శ్రీరస్తు

శ్రీపురుషోత్తమాయ పరబ్రహ్మణేనమః

# పురుషోత్తమమాహాత్మ్యము

అను

## (అధికమాసపురాణము.)

ఇది

బ్రహ్మశ్రీ


చివుకుల వేంకటాచల శాస్త్రి


రచితము


మొదటికూర్పు. 1000 ప్రతులు.

సికింద్రాబాదు

చందానారాయణశ్రేష్ఠిగారి

శ్రీబాలాత్రిపురసుందరీ ముద్రాక్షరశాలయందు

ముద్రింపబడియె.

1934



[గ్రంథకర్తృస్వామ్య సంరక్షితము]



[మూల్యము రు. 1-8-0]

T
294.5925
VSS P

University of Hyderabad
LIBRARY
Acc No. 28977
Dated 1-9-87
Hyderabad - 500 134.

శ్రీ ర స్తు.

# ఉ పో ద్ఘా త ము.

శ్లో॥ యజ్జ్యోతిస్తమసః పరంమహదహో నిత్యాత్మయద్రూపాణి త
న్నామాని ప్రవిభజ్యచ వ్యవహరత్యేతైర్గుహాయాంగతం
ఆనందైకరసం తదద్వయ మధోతన్మాయయా దేవకీ
కుంతీ సత్యవతీషుజన్మ ధృతవత్కృష్ణత్రయం పాతునః

సం॥ భా॥ వ్యా॥ నీలకంఠీయము॥

ఈ విశాల బ్రహ్మాండమున ననేకజీవులు దేవమనుష్యాది యోనులయందు మాటిమాటికిని ఘటీయంత్రంబువోలెఁ బరిభ్రమించుచు వ్యాకులపడుచుందురు; అందుఁ బుణ్యాపాపమిశ్రితఫలంబున జన్మించిన మానవుండు తనదేహంబును మిశ్రకర్మజనితక్లేశంబుగా వించి శాశ్వతానంద మొసంగు మోక్షంబునొందుటయే ముఖ్యకర్తవ్యము, అట్టి మోక్షకారణసామగ్రిని బోధించుటకే భగవ దుద్గతంబగు వేదంబుకరణిఁ దదుప బృంహణంబగు పురాణమును ప్రవర్తించి మిత్రసమ్మితంబై చిత్రవిచిత్రేతిహాసములతో, బీజకల్పములైన శ్రుతి గుప్తంబులగు స్త్రీపురుషధర్మంబులను గ్రమంబుగ వివరించి సకలజను లకుందత్తదధికారానుసారంబుగ మోక్షసాధనోపాయంబులఁ దెలిపి లోకకల్యాణము సమకూర్చుచున్నది.

పురాణము ధర్మమును శాసించునదిగాన
శాస్త్రమనియుఁ జెప్పఁబడును.

" ఏతావానేవ శాస్త్రాణాం [illegible]
[illegible] పురాణ [illegible]
[illegible] సంపాదనం, [illegible]
[illegible]
[illegible]

శ్లో॥ పురాణన్యాయమీమాంసా । ధర్మశాస్త్రాంగ మిశ్రితాః
వేదాః స్థానానివిద్యానాం । ధర్మస్యచ చతుర్దశ॥

ఈశ్లోకములోని పదునాల్గును ఆయుర్ధనుర్గాంధర్వ వేదార్థ శాస్త్రములు నాలుగునుచేరి పదునెనిమిదియైన యీశాస్త్రప్రస్థానముల రహస్య భూతార్థమేమన, విషయాకారమునుబూనిన మానవ చిత్తమునకు భగవదాకారమును సంపాదించుటయే యనియు, సర్వ శాస్త్రములును వ్యాపారభేదముచే నీవిషయమునందే ముగియుచున్నవనియుఁ దెలియుచున్నది;

శ్లో॥ కాఠిన్యం విషయేకృత్వా । ద్రవత్వం భగవత్పదే
ఉపాయైశ్శాస్త్రనిర్దిష్టైరనుక్షణమతో బుధః

శాస్త్రనిర్దిష్టములగు నుపాయములచే విషయములయందుఁ గాఠిన్యమును భగవత్పదమందు ద్రవత్వమును చిత్తమునకుఁ గూర్పవలయునని కలదుగాన ప్రతిగ్రంథమును మానవచిత్తమునకు భగవదాకారతను సంపాదించుటయందే పర్యవసితమై యుండవలయు అట్లు కాని గ్రంథము సాక్షాత్తుగాఁగాని పరంపరచేఁగాని భగవత్స్వరూప ప్రాపణతాత్పర్యములేమిచే విషయలాలసను పెంచుచు నిక్కమగు నాత్మానందమును కూర్పఁజాలక నిరర్థకమగుచున్నది.

పురాణమనునది చిత్తమునకు భగవదాకారమును సంపాదించు శాస్త్రప్రస్థానములను జెప్పెడి వెనుకఁజూపిన "పురాణన్యాయ మీమాంసా" అను శ్లోకములో నగ్రస్థాన మలంకరించియున్నది.

పురాణమును కొంతకాలముక్రిందట నెవ్వరో మనుజమాత్రులు నమకుఁ దోఁచినకొలఁది వ్రాసియుంచిరని యర్వాచీనులు కొందఱందురు, కాని యది కేవల మవిమర్శకరణమేయగును, పురాణమును గూర్చి వేదమున నిట్లున్నది. [illegible]

[illegible]

[illegible]

ణం విద్యా ఉపనిషదః శ్లోకాస్సూత్రాణ్యనువ్యాఖ్యానాని
వ్యాఖ్యానాన్యస్యైవైతాని సర్వాణినిశ్వసితాని
బృహ-ఉ-అధ్యా-4-బ్రా-4-అను-10.

తా॥ తడిగలచిదుగులఁ గప్పి వేయఁబడిన యగ్నినుండి నానా ప్రకారములఁ బొగ తెగనిపరివిధి సేమహాభూతమైన పరమేశ్వరునినుండి తనకుఁదానైవచ్చు నిశ్వాసమువలె నప్రయత్నముగా బయలు వెడలినవి, అవివెవియనిన నాల్గుగువేదములును ఇతిహాసమును పురాణమును విద్యలు ఉపనిషత్తులు, శ్లోకములు, సూత్రములు అనువ్యాఖ్యానములు వ్యాఖ్యానములు ఇవియన్నియు నాపరమాత్ముని నిశ్వసితములే ఈ శ్రుతిలోఁజెప్పఁబడిన చతుర్విధ మంత్రజాతంబునకును అష్టవిధ బ్రాహ్మణంబునకును నీ పండ్రెండింటికిని విదపఁ జతుర్ముఖుండగు బ్రహ్మ యభివ్యంజకుఁడయ్యె పై పండ్రెండింటిలో నంతర్గతమగు పురాణం అనుశ్రుతిస్థ శబ్దమునకు అసద్వాఇదమగ్ర ఆసీదిత్యాది అని భాష్యము రచించిన పూజ్యపాద శ్రీశంకరుల యభిప్రాయమునను తాదృశబహుశ్రుత్యర్థోప బృంహణముగఁ గలియుగంబునఁజతుర్లక్ష పరిమితంబుగ భగవంతుఁడగు వ్యాసమహర్షి ముఖంబున వెలువడిన యష్టాదశ భాగాత్మకపురాణంబువకును భగవన్నిశ్వసితత్వము వ్యభిచరింపదు. మఱియు "సయథా"యను శ్రుతియందలి పురాణం అనుశబ్దమునకు విష్ణుపురాణాది అని శ్రీరంగరామానుజ మునులు భాష్యము రచించి విదపఁ దద్భాష్యమున

రం॥ భా॥ యద్యపిమాత్ర స్మృతిపురాణాదయో వ్యాసాద్యుద్గతా ఇతిపురాణేషు ప్రసిద్ధిః తథాపి తేషాం భగవదంశత్వాత్ భగవన్నిశ్వసితోక్తిరుపపద్యతఇతి ద్రష్టవ్యం.

తా. సూత్రస్మృతి పురాణాదులు వ్యాసాదులవలన బయలు వెడలినట్లు పురాణములవలనఁ దెలియుచుండినను ఆ వ్యాసాదులు భగవదంశ [illegible] పురాణాదులు భగవన్నిశ్వసితములని
[illegible]

శా. శ్రాద్ధమున వేదధర్మశాస్త్రేతిహాసపురాణాదుల నన్నియు వినుపింపవలయు॥ ఇందునుఁబురాణము వక్కాణింపఁబడినది.

శ్లో॥ పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణాస్మృతం
అనంతరం తువక్త్రేభ్యో వేదాస్తస్య వినిర్గతాః

అను మత్స్యపురాణోక్తినిబట్టియు సర్వశాస్త్రములకుముందుఁ బురాణము బ్రహ్మచే స్మరింపఁబడినదనియుఁ బిదప నానాఁటువదనలు మోములనుండియు వేదములు వెలువడెననియుఁ దెలియుచున్నది. కాన నెట్లు చూచినను పురాణము నెవ్వరో మనుజమాత్రులు తోఁచి నకొలఁది వ్రాసియుంచినదికాదు పురాణమునుగూర్చిన యకృత్రిమ ములగు నీశ్రుతి ప్రమాణములవలనను మనుసంహితా మత్స్యపురాణోక్తులవలనను పురాణపురుషుండగు భగవంతునివలె పురాణమును అనాదినిధనమై నిత్యమైనదగుట సత్యము.

వటబీజమున సూక్ష్మాకారముగనున్న వృక్షమే మహాన్యగ్రోధమై విలసిల్లినట్లుకర్మోపాసనాజ్ఞానకాండాత్మకముగనున్న వేదమున జనతారకములగు ననేకధర్మములు గంభీరార్థముగలవైయుండి సామాన్యబుద్ధులకు సుగమములు గామిచే పరిపూర్ణజ్ఞానులును భగవత్స్వరూపులునగు మహర్షులు తదర్థమునే పురాణములయందనేకవిధముల విస్తరించి బోధించిరి వేదమునందుఁ జెప్పఁబడినవే పురాణేతిహాసములయందు నెల్లెడ విపులీకృతములనుటకు ననేకోదాహరణములుగలవు ప్రకృతము రెండుమాత్రము చూపఁబడును.

1 ఉదా. శ్రుతి. విశ్వరూపో వైత్వాష్ట్రః పురోహితో దేవానామాసీ
త్స్వస్రీయోఽసురాణాం తస్య త్రీణి శీర్షాణ్యాసన్
సోమపానగ్ం సురాపానమన్నాదనగ్ం సప్రత్యక్షం
దేవేభ్యోభాగమవదత్ ఇత్యాది యజు-సం. కాం 2 ప్ర. 5. అను 1.

ఈ శ్రుత్యర్థమునే సం. భాగ। స్కం. 6 అధ్యా. 9 శ్లో. 1
[illegible] త్వష్ట్రస్య త్రీణి శీర్షాణ్యా[illegible]
[illegible]

### తెలుగు భాగవతము. స్కం 6 పద్యం 214

సీ. భూపాల యావిశ్వరూపున కరుదైన తలలు మూఁడును వొందఁ గలిగియుండు
సొరిది సురాపాన సోమపానంబులం నన్నాదమనగాను [illegible]

అని సంస్కృతాంధ్రభాగవతములయందు విస్తరించి యుం దెన్నియో ధర్మములు జనులకు బోధింపఁబడినవి.

### బృహదా ఉ అధ్యా 7 బ్రా 2

2\. ఉదా. శ్రుతి. త్రయాః ప్రాజాపత్యాః ప్రజాపతౌ పితరి బ్రహ్మచర్యమూషుః దేవా మనుష్యా అసురాః ఉషిత్వా బ్రహ్మచర్యం దేవా ఊచుః బ్రవీతు నో భవానితి తేభ్యో హైత దక్షరముపాచ ద ఇతి వ్యజ్ఞాసిష్టా3 ఇతి వ్యజ్ఞాసిష్మేతి హోచుః దామ్యతేతి న ఆత్థేత్యోమితి హోవాచ వ్యజ్ఞాసిష్టేతి. 1.

అథ హైనం మనుష్యా ఊచుః బ్రవీతు నో భవానితి తేభ్యో హైత దేవా క్షరముపాచ ద ఇతి వ్యజ్ఞాసిష్టా3 ఇతి వ్యజ్ఞాసిష్మేతి హోచుః దత్తేతి న ఆత్థేత్యోమితి హోవాచ వ్యజ్ఞాసిష్టేతి. 2.

అథ హైన మసురా ఊచుః బ్రవీతు నో భవానితి తేభ్యో హైత దేవాక్షర మువాచ ద ఇతి వ్యజ్ఞాసిష్టా3 ఇతి వ్యజ్ఞాసిష్మేతి హోచుః దయధ్వమితి న ఆత్థేత్యోమితి హోవాచ వ్యజ్ఞాసిష్టేతి, తదేతదేవైషా దైవీ వాగనువదతి స్తనయిత్నుర్ద ద ద ఇతి దామ్యత దత్త దయధ్వ మితి తదేత త్త్రయగ్ం శిక్షేద్దమం దానందయా మితి. 3.

తా. దేవతలు మనుష్యులు రాక్షసులు అను మూఁడువిధము లవారగు ప్రజాపతిపుత్రులు తమతండ్రియగు వానియొద్ద బ్రహ్మచర్య మునాచరించిరి. దేవతలు మాకేమియుపదేశింతువో చెప్పుమన ద అను నక్షరము నతఁడుపదేశించి దాని యర్థమును దెలిసికొంటిరా యని యడుగ నదాంతులము మాకు దమము (అంతరింద్రియనిగ్రహము) ఉపదేశించితివన అగును చక్కఁగాఁ దెలిసికొంటిరనెను

పిదప మనుష్యులు మాకేమి యుపదేశింతువో చెప్పుమన ద అనునక్షరమునే యుపదేశించి దానియర్థము [illegible] యని యడుగ స్వభావము [illegible] యుపదేశించితివన అగును చక్కఁగా [illegible]

తరువాత రాక్షసులు మాకేమి యుపదేశింతువో చెప్పుమన ద యనుసక్షరమునే యుపదేశించి దానియర్థమును దెలిసికొంటిరా యని యతఁడడుగ స్వభావముచే హింసాద్యాసక్తులమై క్రూరులమగు మాకు ప్రాణులయందు దయగలిగియుండుడని యుపదేశించితివన అగును చక్కఁగాఁ దెలిసికొంటిరనెను. ఆయనుశాసనరూపమైన యా దైవియగు వాక్కుచే మేఘము ఇప్పటికిని ద ద ద అని అనువదించు చున్నది, దీనిచే దమము, దానము, దయ, అనునీమూఁటిని అందరు కలిగియుండవలయునని శిక్షింపవలయు, ఈయర్థమునే యితిహాస రత్నంబగు భారతమందలి భీష్మపర్వాంతర్గత గీతాశాస్త్రమున.

అధ్యా. 16 - శ్లో - 21

త్రివిధంనరకస్యేదం ద్వారం నాశనమాత్మనః
కామఃక్రోధస్తథాలోభ స్తస్మాదేతత్త్రయంత్యజేత్.

తా. కామ క్రోధ లోభము లనెడు మూఁడువిధములుగల యీనరకద్వారము తనకు నాశహేతువుగాన నీమూఁటిని విడువఁదగు అని విపులముగా వచింపఁబడినది. ఇందులకుఁ దార్కాణగాఁ బురాణేతిహాసాదులయందు దమము (ఇంద్రియనిగ్రహము) లేక, దేవ నాయకుండగు నింద్రుఁడు కామోద్రేకియై యహల్యాభిగమనమునఁ జెడుటయు, లోభముచే మనుష్యేశ్వరాగ్రణియగు దుర్యోధనుఁడు సపరివారంబుగ నశించుటయుకాక నరకంబునం గూలుటయు. క్రోధముచే హిరణ్యాక్షప్రభృతి రాక్షసులు నిహతులగుటయు మొదలగు ననేకచరిత్రలనువర్ణించి సమస్త పురాణేతిహాసాదిగ్రంథములును గూఢముగ వేదార్థమునే విశదీకరించిబోధించుచు, మనకు నిష్టప్రాప్తియు ననిష్టపరిహారంబును గావించుచున్నవి. ఇట్లు నిగ్రహింపలేక స్థూలమతులమగు మనము స్థూలబుద్ధితోడనే పురాణాదులవిమర్శించుచుఁ [illegible] మరియు నిదివఱకుఁ దెల్పిన [illegible] ధర్మ[illegible] సత్యమును, [illegible] ప్రాణము[illegible] [illegible]

ధనాదులనెడి కామక్రోధలోభాదిశత్రువులు బాధించుచుండ నర్జునుండను జీవుండు పరమాత్మని చెందఁగోరినతఱి భగవంతుండగు శ్రీకృష్ణుం డర్జునుండనుజీవుని రక్షించుకొఱకు బహువిధంబుల గీతామయతత్త్వోపదేశంబుఁ గావించి స్వసాన్నిధ్యముం జేర్చికొనియె; నని వేదసారభూతంబగు తత్త్వమునే తత్త్వవేత్తలగుపెద్దలు పంచమవేదంబగు భారతంబున కంతరార్థంబుగ వక్కాణించుచున్నారు. కావున నప్రమాదమతులును సర్వజ్ఞులును స్వార్థత్యాగులును నిష్పక్షపాతబుద్ధులును నిరీహులును నిర్భయులును యథార్థైకప్రకాశకులును సత్యసంధులును లోకకల్యాణ సంధానవ్రతులును బ్రహ్మజ్ఞానసంపన్నులునగు మహర్షులు విపులీకరించిన శ్రుత్యర్థమేయగు నిఖిలపురాణమును శిరసావహించి యందలి ధర్మరహస్యమెఱింగి యాచరించుచుంటిమేని యామహర్షుల ఋణముతీర్చి యైహికాముష్మికసౌఖ్యములనందుదుము. ఈవిషయమునింకను ననేకవిషయములు వ్రాయవలసియున్నను అన్నియు వ్రాయుటకిది తావుగామిచే దిఙ్మాత్రము చూపఁబడియె.

శ్లో॥ ఇతిహాసపురాణాభ్యాం వేదార్థముపబృంహయేత్॥

ఈ మొదలగు ప్రమాణవచనములు ఇతిహాసపురాణములచే వేదార్థమును వృద్ధిపొందింపవలయుననియుఁ బలుకుచున్నవి.

పైనిజూపఁబడిన ప్రమాణములను బట్టి వేదార్థవివరణమే పురాణములని తెలిసెనదిగదా, అట్టి యష్టాదశ మహాపురాణములలోఁ జేరిన బృహన్నారదీయ పురాణమునఁగల పురుషోత్తమ మాహాత్మ్యమనెడి యీయధికమాసపురాణము నాచే రచింపఁబడినది. ఈ యధికమాస మాహాత్మ్యము పద్మపురాణమునందుఁ గలదు. అయినను బృహన్నారదీయపురాణాంతర్గతాధిమాస మాహాత్మ్యమందలి యవి [illegible] [illegible] [illegible] [illegible]

నారదపురాణాంతర్గతాధిమాస మాహాత్మ్యమునే గైకొని యాంధ్రీక రించితిని. మఱియుఁ బద్మపురాణాంతర్గత, పు- మాహాత్మ్యమున.

అధ్యా 24—శ్లో-1326—గలవు. నారదపు-అంతర్గత: పురు-మాహాత్మ్యమున అధ్యా 31—శ్లో-1589 గలవు.

పద్మ-అంత-పురు - మాహాత్మ్యమున లేక, నారదపు-అంత పురు-మాహాత్మ్యమునఁ గల యధికవిషయములీక్రింద-చూ.

1. పురుషోత్తమవ్రతియగు గృహస్థు చేయఁదగిన పూర్వాహ్నిక విధానములు.
2. పురుషోత్తమ పూజనవిధి.
3. ఆహ్నికకథనము మొదలగునవి.
4. చిత్రబాహుండనురాజు పూర్వజన్మవృత్తాంతము.
5. పురుషోత్తమ వ్రతోద్యాపనక్రమము.
6. పురుషోత్తమవ్రతి గృహీతనియమవిసర్జనము.
7. గృహస్థుచేయఁదగిన దివసాపరభాగీయాహ్నికము.
8. పతివ్రతాధర్మములు.
9. సంపుటదానఫలము.
10. పురుషోత్తమ మాహాత్మ్యశ్రవణఫలము.

ఈయుభయపురాణగత మాహాత్మ్యములందునుఁ గల గాథ లీషద్భేదముగ నొక్కటిగనే యుండునుగాని పద్మపు - అంత-పురు-మాహాత్మ్యము నందలి దృఢధన్వుఁడను రాజుయొక్క సంపత్సమృద్ధి వర్ణనముమాత్రము కావ్యములయందువలె విశేషముగాఁ జేయఁబడినది అందు మనోహారములనితోఁచినవి నాయాంధ్రీకరణమున నందందుఁ బొందుపఱిచితిని.

మఱియు ఈయధిమాసమునకుఁ బురుషోత్తమనామమువచ్చు టకుఁ దగినకారణము ఈగ్రంథమునఁ బ్రథమాశ్వాసమున వివ రింపఁబడినది, ఎట్లన పరమేశ్వరుఁడును గోలోకాధిపతియునగు

పురుషోత్తముఁడు ఈయధిమాసాభిమానిదేవత శ్రీకృష్ణునితోఁగూడఁ దనలోకమునకు వచ్చినప్పుడు కృష్ణునితో నిట్లువచించె.

ఆశ్వా 1-పద్యము 197

మ॥ అనుభావంబున సద్గుణంబులను గీర్త్యైశ్వర్య దానంబులన్
ఘనవిక్రాంతిని సద్భగంబులను భక్తాభీష్టసంప్రాపణం
బున నెంతేఁబురుషోత్తముండనఁగ నేఁ బొల్పొందితిం, దద్విధం
బున దీనింబురుషోత్తమాఖ్య, సుయశంబుం జెందఁగావించెదన్

మఱియు ఆశ్వా 1 సీ 198 చూ

కాలమునందలి భాగంబులగు మాసాదులకును, శైలనద్యర్ణవాదులకును నభిమానిదేవత లున్నట్లును, వారు గూఢముగానుండి యవసరముగలిగినప్పుడు అభివ్యక్తులై మనుష్యాదు లట్లు చేష్టింతురని యుఁ బురాణాదులవలన విస్పష్టమగుచున్నది. పూర్వము దాశరథి శరధిపై శరంబరివోసినతఱి

శ్లో॥ తతోమధ్యాత్సముద్రస్య సాగరస్స్వయముత్థితః
ఉదయాద్రి మహాశైలా న్మేరోరివ దివాకరః॥

వా-రా-యు-కాం-స 22 శ్లో 17

తా. మేరువునుండి సూర్యునివలె సముద్రమధ్యమునుండి సముద్రుఁడు బయలువెడలె॥ ఈశ్లోకమునకు వ్యా॥ లో సాగరః-సముద్రాభిమానిదేవతా-అని కలదుగాన జలరూపమగు సముద్రము నుండి పురుషాకారమున సముద్రాభిమానిదేవత శ్రీరామునియొద్దకు వచ్చి మాటలాడినట్లు తెలియుచున్నది. గాన నిత్యాది ప్రమాణముల చే నెఱుంగునది.

—(*) (ఆశ్వాసవృత్తాంతసంగ్రహము.) (*)—

(1) ప్రథమాశ్వాసమున నధికమాసము పురుషోత్తమనామముధరించి యైశ్వర్యప్రాప్తిఁ గనుట.

(2) ద్వితీయాశ్వాసమున ద్రౌపదీ పూర్వజన్మవృత్తాంతము.(ఈ-ద్రౌ పూర్వ-జ-వృ- భారతాదివర్వమునందలి వృత్తాంతము[illegible]యుఁ [illegible]కింపవలెనుగలది.)

(3) తృతీయాశ్వాసమున దృఢధన్వుని చరిత్రము.

(4) చతుర్థాశ్వాసమున ఆహ్నిక కథనము, పురుషోత్తమపూజనవిధి, పురుషోత్తమవ్రత నియమకథనము.

(5) పంచమాశ్వాసమున చిత్రబాహుండనురాజు పూర్వజన్మవృత్తాంతము, పురుషోత్తమ వ్రతోద్యాపనవిధి, పురుషోత్తమవ్రతి గృహీతనియమవిసర్జనము, దృఢధన్వుఁడు భార్యాసహితుండై గోలోకంబునకరుగుట.

(6) షష్ఠాశ్వాసమున చిత్రధర్ముఁడను కదర్యుని యుపాఖ్యానము, గృహస్థు చేయఁదగిన దివసాపరభాగీయాహ్నికము, పతివ్రతాధర్మములు సంపుటదానఫలము. పురుషోత్తమ మాహాత్మ్య శ్రవణఫలము

ఇట్టివిషయంబులచేఁ బొలుపారుచు విష్ణుమహిమామృతమును వర్షించునదియై భక్తజనచాతకనూతనజీమూతంబుగనున్న యీపురుషోత్తమ మాహాత్మ్యమను నధిమాసపురాణమును ద్రవిడులును మన యాంధ్రులును నింతవఱకుఁ బెక్కుమంది యెఱింగియుండరు. తత్కర్తృ ధర్మాచరణ మంతకంటె నెఱుఁగరు, చైత్రము మొదలగు సప్తమాసంబులవఱకు వచ్చెడి యే యధిమాసంబైనను పురుషోత్తమ మాస మనంబడు. క్వాచిత్కముగ ఫాల్గునంబును నధిమాసంబగు

శ్లో॥ చైత్రాద్యాశ్వయుజాంతేషు అధిమాసాః ప్రకీర్తితాః
నతుయోనాధిమాసస్స్యా న్మాఘో వైపరికీర్తితః — ని-సిం

దైవజ్ఞకర్ణామృతే

శ్లో॥ అసంక్రాంతిమాసో౽ధిమాసస్ఫుటస్స్యా
ద్ద్విసంక్రాంతిమాసః క్షయాఖ్యః కదాచిత్
క్షయః కార్తికాది త్రయే, నాన్యథాస్యా
త్తదావర్ష మధ్యే౽ధిమాసద్వయంచ॥

విపులము-ధ-జ్యో-శా-చూ

ఇట్టి పురుషోత్తమమాసము వచ్చినతఱి ఘూర్జరులును మహారాష్ట్రులును మార్వారుదేశస్థులును బంగాళీవారును హిందూస్థాను [illegible] నంతయును [illegible]

దేశవాసులును చిరకాలమునుండియు నత్యంతభక్తి శ్రద్ధలతో నేతద్గ్రంథోక్తవిధుల నాచరించి ధన్యులగుచున్నారు. బొంబాయిపట్టణమున నీపురుషోత్తమ మాసమువచ్చె నేని యామాసంబంతయు నచ్చటివారొనర్చు పుణ్యకార్యములు వర్ణనాతీతములు మనయాంధ్రజను లెల్లరును నేతద్గ్రంథమునుబఠించి యిందుఁ జెప్పఁబడిన ధర్మములనాచరించి కృతకృత్యులగుదురను విశ్వాసముతో సంస్కృతభాషలోనున్న యీ యది సర్వజన సుగమముగ తెలుఁగుభాషలో రచింపఁబడినది

ఇక్కాలమున సంస్కృతభాషాప్రవేశముగలిగి యాంధ్ర సాహిత్య మలవడని మనయాంధ్రులు కొందఱు తెనుఁగునరచియింపఁబడిన గ్రంథములను స్పృశించినఁ దమపాండిత్యమునకుఁ గొఱంత వాటిల్లునను భీతిచే నన్నయాద్యాంధ్ర మహాకవికృత భారతాదులఁ గూడ పఠింపకయుఁ బురాణ ప్రవచనాదులలోఁ గైకొనకయుఁ బైపెచ్చు తమకన్న నెక్కువసంస్కృతపాండిత్యముగలిగి తద్గ్రంథములఁ బ్రవచనాదులలోఁ గైకొనినవారినిగూడ “ఓహో తెలుఁగా” యని తృణీకరించుటయుఁ దమకాంధ్రసాహిత్యము లేమియు నొక యున్నత గుణముగనే ప్రకటించికొనుచుండుటయుఁ బలుతావులఁ జూచుచుంటిమి, సంస్కృతభాషకునుసంస్కృతగ్రంథములకునుగౌరవ మొసంగుట మాకును నభిమతమేకాని తామాంధ్రులయ్యునుమాతృభాషాగ్రంథములపై యనాదరము చూపుటమాత్రము న్యాయ్యముగాదు, సంస్కృతగ్రంథములం దేకొని పురాణప్రవచము చేయునప్పుడు శ్రోతలకుఁ దృప్తిగాఁ దదర్థవివరణముచేయునెడఁ దమచే నిరాకృతమగు నాంధ్రభాషయేగదా మఱల వీరికి శరణమగుచున్నది. సంస్కృత శ్లోకోచ్చారణముచేఁ బుణ్యవిశేషముందురేని అయ్యది పారాయణ నియమమాత్రపర్యవసితము. మఱియు సంస్కృతగ్రంథములలో సారస్యమెక్కువగ నుండునందురేని మూలగ్రంథముతోఁ దుల్యముగనో తదధికముగనో సారస్యము నించిన వాగనుశాసనాదుల యాంధ్రగ్రంథములయందలి సమధిక సారస్యమునుగూడ వీరేల కొల్లాడలేరు? తెలుఁగుపొత్తముల నటుండనీతురే యాదరింతురని కాంక్షిం

వీరితలంపు,పురాణప్రవక్తయందు సారస్యము లేనియప్పుడు సంస్కృత గ్రంథమును చేపట్టిన యాధిక్యంబును, ఆతనియందు సారస్యముకల దేని యాంధ్రగ్రంథమును చేపట్టిన లోపంబును మృగ్యంబు లేకదా. కావున గ్రంథసారస్యమునకుఁ దోడుగ వక్త్ర సామర్థ్యముగూడ నుండవలయు. గనుక యెట్లుచూచినను వీరి సరసాంధ్రకవి గ్రంథనిరా కరణమహోద్యమము నిర్హేతుకమనకతప్పదు.. ఒకవేళ, సంస్కృత గ్రంథములచేతనే యిష్టసిద్ధియగుచుండగా నింక మాకీయాంధ్రకవి గ్రంథసభాజన భారమేల? యందురేని సర్వవిషయములను సంస్కృ తమునకు వెనుదీయక యుచ్చారణమాత్ర సకలశ్రోతృజన చిత్తాకర్షణ విశేషభూషితంబైన యాంధ్రసుకవి గ్రంథనిరాకరణంబుచే మాతృ వాగ్దేవతయెడఁ గృతఘ్నతరత తప్పదుగదా! కావున గ్రంథస్థవిషయ గౌరవసారస్యాది గుణగ్రహణ తత్పరులై యాంధ్రసత్కవుల గ్రంథ ములుసైతము సంస్కృతగ్రంథములపగిది తక్కిన యాంధ్రులకరణి సమమితితో మన సంస్కృతభాషాప్రవేశముగల యాంధ్ర మహా శయులును ప్రవచనాదులయందుఁ గైకొని యాంధ్రసాహిత్య మల వఱుచుకొని మాతృవాణీ సేవాసుకృతము వడయుదురుగాక.

—(*) ప్రకృతగ్రంథాంధ్రీకరణమునగలవిశేషములు (*)—

ఈ నా యాంధ్రీకరణము పూర్వాంధ్ర మహాకవులుచూపిన త్రోవననుసరించియే యుండును. మూలగ్రంథములోని ప్రధానాంశ ములకు భిన్నముకాకుండఁగనే యటనట సమయోచితముగ వర్ణనము లు నితరవిశేషములు పెక్కుపద్యములుచేర్పబడినవి. నారదపు-పురు- మాహాత్మ్యమందలి దృఢధన్వచరిత్రకంటె పద్మపు-పురు-మాహాత్మ్య మునందలి దృఢధన్వచరిత్రముమాత్ర మత్యంతము కావ్యధోరణితో నానృపుని సంపత్సమృద్ధి మొదలైనవి బహువిపులముగా వర్ణింపఁబడి యుండుటచే దానినుండి మనోజ్ఞములు పెక్కులింపు గ్రహింపఁబడి నవిగాన నీయనువాదగ్రంథ మొక్కటి చూచినచో బై యుభయ పురాణగత పురుషోత్తమ మాహాత్మ్యములను దిలకించినవారగుదురని యే నాయాశయము

ఈ గ్రంథమున సమకూర్పఁబడిన యఖండయతులకును యతి ప్రాసములయందు లఘ్వలఘు రేఫమైత్రికిని ప్రాచీనాంధ్రకవులే మార్గ దర్శకులు.

ఈ భావసంవత్సర వైశాఖము పురుషోత్తమ మాసమైయుం డుటచే నప్పటికెట్లైని యీగ్రంథమును పూర్తిగావించి ప్రచారము లోనికిఁ దేవలయునని పట్టుదలతో నీగ్రంథరచనకుఁ దగిన వ్యవధిలేక యారంభించుటయు, నాస్వల్పవ్యవధిలోఁగూడసంస్కృతిసంబంధములగు పలుతెఱఁగులవిఘ్నములకుఁ బాల్పడుటచే చిత్తస్థైర్యములేకుండుట యు శరీరారోగ్యమును తీరికయులేకుండుటయుఁ జిత్తుకాగితములే యచ్చునకొసంగుటయు మున్నగు పెక్కుకారణములచే నీగ్రంథమున నేమేనిలోపములుండిన నవియన్నియు సహృదయులై సవరణతోఁ బఠించి యిందలిగుణములనే గ్రహింతురుగాక యని విద్వాంసులు ప్రార్థింపఁబడుచున్నారు.

10-3-1934 }
శికింద్రాబాదు }

ఇట్లు విధేయుఁడు
చివుకుల వేంకటాచలశాస్త్రి

శ్రీపురుషోత్తమాయపరబ్రహ్మణేనమః

# కృతజ్ఞత.

## ప్రధానపోషకులు

బ్రహ్మశ్రీ. ధర్మరంజన పిసుపాటి వేంకటరాయశర్మగారు.

జమ్మవరం రెవిన్యూసెటిల్మెంట్ల ప్రాప్రైటర్లు
వేదశాస్త్రముల పాఠశాలాస్థాపకులు, నిర్వాహకులు
గుంటూరుమండల వేదప్రవర్తక విద్వత్పరిషదధ్యక్షులు
కాశీస్థ శ్రీ భారత ధర్మమహామండల సంరక్షకులు,
చెన్నపురి భూస్వామి సభాసభ్యులు,
ఒంగోలు మున్సిపల్ కౌన్సిల్ మెంబరులు,
ఒంగోలుతాలూకా బోర్డుప్రెసిడెంట్లు,
కరవది దేవాలయ ధర్మకర్తలు,
కాశీస్థాఖిల భారతవర్ణాశ్రమ స్వరాజ్యసంఘ యావజ్జీవసభ్యులు

కరవది—ఒంగోలుతాలూకా.

## పోషకులు.

బ్రహ్మశ్రీ. చావలి వేంకటనరసింహశాస్త్రిగారు.

ఎమ్. ఎస్. కె. మిల్సు. మేనేజరులు, గుల్బర్గా

బ్రహ్మశ్రీ. చివుకుల శ్రీరామశర్మగారు భూస్వాములు

ఒంగోలుతాలూకా బోర్డువైస్ ప్రెసిడెంటుగను,
గుంటూరుజిల్లాబోర్డు మెంబరుగను,
గుంటూరుజిల్లా ఎడ్యుకేషనల్ కౌన్సిల్ మెంబరుగను ఉండినవారు

సంతపేట—ఒంగోలు

## పోషకులు.

మ॥రా॥శ్రీ. చీకోటివీరన్నగారు,కంట్రాక్టర్సు, అండ్ జనరల్ మర్చంట్సు
సికింద్రాబాదు.

,, మఱిపల్లి మాణిక్యముగారు, వస్త్రవ్యాపారులు ,,
,, నాగెల్లివెంకన్నగారు,కుమారుఁడుదుర్గయ్యగారు ,, ,,
,, బొజ్జాయోగయ్యగారు ,, ,,
,, లింగా వీరన్నగారు, నగలవ్యాపారులు. ,,
,, హరినాథులబాలయ్యగారు,బంగారమువ్యాపారులు ,,
,, వనమాల వెంకయ్యగారు, ,, ,,
,, క్యాసా చంద్రయ్యగారు, ,, ,,
,, గుండా ఆగయ్యగారు. కలపవ్యాపారులు ,,
,, దాచాశంకరయ్యగారు. ,,
,, దాచాబాలరాజయ్యగారిపుత్రుఁడు రాజేశ్వరయ్యగారు ,,
,, కైలా బక్కయ్యగారు, చిలుకలగూడెము ,,

విద్యాభిమానులగు నీ యౌదార్యసంపన్నులీగ్రంథమునకుఁ బోషకులై తగినధనసహాయమొసర్చి నాయుద్యమము నెఱవేర్చినందుల కీతద్గ్రంథాభివర్ణితుండగు శ్రీపురుషోత్తమ పరమేశ్వరుండు వీరి మనోరథంబుల సఫలంబులఁ గావించి ప్రోచుఁగాక.

ఇట్లు

గ్రంథకర్త.

# విషయసూచిక.

## ప్రథమాశ్వాసము


| విషయము | పుట |
|---|---|
| ఇష్టదేవతాదిప్రార్థనము | 1 |
| శ్రీశంకర భగవత్పాదప్రశంస | 2 |
| గ్రంధకర్తృవంశావతారాదికము | 4 |
| ప్రకృతకృతివిషయము | 5 |
| మన్వంతరములు | 7 |
| కథాప్రారంభము | 8 |
| సూతుండు నైమిశారణ్యంబునకువచ్చుట | ,, |
| నారదుండు నారాయణర్షి దర్శనంబునకై బదరికాశ్రమంబునకువచ్చుట. | 14 |
| శ్రీకృష్ణుండు కామ్యకవనంబుననున్న పాండవులయొద్దకు వచ్చుట. | 20 |
| శ్రీకృష్ణుండు పాండవుల కధిమాసవృత్తాంతంబు సెప్పుట. | 23 |
| అధిమాసంబు వైకుంఠంబునకుఁ జనుట. | 25 |
| శ్రీహరి గోలోకంబున కధిమాసంబును గొంపోవుట. | 33 |
| అధిమాసంబున నైశ్వర్యప్రాప్తిగలుగుట. | 42 |


## ద్వితీయాశ్వాసము


| | |
|---|---|
| శ్రీకృష్ణుండు పాండవులకు మేధావిమునిపుత్రికావృత్తాంతము సెప్పుట. | 51 |
| మేధావిపుత్రికయొద్దకు దుర్వాసుండు వచ్చుట. | 56 |
| మేధావిపుత్రి కీశ్వరుండు ప్రత్యక్షంబగుట | 68 |
| మేధావిపుత్రి ద్రౌపదియై జన్మించుట. | 75 |
| శ్రీకృష్ణుండు ద్వారకాపురంబున కరుగుట. | 80 |

| విషయము | పుట |
|---|---|
| **తృతీయాశ్వాసము.** | |
| దృఢధన్వునిచరిత్రము. | 86 |
| కథామాత్రిపద్యము. | 98 |
| దృఢధన్వుని పూర్వజన్మవృత్తాంతము వాల్మీకి సెప్పుట. | 203 |
| విష్ణుమూర్తి సుదేవునకుఁ బ్రత్యక్షమగుట. | 106 |
| విష్ణుమూర్తి సుదేవునకు రెండవమారు ప్రత్యక్షమగుట. | 127 |
| విష్ణువుసుదేవునకు ధనుర్మాసకథ సెప్పుట. | 130 |
| **చతుర్థాశ్వాసము.** | |
| వాల్మీకిమహర్షి దృఢధన్వునకుఁ బురుషోత్తమవ్రతి సేయఁదగు వాహ్నికవిధానంబు సెప్పుట. | 142 |
| మర్త్యునకు ధర్మాచరణమే ముఖ్యమనుట. | 146 |
| వాల్మీకిమహర్షి దృఢధన్వునకుఁబురుషోత్తమవ్రతి నియమంబులఁ దెల్పుట. | 149 |
| వాల్మీకిమహర్షి దృఢధన్వునకుఁ బురుషోత్తమ పూజనవిధి చెప్పుట. | 154 |
| **పంచమాశ్వాసము.** | |
| దృఢధన్వునకు వాల్మీకి చిత్రబాహుచరిత్రంబు సెప్పుట. | 159 |
| అగస్త్యుండు చిత్రబాహున కాతనిపూర్వజన్మవృత్తాంతంబు సెప్పుట. | 163 |
| మణిగ్రీవుం డుగ్రదేవునకు నిజవృత్తాంతము సెప్పుట. | 165 |
| వాల్మీకి దృఢధన్వునకు వ్రతోద్యాపనవిధి చెప్పుట. | 170 |
| వాల్మీకి దృఢధన్వునకు గృహీతనియమమోక్షణంబు సెప్పుట. | 177 |
| శ్రీవాల్మీకి ప్రస్థానము. | 180 |
| దృఢధన్వుండు సభార్యుఁడై గోలోకమేగుట. | 181 |
| **షష్ఠాశ్వాసము.** | |
| నారాయణముని నారదునకుఁ గదర్యోపాఖ్యానము చెప్పుట. | 185 |
| శ్రీనారాయణర్షి నారదునకు దివసాపరభాగీయ విధిని దెల్పుట. | 190 |
| నారాయణర్షి నారదునకుఁ బతివ్రతాధర్మంబులు చెప్పుట. | 205 |
| శ్రీనారాయణర్షి నారదునకు సంపుటదానఫలంబును జెప్పుట. | 215 |
| సూతుండు శౌనకాదులకుఁ బురుషోత్తమ మాహాత్మ్య శ్రవణఫలంబును జెప్పుట. | [illegible] |

శ్రీ ర స్తు.

శ్రీపురుషోత్తమాఖ్యపరబ్రహ్మణేనమః.

# పురుషోత్తమమాహాత్మ్యము.

## ప్రథమాశ్వాసము.

### ఇష్టదేవతాది ప్రార్థనము.

శ్రీపురుషోత్తముఁ డవ్యయుఁ
డాపద్వినివారకుఁడు మహామహుఁ డఖిల
వ్యాపకుఁడు శుభము లొసఁగుచుఁ
గాపాడి యొసఁగుఁగాతఁ గైవల్యంబుల్. 1

క. శ్రీశాదులుగూడ నిజో
ద్దేశము కడనఁగ నెవని దివ్యాకృతిఁ బా
మాశించి కొలుతు రట్టి మ
హేశతనూభవు గజాస్యు నేఁ బ్రణుతింతుర్. 2

మ. హరియై శంకరుఁడై సరోజభవుఁడై యబ్జప్రియుఁడై గణే
శ్వరుఁడై చంద్రముఁడై సురాధిపతియై వైశ్వానరుండై విర
స్తరతేజోమయుఁడై ధనాధినధరుండై వెల్గు శ్రీమత్పరా
త్పరు నిష్టార్థములిచ్చి ప్రోచుటకునై భావింతు నశ్రాంతమున్. 3

క. శ్రీవాణీగిరిజాఖ్యల
చే వఱలుచు సిరియు విద్య చింతితసర్వా
ర్థావిర్భూతులు నొసఁగు మ
హావిభుపరమేశశక్తి కంజలియిడుదున్. 4

క. భ్రమరహితమ్మును సరసహి
తము మధురాక్షరసుధాయుతమ్మునై రమణీ
కమనీయ కచ కుచా ధర
సమకవనము సలుపు సుకవిసమితి కెరఁగుదున్. 5

క. సరస కవులయ్యు భక్తిన్
హరి హర చరితంబు కృతులయందిడి యిహాముం
బరమున్ వెలయించిన కవి
వరులకు మతినుతియొనర్తు వందన శతముల్. 6

ఉ. ఉత్తమహాంకృతింగొనుట యొక్కటిదక్క యొవండుఁగాని కీ
ర్తిత్తును ఁదోటులేని పని చేయఁగఁజాలఁ డలోపకృత్య లో
కోత్తరబుద్ధిమత్త పురుషోత్తమ నీక ఘటించెఁ గాన నా
పాత్తయునందుఁ గ్రందుకొను పొల్లులు సైఁచి పరిగ్రహింపవే. 7

గీ. సకల బుధులును శశిని దోషాకరుఁడన
కమ్మృగ ఘృణియని గ్రహియించినట్లు నాదు
కృతియు దోషాకరంబేని శ్రీహరి మహి
మామృత యుతంబగుటఁ గొనుఁ డఖిలబుధులు. 8

మ. ఒక కార్యంబును నిర్వహించుటవ నెంతో కష్టమెత్తోఁచుఁ బా
యక యందున్ నెనుల్ గ్రహింపనలభంబై యుండు,మాహింపుఁడీ
చకితత్వంబును పీడి యాదల మహాశైలంబునుం దాల్చుటల్
ప్రకటంబై తగుబీరమో యోడిసెలన్ జాల్ రుప్పటల్ బీరమా

## శ్రీశంకర భగవత్పాద ప్రశంస

సీ. బాల్యమం దిందిరా బ్రాహ్మణీ గృహమందుఁ
గనకామలకములఁ గానుప నలిపి
సప్తమాబ్దమునకే సకల విద్యావార్థు
లల యగస్త్యునిరీతి నాచమించి
ద్వాదశాబ్దంబుల ప్రాయంబునఁ భాష్య
ములు సల్పి వ్యాసుని ముదితుఁ జేసి
మండనమిశ్రాద్యఖండ పండితుల నో
డించి దిగ్విజయంబుఁగాంచి మించి
గీ. వృషగిరి ప్రాణు ద్విజపుత్రుఁ బ్రదుకఁజేసి
జగతి నద్వైతమతము సంస్థాపితంబు
సలిపి తాఁ బల్కినట్లుగా బొలిచినట్టి
హరిహరస్వాంతు శంకరగురుఁ దలంతు. 10

క. ఈశ్వరుఁడవో నీవా పర
మేశ్వర భిన్నుండవో యతీశ్వర మఱి నీ
విశ్వాతిశాయి కృత్యం
బీశ్వర భిన్నత్వమొల్ల దేమనఁ జెల్లున్. 11

కం. సర్వజ్ఞ బిరుద మీశ్వర
నిర్విష్టంబంద్రు యతిమణీ నీ మహిమం
బుర్విం బరవశమున్నా
గర్వం బాతనికి డక్కెఁ గాక మహాత్మా. 12

## గ్రంథకర్తృ విద్యాగురు ప్రశంస.

శా. ధీ నైపుణ్యము వోల్పు పండితులు నంతేవాసులై కొల్వ బ్ర
హ్మానందం బొలయంగ శిష్యులకు వేదాంతాది శాస్త్రంబులు

జ్ఞానః పూర్వముగా సుబోధమగు తేవన్ బోధ గావించు ల
క్ష్మీనారాయణ పండితున్ గురువరున్ సేవించితు సచ్ఛాంతిమున్

కం. శ్రీకిఁ జిరపూరి వంశ్యున్
సీతారామాఖ్య విబుధు శిష్య ప్రియు గో
దాతీర వాసి శాబ్దికుఁ
జేతంబున మద్గురున్ భజించెద ననఘున్. 14

గ్రంథకర్తృ వంశావతారాదికము.

చ. ఘనతరసత్వశోభిత మఖండమునౌ వెలనాఁడి శాఖయం
దనుపమకీర్తిమ ద్విప్రకులాన్వయమందు జనించి వేదమం
దును మఱి జ్యోతిషంబున బుధుండయి వేంకటలక్ష్మమాంబయుం
దోసరఁగ నన్నుఁగన్న పురుషోత్తము నామకుఁగొల్తు మత్పితన్

సీ. దివుకులాన్వయ దుగ్ధసింధు చంద్రుఁడైన
వేంకటాచలమహా విబుధమణికిఁ
దనయుఁడైనట్టి సీతారామశాస్త్రికి
మంగమాంబికకుఁ గుమారుఁడఁగను
దత్తుండనై శికింద్రాబాదు పురమున
సంతతంబును నివాసంబు దనరి
శ్రీరాచకొండ లక్ష్మీ పూర్వ నారాయ
ణాఖ్య విద్వద్వరుఁ డస్మదీయ

గీ. జననికిఁ గనిష్ఠ పితయైన సాధు చరితుఁ
డాశితప్రీతి న న్నుపనీతుఁజేయఁ
దత్సమీపంబునందు విద్యయును గఱచి
శేషమాఖ్యను సతిగాఁగఁ జేసికొంటి, 16

గీ. ప్రకృతియం దాంధ్ర వసుధపైఁ బ్రబలినట్టి
శతవధానాష్టకవధాన కృతులు సభల
సలిపి బృందారకాంధ్రభాషలను గొన్ని
పుస్తకంబు లొనర్చితి బుద్ధికొలఁది. 17

చ. తలఁచెద మానసంబున నితాంతము సంచితవేదశాస్త్రసి
స్తులితుఁ బురాణపారగు విశోధితధర్మరహస్యజాలు సం
కలితమహాసభాంతరజగద్వినుతాచ్ఛయశస్కు వేంకటా
చలబుధు మత్పితామహుఁ బ్రశాంతు నిరంతర దైవచింతనున్.

మ. తదభిఖ్యన్ ధరియించి నట్టిఁడ భరద్వాజర్షి గోత్రుండ న
భ్యుదయ ప్రాపక విష్ణుసత్కథల నే నూహించుచుండంగ నా
మది శ్రీమత్పురుషోత్తమాభిధలసన్మాహాత్మ్య మాంధ్రోక్తులం
దొదవంజేయఁ దలంపు పుట్టిన సముద్యుక్తత్వముం దాల్చుచున్

గీ. వేంకటాచలశాస్త్రి నామాంకితుండ
వేదశాస్త్ర ప్రశంసిత విబుధ పాద
పంకజార్పిత మానస బంభరుండ
నైన నామది శ్రీహరి నూని భక్తి 20

ప్రకృత కృతివిషయము.

శా. ఎన్నో రీతుల నన్యవృత్తములనే యాకాలపుం వారు బల్
సన్నాహంబుల గ్రంథరూపమున నిచ్చల్ సల్పి మోదిల్లుటం
గన్నారం గని దైవవృత్తమున వీఁకంజూప మచ్చిత్త మే
పున్నంబో యణుమాత్ర మొప్పెనను చుం బుద్ధిన్ ముదంబందితిన్.

చ. పలికెను వ్యాసమౌని మును పద్మపురాణమునందు నిక్కథం
దలకొని నారదీయమ్మునఁ దా, మఱలం రచియించెదాని ని

ట్లొలయఁగ నారదీయ పురుషోత్తమ గాథ నగణ్యమైన పె
క్కులు విషయంబులుండుటను గూర్చెదఁ దెల్గున నారదీయమున్.

ఉ. సారవిహీన సంసరణ సాగరమందున మున్గి తేలుచుం
దీరము సేరఁజాలక తితీర్షువులై తపియించు నాంధ్రులం
గూరిచి నావయై తవరి కూలము సేర్పఁగ, నాదుజన్మమున్
శౌరికథా ప్రచారమున సార్థము గా, నిది తెల్గు సేసెదన్.

ఉ. వేదములందు శాస్త్రములు విశ్వజనీన పురాణజాలమం
దాదృతిలేని కొందఱు నిరంకుశచారులు నేటి కైసరుల్
మోందిలనీ మనుత్కృతికి మోదముఁ గాల్చకయుండనీ కడు
న్నాదరులైనఁ జాలదె ? సనాతనధర్మపరుల్ కవీశ్వరుల్. 24

క. మానవ జన్మంబెత్తియు
శ్రీనారాయణుని సేవఁ జేయక యున్నన్
దానొకఁడు కాక యుండినా
మానవునకు నాత్మహంత మఱియొకఁడున్నే ? 25

సీ. ఇందిరేశుని గొల్వ కింపు సంపను శ్రేయ
మందఁగోరెడి మహా మందమతులు
కనులు గట్టిగ మూసికొని వీనులను విచ్చి
కొని యునుం గనఁగొనం జనెడివారు;
హరిని సేవింపక పురుషకారము చేతఁ
గడు సుఖంబులఁ గాసపడు వెడఁగులు
నోరు బిగ్గంబట్టి సారెకున్ ముక్కుతో
నుక్కిరల్ చక్కిరల్ బొక్కువారు;

గీ. పూజసేయక హరి; నాత్మ పోతకులయి
కలుషతర సంసృతిని బాయ దలఁచు జనులు

కొయ్యయియ్యది యని యొక్క ప్రకార మాకలఁ
బట్టి నెట్టన నది దాఁటునట్టివారు; 26

క. హరికథను వినక పాడక
హరికథ రచియింప నొల్ల కన్యకథలపై
నుఱుకు జనుఁ డుఱక యమృతము
నుఁ జవిగొనువాని వగిది నుడివడకున్నే? 27

క. ఎన్నియొ జన్మము లింతకు
మున్నరిగె ననంతదుఃఖముల నిఁక ముంద
లెన్నటికిఁ గాక యుండఁగ
నన్నలినాక్షునకు హరికి నర్పింతుఁ గృతిన్. 28

వ. అని నిశ్చయించుకొని నా హృదయ మధ్యంబునఁ బరా
త్పరుండగు శ్రీపురుషోత్తమదేవుని సన్నిధానంబు గల్పించుకొని. 29

షష్ఠ్యంతములు.

సీ. సోమకామరశత్రుసూదనామోదికి
భ్రమదద్రిసందధత్కమఠపతికి
జాతరూపాక్షముస్తకమహాఘోణికిఁ
గర్వ్యరకశిపుదుష్కరకరి హరికి
బలిదానవార్చితపదఖర్వరూపికిఁ
బరశునికృత్తభూపతిపటలికి
హృతరావణశిరోవితతిచక్రవర్తికిఁ
గంసాంధతమసభీకరతరణికి

గీ. బుద్ధరూపికిఁ గల్కికి శుద్ధమతికి
సిద్ధపతికి సకలానిబద్ధగతికి

భక్తచిత్తానువర్తికి భుక్తిముక్తి
యుక్తిదాయికి నుపనిషదుక్తిపతికి. 30

ఉ. హాటకగర్భముఖ్యపరిణాగమపేటికి భవ్యవాక్సరీ
పాటికిఁ బీతశాటికి విపాటితదుష్టనిశాటవాహినీ
కోటికిఁ బత్త్రిఘోటికి నికుంజసమర్పితగోపికాసునో
ధాటికి నల్లలాటికి సుధాబ్ధిసుతాస్థితహృత్కవాటికిన్. 31

వ. సమర్పితంబుగా నాంధ్రంబున నా యొనర్పంబూనిన
శ్రీనారదీయ మహాపురాణాంతర్గత పురుషోత్తమ మాన మాహా
త్మ్యంబునకుఁ గథా ప్రారంభం బెట్టిదనిన. 32

కథా ప్రారంభము.

క. వందారుబృందమందిర
మందారు నమందపాపమర్దనపీరున్
బృందావనసంచారున్
బొందికఁ గొనియాడికొందుఁ బురుషోత్తమునిన్. 33

క. నరనారాయణులకు నజ
తరుణికి వ్యాసునకు నధికతప్రీతి నమ
స్కరణం బొనరిచి జయముం
బరఁగ వచింపఁగఁ దగు నభాస్థలియందున్. 34

—♦(సూతుండు నైమిశారణ్యంబునకు వచ్చుట)♦—

వ. నైమిశారణ్యంబునఁ దొల్లి బ్రహ్మిష్ఠులును వేదవేదాంగ
పారగులును లోకానుగ్రహకర్తలును పరోపకృతిశీలురును నిరంతర
పరప్రీతిరతులును శ్రౌతస్మార్తపరాయణులును నైన యసితుండును
దేవలుండును పైలుండును సుమంతుండును పిప్పలాయనుండును

ఘుమతియుఁ గార్గ్యపుండును జాబాలియు భృగుండును అంగిరసుం డును వామదేవుండును సుతీక్ష్ణుండును శరభంగుండును బర్వతుండును ఆపస్తంబుండును మాండవ్యుండును అగస్త్యుండునుగాత్యాయనుండును రథీతరుండును ఋభుండును కపిలుండును రైభ్యుండును గౌతముండును ముద్గలుండును గౌశికుండును గాలవుండును క్రతుండును నత్రియు బభ్రుండును త్రితుండును శక్తియు బుధుండును బౌధాయనుండును వసుండును గౌండిన్యుండును పృథుండును హారీతుండును ధూమ్రుం డును శంకుండును సంకృతియు శనియు విభాండకుండును పంకుండును గర్గుండును గాణామండును జమదగ్నియు భరద్వాజుండును ధూమ పుండును మౌనభార్గవుండును గర్కశుండును శౌనకుండును శతా నందుండును విశాలాఖ్యుండును విష్ణువృద్ధుండును జర్జరుండును జయుం డును జంగముండును పారుండును పాశధరుండును పూరుండును మహాకాయుండును జైమినియు మహాగ్రీవుండును మహాబాహుండును మహోదరుండును మహాబలుండును ఉద్దాలకుండును మహాసేనుం డును ఆర్తుండును ఆమలకప్రియుండును ఊర్ధ్వబాహుండును ఊర్ధ్వ పాదుండును ఏకపాదుండును ఉగ్రశీలుండును జలాశియుఁ బింగలుం డును శాండీరుండును కరుణుండును కాలుండును కైవల్యుండును గలాధరుండును శ్వేతబాహుండును రోమపాదుండును కద్రుండును కాలాగ్నిరుద్రగుండును శ్వేతాశ్వతరుండును బృథుశ్రవసుండును మొదలగు పెక్కండ్రు మహామునులు శిష్యసహితులై చేరి పవిత్రం బగు నొక్క సత్రంబుసేయ నుద్యుక్తులైయున్నయెడ. 35

ఉ. సూతుఁడు తీర్థయాత్రలకు క్షోణిఁ జరించుచు నైమిశంబునం

బూతచరిత్రులైన మునిపుంగవులన్ బహు శిష్యయుక్తులన్

జేతము పల్లవింపఁ గని చెచ్చెర వందనమాచరింపఁగా
నాతఁడె వారి సన్నిధికి నమ్ముని వచ్చె మహాదరమ్మునన్. 36

సీ. రక్తవల్కలముఁ జీరగఁ దాల్చి గోపిచం
దనముచే నూర్ధ్వపుండ్రమ్ము దిద్ది
శ్రీనామముద్రలుబూని శంఖము చక్ర
మును దాల్చి తులసిమాలను ధరించి
ఘనజటామకుటమండనుఁడు శాంతుఁడు సుప్ర
సన్నవక్త్రుఁడు సర్వశాస్త్రవేది
జితహృషీకచయుండు జీవన్విముక్తుండు
పరమార్థ కుశలుఁడు పరహితుండు

గీ. హరిపదార్పితహృదయుఁడు పరమమంత్ర
జాపకుఁడు వ్యాసమౌని ప్రసాది సూతుఁ
డా వనంబున కేతేర నతనిఁ గని మ
హర్షులెల్లరు హర్షప్రకర్షులగుచు. 37

క. కడువేగ లేచి యాతని
కడ కరిగి విచిత్ర వివిధ కథలను వినఁగాఁ
గడఁకఁ దనుఁజుట్టు వాఱిన
జడదారుల కతఁడు మ్రొక్కె సాష్టాంగముగన్. 38

ఉ. మ్రొక్కిన రౌమహర్షణి కమోఘవచస్సుల దీవనల్ మునుల్
జక్కఁటఁ బల్కి భాగవతసత్తమ నీకిదె యాసనం బటం
చొక్క మనోహరాసనము నొప్పుగఁ గూరిచి పేద దేరుమం
చక్కడఁ దాము నాసనములందు సుఖంబుగఁ గూరుచుండినన్.

ఉ. వారి తపస్సమృద్ధియును వారల తీర్థవిధంబు వారి నీ
వార సుఖోపలబ్ధియును వారల యాశ్రమ నిర్భయత్వమిం

పారఁగ బ్రశ్న సేసి వినయైక విభూషణుఁడైన సూతుఁడ
వ్వారలొసంగు నాసనముపై సుఖ సంస్థితుఁడైన పిమ్మటన్.

వ. పుణ్యకథా శ్రవణ కుతూహలులగు నమ్మునులిట్లనిరి. 41

సీ. అతి భాగ్యవంతుఁడవన్న నీవేకదా
పరికింప నో మహాభాగ సూత
గురు కృపచేఁ బరాశరసూతివాక్యత
త్త్వము జక్క నెఱిఁగినవాఁడ వీవ
నీవు సుఖంబుంటివే? వనంబున నిన్నుఁ
జిరకాలమునకు వీక్షింపఁగలిగె
శ్లాఘనీయుఁడవు పూజ్యప్రధానుండవు
వ్యాసమహర్షి శిష్యావతంస
గీ. సారహీనమహాభవసాగరమున
వినఁగఁదగినవి వేనవేల్ వెలయు, నందుఁ
గొలఁదిలోననె శ్రేయంబు గూర్చు సార
భూతమగు దాని నొండు సంప్రీతిమెఱయ. 42

మ. హరిలీలారసపూరితంబయి మహాహర్షప్రదంబై శివం
కరమై యొప్పు కథావిశేషకము దుష్కర్మాద్రి దంభోళి సం
సరణాంభోధినిమగ్నతారకము నజ్ఞానాంధబాధాపహా!
సరసస్తుత్య! వచింపు నీమది కభీష్టంబైనదానిన్ వెసన్. 43

వ. అని యడిగిన శౌనకాదిమహామునులకు బద్ధాంజలియై
సూతుండిట్లనియె. 44

మ. వినుఁడీ సర్వమునీంద్రులార! తొలుతన్ విఖ్యాతమౌ పుష్కరం
బను తీర్థంబునకేగి క్రుంకులిడి ఋష్యాదిత్య పిత్రాదులం

సీ. సిద్ధభూషణులు ప్రసిద్ధయోగులు దేవ
మానులాహారంబు లేనివారు
ఫలపత్రపవనముల్ భక్షించువారలు
నీర మాహారించువారు మఱియు
నిశ్వాసపవనడిండీరముల్ దినునట్టి
వారలు కొందఱు జేరిరటకు
బ్రహ్మభూతుండును భగవంతుఁడీడ్యుండు
యోగీంద్రులందు నత్యుత్తముండుఁ
గీ. కృష్ణపాదాంబుజాతసంతృప్తచిత్తుఁ
డష్టవర్గదేశీయుఁడు శిష్టతముఁడు
ధూతకల్మషచయుఁ డవధూతమూర్తి
వ్యాసతనయుండు శుకదేవుఁ డపుడు వచ్చె. 49

మ. స్మితవక్త్రుం జ్వలితప్రకాశు నసితస్నిగ్ధాలకోపేతు నా
యతబాహున్ బహుధూళిధూసరితసర్వాంగున్ దయోత్సంగు నా
చతురున్ మూఢులు స్త్రీలు బాలకులు పశ్చాత్తప్తులై దూరసం
స్థితిమై మ్రొక్కి గృహోక్షసాచ్ఛి రతిభక్తివ్యాప్తచిత్తంబులన్. 50

మ. త్వరతో నచ్చటవచ్చియున్నమునులా వైయాసకిం గాంచి లే
చిరి బద్ధాంజలులై రి పీఠమిడి రక్షీణోపచారంబు సా
దరులై చేసిరి పద్మకర్ణికను బత్త్రిస్తోమముం బోలె నం
దఱుఁ దత్సన్నిధిఁ గూరుచుండిరి వచోధారాతతుల్ గ్రోలఁగన్.

ఉ. జ్ఞానసుధాబ్ధిచంద్రుఁడు ప్రశాంతుఁడు వ్యాసమునీంద్రసూనుఁ డా
ధీనిధి బ్రహ్మవర్చసముదిక్కులఁ బిక్కటిలంగఁ జేయుచున్
మానులొసంగు పీఠవరమధ్యమునన్ వెలుఁగొందుచుండెఁ దా
రానిచయావృతామృతకరచ్ఛవి నమ్మునిమధ్యవర్తియై. 52

వ. అని మఱియు సూతుండిట్లనియె. 53

సీ. ప్రాయోపవిష్టుఁడై భరతవంశ్యుఁడు పరీ
క్షిత్తు ప్రశ్నింపఁగా శ్రీశుకుండు
కరుణించిపల్కు భాగవతంబు విని పరీ
క్షి న్మోక్షణంబు వీక్షించి పిదప
సత్రంబుసేయఁగా సమకట్టి దీక్షఁ బూ
నిన మిమ్ము నిచటఁ గన్గొనెడి వేడ్క
నేతెంచి మిమ్ముల నీక్షించి విప్రసా
ధువులార నే కృతార్థుండనైతి

గీ. అనిన సూతునితో ఋషులపుడు సాధు
వర్య! వార్తాంతరంబుల వదలి వ్యాస
వదన సంశ్రుతమౌ నపూర్వవిషయంబుఁ
బ్రీతి దళుకొత్త మాకు విన్పింపుమనిన. 54

వ. సూతుండు శౌనకాదులకిట్లనియె. 55

ఉ. నన్ను విలోమజుండనయినం బరిపృచ్ఛ యొనర్చినార రు
ద్యన్నిగమాంచితుల్ దమరు; ధన్యుఁడనైతి యథామతిం గథల్
పన్నగ వ్యాసమౌని ముఖపద్మమునుండియు విన్నరీతిగాఁ
గ్రన్నన మీకుఁ దెల్పెదను గావున నాదట నాలకింపుఁడీ 56

— { నారదుండు నారాయణర్షి దర్శనంబునకై బదరికాశ్రమంబునకు వచ్చుట. } —

సీ. ఒక దినంబునఁ దొల్లి యుత్తమతాపస
సిద్ధ బృందారక సేవితంబు
బదరీ కపిత్థ నీపప్లక్ష బిల్వామ్ర
జంబు జంబీరాది శాఖియుతము

విష్ణుపాదోదక విభ్రాజమాన పు
ణ్యాలకనందాపగాలలితము
పరిహృత నిజవైర హరికరితురగ కా
సర ముఖ్య జంతు సంభరిత తలము

గీ. నైన యీ నరనారాయణాలయమునఁ
బ్రస్ఫురద్దీప్తియుతుఁ బరబ్రహ్మసక్త
చిత్తు. జితరిపుషడ్వర్గు జితహృషీకు
మహితు నారాయణాభిఖ్య మానిఁగనఁగ. 57

సీ. ఆకులన్నియురాలి జోకబాసిన మోడు
మ్రాఁకులుం జిగురాకు రాకఁజూప
విరసంబులని పెల్లునిరసింపఁబడు తూలు
సరసంబులై కడుఁ జాలువాఱ
ఱెక్కవైచినఁగాని లెక్కసేయక చెవుల్
ఱిక్కించి పసరముల్ చొక్కినిలువ
పగఁబూని యేతెంచు ఖగరాజుఁగానక
ఫణలెత్తి చక్షుశ్శ్రవంబులాడ

గీ. మహతి మీటుచు నిజగాన మహిమవెలయ
శ్రీహరిని బాడికొనుచు విచ్చేసెనటకు
భూరితనుకాంతి నిర్జితపారదుండు
ధీరవందితపాదుండు నారదుండు. 58

క. చనుదెంచి తత్పదద్వయి
కి నమస్కారంబు సల్పి కేల్దోయి ఘటిం
చి నితాంతంబుగ నీక్రియ
మునినాథుని బొగడె దేవముని మునులారా. 59

ఉత్సాహ. దేవదేవ ! జగదధీశ ! దీనరక్షణక్షమా
పావన ! త్రిసత్య ! సత్యభావ ! సత్యసంభవా !
కావుమయ్య' సత్యయోని ! కరుణ, శరణు సొచ్చితిన్
హావళిం దొలంగఁబెట్టుమయ్య! నీకు మ్రొక్కెదన్. 60

వ. మహాత్మా నీవఖిల శిక్షార్థంబును మర్యాదాస్థాపనార్థంబును దపంబాచరించుచుందువు, అట్లుకాదేని కలియుగంబున నొక్కండొనరించు పాతకంబున భూమండలంబు మునుంగు, మఱియు నట్లే యొక్కనిపుణ్యంబునఁ బుణ్యపాపిజనావృతంబగు నిమ్మేదినితరియించు, కృతాదియుగంబులఁ దొల్లి పుణ్యంబొండె పాపంబొండె యొక్కండొనరింప నది సర్వగంబగుట దొలంచి కలియుగంబునఁ గర్తను మాత్రంబుసెందుపొంకు నీవు తపోనిష్ఠవర్తింతువు. 61

శా. అయ్యా! సర్వజనుల్ నిరంతరము దారాపత్యవేశ్మంబులన్
నెయ్యంబున్ ఘటియింతు, రట్టిజనులున్ నేనుం దరింపంగ నా
కయ్యాలించి కథా విశేషమును నాకుం దెల్పుమీ ! తావకా
శ్రయ్యానూన సుధాధురీణమృదువాక్చాతుర్య మేపారఁగన్. 62

గీ. విష్ణు వుపకారరతుఁడని వేదమందు
నిశ్చయింపఁగఁబడుటచే నీముఖమున
బుణ్యకథలను వినియెడి బుద్ధివొడమి
బ్రహ్మలోకంబు డిగి యిట వచ్చినాఁడ. 63

ఉ. కావున లోకతారకముగాఁ గథలంగల భూరి సారమున్
వే వచియింపఁగావలయు విన్నజనంబులకున్ రయంబున
న్గావలె మోక్షమం చనిన నారదు పల్కులకున్ హసించుచుం
బావనమైన సత్కథను బల్కఁదొడంగె ఋషీంద్రుఁడంతటన్. 64

సీ. వల్లవకామినీవదనాబ్జభృంగంబు
రాసకేళిక్రియారసికమూర్తి
బృందావనవిహారి సుందరాకారుండు
పరమపూరుషుఁడు గోవ్రజవిభుండు
కనురెప్పపాటులోననె జగంబులనెల్ల
నిర్మింపఁజాలిన నేర్పుకాఁడు
నగు మహనీయు కృత్యమ్ము వర్ణింపఁగా
ధారుణిలోన నెవ్వారితరము

గీ. సార సరసంబు పాపవివారకంబు
వాగతీతము నారదయోగివర్య
నీవు నా భగవంతువి పావనతర
చరితమెట్టిఁగియె వర్తింతు వరసిచూడ 65

శా. ఐనన్ శ్రీపురుషోత్తమ ప్రథిత మాహాత్మ్యంబు నీవిష్టు స
న్మానం బొప్పఁగ నన్నుఁ బ్రశ్నమొనరింపం జెప్పగాఁబూనితిన్
దానిన్ విన్నదినిస్స్వతాహరము వైధవ్యాపహారంబు సం
తానోదగ్రియశస్కరం బమృతసంధానక్రమం బెంతయున్. 66

వ. అవిన నారదుండిట్లనియె. 67

క. పురుషోత్తముఁడన నేదే
వర ! యాతని మహిమ యెద్ది పరికింపఁగ న
చ్చెరు విడునని తోఁచె నవి
స్తరముగ వచియింపుమయ్య దాక్షిణ్యనిధీ. 68

వ. అంత సూతుండు శౌనకాదులకిట్లనియె. 69

క. నారదువచనము విని యా
నారాయణవరాని దనమనమున ముహూర్తం
బారూఢిగఁ బురుషోత్తముఁ
జేరిచి ముదమొంది యిటులఁ జెప్పఁదొడంగెన్. 70

క. పరగును సహేతుకాఖ్యము
పురుషోత్తమ మాసమొండు; పుణ్యుఁడు కరుణా
శరనిధి తన్మాసాధీ
శ్వరుఁడా పురుషోత్తముఁడని వచియింపఁబడున్. 71

క. కావున ఋషులీమాసము
పావన పురుషోత్తమాఖ్యఁ బడసినదని సం
భావింతురా వ్రతక్రియ
తో వెసఁ బురుషోత్తముండు తుష్టింగాంచున్. 72

వ. అనిన నారదుండిట్లనియె. 73

మ. మధు మాసాదులు సేశ్వరంబులని పల్కారేను వింటిన్ శ్రవః
పథమున్ శ్రీపురుషోత్తమాఖ్య; నెలదాఁ బ్రాపింపదందోతమో
మథనా! శ్రీపురుషోత్తమాఖ్యఁగాని యేమాసంబువోల్చున్ దయా
నిధియా శ్రీపురుషోత్తముండెటులనుండెన్ దానికిన్ స్వామియై.

వ. మఱియు నా పురుషోత్తమమాస స్వరూపంబును నందుఁ జేయందగు స్నాన దాన జప పూజోపవాసాది సాధన విధానంబులును అట్లుసేసిననే దేవుండు సంతసించి యేమిఫలం బొసంగునదియు నింక నితరవిశేషంబులున్న నవియుం దత్వంబుగ జెప్పవేడెద, దీనవత్సలులగు సాధువులడుగకయు వచింతురుగదా. 75

సీ. దారిద్ర్యపీడితు లారోగ్యహీనులు
పుత్రాభిలాషులు మూకజడులు
దంభసంయుతులు విద్యావిహీనులు కుచే
లులు నాస్తికులు లంపటులు కుటిలులు
నీచులు జర్జరుల్ నిత్యనష్టాశులు
క్షీణ సత్వులు పరసేవకులును
భగ్న. సంకల్పులు ప్రబలకుష్ఠామయుల్
వ్యంగాంధదుఃఖశుష్కాంగకులును
గీ. ఇష్ట మిత్ర కళత్ర విహీనజనులు
మాతృ పితృ రహితులు శోకమగ్నచిత్తు
లిష్టవస్తువివర్జితు లితర భాగ్య
వర్తులుందురు కొందఱు వసుధయందు. 76

క. ఏదిసేసిన నెదివినఁగా
నెది తలఁపఁగ మఱల నీదృశులయి తా
ముదయింపకుందు రీ మానవు
లది విదితముసేయవలయు నమలచరిత్రా! 77

మ. వైధవ్యంబులు వంధ్యతాదురితముల్ వైవర్ణ్యహీనాంగక
వ్యాధుల్ విద్రధి రక్త పిత్తరుజలున్ యక్ష్మాదు లున్మాదముల్
వేధింపం; బరిఖిద్యమానజనులన్ వీక్షించి నేనోజగ
న్నాథా దుఃఖితమానసుండనయితిన్ నన్నుం గటాక్షించుచున్.

గీ. నాదు మనమున కత్యంత మోదహేతు
కమ్మును సవిస్తరముగఁ బల్కఁగవలయు
బ్రహ్మ! సర్వజ్ఞ! సర్వతత్వములకీవ
నిధివటందురు దీన సందేహమున్నె? 79

చ. ఇటుల సురర్షి నారదమునీంద్రుని లోకహితప్రహేతుకో
త్కటమధురోక్తులన్, మునివతంసవిభుండగు దేవదేవుఁడా
దటవిని, మౌనివర్యుని సుధాకరశాంతునిఁ బూజసేసియు
ద్భటనవవారివాహరవవల్గువచస్సులతోడ నిట్లనున్. 80

వ. అంత శౌనకాదిమహామునులు నిఖిలపురాణవ్యాఖ్యాన కుశలుండగు సూతుంగాంచి నరసఖుండగు నారాయణుండు నారదునకుం జెప్పిన శుభవచనంబులు మాకానతీయవేయని యడిగిన నో ద్విజసత్తములారా! శ్రీమన్నారాయణఋషీంద్రుండు నారదునకుం జెప్పిన మనోహరవచనంబులు నేను విన్నరీతిగ మీకుం జెప్పెద వినుండు అట్లు శ్రీనారాయణుండు నారదునిం గనుంగొని తొల్లి శ్రీహరియు మహాత్ముండు నగు శ్రీకృష్ణునిచే ధర్మజునకుం జెప్పంబడినదానిని నీకుం జెప్పెద వినుమని యిట్లనియె. 81

(శ్రీకృష్ణుండు కామ్యకవనంబుననున్న పాండవులయొద్దకువచ్చుట.)

సీ. ధర్మజుం డొకనాఁడు ధార్తరాష్ట్రులతోడఁ
గూడి జూదంబాడి యోడిపోయి
పావకసంజాత పాంచాలి దుశ్శాస
నా కృష్టకచవస్త్రయగుచుఁ గృష్ణుఁ
బ్రార్థించి రక్షితయై; రాజ్యముదొరంగి
కామ్యకారణ్యంబుకడకుఁ జేరి
యిడుమలు గుడుచుచు నడవిపండ్లనుమెక్కి
కిరులట్లు పాండవుల్ దిరుగుచుండ

గీ. వారి నవలోకనముసేసి వచ్చుపొంటె
మునులతో వాసుదేవుండు సనిన నటకుఁ
బ్రాణములు సెంద లేచు దేహములపోల్కి
లేచి పార్థులు వెసఁ గౌఁగిలించికొనిరి. 82

క. యమళుల్ ద్రౌపదియు నతి
ప్రమదము గౌరవము భక్తిభావము వినయం
బమరఁగ నమస్కరించిరి
కమలాక్షుని మృదుల పాదకమలంబులకున్. 83

మ. గురుచర్మాంకులు ధూళిధూసరితగాత్రుల్ రూక్షకేశుల్ వ్యథా
భరితుల్ పాండవు లవ్వనాంతరమునం బాంచాలితోఁ దాదృశ
స్ఫురణా కంపితతోఁ జరింపఁగని యా ఫుల్లాబ్జనేత్రుండు దు
ర్భర దుఃఖాగ్నిసమేధమాన పరితాపంబంది చిత్తంబునన్. 84

సీ. భక్తవత్సలుఁడైన భగవంతుఁడప్పుడు
ధార్తరాష్ట్రులను దగ్ధంబుసేయఁ
దలపోసి కోపంబుదాలిచి భ్రూభంగ
కుటిలేక్షణుండయి కోటికాల
భయదవక్త్రుండయి ప్రళయాగ్నిసదృశుఁడై
చటులసందష్టోష్ఠపుటుఁడయి; మును
సీతావియోగంబుచేత సంతప్తుఁడౌ
శ్రీరామచంద్రు నాకారమూని

గీ. మూఁడులోకంబులను గాల్చు వాఁడుఁబోలె
నడరు శ్రీకృష్ణునీక్షించి యర్జునుండు
ధర్మజాద్యనుమోదంబుదాల్చి భీతి
కంపితుండయి యిటు నుతింపఁదొడఁగె. 85

గీ. సాధుజనపూజ్య యో జగన్నాథకృష్ణ
జగము వెలుపలివాఁడ నేనగుదునొక్కొ?
జగములను బ్రోచువాఁడవీవగుటఁజేసి
నన్నురక్షింపవేల? యాపన్నశరణ. 86

ఉత్సాహ. మంగళాంగ మౌనిపూజ్య మామనోహరా హరీ
సాంగవేదబీజబీజ సర్వహేతుకారణా
సంగరహిత జోతయిఁకను సంహరింపుకోప మి
బ్భంగి రోషమిప్పు సెందఁ బ్రళయమందఁ లోకముల్. 87

మ. కరుణావారిధి వీశ్వరుండవగు నోకంజాక్ష నీవిచరా
చరలోకంబు సృజంతు వీక్రియ జగజ్జన్మ ప్రధానుండవై
దురితం బొక్కఁడుసేయ నెల్లజగముల్ ద్రుంగింతువే? దోమలన్
నురుమాడంగ నెవండు కొంపదహియించుం ఉచ్చుముట్టించుచున్.

వ. అంత నారాయణముని యిట్లనియె. 89

కం. పరవీరహరుఁడు నరుఁడిటు
లభిముఖిప్రార్థించి కృష్ణు, నంజలి బంధం
బారయఁగ భాలంబున, నా
హరికి నమస్కారమిడియె నతులితభక్తిన్. 90

ఉ. అంతటఁ గోపముందొలఁగి యాహరి; చంద్రుఁడువోలె సౌమ్యతా
క్రాంతినెసంగఁ బాండవులుగన్గొని యొంతయు స్వస్థచిత్తులై
చెంతకుఁజేరిమ్రొక్కి వనసీమ లభించు ఫలాదులిచ్చి యు
త్యంతముఁ బూజసేసిరి ప్రియంబు మనంబులఁ దాండవింపఁగన్.

ఉ. ఆశరదిందుసుందరతరాస్యుఁడు నూతనవారివాహనీ
కాశుఁడు భక్తవత్సలుఁడు కంసనిషూదనుఁ డుగ్ర నిగ్రహా
వేశముమానియుంటఁగని ప్రేమపరిప్లుతచిత్తుఁడై గుడా
కేశుఁడు మాటిమాటికిని గేలుమొగిడ్చి యొనర్చెఁబ్రశ్నముల్.92

మ. పరమోదార! మునీంద్ర! నీవిపుడునన్ బ్రశ్నించు వృత్తాంతమా
నరుఁడుం గృష్ణుని బ్రశ్న సేసిన జగన్నాథుండు సర్వజ్ఞుఁ డా
దరబుద్ధిన్ విని కొంతజాగుమదిలో ధ్యానించి యప్పాండవో
త్కరముల్ ద్రౌపదినూరడించి పలికెన్ దత్ప్రీతి సంధిల్లఁగన్.93

వ. శ్రీకృష్ణుండిట్లనియె. 94

మ. వినుఁడీ పాండవులార నావచనముల్ భీభత్సుఁడిప్పట్టునన్
ననుఁబ్రశ్నించె నపూర్వమా విషయముల్ దానిన్ వచింపంగ మ
న్మనముత్సాహము సూపదయ్యదివినన్మౌనీంద్ర సంఘమ్ముకై
నను దుస్సాధము; గాన, భక్తులగుటన్ వర్ణింతుమీకియ్యెడన్.95

—{ శ్రీకృష్ణుండు పాండవుల కథిమాసవృత్తాంతంబు సెప్పుట }—

సీ. చైత్రాదిమాస పక్షర్తునాడీలవ
యామాయనద్వయ హాయనములు
ఋతుయామినీ ఘస్రవితతులుయుగపరా
ర్ధంబులు కూపనద్యర్ణవములు
వాపీతటాక పల్వలనిర్ఝరంబులు
పాదపౌషధివనస్పతులు లతలు
పురపత్తనగ్రామగిరులు మున్నగుమూర్తి
మంతంబులన్నియు సంతతంబు

గీ. స్వీయగుణములచేతఁ బూజితములయ్యె
వానిలో స్వామిలేనిది కానఁబడదు
ఫలములిడునవి తమతమపదవులందు
ననయమును బూజితములగు నరయనెందు. 96

వ. మఱియు నీజగంబున సకలంబులును నిజనాథయోగ మాహాత్మ్యంబునంజేసి సౌభాగ్యవంతంబులైయుండు.

ఆ. వె. అధికమాసమనఁగ నావిర్భవించెను
బూర్వమందుఁ బాండుపుత్రులార!
అఖిలలోకవాసు, లసహాయమును జుగు
ప్సితమునైనదాని స్థితినిజూచి. 98

మ. మలమాసంబిది దీనియందు శుభకర్మంబేదియుం జేయరా
దలసూర్యుండునుసంక్రమింపఁడహాహా!యస్పృశ్యముఁ నింద్యముఁ
గలు షోపేత మనర్హమంచుజగముల్ గర్హింపఁగా వారిప
ల్కులకుందన్మలమాసముల్లమున ముల్కుల్ గుచ్చినట్లేడ్చుచుఁ.

ఉ. అందఱు నన్ దుఃఖారములనాడుచు మాటికిఁజౌకసేయుచుఁ
నిందితమాసమంచుఁ గడునీచముగాఁ దలపోయుచుండ్రు నా
చందముఁజూడ మేఁకమెడ చన్నులచెన్నువహించె నక్కటా
యందఱిలోన నిట్లనదనై బ్రదుకన్ లిఖియించితేవిధీ. 106

క. అనియిట్లు మాటిమాటికి
దనలోఁదలపోసిపోసి తలవ్రాతకునై;
మనమందుఁ జచ్చునిచ్చం
గోనియెన్ మలమాస మార్తికుంఠితమతియై. 101

—(అధిమాసంబు వైకుంఠంబునకుఁ జనుట.)—

మ. అధిమాసంబటుమీఁద నెట్టటులో ధైర్యంబూని వైకుంఠమున్
వ్యథఁబోకార్చికొనంగఁ జేరి యట నా యంతఃపురంబాదు సు
ప్రథితోదగ్రమణిప్రభాలసితభర్మస్ఫీతసింహాసనం
బధిరోహించి వసించు నన్నుఁగని సాష్టాంగంబులర్పించుచున్. 102

ఉ. అంజలిసంఘటించి వినయంబునఁ; గన్నులజారు నశ్రువాః
పుంజముతోడ గద్గదికఁబూనిన వాక్కులతోడ సౌమ్యతా
రంజనతోడ నుద్గతనిరంతరభక్తిపరీతశుద్ధ హృ
త్కంజముతోడ ధైర్యమును గైకొని యిట్లువచించెనత్తఱిన్. 103

గీ. ఈవిధంబున నా బదరీవనస్థ
మౌనివల్కిన నారదమౌనివర్యుఁ
డాలకించి తదీయవాక్యంబులెల్ల
మఱలఁ బ్రశ్నించె నీరీతి మౌనులార ! 104

సీ. చంచలేతరభక్తి జంగమ్యమానంబు
జగదశేషాఘనిస్తారకంబు
సతతయోగాభ్యాసి జనచయాగమ్యంబు
హేయదూరానందదాయకంబు
రమణీయ బహురత్నరాజితస్థలకంబు
సూర్యకోటిప్రభా శోభితంబు
పాకశాసనముఖ్యభక్తసంసేవ్యంబు
సకలసౌభాగ్య విస్తారకంబు
గీ. పూర్ణరూపాదివిష్ణు విభూషితంబు
భవనరాజంబుఁ జని జగద్భయనిహంత

హరినిగని తత్పదాబ్జముల్ శరణుసొచ్చి
యధికమాసంబు పిదప నేమనివచించె? 105

వ. అనియడిగిన నారదునకు నారాయణుండిట్లనియె. 106

క. వినుమో నారద లోకం
బునకు హితంబేనుగోరి పొలుపుగనీకున్
వినిపించెద నధిమాసము
జనియా హరికడకు; సలుపు సంభాషణముల్. 107

వ. అధిమాసంబిట్లనియె. 108

మత్తకోకిల. నాథనాథ! దయానిధీ! శరణాగతార్తివిభంజనా!
శోధితాఘసమూహ! నక్రనిషూదనా! మధుసూదనా!
మాధవా! జగమెల్లనన్ మలమాసనామముచేతస
క్రోధులై పలుకాడుచుందురు ప్రోవుమయ్యాజనార్దనా! 109

మ. శుభకర్మంబులకుజ్జగింతురు ననున్ శుద్ధేతరంబంచు; న
ప్రభుకంబంచు సనాథమాసములు గర్వప్రాభవంబొప్ప నా
రభటిన్ మాటికి నవ్వుచుండెడిని దీవ్యంబాభవద్రక్షితా
విభవంబేడకునేగె నిమ్మెడననున్ వేగంబెరక్షింపవే. 110

మ. ఖలుండై దుర్మనుండై మహాకఠినుండై కంసుండుపూర్వంబునన్
లలనారత్నము దేవకిన్ మిగుల నల్కంబూనిబాధింప; నా
తులువన్ ద్రుంచి తదీయదుఃఖలతికం దున్మాడవే? దీనవ
త్సల! తద్రీతిగ నేల మామక మనశ్శల్యంబుఁ బోకార్పవో. 111

మ. యమునాద్వీపవతీవిపాంబువుఁబిపాసాయత్తులై గోపకుల్
తమ గోవర్గముతోడఁద్రావి యసుసంతానంబు గోల్పోయినన్
విమలంబైన భవత్కృపాగరిమచే వీక్షించిరక్షించిన
ట్లమలాత్మా! శరణంబువేఁడునను నేలా నేఁడురక్షింపవో. 112

ఉ. గోపులు గోపకుల్ మఱియు గోపసతీతిలకంబు లవ్వనిన్
దావశిఖిప్రభంజనము దార్కొని యేచుడు నిన్ను వేఁడినన్
ద్రావితదగ్ని; వారల సురక్షితులం బొనరించినట్లు నన్
జేవదలిర్ప రక్షణము సేయవదేటికి? దీనవత్సలా. 113

మ. సమరోదాత్తభుజాబలాంధుఁడు జరాసంధుండు బాధింప దు
ర్దమదుఃఖంబున రాజులెల్లరు నినుం బ్రార్థింప నవ్వారలన్
విమలంబైన భవత్కృపాగరిమచే వీక్షించి రక్షించిన
ట్లమలాత్మా! శరణంబు వేఁడునను నేలా నేఁడు రక్షింపవో. 114

మ. గురుగంభీరసరోవరాంతరమునం గుంభీరమొక్కండు దు
ర్ధరశక్తిన్ గజరాజుఁ బట్టి పరిమార్పం జూడ నాదంతి దు
ర్భరదుఃఖంబున నిన్ను వేఁడిన వెసన్ రక్షించినట్లీవు నన్
గరుణం బ్రోవవదేల? తెల్పగదవే? కారుణ్యవారాంనిధీ. 115

చ, దవదహనంబుగా సవతితల్లి దిసంతులు గొట్టి చిత్తమున్
మిపులదహింప నీశ్వరు నమేయగుణాకరు నిన్నుఁ గొల్చు నా
ధ్రువుఁ గరుణించుచున్ జితవిరోధిజనున్ బహుభద్రసంయుతుం
దవిలిన ప్రేమఁ జేయు క్రియ నన్నొనరింపవదేల? శ్రీహరీ. 116

మ. దురితాత్ముం డసురాధిపుం డిభముచేఁ ద్రొక్కించియున్ నొంచియున్
గిరులన్ వైచియు బాఁకులం బొడిచియుం గీలించియుం గీలలన్
బరిమార్పం దలపూన? నిన్ గొలుచు నా ప్రహ్లాదు నేరీతి నీ
కరుణం బ్రోచితి వా విధంబున ననుం గావంగరాదే? హరీ. 117

మ. భవదిచ్ఛన్ జ్వలనుండు చల్లవడుఁ, గంపంబందు మేర్వద్రి, లా
ఘవముం జెందు నదీశ్వరుండు, జడతంగాంచున్ సురేజ్యుండు, భా
నుపుతాస్త్రముచేత నోటువడు, నిన్నున్ మీఱరెవ్వారు; మా
ధవ! నినే మదినమ్ముకొంటి దయరాదా! నీకుదిన్ నాపయిన్.

వ. ఇట్లు నిరీశ్వరంబగు నయ్యధిమాసంబు పరబ్రహ్మస్వరూపుండగు విష్ణువునకు విన్నవించి విరమించి యశ్రుపరిప్లుతవదనంబున నాజగత్పతియెదుట నిలచియున్న సమయంబున శ్రీహరికృపాప్లావిత చేతస్కుండై దీనవదనంబుననున్న మలమాసంబుతో నిట్లనియె. 119

ఉ. వత్స! యిటేలవచ్చితివి? వావిరి నీవిపుడేల యీక్రియం
గుత్సితమైన దుఃఖమునఁ గుందుచునుంటివి? తెల్పువేగ; నా
పత్సమయంబునందు నను భావనసేసినవారి వంత నే
నుత్సుకతన్ నితాంతము వియుక్తముఁజేసెదఁ జింతమానుమీ.

క. నను శరణంబును వేఁడిన
జనులకు నెవ్వారికేని చర్చింపంగా
వనటలిఁకరావురావని
ఘనభక్తికమోఁదిచెప్పఁ గలుగుదు వత్సా. 121

మ. జరయున్ మృత్యువులేక శోకమటియున్ సానందమై చారు సు
స్థిరరూపంబగు నాపురంబునకుఁ బ్రీతిన్ వచ్చియు న్నీవు ని
ర్భర శోకామయమగ్నమానసమునన్ వర్తింతువేలా వృథా
తురితుండున్ బలితుండువచ్చిననిటన్ దుఃఖింపఁడొక్కండయున్.

శా. కుత్సా యిచ్చట దుఃఖమొందు నిను వైకుంఠస్థు లత్యంతమున్
వెత్రింగాఁ దలపోసి యచ్చెరువునన్ వీక్షించుచున్నారు; నీ
వుట్లిట్లాగఁగనేల చత్తునని; నీయుద్యోగమున్ మానుమీ
యొత్తావంతకు హేతువేమిచెపుమీ యుత్సాహివై యత్తఱిన్.

వ. అని శ్రీకృష్ణుండు పలికిన. 124

క. ఆసరసిజాక్షు పలుకధి
మాసంబాలించి తనదు మస్తగభరముం

దీసిన గతిఁదలపోయుచు
శ్వాసోచ్ఛ్వాసములతోడఁ జక్రికి ననియెన్ 125

సీ. ఆకాశవిధముగా నఖిలప్రపంచంబు
వ్యాపించియుండెడి యమలచరిత
సర్వలోకములకు సాక్షివై బహు చరా
చరములఁ బొలుపారు పరమపురుష
నిఖిలభూతంబులు నీయందుఁ గ్రమముగా
వసియింపఁ జేసిన వాసుదేవ
విశ్వదర్శనుఁడవై విష్ణుండవై జగ
న్నాథుండవై పొల్చు నళిననాభ

గీ. సుస్థిరాకారుఁడవయి కూటస్థుఁడవయి
యలరు నీకన్న వేఱులేదమరవంద్య
నీవెఱుంగని దిసుమంతయేని కలదె
కాన నావ్యథ నీవెఱుంగవె మహాత్మ! 126

క. ఐనను వచింతు నాథా
నేనిప్పుడుచెందు దుఃఖనీరధి నెవ్వం
డైనన్ జెందెనటంచున్
వీనులవినమెపుడు కనులవీక్షింపమెటన్. 127

మ. క్షణముల్ రాత్రులు పక్షముల్ దినములున్ సంవత్సరంబుల్ నెలల్
గణుతింజెందుచు నాథశోభితములై కౌతూహలంబందు; నా
కణువుంగీరితిలేదు నాథుఁడునులే డశ్లాట నన్నంబుజే
క్షణ! సత్కర్మకముల్ సనాథములు ధిక్కారంబుగావించెడిన్.

చ. మలయుత మంథ మార్యజనమండలదూషిత మెప్డు దీనినిం
జెలువలుచూలుదాల్చినఁ గుసీదముగై కొననెంచినంగదా

నెలయని యించుకంతగగణించెద రంతియెకాని దీనిక
గ్గలమగుపేరులే దవటగం; బని నన్ వచియింతురచ్యుతా. 129

ఉ. కావునఁ జావనిచ్చమదిఁగట్టిగఁ బట్టితినయ్య నాకిఁకన్
జీవములన్ ధరించి నివసించెడిభావము పుట్ట, దిట్టి దు
ర్జీవితమూనుకంటెఁ గడుశ్రేయము చచ్చుటయే; జగంబునం
బావక దగ్ధుఁడౌజనుఁడు పాయక నిర్జర సెంద నేర్చునే? 130

మ. పరమాత్మా యిఁక లేవు నేనువచియింపందగ్గ వృత్తాంతముల్
పరదుఃఖప్రకరాసహిష్ణువు కృపాపారీణుఁడౌ విష్ణు వం
చరయన్ వేదములం బురాణముల నత్యంతప్రసిద్ధంబునీ
వరధర్మంబుదలంచి యిష్టమగు క్రోవంబొమ్ము భక్తప్రియా. 131

క. పామరుఁడు మాటిమాటికి
శ్రీమహితప్రభువునొద్దఁ జెప్పంజనదో
స్వామీ! చచ్చితిఁ జచ్చితి
నోముమటం చధికమాస మూరకయుండెన్. 132

క. తరువాత నధికమాసము
హరిసన్నిధియందుఁబడియె నతివేగమునన్
బరిపతితమైనదానిం
బరికించి సదస్యు లరిదిపడిరి మునీంద్రా. 133

వ. అని మఱియు నారాయణమునీంద్రుం డిట్లనియె. 134

చ. కలిగిన కష్టముల్ క్రమముగాఁ దనతో నటుఁవిన్నవించి యా
మలయుతమాస మంఘ్రిలసమక్షమునంబడియున్నఁ గాంచుచున్
జలరుహనాభుఁడిట్లనియెఁ జంద్రమయూఖ సుశీతలంబులన్
జలదమనోజ్ఞ రావసదృశంబుల మంజులభాషణంబులన్. 135

వ. అంత సూతుండిట్లనియె. 136

ఉ. ఆయతపుణ్యమూర్తి నిగమార్థవిచారవిపశ్చితుండు నా
రాయణమాని, పాపనికరాపహవాక్యములన్ వచించినన్;
గాయకగేయమానివిని కౌతుకియై, హరివాక్యముల్ శ్రవః
పేయము లయ్యెడన్ వినెడిపేర్మి మునీశ్వరులార యిట్లనున్. 137

క. చరణాగ్రనిపతితంబయి
మఱిమఱి దుఃఖించు నధికమానసముతో నా
వరదుండు హరియేమనియెను
పరమతపోనిధివతంస పలుకుమునాకున్. 138

వ. అని పలికిన. 139

క, వినుమీ తెల్పెద నారద
మునివర! ధన్యుండవీవు మురవైరి జనా
ర్దనుఁడు వచించిన సత్కథ
నను నీవడిగితివిగాన నయభయయుక్తిన్; 140

వ. పిదప శ్రీకృష్ణుం డర్జునా! యచ్చట వైకుంఠంబునజరిగిన
వృత్తాంతంబు నీకుందెల్పెద నాలకింపుమని యిట్లనియె 141

ఉ. అంతట మూర్ఛితంబయి సమక్షమునం బడియున్న మానసం
బెంతయుఁ గూర్మితో; హరి ఖగేంద్రునకుం గనుసన్న సేయఁ బ
ఱాంతముతోడ నాగరుడుఁ డల్లనవీచిన మూర్ఛదేరి శ్రీ
కాంతుని మ్రోలనిల్చి యనఘా! యిదినాకు రుచింపదింతయున్.

వ. అని మఱియు నధికమానసంబిట్లనియె. 143

ఉ. కావుము కావుమీ నను నఖండకృపాజలధీ రయంబునన్
దావకపాదపద్మశరణంబును వేఁడిన నన్నుపేక్షమైఁ

గావమియేల నీకని ప్రకంపితమై విలపించుమాసముఖ్
శ్రీవనితావిభుండుగని చిత్తమెలర్ప వచించెదానికిన్. 144

ఉత్సాహ. ఊరడిల్లు మూరడిల్లు మోయివత్స! నీవు క
న్నీరు నింపఁబోకుమింక నీకు భద్రమయ్యెడున్
దూరమెంచ నీసిలుంగు దుర్నివారమంచు హృ
త్సారసమున నాకుఁ దోఁపసాగె నోయనాథుఁడా! 145

క. అనిచెప్పి యొక్కతుత్రిటి హరి
మనమునఁ దదుపాయమరసి మాసముతోఁడన్
దను నిశ్చయించు విషయము
ననుమానంబేది పలికె నదిముదమందన్. 146

గీ. యోగిదుర్లభ గోలోక భాగమునకు
వత్స! నాతోడరమ్ము నీవనటవాయు
నచటఁ బురుషోత్తముండు మహానుభావుఁ
డైన శ్రీకృష్ణభగవానుఁ డధివసించు. 147

సీ. గోపికాకామినీకూటమధ్యస్థుండు
ద్విభుజుండు మురళికాదీపితుండు
నవనీరదశ్యామసువిలాసదేహుండు
రత్నపంకేజనేత్రద్వయుండు
శారదపార్వణచంద్రసుందరముఖుం
డద్భుతసక్ప్రపీతాంబరుండు
కోటికందర్పసంఘుష్టలావణ్యుండు
వనమాలికోపేతవక్షుసుండు

గీ భూరిమణిభూషణుఁడు ప్రేమభూషణుండు
చందనోక్షితసర్వాంగసౌరభుండు

హారి కస్తూరికా కుంకుమాంకితుండు
సత్సహాయుండు నిజభక్తవత్సలుండు. 148

సీ. శ్రీవత్సవక్షుండు శిష్టసంపూజ్యుండు
భ్రాజిత కౌస్తుభరాజితుండు
సద్రత్నసారభాస్వత్కిరీటాఢ్యుండు
నురుతరమణికుండలోజ్జ్వలుండు
అంచితరత్నసింహాసనారూఢుండు
పార్షదసందోహపరివృతుండు
పరిపూర్ణుఁడు పురాణపురుషోత్తముఁడు పరా
త్పరుఁడు నిరీహుండు ప్రభువరుండు

గీ. ఆతఁడే పరమబ్రహ్మమతఁడె యీశుఁ
డతఁడె ప్రకృతివిభిన్నుఁడు గతగుణుండు
నిత్యవిగ్రహుఁడీడ్యుండు నిర్వికారుఁ
డతఁడె కారణ మాధార మఖిలమునకు. 149

క. అచ్చటికేగిన మనమా
సచ్చరితుఁడు కృష్ణుఁడంత సాదరమతియై
వచ్చిన నీసంతాపము
గ్రచ్చుఁగ దొలఁగింపఁగలఁడు కదలుము వేగన్. 150

—(శ్రీహరి గోలోకంబున కథిమాసంబును గొంపోవుట.)—

వ. అనిపలికి యయ్యధిమాసంబును కరంబునధరియించి హరి గోలోకంబునకుంజనియె. అచ్చట స్వేచ్ఛామయుండును సర్వవ్యాపకుండునగు పరమేశ్వరుని మహోల్బణంబగు తేజం బలరారుచుండు అయ్యది యజ్ఞానతమోనివారకంబును జ్ఞానమార్గప్రదీపకంబును ప్రళ

యంబునను కేవలజ్యోతిస్స్వరూపంబును సూర్యకోటిసదృశంబును నిత్యంబును నసంఖ్యంబును విశ్వకారణంబును నైయుండు. అట్టి తేజంబున మనోహరంబగు లోకత్రయంబు వర్తించు ఆలోకత్రయంబుపై బ్రహ్మాంబుకైవడి శాశ్వతంబగు గోలోకంబుకలదు. ఆలోకంబు మూఁడుకోట్లయోజనంబులపొడవుగలిగి విస్తీర్ణంబై మండలాకారంబై తేజస్స్వరూపంబై మహారత్నభూమిమయంబై శ్రేష్ఠంబై యోగులకు స్వప్నంబునను నదృశ్యంబై యుండు మఱియుగోలోకంబు. 151

శా. ఆధుల్ వ్యాధులు మృత్యువుల్ జరలు శోకాదుల్ మహాభీతి సం
బాధంబుల్ వసియింప కెప్పుడు; లసన్మాణిక్యకోద్భాసణ
ప్రాధాన్యంబున నొప్పు సౌధముల శోభావంతమై యాశయో
గాధారంబున నంతరిక్షమున నిత్యంబుఁ వసించుంజుమీ. 152

వ. దానికి నధోభాగంబునఁ గుడియెడమలఁ దత్సమంబులై మనోహరంబులగు వైకుంఠశివలోకంబులు వర్తించు. వైకుంఠంబు మండలాకృతిదాల్చి కోటియోజనవిస్తీర్ణంబై యుండు. 153

మ. విగతాహంకృతులుజ్జ్వలాంగులు లసత్పీతాంబరుల్ శంఖ చ
క్ర గదా పద్మవహచ్చతుర్భుజులు శ్రీకాంతోపముల్ పూరుషుల్;
సుగుణల్ నూపురమేఖలాంచితలు సంశుద్ధల్ రమాసన్నిభల్
మగువల్ తత్పదమందు నుండెదరు సంప్రాప్తపుణ్యాంబునన్.

వ. మఱియు దానికి నెడమదెసఁ గోటియోజనవిస్తృతంబును లయశూన్యంబును సృష్టియందును పార్షదపరివృతంబును నైయున్న శివలోకంబున. 155

సీ. భసితంబు మెయినిండఁ బూసఁగఁబూసినవారు
బాఁపజన్నిదములం బరగువారు

బుడుతచందురు ఫాలమునఁదాల్చువారలు
బట్టిన శూలముల్ బట్టువారు
తాటికెక్కువాని తల్లిఁదాల్చినవారు
పులితోలువిపునం బూలుచువారు
నొసటమిక్కిలికంటిపస నెసంగెడివారుఁ
గప్పుకుత్తుకతోడ నొప్పువారు
గీ. పురియఁ పేరుల ధరియించి తిరుగువారు
బూచిగములకు రాజులై తోఁచువారు
నగుచు నలశంభుసదృశులై యఖిలరుద్ర
గణము లచ్చోటనుండ్రు దుఃఖములఁబాసి.		156

వ. మఱియు నా గోలోకమధ్యంబున మిక్కిలి మనోహరంబును పరమాహ్లాదకరంబును నిరంతరపరమానందకారణంబునునగు నఖండతేజంబుండు. అద్దానిని జ్ఞాననేత్రంబునను యోగంబునను యోగులు ధ్యానింతురు. అదియే ఆనందజనకంబును నిరాకారంబును బరాత్పరంబునునైయుండు. తజ్జ్యోతిర్మధ్యంబున నత్యంతసుమనోహరరూపంబు విరాజిల్లుచుండు. అయ్యది.		157

సీ. కోటిశారదపూర్ణకుముదబాంధవదీప్తి
భాసమానమనోజ్ఞ వదనకంబు
కోటికందర్పసంఘుష్టసౌందర్యలీ
లాసాధులహారికాలంబనంబు
ఇందీవరశ్యామసుందరాకారంబు
పంకజారుణనేత్రభాసురంబు
మురళికా హస్తంబు వరపీతవసనంబు
చారుద్విభుజకంబు సస్మితంబు

గీ. లలిత శ్రీవత్సకౌస్తుభ విలసితంబు
రత్నకటకకిరీట విభ్రాజితంబు
సుభగవనమాలికాగళశోభితంబు
రత్నసింహాసనస్థంబు రాజితంబు. 158

సీ. అదియే పరబ్రహ్మ మఖిలసంపూర్ణంబు
శ్రీకృష్ణసంజ్ఞంబు చిన్మయంబు
అదియె స్వేచ్ఛామయం బదె సర్వబీజంబు
నదియె సర్వాధార మదియె పరము
అదె కిశోరవయస్క మదె గోపవేషాఢ్య
మదె కోటిపూర్ణచంద్రాభకంబు
అదె భక్తవత్సలం బదె నిర్వికారంబు
పరిపూర్ణతమ మదె ప్రభువు నదియె

గీ. రాసమండలమధ్యసంన్యాసి యదియె
సర్వమంగళమంగళస్థాన మదియె
సత్యమక్షరమయ్యదె శాంత మదియె
నిర్గుణంబదె యానందనిధియు నదియె. 159

వ. మఱియు హరియు నిరీహంబును నవ్యయంబును సర్వసిద్ధేశ్వరంబును సర్వసిద్ధిరూపంబును సిద్ధిదంబును ప్రకృతికంటెఁబరంబును నీశానంబును నిత్యవిగ్రహంబును నాద్యపురుషరూపంబును నవ్యక్తంబును బురుష్టుతంబును బురుహూతంబును నిత్యంబును స్వతంత్రంబును నేకంబును బరమాత్మస్వరూపంబును శాంతిపరాయణంబును నయి భగవంతుఁడొక్కఁడే యిన్నివిధంబులం బొలుపారుచుండు. ఆతనిని శాంతులగు విష్ణుభక్తులు ధ్యానించుచుందురు. 160

క. హరియిటు లధిమాసమునకు
విరివిగ వచియించి యంత విరజాతటినీ
పరివేష్టితగోలోకముఁ
ద్వరితంబుగ దానిఁజేర్చెఁ దనతోఁగూడన్. 161

ఉ. ఈరహి నిద్ధవాక్యము మునీంద్రుఁడు పల్కియు మిన్నకుండినన్
నారదమౌని యెంతయు వినం గమకించి మునీశచంద్రమా!
భూరినవీనసత్కథలు పొల్పుగఁదెల్పఁగదయ్య! నీదువా
క్సారము గ్రోలఁగాఁ దనివి సాలక యున్న దటంచు నిట్లనున్. 162

క. వైకుంఠాధిపుఁడా గో
లోకంబున కేగి తదధిలోకంబునఁదా
నేకరణి సేసె దయతో
నాకు నెఱిఁగింపు మౌనినాయక! వేగన్. 163

వ. అనిన నారాయణమునీశ్వరుండు నారదునకచటజరిగిన వృత్తాంతంబు నెఱింగించెద వినుమని యిట్లనియె. 164

సీ. అధిమాసమును గొని యచ్యుతుఁడంత గో
లోకమునకుఁజని వీఁకతోడఁ
జారుమణిస్తంభసంశోభితంబును
జ్యోతిర్మయంబునై సూర్యకోటి
భాసురంబైనట్టి భగవన్మహాధామ
మును దూరమునఁజూచి తనరుతేజ
మును సైపఁజాలక మూతలువడిన నే
త్రముల నల్లన విచ్చి దారి దెలిసి
గీ. య్యధికమాసము తనదు వెన్నంటి నడువ
మెల్లమెల్లన భగవంతుఁ డుల్లసిల్లు

మందిరప్రాంతమేగి యానందమొదవ
ద్వారపాలక వందితపాదుఁడగుచు. 165

క. ద్యుతిముషితాంబకుఁడై హరి
ప్రతిభాన్వితమైనయట్టి భగవద్ధామం
బతులముదంబునఁ దా జని
నతులం గృష్ణునకొనర్చె నయవినయములన్. 166

గీ. గోపికా మధ్యవర్తియై దీపితమగు
రత్నసింహాసనమున విరాజమానుఁ
డైన శ్రీకృష్ణునకు నతు లాచరించి
యంజలిఘటించి శ్రీకృష్ణుఁడనియె నిట్లు. 167

వ. దేవా నీవు విష్ణుండవు గుణాతీతుండవు గోవిందుండవు నేకాకివి యక్షరుండవు నవ్యక్తుండవు నవ్యయుండవు వ్యక్తుండవు గోపవేషధరుండవుఁ గిశోరవయస్కుండవు శాంతుండవు గోపీకాంతుండవు మనోహరుండవు నవీననీరదశ్యాముండవు కోటికందర్పసుందరుండవు బృందావనవనాభ్యంతర సౌమ్యుఁడవుఁ ద్రిభంగలలితాకృతివి రాసేశ్వరుండవు రాసవాసివి రాసోల్లాససముత్సుకుండవు ద్విభుజుండవు మురళీహస్తుండవుఁ బీతవాసనుండవు నచ్యుతుండవునైయున్నవాఁడవు. ఇట్టి నీకువందనంబులర్పించుచున్నాఁడను. 168

క. అని యిట్లుపలికి నతులిడి
తనకుం దత్పార్శ్వదాళి తగ నిడు సింహా
సనమున శ్రీకృష్ణుని యా
జ్ఞను విష్ణువు గూరుచుండె సవినయుఁడగుచున్. 169

వ. అంత నారాయణర్షి యిట్లనియె. 170

మ. హరిచేతన్ రచియింపఁగాఁబడిన పుణ్యంబైన యీ స్తోత్ర మా
దరమొప్పన్ బఠియించుచున్న యెడఁ బ్రాతఃకాలమం దెవ్వరేన్;
దురితంబుల్ హరియించుఁబాయును మహాదుస్స్వప్నదోషంబులున్
పరిపూర్ణంబగు సత్ఫలంబులు సదా ప్రాప్తించు నవ్వారికిన్. 171

గీ. ప్రచురతరమగు గోవిందపాదభక్తి
పుత్ర పౌత్రాది వృద్ధిని బొసఁగఁజేయు
సుయశ మెంతయుఁ జేకూర్చు నయశమార్చుఁ
గాన నెప్పుడు తద్భక్తి పూనవలయు. 172

క. తనుఁ గనరని ఘనతరముగ
గనుఁ గొనలను బాష్ప సలిల కణగణమెడలన్
మనమున నలజడిబడి కడు
ననువును విడనాడియుండె నధిమాసమటన్. 173

ఆ. వె. పిదప, గూరుచున్న విష్ణువు శ్రీకృష్ణు
నంఘ్రియుగళమునకు నధికమాస
మును వడంకుతోడ వనరెడు దానిని
మ్రొక్కఁజేసె నతని ముందునిల్పి. 174

వ. అంత శ్రీకృష్ణుండు హరితో నిట్లనియె. 175

ఉ. ఎచ్చటి నుండి వచ్చె నితఁడెవ్వఁడు శ్రీధర నాదు లోకముం
జొచ్చియు నీక్రియన్ మిగుల శోకముఁ జెందుచు నున్నవాఁడహో
యిచ్చట నుండు వారలకు నించుకయేనియు స్వప్నమందునుం
బొచ్చెము కానగాఁబడదు పొందుచునుందురు సర్వభద్రముల్.

ఉ. ఎన్నఁడుగాని యెవ్వరిట నేమిటికిన్ విలపింప రీతఁడో
కన్నుల నశ్రుబిందువులు కాల్వలు గట్టఁగఁ బిట్టు నేడ్చుచున్

ఖిన్నముఖాంబుజాతమునఁ గేశవ! నాదు సమీపమందునన్ ;
మున్నరకం ద్యజించి యిటు మోకరిలం గతమేమి? తెల్పుమీ.

ఉ. శ్రీకరపాదపద్ముఁడు విచిత్ర చరిత్రుఁడు నూతనాంబుదా
నీకమనోజ్ఞమూర్తి కమనీయవచోవిభవోన్నతుండు గో
లోకవిభుండు భక్తజనలోలుఁ డిటుల్ వలుకాడి నందద
స్తోకవచస్సులన్ శ్రవణతోషముగా విని విష్ణువయ్యెడన్ .178

క. సింహాసనంబునుం డిగి
రంహస్సున మాసదుఃఖరాజి దెలుపఁగా
నంహోహరు శ్రీకృష్ణుని
బంహిష్ఠ దయాఘుఁ గాంచి భాషించె నిటుల్. 179

మ. ప్రియమొప్పన్ వినుమయ్య నా పలుకులన్ బృందావనాధీశ్వరా
భయదంబౌ నధిమాసదుఃఖమును నీ పజ్జన్ వచింపంగనే
నయి యిచ్చోటకు వచ్చినాఁడను తదీయాంతఃపరీతాపమున్
దయతోడం దొలఁగింపఁ గాఁదగు ననాథం బిద్దిలోకేశ్వరా,180

సీ. అధికమాసంబని యందురు దీని న
ర్యమ సంక్రమంబిందు నమరఁబోదు
మలినం బనాథంబు మంగళకర్మదూ
రము స్నాన దాన దూరమ్మటంచుఁ
గలలు కాష్ఠలు లవంబులు నెలల్ పండ్రెండు
బహువాయనర్తు సంవత్సరములు
పత్తనంబులు నదుల్ పర్వతంబులు వన
స్పతులు లతౌషధుల్ ప్రభులఁ గూడి

గీ. గర్వ సహితంబులగుచు ధిక్కార మెపుడు
దీనిఁ జేయుచు నుండెడిఁ గాన నిద్ది

దుఃఖవహ్ని విదగ్ధమై తుట్టతుదకు
నుసురులను బాచుకొనుట కుద్యుక్తమగుడు 181

చ. పిదపను నే దయాళువులొ ప్రేరణసేయఁగ నాదు చెంతకుం
గొదకొని వచ్చి దుఃఖముసఁ గుందుచు సర్వమెఱుంగఁ బల్క నే
నది విని నా కసాధ్యమనిఁ యాత్మఁదలంచి భవత్సమీపముం
బదపడి దీని దెచ్చితిని భక్తవశంవద కావవే దయన్. 182

మ పరదుఃఖంబుల నోర్వఁజాలవని విద్వాంసుల్ త్రయీవేత్త లా
దర మొప్పన్ నినుఁ బల్కుచుండెదరు గాదా! కావునన్ నీవు వి
స్తర దాక్షిణ్యముచేత నీ యధికమాసంబున్ వెసం బ్రోవు, నీ
చరణాంభోజము సెందువారలకు నిచ్చల్ శోకముల్ నిల్చునే?

ఉ కావున మిథ్య యెన్నఁడును గాదు త్రయీవచనంబు, మాసము
న్గావుము నా నిమిత్తమయినన్ జగదీశ! సమస్త కార్యముల్
వావిరివీడి వచ్చితిని, వచ్చిన నన్ సఫలుం బొనర్ప వే
సావధి పల్కుడుల్ ప్రభువు సన్నిధిఁ గూడదటంద్రు కోవిదుల్.

క. ఇటులన్ హరి, బద్ధాంజలి
పుటుఁడై విజ్ఞాపనంబు పొరసల్పి పుర
స్థటమున భగవన్ముఖమున్
బటుగతిఁ జూచుచు వసించె బహు వినయమునన్.

వ. అంత శౌనకాదులిట్లనిరి. 186

ఉ. సూత! వదాన్యవర్యుఁడవు సూ, మఱి నీవిఁకఁ బెక్కువర్షముల్
భూతలమందు జీవితము బొంది సుఖింపఁగదయ్య! మమ్ము వి
ఖ్యాతజనార్దనాంచితకథామృతపానులఁజేసి తాజగ
న్నేత యనంతరంబు హరినింగని యేమివచించెఁ దెల్పవే? 187

వ. మఱియు విష్ణుశ్రీకృష్ణసంవాదంబు సర్వలోకోపకారకం బైయుండు.

చ. సురముని యా ఋషిప్రవరుఁ జూచి యనంతరమేమి ప్రశ్న ముం
దిరముగ సల్పె మాకు నది దెల్పుము సూత, హరిస్వరూపుఁడా
పరమమునీంద్రుఁ డాపరమభాగవతుండు వచించు పల్కు, లో
నరయ మహాభయంకరభవామయభేషజమై చెలంగదే. 189

—(అధిమాసమున నైశ్వర్యప్రాప్తిగలుగుట.)—

వ. సూతుండిట్లనియె. 190

క. మీరొనరించిన ప్రశ్నమె
నారదుఁ డొనరింప నపుడు నారాయణుఁ, డే
తీరున వచించె నదియే
వారక మీకున్ వచింతు వరమునులారా. 191

మ. మలమాసోన్నతదుఃఖకారణము పద్మావల్లభుం డంతయుం
దెలియంగా వచియించి మౌనమున వర్తింపంగఁ బాపేంధన
జ్వలనుండా పురుషోత్తముండెటులు దా సల్పెం బ్రియంబేర్పడ
న్బలుకంగావలెనంచు నారదుఁడనన్ నారాయణుండిట్లనున్. 192

శా. గోలోకేశుఁ డుపేంద్రుఁ డిట్లనిన యా గుహ్యంబు నీకిత్తఱిన్
వాలాయంబుగఁ దెల్పువాఁడ, నది సంవాచ్యంబు భక్తాళికిన్
బోలన్ దంభవివర్జితప్రజలకుం బూజ్యాస్తిక శ్రేణికిన్
జోలిందాల్చి మనంబునం దనయమున్ శుశ్రూషుతావారికిన్.

ఉ. కీరితిఁ బెంచు సంతుఁ గలిగించు నఘంబును ద్రుంచు పుణ్యముం
గూరుచు రాజవశ్యమును గొల్పు దరిద్రత మాన్పు విత్త వి
స్తారమొసంగుఁ, గాన వినఁ దగ్గది విన్నగతిం బ్రసక్తితో
నారసి చేయఁ దగ్గదిసుమా యిదియెంతయు మానిసత్తమా. 194

ఉ. మంచిపనిన్ రచించితివి మాధవ! నీవిట కేగుదెంచుటం,
గాంచక యిట్టిమాసమును గూరిమిఁ గైకొని పెద్దకీరితిం
గాంచెద వెట్టిజీవులను గైకొనెదీ వలవారు నాకునున్
వంచనలేక గ్రాహ్యులు ధ్రువమ్మిది నమ్ముము నీమనమ్మునన్.

వ. కావున ని మ్మలమాసంబు మత్సమానంబుఁ జేసి సర్వంబు
నకుం దలమానికంబు గావించెద. 196

మ. అనుభావంబున సద్గుణంబులను గీర్త్యైశ్వర్య దానంబులన్
ఘనవిక్రాంతిని షడ్భగంబులను భక్తాభీష్ట సంప్రాపణం
బున నెంతేఁ బురుషోత్తముండనఁగ నేఁ బొల్పొందితిం దద్విధం
బున దీనిం బురుషోత్తమాఖ్య సుయశంబుం జెందఁ గావించెదన్.

సీ. నాయందుఁగల సద్గుణములు సర్వంబును
పెరిమదీనికి సమర్పించినాఁడ
లోకవేదంబులలోఁ బ్రథితంబైన
యట్టి నా పురుషోత్తమాఖ్యఁ గూడ
నర్పించితిని దీనికాదరంబొప్ప న
ధోక్షజ! నీకు సంతుష్టిగదుర
నిద్దానికిన్ స్వామి నేనయివర్తింతుఁ
దగ దీనిపేరుచే జగమఖిలము

గీ. పాతకంబుల విడనాడి పూతమగును
నాదు సాదృశ్యమును జెంది యాదరమున
నఖిలమాసాధిపత్యంబు నందు; నిద్ది
పరమపూజ్యంబు వంద్యమై ప్రబలుఁగాత. 198

శా. ఈమాసంబిఁక సర్వపూజకుల కెంతే దుఃఖ దారిద్ర్య దు
స్సామర్థ్యంబు నడంపఁజాలెడుసుమీ సర్వంబు లౌ మాసముల్

కామోపేతము, లేను దీని నతినిష్కామంబుగావించితి
న్దా, మోక్షంబిడఁజేసితిం జగతిపై; నర్ బోలి భక్తాళికిన్. 199

ఉ. కామవివర్జితుల్ సకలకామసమన్వితు లిట్టి మాసమున్
భామిని పూజసేయునెడ బూది యొనర్చుచుఁ గర్మజాలముల్
దామిట నన్నుఁజేరెదరు తథ్యముసు మ్మధిమాసనామమున్
మామకనామ మొక్కటియె మాకిఁక నేమిఁట లేవు భేదముల్. 200

సీ. ఫలపత్రములు మెక్కి జలములాహరించి
యనిలంబు మెసవి యాహార ముడిగి
కామంబు నిర్జించి కడకొత్తి క్రోధంబు
నింద్రియంబులఁ గెల్చి తంద్రమాని
చలికిఁజంకక వాన కులుకుఁజెందక యొడ
కలయ కష్టనిశం బడవినడఁగి
బహునిష్ఠతో మహాభాగులు యతివరుల్
బ్రహ్మచారులు తపఃపరతఁ జెంది

గీ. యస్మదీయావ్యయపదంబు నభిలషించి
యనధిగత వాంఛితార్థులై చనుచు నుందు,
రింకఁ బురుషోత్తమాఖ్యమహిష్ఠమాస
భక్తులొకమాసముననె మత్పదముఁగాంత్రు. 201

మ. జరనున్ మృత్యువుఁ బాపెడిన్ సులువుగా, సర్వార్థసంసిద్ధులం
ద్వరితంబె సమకూర్చు, సాధనములం దథ్యంబుగా శ్రేష్ఠమై
వరలున్ శ్రీపురుషోత్తమాఖ్య మురుసేవాయోగ్యమాసంబు, సా
దరులై దీనిని గొల్చువారికిఁ గొఱంతల్ గల్గవెందున్ హరీ. 202

గీ. విత్తులను జల్ల లాంగలవీథియందుఁ
గోట్లకొలఁదిగ నభివృద్ధి నెట్లుగాంచు;

నట్లుగాఁ గోటిగుణితపుణ్యంబు నధిక
మాసమందున వసియింపఁజేసినాఁడ. 203

క. చాతుర్మాస్యాదికయ
జ్ఞాతతపుణ్యంబుచేతస్వర్గము జని సం
ప్రీతి నట భోగముంగని
భూతలమున కరుగుదెంతురు పోయినవారల్. 204

చ. ఒనరఁగ నేజనుండు పురుషోత్తమమాసము బత్తినెంతయుం
గొనుచు విధిప్రకారముగఁ గొల్చు; నతండు స్వకీయవంశముం
దనరఁగ నుద్ధరించి ననుఁ దద్దయు జెందగలాఁడు, సంశయం
బును ద్యజియించి మద్వచనముల్ శిరసావహియింపుమచ్యుతా.

గీ. జన్మమృత్యుభయాకులస్థానమగుచు
నాధి వ్యాధియు జరగల్గి బాధగొల్పు
నట్టి సంసృతి, ననుబొందునట్టి మాన
వుండు మఱలను జవిఁజూడకుండుఁగాదె. 206

అ. వె. ఏదిచెంది మఱల నీవలికే తేర
రదియె నాదు పరమమైనధామ
మనెడు వేదవచన మత్యంతసత్యంబ
యగు, నసత్య మెన్నఁడైన నగునె? 207

శా. ఈమాసంబున కే నధీశ్వరుఁడనై యెంతేఁ బ్రతిష్ఠించితిన్
శ్రీమ న్మత్పురుషోత్తమాఖ్య దయతోఁ జేకూర్చితిం, దీనినిం
బ్రేమింపంగను భక్తులెప్పుడు, ననుం బ్రేమించినట్లెంచి త
త్కామంబుల్ సకలంబు లేన యిడుదుం గౌతూహలంబొప్పఁగన్

క. ఎపుడేనియు మద్భక్తుల
నెపమెన్నెదఁగాని యిట్టి నెలపై బత్తిం

దపియించువారి నెపములఁ
నెపుడుఁ గణియింప నొల్ల నిది నిజమనఘా. 209

మ. నను బూజించుటకన్న నాకు హితమౌ నావారిఁబూజించుటల్
నను సేవించెడివారి కోరికలకన్నన్ నాదుమాసంబు భ
క్తిని సేవించెడివారి కోర్కులు వెసన్ దీర్తున్, మదీయాఖ్య మా
స నితాంతప్రియులైనవారెపుడు మత్సంప్రీతిపాత్రుల్ సుమీ 210

ఉ స్నానము దానముం జపము సాధుని షేవణ దేవతీర్థ స
న్మానవిశుద్ధకర్మములు మామకమాసమునందు మూఢులై
మానినయట్టి మానవులు మాటికి దుర్భగులై దురాత్ములై
హీనతఁజెంది భూమిఁజరియింతు రహో పరభాగ్యజీవులై. 211

మ విశదంబైన యశంబుదాల్చి జగతిన్ విఖ్యాతమన్నామమున్
భృశముం గైకొని కీర్తనీయమగుచుం బెంపొందుమాసంబుఁగ
ర్కశమౌఢ్యంబునఁ గొల్వకుండినజనుల్ కల్యాణసందోహమున్
శశశృంగంబులఁబోలెఁ గాంచగలరే? స్వప్నంబునందేనియున్.212

క. పురుషోత్తమాఖ్యమాసము
నఱిముఱి మత్ప్రీతిపాత్రమగు దాని దిర
స్కరణంబుసేసి ధర్మము
నెరపని జడు లొందగలరు నిరయాలయమున్. 213

వ. మఱియుఁ బ్రతి తృతీయవర్షంబున (వసంతగ్రీష్మవర్షర్తువుల నెదియే నొకనెల) పురుషోత్తమమాసంబుగా వచ్చుచుండు, అట్టితఱి ధర్మంబాచరింపనివారు కుంభీపాకంబునంగూలుదురు, ఈలోకంబున మహామూఢులై పుత్ర పౌత్ర కళత్రజంబగు దుఃఖదవానలంబు జెందు దురు. శ్రీమంతంబును పుణ్యతమంబును మదీయంబునగు పురుషోత్తమ

మాసంబు నజ్ఞానంబున నతిక్రమించువారు సుఖంబెట్లు పొందగలు
గుదురు? 214

సీ. సౌభాగ్యవతులైన చానలెవ్వరుగాని
సుతసుఖసౌభాగ్యవితతికొరకు
పురుషోత్తమాభిఖ్యవరమాసమున నదీ
స్నానదానార్చనల్ సల్పిరేని
వారికందఱకు సౌభాగ్యసంపత్తులు
వెసఁబుత్రసుఖము లేనొసఁగువాఁడ
నేరికి మన్మాస మూరక గతియించు
వారికిఁ బ్రతికూలవర్తనుండ

గీ. నౌట, స్వామిజసౌఖ్యంబు లమరకుండు
భ్రాతృపుత్రార్థసుఖము స్వప్నమునఁగూడ
నోసరిల్లును గాన నీమాసమందు
స్నానపూజాజపంబులు సలుపవలయు. 215

చ. తనరఁగ నిట్టిమాసమున దానము శక్తికొలంది సల్పి న
న్ననిశము భక్తితోఁ గొలుచునట్టిజనం బిహలోకతృప్తిగా
ధనమును ధాన్యముఁ హితసుతప్రకరంబును జెంది సౌఖ్యముం
గొనుచు నుదీయలోకమునకుం జనుదెంచి సుఖించు నాపయిఁ;

గీ. నామనానతి సర్వజనంబునాదు
మాసపూజయొనర్తురఁ మతినిదాల్చి
సర్వమాసంబులందు శ్రేష్ఠంబుగాఁగ
దీనిసల్పితినయ్య నీపైనిపేర్మి. 217

క. కావున నధిమాసంబున
నైకె వగ దిగనాడి దీనిఁ గైకొని వేగఁ

శ్రీవైకుంఠాఖ్యంబగు
నీవాసంబునకుఁ జనుము నీరజనాభా. 218

వ. అంతనారాయణర్షి యిట్లనియె. 219

ఉ. ఆరసికాగ్రగణ్యుఁ డిటులాడిన నెంతయు సంతసంబునన్
మారమణీవిభుం డధికమాసముఁ గైకొని నూత్నమేఘవి
స్తారరుచిప్రశోభితు విదారితదుష్కృతు నాదిదేవు నిం
పార నమస్కరించి తనయాలయమేగె ఖగేంద్రగామియై. 220

వ. అంతసూతుండు శౌనకాదులం గని యిట్లనియె నట్లు విష్ణు
శ్రీకృష్ణసంవాదంబును విని సంతోషించిన నారదుండు మఱలఁ బ్రశ్నిం
చె నెట్లనిన. 221

శా. వైకుంఠంబున కచ్యుతుం డరుగ నాపై నేమియయ్యెన్ మఱిన్
నాకాధీశతనూజకృష్ణుల యుదంతం బెట్లువర్తించె న
స్తోకానందము భావిపూరుషులకున్ జొప్పిల్ల నిప్పట్టునన్
నాకున్ వీనులవిందుగాఁ దెలుపవే? నారాయణర్షీ దయన్. 222

క. ఈరీతి నమరముని యన
నారాయణమౌని యలరి నారదునకు వి
స్తారజగన్మోదముగ శ్రుతి
పారణమొదవంగ నిట్లుపలుకఁ దొడంగెన్. 223

గీ. పిదప విష్ణుండు వైకుంఠపదము జేరి
యధికమాసంబు నట నుండునట్లు చేయ
నచట హరితో రమించుచు నధికమాస
మఖిలమాసమ్ములకుఁ బతియయ్యెఁ దాను 224

క. ద్వాదశమాసంబులకున్
సాదరుఁడై ప్రభువుఁ జేసియధిమాసంబున్;

వేదాంతవేద్యుఁ డాహరి
మోదంబును జెందె మది నమోఘదయాప్తిన్. 225

క. నిరవధికదివ్యరూపా!
పరమభుజాటోపదళితపశుపతిచాపా!
దురితాంధకారదీపా!
పరిహృతశరణాగతార్త బహుపరితాపా! 226

మాలిని. అగణితశుభలీలా! హార్దసంధానశీలా!
సుగుణగణసమేతా! సూరిసందోహగీతా!
ఖగపతివరవాహా! ఖండితాఖండమోహా!
నిగమవినుతకీర్తీ! నిర్మలానందమూర్తీ! 227

గద్య.

ఇది శ్రీమద్విబుధవిధేయ వేంకటాచలశాస్త్రి
నామధేయ ప్రణీతంబైన బృహన్నారదీయ
పురాణాంతర్గత పురుషోత్తమ
మాహాత్మ్యంబునఁ
ప్రథమాశ్వాసము.
శ్రీకృష్ణార్పణమస్తు.

శ్రీరస్తు.

శ్రీపురుషోత్తమాయపరబ్రహ్మణేనమః.

# పు రు షో త్త మ మా హా త్మ్య ము.

## ద్వి తీ యా శ్వా స ము.

శ్రీ సంశోభితవక్షః
ప్రాసాదస్థగితకౌస్తుభమణిచ్ఛాయా
భాసుర! పోషితనిజపద
దాసా! పురుషోత్తమా! బుధస్తుతనామా!

వ. దేవా! సూతుండు శౌనకాదుల కిట్లనియె నట్లు నారాయణర్షి నారదునకిట్లనియె ననంతరం బయ్యర్జునయుధిష్ఠిరపాంచాలులం జూచి భగవంతుఁడును భక్తవత్సలుండునగు దేవకీనందనుం డిట్లనియె.

సీ. ఈతపోవనమున కేతెంచి ధర్మసం
భవ మీరు దుఃఖసంభరితులగుచు
గోలోకవల్లభపాలితంబైన శ్రీ
పురుషోత్తమాభిఖ్యఁ బరగు నెలను
గాంగేయకుంభజకర్ణులవలన సం
త్రస్తంబులైన చిత్తములచేత
వ్యాసోపదిష్టవిద్యారాధనాసక్తి
నర్జునుండింద్రకీలాద్రి కేగఁ

గీ. దద్వియోగప్రభూతఖేదంబుచేత
నాదరింపరు మిగులఁ బ్రమాద మూని

కర్మగతి యవ్విధంబుగాఁ గడపుచుండ
నందులకు మీకు నేమి సేయంగవచ్చు? 3

గీ. పరికేని నదృష్టంబదెట్టులుండుఁ
దదనుగుణముగ బుద్ధివర్తనము సెల్లుఁ
దనకు గల్గు నదృష్టసంజనితఫలము
ననుభవింపక తప్పునే యవనినాథ. 4

వ. సుఖదుఃఖంబులును భయక్షేమంబులును నదృష్టానుసారం
బుగా జనులు పొందుచుందురు కావున మీర లెప్పుడు నదృష్టనిష్ఠులై
యుందురుగాక మఱియును. 5

**—{ శ్రీకృష్ణుండు పాండవులకు మేధావిమునిపుత్రికావృత్తాంతము సెప్పుట. }—**

క. వేఱొండు మీకు దుఃఖపు
గారణమితిహాసయుతముగాఁ దెల్పెద నే
నో రాజవర్య! యిత్తఱి
వారక నావలన వినఁగ వలయును మీరల్ 6

వ. అనిశ్రీకృష్ణుం డిట్లనియె, 7

గీ. పూర్వజన్మంబునందు నీపొలఁతిమిన్న
ద్రోవది, ధరామరుండు మేధావియనఁగఁ
బరఁగునతనికిఁ బుత్రియై ప్రభవమంది
క్రమముగాఁ బదియేండ్లప్రాయము ఘటింప. 8

క. రూపము లావణ్యము లలి
తాపాంగవిలోకనములు సతిచాతుర్యం
బేపారి పితకు నొకతుక
యే పుత్రికయై వసించె నెంతయుఁ బ్రీతిన్. 9

చ. గుణవతి సుందరాంగి దనకూఁతు, సుతుంబలె నా ధరామరా
గ్రణి గనుచుం బ్రలంభనముగాఁ బలుకాడఁ డొకప్డు, కన్యకా,
మణి నిఖిలాగమంబుల నమందమనీషఁ బఠించి వైనుషీ
ప్రణిహితశుద్ధకీర్తియయి భాసిలెఁ దండ్రిగృహంబునందునన్. 10

ఆ. వె. దానిచిన్ననాఁడె తల్లి స్వర్గమునకు
జనఁగఁ దండ్రిచేతఁ బెనుపఁబడుచు
యిరుగుపొరుగువారి యిండ్లఁ గాంచి సుఖంబు
పుత్రపౌత్రసుఖము పొందఁగోరి. 11

చ. అలఘుగుణుండు భాగ్యనిధియైనవిభుండు, సుపుత్రవర్గముం,
గలిగియు వీరికైవడి సుఖంబుగ నేను వసించుటెట్లు, నన్
వలచి యొకానొకండును ధ్రువంబుగ రాఁ డిదియేటిపాపపున్
ఫలమొ యటంచు నప్పుడల బాలిక యిట్లు దలంచె నాత్మలోన్

ఉ. ఏమునిసేవసల్పుదు మఱేసురవర్యుని గొల్తు నేవ్రతం
బీమెయిఁ జేయు దేనదుల కేగుదు నేమియొనర్తు నక్కటా!
మామకభాగ్యదేవత ప్రమాదము నొందె బుధుండు తండ్రియుం
దీమన మేది నాదు దురదృష్టమునం గడుమూఢుఁడై తగెన్. 13

సీ. పరిణయంబున కీడు ప్రాపింప వరునకుఁ
దగినవాని కొసంగఁ దలఁపఁడు పిత;
అళీజనంబున కన్యకస్సురాలనై
కన్యాత్వదుఃఖసంక్రాంతనైతి
నాపాప మది యేమొ నాదు నెచ్చెలులట్లు
భర్తతోడి సుఖంబు ప్రాప్తిలేదు
నాప్రియజనయిత్రి నాకంబునకు మున్నె
యరుగ నేటికి నభాగ్యంబుకతన

గీ. అనుచు నాబాల చింత నత్యంత మూని
మహితవాంఛాపయోధినిమగ్నయగుచు
మోహసలిలంబులను శోకమోహవీచి
సముదయంబునఁ బీడితస్వాంత యయ్యె. 14

ఉ. ఆవరపుత్రికిం దగినయట్టి విభుం వెదకం దలంచి మే
ధావిమునీంద్రుఁ డుర్వర నితాంతమునుం జరియించి యెచ్చటం
లేవడిఁ గుంది డస్సి విఫలీకృతమానసుఁడౌట నింటికిం
బోవఁ దలంచి దైవగతిఁ బొందె జ్వరంబును మార్గమధ్యలోన్.

ఉ. దారుణతీవ్రమౌ జ్వరము తన్నుఁ గడుంగడుఁ బీడవెట్ట నా
పాఱుఁడు సర్వగాత్రములఁ బాయఁగజాలని తాప మందుచున్
జాఱుచుఁ బాతముంగనుచు సారెకు, మద్యపుఁడట్టు; లింటికిం
జేరినతోడనే పడియెఁ జేవఁదొఱంగి ధరాతలంబునన్, 16

ఉ. వేగముగాఁ దనూజ భయవిహ్వలయై చనుదెంచి భూసురుం
డాఁ గనుమాత్రలో నతఁడు దాని స్మరించి ముమూర్షువై, మదిం
గాఁగలయర్థశక్తి భయకంపితుఁడై, తనయావివాహపుం
రాగము బూనఁగా నవసరం బిదికాదని నిశ్చయించుచున్. 17

ఉ. తొల్లి గృహస్థధర్మములఁ దూకొని చేసినకారణంబుచే
నుల్లమునన్ విశుద్ధి గని యుద్ధతసంసృతిమోహబంధముం
ద్రెళ్లఁగఁజేసి, యియ్యెడల శ్రీహరిసంస్మరణంబు భక్తిసం
ధిల్లఁగఁ జేయఁగాఁదగినదెన్నని యాద్విజుఁడూర్జితాత్ముఁడై. 18

సీ. ఇందీవరశ్యామ! నందగోపకుమార!
వరద! త్రిభంగసుందరశరీర!
ధ్యానేశ! రాధికారమణ! ప్రచండదో
ర్దండసంతాడితోద్దండదనుజ!

భయదోగ్రదావాగ్నిపరిపానణనిష్ణాత!
వల్లవీసందోహవస్త్రహరణ!
శ్రీకృష్ణ గోవింద! శ్రితజనావనదక్ష
దేవదేవ! మురారి! దీననాథ!

గీ. ఘోరసంసారసాగరవారి మునిఁగి
తీరమునుగానకున్న యీదీనజనుని
గాచు దిక్కెవ్వరయ్య! నీకన్న నింక
మాధవా! ప్రోవుమయ్య! నమస్కరింతు. 19

క, అని ప్రార్థించిన మానీం
ద్రుని మొఱ యాలించి విష్ణుదూతలు వేగం
బున వచ్చి మృతమునిం గై
కొని హరిచరణముల చెంతకుం జని రథిపా, 20

ఉ. బాలిక యంత నాజనకుప్రాణమువోవఁ దదీయదేహముం
దాలిచి యంకపీఠమునఁ దద్దయు శోకపరీతచిత్తయై
పేలతనంబుతోడ విలపించుచుఁదా, గురరీవిధంబుగా
నోలి వచించె జీవముల నొందిన తండ్రినిబోలె నీక్రియన్. 21

ఉ. ఆక్కట! తండ్రి! నన్నెవనియంకమునం దిడి విష్ణులోకముం
ద్రెక్కితినాఁడవో పిత గతించిన పిమ్మట నాకు నిచ్చటం
దిక్కెవరింక భ్రాతలును తేరి కనుంగొను సోదరీమణుల్
తక్కినబాదుగుల్ మఱియుఁ దల్లియు సైతము లేదుగావునన్. 22

ఉ. అన్న మొసంగి వస్త్రమిడి యాదరణన్ ననుఁ గాంచు వారలున్
మన్ననతోడ నాపలుకు మాటలకున్ ముదమందు వారలున్
సున్నగదా త్రయీనినదశూన్యగృహంబగు నాశ్రమంబునన్
విన్నన, నిర్జనంపుటడవింబలె నొంటిగ నిల్వనేర్తునే? 23

చ. బ్రదికి ఫలంబులే దిఁకను బ్రాణము వాసెద నాకుఁ బెండిలిం
గొదకొని చేయకుండ నెటకుం జనినాఁడవొ? తండ్రి! వేగ ని
య్యదనున వచ్చి తావకసుధాంచితవాక్కుల నాదరించుచున్
ముద మిడవేల? మానమును బూని వసించుట నీకు న్యాయమే?

చ. వరమతివై సదా దుహితృవత్సలతం బ్రకటించుచున్ ననుం
గఱకుఁదనంబుతో నెడఁద గాఁడఁగ నాడ వొకప్డు; డట్టినీ
వఱిముఱి దీర్ఘనిద్రఁ గొను టర్హమె? శీఘ్రమ లెమ్ము నేత్రముల్
దెఱచి ననుం గనుంగొనుము దీనను గావుము తండ్రి! మక్కువన్

చ. అని యిటు లామునీంద్రసుత యశ్రుజలంబులు నేత్రయుగ్మనుం
దునను బ్రవాహమై వెడల దుస్సహదుఃఖముతోడఁ గంచు గీ
చినగతి ముక్తకంఠమున జెట్టులు గుట్టలునుం గరంగ రో
దన మొనరింపఁ దద్విపినధామమునం గల మానులెల్లరున్. 26

మ. విని కారుణ్యమునం దపోవనిన్నిటుల్ విస్తారశబ్దంబుచే
తను శోకించెడివార లెవ్వరని మేధానామమానీంద్రనం
దినిశబ్దంబుగ నవ్విడిం దెలిసి యెంతే సంభ్రమోపేతులై
యనుధావించుచు వచ్చి రచ్చటకు హాహాకారరావంబులన్. 27

ఉ. ఆగతులౌ మునీంద్రులు సుతాంకగతున్ మృతమౌని గాంచియు
ద్వేగము జెంది దుఃఖమునఁ; దేఁకువ కొంత వహించి, యంత నా
మోగికళేబరంబుఁ దనయూరువునుండి శ్మశానభూమికిన్
వేగమ తెచ్చి యంత్యవిధి వేల్చిరి చిచ్చున దారురాశితోన్. 28

ఉ. ఊరడిలంగఁ బల్కి మునియూథము బాలిక, కంత వారు నిజా
గారము సేరినం గ్రమముగా మది ధైర్యము నూది శక్తికిం
దీరుగ న్నౌర్ధ్వదైహికవిధిం బితకున్ రచియించి బాల యా
ధారముగాఁగఁ బిత్ర్యమగు ధామమునన్ వసియించెనవ్వనిన్. 29

గీ. కారుచిచ్చునఁ జిక్కిన కదళిమాడ్కి
కేఁపు మడిసిన దురపిల్లు గిడ్డి వోలె
జనకపరలోకగమనసంజనితతాప
వహ్ని నంపురుచుండె నా వనరుహాక్షి. 30

వ. తదనంతరంబు సూతుండు శౌనకాదులతో నిట్లనియె నట్లుస్ఫుతంబగు నామేధావిద్విజవర్యసుతావృత్తాంతంబు వినివెరగంది నారదుండు నారాయణర్షింగని మహాత్మా! తపోవనంబున నబ్బాలిక యేమొనరించెఁ బిదప నేముని యక్కన్యకను వివాహంబయ్యెఁ దెల్ప వేయని యడిగిన నారాయణుం డిట్లనియె, నంత ధర్మజునకు శ్రీకృష్ణుం డిట్లనియె. 31

క; తలఁచితలంచియు జనకుని
జలజల కన్నీరు బాల జార్చుచు; నుటజ
స్థలి నేకాకినియై యిటు
విలపింపఁ దొడంగె దుఃఖవిహ్వలయగుచున్. 32

చ. ఇల జనయిత్రినాకు, జగదీశ్వరుఁడే జనకుండు, కానలో
మెలఁగు మృగాళి బంధుగులు, మింటఁ జరించు పులుంగులే చెలుల్
చెలఁగిన విద్యయే ధనము, జీవనమై తగె జీవనంబు, నన్
వలచినవాఁడు శోకమను నాయకుఁడేయిఁకదిక్కు, దైవమా. 33

వ. అని విలపించుచున్న సమయంబున. 34

—(మేధావిపుత్రికయొద్దకు దుర్వాసుండువచ్చుట)—

సీ. శూన్యసద్మమునందు దైన్యంబుతో యూధ
విభ్రష్టమృగివోలె వెఱచుగాని
హృదయసంతాపాగ్ని నొదువు కన్నీటితోఁ
జల్లార్చునదిగా నెసంగుదాని

పరిరుద్ధమైనట్టి యురగినా నిశ్వాస
పవనసందోహంబుఁ బరపుదాని
ఘనదుఃఖవార్ధికిఁ గడయొందఁగానక
దీనయై మిగులఁ జింతించుదాని

గీ. బిట్టుబీతునఁ గృశియించినట్టిదాని
నాదరింప భవిష్యత్ప్రణోదితుఁడయి
తిరుగుచును తద్వనమున యాదృచ్ఛికముగఁ
బరమకోపనముని యటకరుగుదెంచె, 35

మ. సముదగ్రోరుజటాకలాపపరితస్సంఛన్నుఁడై భస్మది
గ్ధమనోజ్ఞాకృతియై కనుంగొనినమాత్రన్ వృత్రహుండేని త్రా
సముసెందన్ వరదండకుండికలతో సాక్షాచ్ఛివుండట్లుగా
నమరెం దన్ముని, నీకు తల్లికిని బాల్యంబందు సంప్రీతుఁడై. 36

క. ఆతఁడు త్రిదశాకర్షక
మైశగు విద్దియను తొల్లి యమలమనీషన్
భూతలనాథ యొసంగిన
మీతల్లి జపించి కాంచె మిముఁదనయులుగన్. 37

చ. అఖిలసుపర్వవందితుఁడనై తగు నేనొగి రుక్మిణీసతీ
ముఖవచనంబులన్ వినుచు ముందట నిమ్మునితో రథమ్మునన్
సుఖముగఁ గూరుచుండి చనుచున్ బథమందుఁ బిపాసతోడ మ
త్సఖియగు రుక్మిణీసతికిఁ దాలువు లోష్ఠపుటంబు లెండినన్. 38

చ. సుదతి జలాభిలాషగొని సూచనసేయఁ బ్రియుం బెలర్చ మ
త్పదశిఖరంబుచేత వసుధాతల మించుక నొక్కి భోగవ

త్త్యుదకము వెల్వరింప నది యుగ్మలికిం దగునంత మీఁదికిం
బొదలి దగన్ హరింప మునిపుంగవుఁడయ్యది సూచి యెంతయున్.
చ. తటుకునఁగోపమూని మునిఁదాలిమి సుంతయులేక యత్తఱిన్
బటుతరవిస్ఫులింగములఁబర్వెడునాపరిశయాగ్నిరీతిగాఁ
బటపట పండ్లుగీఁటుచు గుభాలునలేచి దురాత్మ!కృష్ణ! యో
కుటిలమనస్క! రుక్మిణియె కూరిమివల్లభ నీకుఁగావునన్. 40
మ. అవమానించుచు నన్ను నీదయిన మాహాత్మ్యంబు సూచించి మ
త్పవిధంబుదుఁ బ్రియాప్రహర్షరససిక్తస్వాంతమేపారనీ
యువిదంబీతజలన్ బొనర్చితివి; తదోగ్యంబునం బాసియుం
డువటంచున్ శపియించె నన్నెవఁడు; తద్ధూర్తుండె భూవల్లభా. 41
సీ. రుద్రాంశసంభూతుఁ డుద్రిక్తకోపుండు
కాలరుద్రపరోద్వేలమూర్తి
అత్రిమహాశీశ్వరాత్యంతోగ్రవరతపః
కల్పకానోకహానల్పఫలము
సాధ్వీమతల్లికాసత్కీర్తిశోభిత
కనసూయకాత్మజుండైనఘనుఁడు
బహుతీర్థజలసిక్తపటుజటాపటలపిం
గాంశురాజచ్ఛిర్షకాభిరాముఁ
గీ. డఖిలశాస్త్రార్థబోధనానర్గళమతి
వరతపోవిగ్రహుండు దుర్వాసుఁడెదుటఁ
దనకుఁగనిపించినంత మేనావిపుత్రి
యైన యాకన్య యెటులొ శోకాబ్ధివెడలి. 42
ఉ. అల్లన లేచి యేగి ధృతి యాత్మమునం ధరియించి వ్రాణిరా
ట్పల్లజుపాదపద్మములు దద్దయు భక్తి నమస్కరించుచుం

దొల్లి వసుంధరాసుత వధూమణి వాల్మికిమౌనిఁ బ్రీతిసం
ధిల్ల నిజాశ్రమంబునకుఁ దెచ్చినకైవడిఁ దెచ్చియామునిన్. 43

ఉ. ఆదర మొప్పఁగాఁదనదు నాశ్రమమందున నిల్పి యర్ఘ్యపా
ద్యాదిగ వన్యసత్ఫలము లంచితపుష్పము లిచ్చి స్వాగతా
పాదితుఁజేసి తత్పదసపర్య యొనర్చి పథిశ్రమంబఱన్;
మేమరనమ్రవృత్తి మది మేకొని బాల వచించె మౌనితోన్. 44

మ. నను సంభావితఁజేయ నియ్యెడ మునీంద్రా! నీవువిచ్చేసి తిం
బున భావత్కపదాంబుజద్వయరజంబుం దీర్థరూపంబు స్ప
ర్శనముం జేయుడు నాశరీరమును మజ్జన్మంబు యాత్రాతపో
వనపూజావ్రతదానధర్మములు సాఫల్యంబు గాంచెం జుమీ. 45

చ. అని యిటువల్కి యాతని సమక్షమునందున బాల మిన్నకుం
డినఁ జిఱునవ్వు మోమునఁ గడింది సెలంగ హరాంశజుండు త
న్మని వచియించె నిట్లు; మునిపుత్రి! భవజ్జనకుండు తొల్లిస
ల్పినసుకృతంబుచేతఁ బ్రభవించి కులంబుననీవుతాల్పవే? 46

శా. కైలాసంబుననుండి నేనిపుడు వీఁకన్వచ్చుచున్ నీను స
చ్ఛీలంబున్ వరధర్మచింతన మెదం జింతించి నీయాశ్రమం
బీలీలం జనుదెంచి నీవిడిన బాహిస్థాతిథేయంబునన్
వాలాయంబుగ సంతసించితిని మత్స్వాంతంబునం బాలికా! 4

ఉ. శ్రీయుత మైనయట్టి బదరీవనసీమకు నేను వేగమే
పోయెద నిప్పు డచ్చటఁ దపోనియతిన్ వసియించుచుండె నా
రాయణమౌని లోకపరిరక్షకుఁడై; యతనిన్ ముదంబుతో
నీయెడఁ గ్రాంతు నుత్తమమునీశ్వరవందితుఁ డాతఁ డెంతయున్.

వ, అనిన బాలిక యిట్లనియె. 49

సీ. ఋషివర్య! నిన్ను దర్శించుటచే నాదు
శోకసముద్రంబు శుష్కమయ్యె
నను నీవుసమ్మాననము సేసి తిట్టుపైని
శుభము సేకూరు నంచును దలంతు
సంజనితాధికజ్వాలదావాగ్ని నా
హృదయస్థ మగుట నీ వెఱుఁగవొక్కొ?
శంకర రౌదయాసాగర! యద్దాని
శీఘ్రంబ శమియింపఁ జేయు మయ్య
గీ. కాంచఁగా హర్షహేతు వొక్కటియు లేదు
తల్లిదండ్రులు భ్రాతలు ధైర్యమిడఁగ
నెవ్వరును లేరు నాకు; నింకెటులఁ బ్రదుక
గలను తెల్పుము? దుఃఖసాగరము నీఁది; 50

క. ఏ యే దెసఁ గాంచుదునో
యా యా దెస నాకు శూన్యమై కనుపట్టున్
నీ యోగశక్తిని మదీ
యాయతదుఃఖంబు నుడుప నగు మునితిలకా! 51

మ. నను నెవ్వండును బెండ్లియాడఁ దలపూనం బోవఁడాపైని జెం
దును నాకున్ వృషలీత్వదోష మని యెంతో భీతి వాటిల్లె, నం
దున మద్భోజననిద్రలుం దొలఁగె నెందున్ భద్రమే కానరా
దనఘా! ప్రాణములీఁగుటే తగు నుపాయం బంచు నూహించితిన్

గీ. అని వచించుచు నాబాల యశ్రువదన
యగుచు విరమించి యున్నంత నతని యెదుట;
దానికి నుపాయ మరయుంగ మానివరుఁడు
చిత్తమందు విచారంబు సేయఁదొడఁగె. 53

వ. అంత నారాయణర్షి యిట్లనియె. 54

క. మునికన్యక యిటువల్కన
విని యా కోపనమహర్షి విస్మితమతియై
ఘనకృపతో హితవచసం
బును బాలికతోడ నెదియొ మునుకొని పలికెన్. 55

వ. అనిన నారదుం డిట్లనియె. 56

క. దుర్వాసోమునివర్యుఁడ
ఖర్వవిచారణము సల్పి కడ కేమని తా
నిర్వచియించెను కన్యకు
శర్వప్రతిమాన! మౌనిచంద్ర! తెలుపవే? 57

వ. అంత సూతుండు శౌనకాదుల కిట్లనియె. 58

గీ. త్రిదశమునిమాట విని బదరీవిభుండు
పలికె నత్రితనూజుండు పలికినట్టి
వచన; మయ్యది గుహ్యంబు వసుధ జనుల
కందఱకును శివంకరమై రహించు. 59

వ. అంత నారాయణుం డిట్లనియె 60

గీ. ఓవిబుధమౌనివర్య! మేధావిసుతకు
వనట నుడుప దయాళువై మునివరుండు
తెలిపినట్టి యుదంతంబుఁ బలుకువాఁడ
దాని వినుమయ్య! మిగులశ్రద్ధాళుఁడవయి. 61

వ. అంత ననసూయానందనుండైన దుర్వాసుం డిట్లనియె.

మ. కువలాక్షీ వినుమీ వచించెద నిఁకన్ గుహ్యాతిగుహ్యం బసం
భవమై యుండెడి నెల్లవారి కిది చెప్పంజెల్ల దక్షైన నీ

వు విశేషంబుగ నన్ను వేఁడుకతనఁ బూర్ణానురాగంబుచే
త వచింపం గమకించితిఁ సకలశాస్త్రంబుల్ విమర్శించుచున్.63

ఉ. ఎంతయు విస్తరంబు రచియింపక తెల్పెద సంగ్రహంబుగా
నింతకుఁబై తృతీయముగ నింపెసలారెడు మాస మారమా
కాంతహితంబుగాఁదనరుఁ గన్యకరో! పురుషోత్తమాఖ్యమై;
సుంతయు సంశయింప కది చొప్పడినప్పుడొనర్పు పుణ్యముల్.

క. స్నానము తీర్థములందున,
నానెల నొనరింప భ్రూణహత్యయుఁదొలఁగున్
దానికి సమమగు మాసము
కానంబడ దెందుఁ గార్తికాదులయందున్. 65

ఆ. సర్వమాసపక్షసమితి, యన్యములైన
పర్వములును నిగమ బహుళకథిత
సాధనంబు లెల్లఁ జర్చింపఁగా దీని
షోడశాంశఫలముఁ బొనుప గలవె? 66

వ. మఱియుఁ బన్నెండువేలవత్సరంబులు గంగాస్నానం బొన
ంచినఫలంబును సింహంబున గురుండువసియింప నొక్కపర్యాయంబు
గోదావరీస్నానం బొనరించిన ఫలంబును బురుషోత్తమమాసంబున
నెయ్యెడనేని యొక్కపర్యాయంబు స్నానం బొనరించుమాత్రమున
ధించు. 67

గీ. బాలికామణి! శ్రీకృష్ణవల్లభ మగు
మాసమియ్యది పురుషోత్తమాఖ్యఁదనరు
దీని సేవింప వాంఛలు దీరుఁగాన
సరగ నీమాసమును గొల్చి సౌఖ్యపడుము. 68

వ. నేనును నీమాసంబును బురుషోత్తమునింబోలె భక్తిని బూజించుచుందు 69

సా. ఒకనాఁడే నల యంబరీషుపయిఁ గోపోద్రేకియై కృత్యనా
నోకశక్తిం బరపంగ విష్ణువు సముద్యోగించి చక్రంబుఁ బం
పకమున్ నాపయిఁ జేయుడుం దొడరి; తద్బాధం బెడంబాపికొం
టకు నే నీపురుషోత్తమవ్రతము శ్రేష్ఠంబంచుఁ గావించితిన్. 70

క. ముల్లోకంబుల భస్మము
సెల్లుగ నొనరింపఁజాలు విష్ణునిచక్రం
బొల్లక నను, వెనుకకుఁ జనె
నల్లనఁ; బురుషోత్తమవ్రతాచరణమునన్. 71

క. పరికించి యద్ది విస్మయ
పరవశతం గాంచినాఁడ బాలరో! నీవా
పురుషోత్తమవ్రతంబును
విరచింపు మటంచు మాని విరమించె నటన్. 72

వ. అంత శ్రీకృష్ణుం డిట్లనియె. 73

మ. అనసూయాసుతవాక్యముల్ వినుచుఁదా నాబాల సాసూయయై
ఖనమౌర్ఖ్యంబున భావిచోదనమునం గల్యాణదూరంబుగా
ననియెన్ మౌనినిగాంచికోపమతియై; యార్యా! భవద్వాక్యముల్
పౌనరన్ వింటిని గాని నామది రుచిం బుట్టింప వాక్యింతయున్.

ఉ. కార్తికమాఘమాధవముఖప్రమదప్రదపుణ్యమాసముల్
పూర్తిగ ధిక్కృతంబు లయి పోయె భవద్వచనంబుచేత; నో
ధూర్తమునీంద్ర! యా నెలలు త్రోయవె? పాపము; గోర్కులీయవే?
యార్తిహరించి ధూర్జటిముఖామరు లిష్టసుఖంబొసంగరే? 75

మ. పరఁగన్ వాంఛితమున్ ఘటించుటకునై ప్రత్యక్షదైవంబు భా
స్కరుఁడున్ సర్వజగత్పవిత్రి యగు నా కాత్యాయనీదేవియున్
గురువిఘ్నాళిహరించుదంతివదనుండున్ సర్వబృందారకే
శ్వరుఁడైనట్టి వృషధ్వజుండును వ్యతీపాతాదులుం జాలవో? 76
ఉ. ఇందఱుఁ దూలనాడి మఱి యీయధిమాసము సర్వపూజ్యమై
పొందుగఁ గామితార్థ మిడుపొంటె బ్రసిద్ధమటంటి వీవు వా
సిం దగు మానివయ్యు మది సిగ్గొకయింతయు లేద? చాలునో
మందమతీ! యిఁకన్ విడువుమా! మలమాసప్రశంస నీయెడన్. 77
గీ, సూర్యసంక్రమరహిత మనార్యము; శుభ
కార్యవర్జిత మిదియందు రార్యజనులు;
ధైర్యమున నిట్టిదాని నాచార్య! పొగడి
తిర్యగుక్తి వచింతె? నీచర్య దెలియు. 78
క. ఎఱుఁగుదు నెల్లసిలుంగుల
హరియింప సమర్థుఁడనుచు హరిని బరమున్;
ధరణీసుర! రాత్రిందివ
మెరనెరియుట దక్క మఱియు నితరుల నెఱుఁగన్.
గీ. జానకీనాయకుఁడు రామచంద్రుఁడు మఱి
పార్వతీవల్లభుండు కపర్ది దక్క
నితరుఁడగు పెద్దవేలు పింకెవఁడు గాని
నాదుదుఃఖంబు దీర్పలే డాదరించి; 80
క. కూరిమితో మలమాసముఁ
గూరిచి యింతగను నీవు కొనియాడంగా
ధారుణీసురవర యేలా?
వీరల నందఱనువిడచి వీఱిఁడి వగుచున్. 81

గీ. ఇటుల మునిపుత్రి పల్కిన కటువచనము
వినుచు నాక్షణమందు నమ్మునివరుండు
క్రోధజాజ్వల్యమానగాత్రుఁడయి మిగులఁ
దోఁకఁ ద్రొక్కిన త్రాఁచునాఁ ద్రుళ్లిపడియె. 82

మ. మొదలే కోపనుఁ డామునీంద్రుఁ; డటుపై ముగ్ధాత్వముం జూపి త
త్సుదతీరత్నము కారులాడినఁ గ్రుధాదుర్వారుఁ డై మౌని నె
మ్మది యెట్లో కని మిత్రపుత్రి యను ప్రేమం జూపుచున్ శాపమున్
ప్రదరంబున్ ముఖలస్తకం బనుప నొప్పం డయ్యె ధాత్రీశ్వరా!

గీ. మాధురాలీకుమారి యపూర్ణధిషణ
హితము నహితంబు నెఱుఁగదు కుతలమందు
మహితపురుషోత్తమాభిఖ్యమానసమహిమ
పండితుల కేని దుర్జ్ఞేయభంగి నుండు. 84

వ. కావున నిట్టివిషయం బల్పమతులైన పురుషులకును బాలి
కలకును దెలియుట యసాధ్యంబు గాదె? యని తలంచి. 85

చ. జనకుఁడు లేని కన్య యిది చాలగ దుఃఖఘనంజయార్చులన్
మునుపె దహింపఁగాఁబడె నమోఘమదీయకఠోరశాపముం
జొనిపిన నైఁపలే దని యసూక్షణజాతరుషన్ దమించి య
మ్మునిజనవల్లభుం డనియె మున్కొని కన్నియతోడ నిట్టులన్. 86

ఉ. బాలరో! నీవు నా హితుని పట్టివి గావున నిట్టి పట్టునం
దాలిమి నూనినాఁడ నిఁకఁ దాపకచిత్తమునందు దోఁచిన
ట్లోలి రచించికొమ్ము పురుషోత్తమమానసము నీ వభాగ్యతం
దూలఁగ నాడియుంటి వలదోషము మాత్రము పాయ దెప్పుడున్

గీ. కాన నీజన్మమందున నైన నీకు
నవలిజన్మంబునం దైన నాఫలంబు
ననుభవింపక తప్ప దో వనజనేత్ర
యింక బదరీవనంబున కేనుసనుదు. 88

ఉ. బాలిక వీవు గావున శుభం బశుభంబు హితాహితంబులున్
మేలిమి గుర్తెఱుంగవుసుమీ! శుభమయ్యెడుఁ గాక నీకు నేఁ
గాలవిలంబమున్ సలుపఁగాఁబనియే మిఁకఁబోవుదెంతు నీ
ఫాలమునం దజుం డెటుల వ్రాసె నటుల్ ఘటియించుఁబొమ్మికన్

వ. అని దుర్వాసుం డేగ నని చెప్పి శ్రీకృష్ణుం డిట్లనియె. 90

ఉ. ఈరహిఁ బల్కి తామసమునీశ్వరుఁడేగిన యంత బాల దా
నోరిమి సుంత లేక పురుషోత్తమమాసము ధిక్కరించుటన్
జారుకలావిహీనయయి చాలవిమర్శనమాచరించి గౌ
రీరమణార్చనంబు నొనరించెడిపొంటె దృఢాంతరంగయై. 91

క. భూరితపంబొనరించుచు
నారాధించెదను గిరిశు హైమవతీశున్
గోరికలన్ వేవేగమె
తీరుచు నాతండ, యంద్రు ధీరవరేణ్యుల్ 92

గీ. ఇట్లు మేధావిసుత నిశ్చయించి మదిని
స్వాశ్రమస్థానమందు దుష్కరతపంబు
సలిపి యీశ్వరసంతుష్టి గొలిపి తనదు
కోర్కి నీడేర్చుకొన నెంచెఁ గువలయేశ. 93

వ. అంత సూతుం డిట్లనియె. 94

చ. మునివరపుత్రి యత్రిమునిపుత్రుని వాక్కులు ధిక్కరించి శా
ర్ఙ్గిని బహుసత్ఫలప్రదు విరించిని దాదృశు నుజ్జగించుచుం

దన వనమందు నంధకవిదారి నుమాపతిఁగూర్చితోడ సే
వన మొనరింపఁ బూనె నిజవాంఛమెయిం దన వాంఛదీరఁగన్.

వ. అంత నక్కుమారి సర్వమునులకును సుమస్కారంబగు మహాకార్యంబునకుఁ దలకొనియె నంటి వవ్వల నేమియయ్యె విన వలతుం జెప్పవే? యని యడిగిన నారదునకు నారాయణర్షి యిట్లనియె. 96

సీ. పిదప నాకల్యాణి పేర్మితో శంకరు
భక్తవత్సలు శాంతుఁ బంచవక్త్రు
భుజగభూషణు నీశు బుధగణసంసేవ్యు
నందిభృంగ్యాద్యభివందితపదుఁ
త్రిగుణంబులును చతుర్వింశతితత్వంబు
లష్టమహాసిద్ధు లాప్రకృతియుఁ
బురుషుఁడు నుతియింపఁ బరగుదేవుని సనా
తను చంద్రఖండభాలుని శివేశు

గీ. శూలి ధవళాంగకుని జటాజూటలలితుఁ
బరమపూరుషుఁ గూర్చి దుశ్చరతపంబుఁ
జూచు వారలు మిక్కిలి చోద్యమంద
నాచరింపఁగఁ దొడఁగె నయ్యాశ్రమమున. 97

ఉ. భానుప్రగీష్మగుం డయిన పట్టునఁ బంచకృశానుమధ్యమ
స్థానమునందు; మార్గమును బైషము మాఘము ఫాల్గునంబు చై
త్యానతసర్వకాయముగఁదార్కొన శీతజలాంతరంబునం
బూని వసించి చాల తపముం బొనరించుచునుండె నుగ్రతన్. 98

శా. బాలారత్నము నీరమందుఁదపముల్ వ్యక్తాస్యయై చేయుచోఁ
గీలాలస్థసరోజశోభఁదనరెం, గీల్కొప్పు జాఱంగ జం

బాలావేష్టిత వోలెఁజెన్నలరె, బ్రహ్మాగ్రశిఖాసంజాతధూ
మాళుల్ వొల్చె సరోజసేవలకు సంప్రాపించుభృంగాలినాఁ. 99

వ. మఱియు నాతన్వీశిరోరత్నంబు. 100

క. బృసికోపేతస్థండిల
వసుధన్ ఛాదనములేక వర్షాసమయ
ప్రసరన్నిశల శయించుం
బస నిరుసంజలను ధూమపానము సలుపున్. 101

మ. పురుహూతుండు తదీయదుశ్చరతపంబుం గాంచి యీరీతి ని
ర్జరులున్ సర్వమహర్షులున్ సలుపఁగా సాధ్యంబొకో? యంచు ధై
ర్యరమాశూన్యత డిల్లపాటుగన సయ్యార్షేయి వర్తించె నా
హరునిం గూర్చి తపంబునన్ నవసహస్రాబ్దంబు లుర్వీశ్వరా! 102

— (మేధావిపుత్రి కీశ్వరుండు ప్రత్యక్షంబగుట.) —

గీ. అంత వేల్పులతోఁగూడ నరిగి గిరికి
పాఱుజడదాలుపుబిడారిపంచకోడి
యెఱుకసేయుఁడు ముక్కంటి తొరగ గిబ్బ
నెక్కి చనుదెంచెఁ దన డుబుడక్క మ్రోయ. 103

చ. గురుతరయోగివర్యులకుఁగూడ నగోచరమాస్వరూపమున్
గిరిశుఁడు తత్తపోనియతికిన్ ముదమంది కనంగఁజేయ న
బ్బురపడి ప్రాణముం గొనిన బొందిక్రియన్ వడి లేచి తాఁ దపః
పరతఁ గృశత్వముం గనియు బాలిక యత్తఱి హృష్టపుష్టయై. 104

వ. పుడమిచాడ్పున నాతపసంక్లిష్టయు దేవమీాఢయు గరీయ
సియు నైన యాబాల యవనతయై గిరిజాపతికి నమస్కరించి విశ్వవం

దితుండగు నమ్మహాదేవుని మానసోపచారంబుల బూజించి భక్తి
యుక్తంబగు చిత్తంబున నాజగన్నాథునిట్లని స్తుతించె. 105

స్రగ్విణి. పార్వతీవల్లభా! భక్తలోకావనా!
శర్వరీశార్యమోషర్బుధత్ర్యంబకా!
సర్వలోకేశ్వరా! సామగానప్రియా
శర్వనామాంకితా! చక్రిపాణిస్తుతా. 106

భుజంగప్రయాతము. పురారీ! మహేశా! భుజంగప్రభూషా!
సురేశాదిపూజ్యా స్ఫురద్దివ్యరూపా!
దురాధర్షసత్వా! ధునీభృజ్జటాఢ్యా!
గిరీశా! జోహారుల్ కృపం గొమ్ము దేవా! 107

ఉత్సాహ. అస్థిముండమాలికావహద్గళుండవై సదా
స్వస్థముగను రాజతాద్రివాసివై రహించుచున్
సుస్థిరాత్మఁ గొల్చువారి శోక మార్చుదేవ నా
దుస్థితిం దొలంగబెట్టి తోషమున్ ఘటింపవే. 108

ధృవకోకిల. నరులు ఘోరభవాంబురాశి ననారతంబు మునింగి దు
ర్భరశుగావళినక్రసంచయబాధలం గడు గ్రుగ్గుచుం
దరిని జేరఁగ నేర్తురే? హర! త్వత్పదాంబుజసేవయన్
తరణియే వసియింపకుండిన ధ్యానకృజ్జనరక్షణా! 109

సీ, బాణుండు పూజింప భక్తిసంయుక్తుఁడై
స్వీయునిగా నీవు సేసికొనవె?
అల యలర్కుపొలంతి పొలిసిన వెండియు
జీవింపఁగా నీవు సేయలేదె?
దుర్మతియై నీకు ద్రోహం బొనర్చినఁ
గినుకమై దక్షు శిక్షింపలేదె?

సకలజీవులఁ బట్టి సమయించు శమనుని;
మృత్యువు; నీవునిర్జింపలేదె?

గీ. చరణగతసర్వజనపునర్జన్మహరణ!
భువనజన్మాదికారణ! శివ! శ్రుతీడ్య!
ప్రమథగణనాథ! చండీశ! భయవినాశ!
భీమ! వందనశతము లర్పింతుఁ బ్రోవు. 110

క. మనమున వాక్కునను దప
స్విసియగు నక్కన్య వేదవేద్యుని భర్గున్
ఘనతరభక్తి దలిర్పఁగ
వినుతిం గావించి యిటుల, విరమించె నృపా! 111

వ. అంత శ్రీకృష్ణుం డిట్లనియె. 112

క. కృతసంస్తవతపములకున్
శ్రుతిశీర్షసతీమనోజ్ఞచూడామణియా
శితికంఠుండు ప్రసన్న
స్మితముఖుఁడై బాలతో వచించెం గరుణన్, 113

చ. వరమును గోరుమీ సుదతి వాంఛితమై తగుదాని నీకు దు
ష్కర మగు సత్తపంబునకుఁ గౌతుకమందితి ఖేదభారముం
దొరఁగుమనన్ సదాశివుఁడు; దొయ్యలి తద్వచనంబు నాదర
స్ఫురణ మెలర్పఁగా విని ప్రమోదిలి శంకరుతోడ నిట్లనున్. 114

గీ. దీననాథ! దయారాశి! దేవదేవ!
ప్రీతినాకుఁ బ్రసన్నుండ వైతివేని
నాదు కామిత మిదుము పినాకపాణి
యాలసింపఁగఁదగదు మహాత్మ! యింక. 115

క. పతి నిడుము, పతి నొసంగుము,
పతి నాకు ఘటింపుమయ్య, పతి వాంఛింతున్,
బతినే కోరెద, గౌరీ
పతి! నా కితరేచ్ఛ లేదు ప్రార్థన మిదియే. 116

క. ఆశ్లేషి యీవిధంబుగ
హార్షంబునఁ బలికి విరతినందం గని దు
ర్ధర్షదయతోడ హరుఁడు మ
హార్షితనూజ కిట్లు వల్కె నాసమయమునన్. 117

గీ. నీవదనమందునం బతికావలె నని
యైదుసారులు వెడలె నట్లగుటఁ జేసి
యదియె సిద్ధించుఁ గావుత మంబుజాక్షి
నీకు నేగురు భర్తలై నెగడఁగలరు, 118

ఉ. వారలు శూరులై సకలవైదికధర్మవిదగ్రగణ్యులై
సారసమేతులై పరమసాధువులై కృతయాగులై నిజ
స్ఫారగుణప్రసిద్ధులయి సత్యసమన్వితులై జితేంద్రియ
ప్రేరణులై త్వదీయముఖబింబమె చూతురు రాజవర్యులై. 119

వ. అంత శ్రీకృష్ణుం డిట్లనియె. 120

క. అనతిప్రియమగు ధూర్జటి
యనినవచస్సునకు సందియం బంది మదిన్
మునిపుత్రి వాగ్విశారద
వినయానతయై వచించె వీక్షించి శివున్, 121

ఉ. ఇక్కరణిన్ ఘటింపకు ముమేశ్వర యెక్కడ లేనియద్భుత;
మ్మొక్కతె కొక్కవల్లభుఁడ యుండుట యెందును గంటి వింటి నే

నెక్కడఁ జూడలే దొకతె కేగురుభర్తలటంచు; లోకమం
దొక్కఁడుపెక్కురన్ సతుల నొందుటమాత్రము చూతుమెల్లెడన్

క. నీదాన నాకు నిటు లా
పాదింతువె? నింద; పంచభర్తృకయనఁగా
నీదృగ్వచనము నామెడ
నూఁదివచింపంగ నీకు నొప్పునె యనఘా. 123

వ. మఱియు మహానుభావా నే నైదుగురం బెండ్లియాడిన నీదాస నగుటంజేసి నీకు లజ్జాకరంబుగ నుండదే? యనిన మునికు మారికి శంకరుండిట్లనియె. 124

శా. ఈజన్మంబున నీ కిటుల్ జరుగ దోయిందీవరాక్షీ యిఁకం
బైజన్మంబునయందుఁ దప్ప కటు సంప్రాప్తించెడిన్, నీతపో
రాజింజేసి యయోనిజాతవుగ విభ్రాజిల్లుచున్ భర్తృజా
వ్యాజామోదము గాంచి, సెందెదవు కైవల్యంబు నాపిమ్మటన్.

శా. దుర్వాసోముని మత్ప్రియాకృతిసుమీ తొల్దొల్త నత్యంతమున్
గర్వంబొప్పఁగ బ్రహ్మతేజముఁ దిరస్కారంబు గావించి తీ
సర్వంబున్ దహియింపఁజాలు నతఁడే సక్రోధుఁడైయున్న, నో
చార్వంగీ పురుషోత్తమప్రథితమాసత్యాగముం జేయవో? 126

క. ఆమాసము భగవత్ప్రియ
మై మిగుల రహించుఁ గృష్ణుఁడాత్మీయంబా
శ్రీమన్మాహాత్మ్యంబును
బ్రేముడితో దాని కిడియె బిసరుహనయనా! 127

ఉ. నేనును బ్రహ్మముఖ్యులగు నిర్జరులున్ మఱి నారదాదులుం
బూని తదాజ్ఞ సల్పుదుము పొచ్చెమువిూఱఁ దదుక్తి నెవ్వరుం

గాని తొలంగఁగా వలనుగాదు జగత్త్రితయంబునందునం;
గానఁ దదీయమాసమును గన్నెరొ నీవు త్యజింపఁబాడియే? 128

ఆ. వె. మాధురాల! లోకపూజితపురుషోత్త
మాఖ్యమాసమణిని హర్షమొదవఁ
గొలువకుంటె వట్టికలుషంబుచేతను
పంచపతుల నీవు గాంచఁగలవు. 129

చ. ఉరుతరపుణ్యదంబు పురుషోత్తమమాసముఁ గొల్వకున్నఁ ద
ద్దురితము తప్ప దెప్పుడును దోయరుహాక్షిరో దానినింద నె
వ్వరు రచియించుచుందురు ధ్రువంబుగ వారలు రౌరవాఖ్యమా
నరకమునందుఁ గూలి యొకనాఁటికినిం గడువంగ నేర్తురే? 130

క. దాని దిరస్కృతిసేసినఁ
వానికి వ్యత్యస్తమగును వాంఛ నిజముగా
మానక సేవించినయ
వ్వానికి నిష్టార్థసిద్ధి వఱలెడునెందున్. 131

క. పొందుగ నివ్వరమాసము
నెందఱో సేవించి మిగుల నిహపరసుఖముల్
చెందిరి చెందుచునుండిరి
చెందఁగలవార లింత సిద్ధముబాలా. 132

వ. మఱియు నీపురుషోత్తమమాసంబు సేవించుటం జేసి శీఘ్రంబ పురుషోత్తముండు సంతోషించుం గావున గీర్వాణులగు మేమందఱము దీనిని సేవింతుము సేవనీయంబగు నిమ్మాసంబును సేవింపక యెట్లు మిన్నకుందుము? అత్యుత్కృష్టులైన మహాత్ములవాక్కు లెన్నండును మిథ్యలుగావు. నిరంతరసద్వాదవాదులైనమును లనునయింపందగిన

వారుగాదె, అనియిట్లుపలికి శంకరుం డంతర్ధానంబు నందిన యూథభ్ర
ష్టయగు మృగివిధంబునఁ జకితయై యాబాల యిట్లనియెనని శ్రీకృష్ణుండు
సెప్పెనని సూతుండు శౌనకాదులకిట్లనియె. 133

ఉ. కింకరపంకభంజనుఁడు కిన్నరరాట్సఖుఁ డుజ్వలేందులే
ఖాంకితఫాలభాగుఁడు ప్రియంకరశంకరుఁడంత నేగ, న
ప్పంకరుహాక్షిచిత్తమున బాధురదుఃఖము, హత్యఁబుట్టు దు
ష్పంకము వృత్రహంతకుని బ్రాఁకినకైవడిఁ బ్రాఁకెనెంతయున్.

వ. పిదప నారదుండు నారాయణర్షితో నిట్లనియె. 135

క. శితికంఠుఁడు చనుపిమ్మట
నతిశోకమునందినట్టి యాబాలిక యే
గతి వసియించెను మఱియే
గతి నోనరించెను వచింపఁగదవే? నాకున్. 136

వ. అనిన నారాయణుం డిట్లనియె. 137

క. ఈకరణి ధర్మజుఁడు మును
శ్రీకృష్ణుని నడుగ నతఁడు సెప్పినపలుకుల్
నీకిపుడు దెల్పెదను విను
మేకాగ్రమనంబుతోడ నిద్ధచరిత్రా. 138

వ, శ్రీకృష్ణుం డంత ధర్మజునితో నిట్లనియె. 139

చ. పశుపతి చన్నవెన్క మునిబాల గతప్రభయై కనుంగవన్
భృశముగ నశ్రువుల్ దొలుకఁ బెల్లుగ నూర్చుచు భీతచిత్తయై
కృశతరగాత్రయై హృదయకృష్ణగతిజ్వలితాంగయై సుదు
ర్దశఁ గొనియెన్ దవాగ్నిపరిదగ్ధపలాశలతాకృతిన్ నృపా. 140

వ. ఇట్లు పురుషోత్తమహేలనంబున నమ్మునికుమారి శోషించి
యుండఁ బ్రభుండగు పురుషోత్తమదేవుం డక్కన్యయెడ నుదాసీనుండై
యుండె. 141

28977
1-9-87



UNIVERSITY OF HYDERABAD LIBRARY HYDERABAD

గీ. దుఃఖ మీర్ష్యయు మదిలోనఁదూఁగియాడఁ
బెద్దకాలంబు గడపి యాపద్దశ మెయి
మూషకబిలంబు ఘనసర్పమునకుఁ బోలెఁ
బ్రబలకాలవశంవద బాల యయ్యె, 142

క. ప్రావృడ్జలధరనిచయస
మావృతపుష్కరమునందు ప్రాదినిగతి మే
ధావిజ యడంగె నవ్వనిఁ
గావించిన తపముచేత గతకిల్బిషయై. 143

—(మేధావిపుత్రి ద్రౌపదియై జన్మించుట.)—

ఉ. అప్పుడు యజ్ఞసేనుఁ డనునట్టి నృపాలుఁడు ధర్మనిష్ఠుఁడై
గొప్పగ వస్తుసంచయముఁ గూరిచి జన్నము నాచరింపఁగా
నొప్పులకుప్ప కన్యక సముద్భవమందెను యజ్ఞకుండమం
దుప్పరమం దనూనకనకోజ్జ్వలకాంతులఁ గ్రుమ్మరించుచున్. 144

ఉ. ఆమునికన్యయే సుమి యమాత్మజ! యీద్రుపదాత్మజాతయై
భూమిఁ బ్రసిద్ధిఁగాంచె, బలముం బ్రకటించుచు నర్జునుండు వి
ద్యామహిమం బెలర్పఁగ స్వయంవరమందున మత్స్యభేదియై
హేమపుబొమ్మనుంబలె గ్రహించెను ద్రౌపది నుజ్జ్వలాకృతిన్.

ఉ అక్కడి కేగుదెంచినధరాధిపు లందఱు మత్స్యయంత్రమున్
ముక్కలుసేయకుండినను మోహమునం గజరాజయానయం;
దుక్కున యజ్ఞసేనుపయి నోరిమి దక్కి శరాసనాళి దా
మెక్కుడ, నర్జునుం డెదిరి యేపున వారలఁబాఱఁదోలుచున్. 146

వ. తదనంతరంబు గొంతకాలంబునకు. 147

మ. కినుకం జెంది సుయోధనప్రభృతు; లుత్కృష్టప్రకారంబు కా
దని భీష్మాదికు లెంతసెప్పినను దద్వాక్యంబు లోనాడి కొ

ల్పనకుం ద్రౌపది నీడ్చి శూలనివహంబుం బోని వాక్యంబులన్
వినఁగాఁ జేసియుఁ గట్టుపుట్టమును విప్పింపంగ నుంకించుచున్.

వ. అక్కార్యంబునకు దుశ్శాసనునోడంబఱిచిన 149

ఉ. ఆసమయంబునందున బృహన్మదమత్తుఁడు దుష్టబుద్ధి దు
శ్శాసనుఁ డన్నమాటలు దిసంతులుగొట్టక తద్దుకూలముం
దూసి పడంగవైచుటకుఁ దూకొనియుండఁగ నట్టివేళ నే
నోసరియున్నవాఁడఁ బురుషోత్తమహేలనకారణంబునన్. 150

గీ. అట్టియెడఁదన్నుఁగాపాడునట్టిదిక్కు
కానఁబడకుండుటం గడు దీనయగుచు
నాపయిన్ భక్తినూని మన్నామములను
మాటిమాటికి నుచ్చరింపంగఁదొడఁగె. 151

శా. ఓదామోదర! యోకృపాజలనిధీ! యోకృష్ణ! భక్తావనా!
యోదేవార్తినిషూదనా! జగదినా! యోభార్గవీనాయకా!
యోదుష్టప్రకరప్రమర్దన! హరీ! యోదీనసంరక్షకా!
యీదుశ్శాసనహస్తపంజరగ నన్నేలా యుపేక్షింతువో? 152

ఉత్సాహ. లేదుతల్లి, లేఁడుతండ్రి. లేదుభ్రాతృవర్గమున్
లేదుతోడు, లేరుసఖులు, లేఁడుభాగినేయుఁడున్
లేదుబంధుసంచయంబు, లేఁడుప్రాణనాథుఁడున్
నాదుదిక్కునీవ యోజనార్దనా! సమస్తమున్. 153

గీ. గోపికానాథ! గోవింద! పాపహరణ!
దీనవత్సల! కరుణాంబుధీ! శరణ్య!
దేవకీపుత్ర! దుశ్శాసనావమతను
నన్నెఱుఁగవదేల? యాపన్నశరణ! 154

వ. అనివేఁడుచు. 155

మ. తనయత్నంబున నొక్కచేతఁ బటబంధంబూని వేఱొక్కచే
తిని మింటం బ్రసరింపఁజేసి ననుఁ బ్రార్థింపంగఁ బాంచాలి; నా
కనఘా! విన్నడ దాపెమొఱ్ఱ, యిఁకఁ దద్యత్నంబు వ్యర్థంబటం
చని కేల్దోయిని యెత్తి నీవెగతి కృష్ణా! మంచినం దేల్చినన్. 156

క. అని తనరక్షణభారం
బును సర్వము నాయధీనమును సల్పి సభన్
నను సర్వేంద్రియములతో
ఘనభక్తిం గొల్చుచుండె ఘటితాంజలియై. 157

ఉ. చెన్నటి దుస్ససేనుఁ డటుసేయఁగ దిక్కిఁక లేక మాటికిన్
నన్నపు డిట్లు క్రియం ద్రుపదనందన ప్రార్థనమాచరింపఁగా
నెన్నక మున్ను సల్పునవహేలనముల్; రయమార వచ్చితిం
బన్నగవైరివాహనముపై నధిరోహణ మాచరించుచున్. 158

క. వచ్చి సభస్థలి నెలకొని
పొచ్చెంబటి యీమె కొన్నిపుట్టుల వెనుకన్
మెచ్చందగు కృత్యంబొకఁ
డచ్చుగ నొనరించియుంట నాత్మఁదలఁచితిన్ 159

వ. అదియెట్లంటేని. 160

మ. నదిలో వృద్ధమునీంద్రుఁ డొక్కరుఁడు స్నానం బాడుచుండంగ నా
నదివేగంబున జాఱి గోణ మరుగన్ నగ్నస్థితిం బొల్చి యె
య్యదియుం దోఁపక నీ రథోంశుకముగా నందుండి రారాఁడి చే
మదిలోనాహ్నికవేల తూలునని సంభ్రాంతాత్ముఁడై యుండఁగన్

చ. జలములు దేర నీమె కలశంబును గైకొని యేగి యానదీ
సలిలమునందు నున్న మునిచంద మెఱింగి ముఖాకృతిం; దయా

కలితమనంబునం దనదు కట్టినచీర చెఱంగు గోఁచిగా
వెలసెడునంత సించి యిడ విప్రుఁడు దాలిచి తీరగామియై. 162

క. ఇప్పుడు ననుఁగాపాడితి
చెప్పటికేనియును నీకు నీసుకృతము దా
గొప్పగ ఫలించునంచుం
జెప్పి యతండేగె నుటజసీమకు వేగన్. 163

వ. ఇదియంతయుం జింతించి. 164

క. ఆసుకృతజనితమగుఫల
మీసతి ద్రౌపదికి నొసఁగ నిది యద ననుచున్
వాసిగ ననేకవసనము
లాసభలో నొసఁగినాఁడ నరు లురియాడన్. 165

మ. నిరతం బాత్మమునందు నాయెడఁ గృతస్నేహంబుచే నొప్పు నీ
తరుణీరత్నము నాకుఁ బ్రాణసమమై దైవారు; నట్లైననుం
గరమున్ మామకనామమాసముఁ దిరస్కారంబు గావించుటం
గరువంబున్ హరియింపనెంచి సముపేతాభావముం బూనితిన్.

క. పురుషోత్తమమాసతిర
స్కారణం బొనరించునట్టి జనులసుఖంబుల్
సెలుచెద వారెంతయు మ
త్పరులైనం గనను, పక్షపాతముతోడన్. 167

క. మునులకు సురలకు సేవిం
పనగుం బురుషోత్తమాఖ్యమాసము గానన్
మనుజులు సేవింపఁగనగు
నని వేఱుగఁ జెప్పవలయునా? నృపవర్యా! 168

వ. కావున సర్వార్థఫలదాయకంబని యెఱింగి రానున్న పురుషోత్తమమాసంబు నారాధింపుము పదునాలవవర్షంబు పూర్ణంబైనపిదప నీకుసర్వంబును శుభంబైవిలసిల్లు. 169

చ. అదరి సభాంగణంబున దయామతి సుంతయులేక యెవ్వ రీ
విడివడు ద్రౌపదీచికురబృందము నూచిరొ వారికాంతలం
దొడరి రుషన్ శిరోరుహకుతూహలహీనలఁగా నొనర్చుచుం
గడిమి సుయోధనాదులను కాలునిప్రోలికి నేన పుచ్చెదన్. 170

గీ. సర్వశత్రుక్షయంబును సల్పి నీదు
సోదరులు నల్వురుం గొల్వ క్షోణికెల్ల
రాజవై ద్రౌపదింగూడి యోజమెఱయ
సకలశుభములఁ గాంతు వజాతవైరి! 171

ఆ. వె. ఎంతప్రేమ నాకు నెసఁగు భక్తులమీఁద
నంతప్రేమ లక్ష్మియందుఁ గాని
రేవతీశుపైని దేవకీదేవిపై
కామగదులయందుఁ గాని లేదు, 172

క. ఎవ్వఁడు నా భక్తులకున్
నెవ్వగ సమకూర్చు, వాఁడు నిజముగ నాకున్
నెవ్వం గూర్చినవాఁడగు
నవ్వానికిఁ దుల్యమైనయరి నాకున్నే? 173

గీ. వానికి ఫలప్రదుండు వైవస్వతుండె
నియమితుండయి వర్తించె నృపవతంస
తాదృశుని నేను దండనార్థంబుగూడ
కంటితోఁజూడ, భక్తహృత్కంటకుఁడని. 174

వ. అంత నారాయణర్షి యిట్లనియె. 175

చ. అడవిని దుఃఖకర్శితుల నార్యవినమ్రులఁ బాండుపుత్రులన్
సుడివడియున్న ద్రౌపదిని జూచి జనార్దనుఁ డూరడిల్లఁగా
నుడివి కుశస్థలిం జనఁగ నూల్కొనినట్టిమనంబుతోడ న
ప్పుడమిపతిం గనుంగొని ప్రమోదమెలర్ప వచించె నిట్టులన్.176

—(శ్రీకృష్ణుండు ద్వారకాపురంబున కరుగుట.)—

సీ॥ విరహంబుచేఁ గాంతిదొఱఁగినద్వారకా
పురమున కిప్పు డే నరుగవలయు
జనకుండు వసుదేవుఁడును తల్లి దేవకి
యగ్రజుండైన హలాయుధుండు
సాత్యకిగదులును సాంబప్రద్యుమ్నులు
నాహుకప్రముఖులౌ యాదవులును
రుక్మిణి మొదలైన రోలంబచికురలు
ననిమిషనేత్రంబు లమర, మిగుల

గీ॥ వీఁకతోడుత నాదగు రాకఁగోరి
నన్నె చింతించుకొనుచు మనంబులందు
నధికమగు నుత్సుకతను గార్యంబు లుడిగి
యెదురు చూచెదరయ్య ధాత్రీశతిలక. 177

వ. అని పలికి ప్రయాణోన్ముఖుండైన శ్రీకృష్ణుం గని యతి
కష్టంబున గద్గదాక్షరంబుల నిట్లనిరి. 178

ఉ. వారి, జలౌకసంబులకు వర్తిలుచొప్పున జీవనంబుగా;
నారయ మాకుజీవనమవై తగుదీవె జనార్దనా! నినుం
గోరెదమయ్య వెండియును గొబ్బునఁ దావకదర్శనంబిడన్
వారక మాకు నాయకుఁడెవండును లేఁడిఁక నీవుదక్కఁగన్.179

మ. హరియే దిక్కగుఁ బాండుపుత్త్రులకు లేఁడన్యుం డటంచున్ వసుం
ధరలోనం జనులెల్లఁ బల్కెదరు కాదా? కావునన్ మమ్ములం
గరుణం బ్రోవఁగఁ జెల్లునయ్య! మఱవంగాఁబోలదయ్యా! భవ
త్పరివారంబుగ నెంచుమయ్య! పరమాత్మా! భక్తకల్పాగమా.

గీ. మాదు చిత్తంబులనెడు బంభరములకును
దావకీనపదాబ్జముల్ తావలంబు
మాకు నవలంబనంబవై వీఁకఁగొలుప
సంతతంబును నిన్నుఁ బ్రార్థింతు మనఘ. 181

వ. పాండవు లివ్విధంబున మాటికి నెవ్వగం బల్కుచుండ యదూద్వహుం డల్లనల్లన రథం బెక్కి వెన్నడికొనివచ్చు వారలఁ బ్రేమపరిప్లుతుండై మఱల్చి ద్వారకాపురంబున కరిగెనని చెప్పి నారాయణర్షి మఱలనారదున కిట్లనియె. 182

సీ. కృష్ణుండు ద్వారకకేగిన ధర్మపు
త్త్రుండంతఁ దమ్ములతోడఁ గూడి
తీర్థయాత్రాసక్తిఁ దిరుగుచుఁ బురుషోత్త
మాఖ్యమాసంబుపై నాత్మనిలిపి
అనుజులు ద్రౌపది వినఁగ శ్రీకృష్ణుని
పలుకులు స్మరియించి పలికెనిట్లు
పురుషోత్తమాభిఖ్యఁ బరఁగిన నెలనున్న
యత్యుగ్రమాహాత్మ్య మవహితమతి

గీ. వింటిరిగదా క్రమంబుగ వీనులలర
నట్టిపురుషోత్తమంబు సమాదరమున

నర్చనము సేయకుండిన నంచితముగఁ
గోరు శుభములు మనకుఁ జేకూరు టెట్లు? 183

వ. అని వక్కాణించె 184

క. వివిధములగు నియమంబుల
భువిఁ బురుషోత్తమము నెవఁడు పూజించు, నతం
డవితథజన్ముఁడు పూజ్యుఁడు
భవదూరుం డుత్తముండు బహుధన్యుండున్. 185

ఉ. ఇంబుగఁ బాండునందను లహీనశుభావహసర్వపుణ్యతీ
ర్థంబుల సంచరించుచుఁ బదంపడి శ్రీపురుషోత్తమాఖ్యమా
సం బరుదేర నుక్తవిధి సల్పి వ్రతంబు, చతుర్దశాబ్దపూ
ర్తిం బురుషోత్తమాదృతి వరించిరి రాజ్యరమన్ గతార్తులై. 186

సీ. తాపసోత్తమ తొల్లి తరణివంశ్యుండైన
దృఢధన్వుఁ డనుపరీవృఢుఁ డొకండు
కలఁ డాన రేందుఁడింపు కల్యాణకరమైన
పురుషోత్తమవ్రతంబును చరించి
ఘనవిత్తమందున ధనదోపమానుఁడై
పుత్రపౌత్రసుఖంబు వొంది, మిగుల
భుక్తభోగుండయి ముక్తకిల్బిషుఁడయి
యోగిదుర్లభముగా నున్నయట్టి

గీ. మహితగోలోకమేగి సమ్మాన్యుఁడయ్యెఁ
గాననీమాసమందునఁ గల్గుమహిమ
కల్పకోటిశతంబులంగాని నేను
తెలుపశక్తుండఁగాను నిస్తులము సుమ్ము. 187

వ. అంతసూతుండిట్లనియె, 188

గీ. వ్యాసుఁడీపురుషోత్తమమాసమహిమ
నాకుఁదెలుపంగ వింటిని వీఁకఁగొంత
యఖిలమాహాత్మ్యమును దెల్ప నగునటన్న
నాతనికిఁగూడఁ బలుక శక్యంబుగాదు 189

వ. మఱియు నీపురుషోత్తమమాస మాహాత్మ్యం బఖిలంబు నారాయణుం డెఱుంగు. లేక సాక్షాద్వైకుంఠనిలయుండును భగవంతుండునగు శ్రీహరియెఱుఁగుం గాని యన్యులు పూర్ణంబుగా నెఱుంగఁజాలరు. 190

మ. పరమేష్ఠిప్రముఖామరానతపదాబ్జాతప్రపీఠుండు శ్రీ
హరి గోలోకవిభుండు స్వీయమగు మాహాత్మ్యంబు సర్వంబు ని
వ్వరమాసంబునఁగూర్చె దీని మిగులన్ వర్ణింపఁగా దేవతో
త్కరముల్ శక్తముగాదిఁకన్ మనుజవర్గం బెట్లు? శక్తంబగున్ 191

వ. అని పురుషోత్తమకథాశ్రవణప్రసన్నులైన శౌనకాదిమహర్షులకుం బలుకుటయు 192

క. లాలితతులసీమాలా!
పాలితగోగోపబాల! బహుగుణజాలా
కాళీయమౌళినటనా!
మౌళిజ్వలదురుశిఖండమండనఘటనా. 193

మ. ద్రుహిణేంద్రాది సమస్తదేవవినుతా! దుర్వారచక్రాన్వితా!
గ్రహచారాగతసర్వదుఃఖహరణా! కంజాతపత్రేక్షణా!
బృహదారణ్యవిహారకృద్వరహరీ! బృందావనాంతఃపురీ!
దహరాకాశనివాస భాసురతరా! ధాత్రీరమాధీశ్వరా! 194

ఇంద్రవ్రజ. వ్యాసాదిమౌనీశ్వరవందితాంఘ్రీ!
శ్రీసారసాక్షీయుత చిద్విలాసీ!
దాసావనాత్యంతరతా! గుణాఢ్యా
రాసక్రియారంజితరాధికేడ్యా. 195

గద్య

ఇది. శ్రీమద్విబుధవిధేయ వేంకటాచలశాస్త్రి
నామధేయప్రణీతంబైన బృహన్నారదీయ
పురాణాంతర్గత పురుషోత్తమ
మాహాత్మ్యంబున
ద్వి తీ యా శ్వా స ము
శ్రీకృష్ణార్పణమస్తు.

శ్రీ ర స్తు.

శ్రీపురుషోత్తమాయపరబ్రహ్మణేనమః

# పు రు షో త్త మ మా హా త్మ్య ము.

## తృ తీ యా శ్వా స ము.

శ్రీమత్ప్రణవాధారా!
నామస్మరణభ్రమాపనయనవిచారా!
రామాగణకామా! గుణ
ధామా! పురుషోత్తమా! స్తుతవ్యాయామా. 1

వ. దేవా ! శౌనకాదిమహర్షులుసూతుంగనియిట్లనిరి. 2

సీ. పురుషోత్తమవ్రతంబును సల్పి దృఢధన్వుఁ
డనురాజు రాజ్యంబు ధనచయంబు
పుత్త్రసంతానంబుఁ బౌత్రసందోహంబు
పరమపాతివ్రత్యనిరత గరిత
యోగిదుర్లభము సత్యోత్తమంబగు భగ
వల్లోకసుఖముఁ దా నుల్లమలర
నెట్లు గైకొనె? మాకు నెఱిఁగింపుమా! సూత!
తావకవదనపద్మంబునుండి

గీ. యీకథాదివ్యసారంబు నెంతవినిన
నమృతపానంబు సేయుచున్నట్లు మాకుఁ

జాలుననుబుద్ధి పుట్టఁ గఁజాలకుండెఁ
గానఁదత్కథ వివరంబుగా వచింపు. 3

వ. మహాత్మా! నిన్ను నయ్యజుండు మాభాగ్యబలంబునం
గాదె సృజియించి కన్పఱిచె ననిపల్కిన శౌనకాదులకు సూతుం
డిట్లనియె. 4

క॥ అనఘుండైన సనాతన
మునివర్యుఁడునారదునకు మును పల్కిన పా
క్తనమగు నితిహాసమ్మును
బనుపడ వచియింతు వినుఁడు పరమమునీంద్రుల్! 5

—○(దృఢధన్వనిచరిత్రము)○—

క॥ గురుముఖమున నేఁజదివిన
తెఱఁగున దృఢధన్వచరితఁ బరముగమీకే
నెఱిఁగించెదఁదచ్చరితము
దురితంబుల నెల్లఁబాఱఁదోలుఁ హేలన్. 6

వ॥ అంత నారాయణర్షి నారదుం గనుంగొని మునీంద్రా!
గంగాప్రవాహంబుఁబోలె లోకపావనంబును ప్రాచీనంబునైన దృఢ
ధన్వచరిత్రంబు నీకెఱింగించెద వినుమనియిట్లనియె. 7

చ. కలఁడిలఁ జిత్రధర్ముఁడనుక్ష్మాపతివర్యుఁడు హైహయాఖ్యచేఁ
బొలిచెడి దేశమం; దతఁడు భూరిపరాక్రమశాలి సత్యసం
కలనుఁడు శేముషీనిధి యఖండదయాన్వితుఁ, డట్టివాని క
త్యలఘుగుణాన్వితుండుదృఢధన్వుఁడనన్ సుతుఁ డొక్కఁడొప్పెడున్

వ. అక్కుమారుండు. 9

శా. ఆకర్ణాంతవిశాలలోచనయుగుం డాజానుబాహుండు భ
వ్యాకారుండు విశాలవక్షుఁడు మహీయస్తేజుఁ డత్యుత్తమ
శ్లోకుం డున్నతధర్మతత్పరుఁడు సంశుద్ధాంతరంగుండు స
త్యాకారుండయి సద్గుణావళులచే నత్యంతమున్ భాసిలెన్. 10

వ. అంత గురుకులంబున కరిగి. 11

ఉ. వేదములం బఠించి యుపవేదములం గ్రహియించి శాస్త్రముల్
సాదరబుద్ధితోఁ జదివి చక్కని పండితుఁడయ్యె బాలుఁడై
యాదృఢధన్వుఁ, డక్రియసకృత్కథనంబున నెల్లవిద్యలున్
మోదమెలర్ప నేర్చికొనె మున్ను పఠించినవిద్యలోయనన్ 12

చ. గురువరుఁ బూజసేసి తనకుం దగురీతిగ గొప్పదక్షిణ
న్గురున కొసంగి యాతని యనుజ్ఞను గైకొని యంత స్వీయమా
పురమున కేగి పౌరులఁ బ్రమోదసముద్రమునందుఁ దేల్చినం
బొరిపొరిచిత్రబాహువు సుపుత్రునిగాఁగిటఁ గ్రుచ్చి మెత్తుచున్ 13

చ. ముదమున నంకపీఠి నిడి ముద్దులు గైకొని యాతఁడెంతయున్
విదితసమస్తవిద్యుఁడయి విశ్వజనీనములైన ధర్మముల్
పదిలముగా నెఱింగి జనపాలనదక్షతఁ గాంచె వీనిపై
వదలి సమస్తరాజ్యము భవప్రభవార్తిఁ దొలంగు టొప్పదే? 14

వ॥ అని మఱియు ఆశాతరంగబహులంబును రాగావర్తభీషణంబును వితర్కానేకవిహగంబును దారుణంబును జనభీకరంబును శుభాశుభమనోనిర్మితకల్పనారూపశత్రుయుక్తంబును జింతోత్తుంగగిరివిరాజితంబును నైన నీభవసాగరంబు హరిపదపోతవిహీనుం డెట్లుతరించు? అట్లగుటం జేసి 15

సీ॥ సంసారహింసాప్రహింసులక్రీడలోఁ
గనఁగ నింతయుఁ బ్రయోజనము గలుగ

దనుచు, శ్రీకృష్ణుని ఘనశాంతు ద్విభుజుని
మురళీధరుఁ బ్రసన్నముఖు ననంతు
భక్తలోకాభయప్రదుని, బ్రహ్లాద వి
భీషణధ్రువు లంబరీషనృపతి
శర్యాతియు యయాతి శశబిందుశిబిముఖుల్
రంతిదేవుఁడు భగీరథనృపుండు

గీ. పృథువు దుష్యంతభరతులు భీష్మవిదుర
ముఖ్యులుత్తానపాదాఖ్యభూవిభుండు,
నింక నెందఱొ రాజన్యు లెల్లభోగ
ములను ద్యజియించి భక్తితోఁ గొలువలేదె? 16

వ. మఱియు నారాజన్యులు 17

క. పశ్వాద్యవిశేషంబుగ
శాశ్వతమని యెంచఁబోక సంసారంబున్,
శాశ్వతసుఖమును గాంచి ర
శాశ్వతదేహముల విష్ణుసంసేవనులై 18

సీ. విష్ణునామంబును వినఁగఁజాలనిది క
ర్ణమ్ముగాదద్ది కన్నమ్ముగాని
పరమాత్మునామంబు పఠనంబులేనిది
వాయిగాదది పాడునూయిగాని
కమలాక్షురూపంబుఁగనఁగఁజాలనిది లో
చనముగాదది సులోచనముగాని
చక్రిపాదములకు సాష్టాంగమిడనిది
మేనుగాదది చింత మ్రానుగాని

గీ॥ ఉరగశయనునిఁబూజింపకున్న యది క
రంబుగాదది దర్వీకరంబుగాని
శ్రీవిభుఁబ్రదక్షిణంబును జేయనియవి
కాళ్ళుగావవి కంకటికోళ్లుగాని. 19

క. ఆఁకలిదప్పియు నసువున,
శోకముమోహంబు మదిని జొచ్చియుఁ, దనువున్
బ్రాఁకి జరామరణంబులు,
నీకరణి షడూర్ములెపుడు హింసించుజనున్, 20

ఉ. కావున దారపుత్రగృహకాంచనరాజ్యనిబద్ధరాగపా
శావలి ద్రెంచి నేనిఁక నిరంతరమున్ హరిసేవనంబునన్
జీవితమెల్ల సార్థకముజేసెదఁ గాననసీమయందటం;
చావిభుఁ డాత్మ నట్టిసమయంబున నెంతయునిశ్చయించుచున్. 21

వ మంత్రులయు బ్రాహ్మణులయుఁ బ్రజలయు ననుమతంబు
వడసి యొక్కసుముహూర్తంబున 22

ఉ. తాను సమర్థుఁడైన దృఢధన్వునిపై నిజరాజ్యభారముం
బూనిచి రాగదూరుఁడయి; పోయి వెసం బులహాశ్రమోత్తమ
స్థానము జేరి కృష్ణుని సదా స్మరియించుచుఁ దత్తలంబునం
ధీనియతిన్ మహాతపము దివ్యులు మెచ్చఁగ నాచరించుచున్. 23

వ. అంత నొక్కనాఁ డాచిత్రధర్మనృపాలుండు తనమనంబున
శ్రీహరిని నిలిపి 24

క. నిను నేక్షణమున వీడునొ
కను నామది యాక్షణంబ ఘనదుఃఖంబున్;

గనుక మదీయమనంబును
నినుఁబాయకయుండ సలుపు నీరజనాభా. 25

ఉ. భూతలమందు రాముఁడయి మున్ను మహాచపలస్వభావులై
పాతరలాడు వానరులఁ బట్టి భవద్వశులం బొనర్చినా
నీతతి మాటికిన్ విషయవృక్షము లెక్కెడు నాదు చేతమున్
గ్రోఁతిని నీదు పాదములకున్ ముడిఁబెట్టఁగఁజెల్లదే? హరీ. 26

వ. అని యిట్లు ప్రార్థించి. 27

క. కామములం దస్పృహుఁడై
యేమియు భుజియింప కింది రేశ్వరుధ్యానం
బామహిపతి యొనరించుచు
శ్రీమద్ధరిధామమునకుఁ జేరె నమలుఁడై. 28

చ. తన జనకుండు వైష్ణవపదంబున కీగతిఁజేరినట్లుగా
విని దృఢధన్వభూమిపతి విస్మృతిమై మది హర్షశోకముల్
పనుగొన, బ్రాహ్మణోత్తములు వల్కిన కైవడి నౌర్ధ్వదైహికం
బును బితృభక్తితో సలిపె భూరిధనంబును వెచ్చపెట్టుచున్. 29

గీ. నీతిశాస్త్రంబునం దతినిపుణుఁడగుచుఁ
బుష్కరావర్తకంబను పుణ్యనగరి
నింపుమీఱఁగ రాజ్యంబు నేలుచుండెఁ
దగువిధంబున నాదృఢధన్వనృపతి. 30

వ. ఇవ్విధంబున నుండి విదర్భవిభుపుత్రిని స్వయంవరంబున
వరియించె. 31

మ. పగడంబుం బురడించుమోవి, సొబగుం బాలిండ్లు, లేనవ్వుతో
మిగులన్ సొంపుఘటించుమోము, ఘనధమ్మిల్లమ్ము,వాల్గన్నులున్

సొగసౌనాసయు,మంచిపల్వరుస, మెచ్చుఁ హెచ్చుగాఁదెచ్చుచుం
జిగురుంగ్రెమ్మవుజోదుపైదలి యనం జెన్నారె నక్కన్నె దా॥ 32

ఉ. అంత విదర్భరాజతనయన్ గుణసుందరినామధేయ న
త్యంతసుశీలఁ బెండ్లియయి తత్తరుణీమణియందు నల్వురం
గాంతిసమేతులన్ సుతులఁ గన్నియ నొక్కతెఁ గాంచి సంతతా
క్రాంతముదంబురాశిని ధరావరవర్యుఁడు దేలుచుండఁగన్. 33

వ. ఆ నృపతనయులు క్రమంబునఁ జిత్రవాక్కనియుఁ జిత్రవా
హుండనియు మణిమంతుండనియుఁ జిత్రకుండలుండనియు నామం
బుల ధరియించియు, రాజపుత్రిక చారుమతినామంబునుధరియించి
యు నందఱునుసకలసద్గుణంబుల నతిచాతుర్యంబున విలసిల్లుచుండిరి34

సీ. రూపమన్మథుఁడు ప్రతాపమార్తాండుండు
ధైర్యమేర్వద్రి గాంభీర్యశరధి
నీతిదైత్యగురుండు నిగమలోకేశుండు
వాచాఫణీశుఁ డైశ్వర్యశివుఁడు
ధర్మదండధరుండు ధనకిన్నరేశుండు
శేముషీగురుఁడు శుచిత్వవహ్ని
గానవాగ్దేవి దయానలినాక్షుండు
ఘనశాంతిధర పరాక్రమగుహుండు

గీ. సత్యవచనహరిశ్చంద్ర చక్రవర్తి
యేకపత్నీత్వరఘురాముఁ డిద్ధచాప
వేదజమదగ్నిసుతుఁడు వివేకశాలి
యగుచుదృఢధన్వుఁ డొప్పె సద్యశమెసంగ. 35

మ. అసదృశంబుగ విత్త మర్థులకుఁ దా నర్పింప రాజేంద్రుఁ డి
వ్వసుధన్ శ్రీదృఢధన్వుఁ డిచ్చినక్రియన్ స్వరంబునం దొప్పు న

ప్పసరంబిచ్చునె? పాదపంబొసఁగునే? పాషాణ మీఁజాలునే?
యసకృద్దాన మటంచుఁ బల్కుదురు నిత్యంబప్పురిన్ యాచకుల్ 36

వ. మఱియుఁ దదాజ్ఞ్యపరిపాలనంబునసంభ్రమంబును క్రూర తయు దైన్యంబును మిథ్యాలాపంబును కాఠిన్యంబును నాస్తికత్వంబు ను స్వల్పభాగ్యంబును దరిద్రతయు భూతహింసయుఁ బరద్రోహంబును పరదారరతియుఁ గలహంబును మాలిన్యంబును మత్సరంబును చౌర్యం బును జడతయుఁ బైశున్యంబును క్లేశంబును క్రోధంబును నిస్సంతాన తయుఁ బరార్థనయు ననార్యత్వంబును నిర్గుణత్వంబును లోలుపత్వం బును నరాతితయు దృష్ణయుఁ దంభంబును గాపట్యంబును గార్ప ణ్యంబును శత్రుసేవనంబును మాతాపితృసమ్మానరాహిత్యంబును వృత్తినిమిత్తకధర్మసేవనంబును వ్యాధిజభయంబును, శశవిషాణంబుల పగిది మృగతృష్ణాజలంబులీల గగనపుష్పంబులకరణి వంధ్యాసుతో ద్భవంబు చందంబున నుండఁ ద్రేతయందును కాలంబు కృతయుగసమం బుగ దృశధన్యం డాచరించి లోకానందంబుఁ గూర్చుచుండె 37

సీ. మురవైరిపదభక్తచరణంబులకుఁదక్క
శిరమును వంపఁ డెవ్వరికి నతఁడు
శ్రీమనోవల్లభు నామమొక్కటి దక్క
జిహ్వతో నెదియున్ వచింపఁ డతఁడు
శ్రీజగన్నాథాంఘ్రిపూజ దక్క తదీయ
హస్తంబు లితర కార్యములఁజొరవు
తీర్థంబులకు నడతెంచుటదక్కయు
స్వమున కేగదు తదీయాంఘ్రియుగము
గీ. అచ్యుతుని చరితమును దక్క యన్యవార్త
లతని కర్ణంబు లెన్నండు నవధరింప

వనఘుహారిదివ్యరూపంబు గనుట దక్క
నితరరూపంబుఁజూడ వానృపతికనులు. 38

మ. నిరతంబుం బతిభక్తి చెన్నలర మన్నింపెన్నఁడున్ మోదిలన్
సురఁటీ వైచుచుఁ జామరల్విసరుచున్ శుద్ధాంతరంగంబుతో
హరి నయ్యిందిరవోలెఁ; బార్వతి విరూపాక్షున్ వలెం గొల్చుచున్
మరియాదన్ గుణసుందరీవనిత నామంబందు శోభిల్లెడిన్. 39

గీ. వారిరాశినిఁ బోలె దుష్పారుఁ డతఁడు
బ్రాహ్మణుల రక్షపొంటెఁ బరాక్రమించు
నాల్గుదంతంబులను శక్రునాగమట్లు
క్ష్మాపతి యెసంగు సుతచతుష్టయముచేత. 40

వ. మఱియు నాదృఢధన్వుని పుత్రులు నలువురును చాతుర్యనిధులును శూరులును వేదవేదాంగపారగులును ధార్మికులును సత్యసంధులును ధనుర్విద్యాకృతశ్రములును పంచకర్మనిర్విణ్ణులును విక్రాంతులును సింహయోధులును సర్వదిగ్జయులును ధీరులును ననేకభూపవందితులును స్వాచారనిరతులును రంజితసాధువులును కాందిశీకీకృతారులును సాధువులును శంసితవ్రతులునై జనకుని పనుపు సేయుటనలని యానందంబుకన్న ననేకభోగానందంబు ననముగాఁ దలంచుచు నివ్విధంబున 41

మ. అకలంకుల్ నృపనందనుల్ సతత ముద్యద్భానుబింబంబుగాఁ
బ్రకటంబౌపితృభక్తి నాతని ముఖాబ్జంబే యుపాసింత్రు; పెన్
ముకుఁద్రాటం బరిరుద్ధమైన వృషభంబుల్వోలె నాయత్తులై
సకలార్థంబులఁ దెచ్చియిచ్చెదరు రాజశ్రేష్ఠు లారాజుకున్. 42

వ.మఱియుఁబవిత్రులునుసుభృతులునుప్రభుహితరతులునుసాధుజనంబులకుఁ బ్రాణంబులచేఁగూడ నుపకరించువారు నగు భృత్యు

లును, సుదానులును సంతతగుణోపకృతిరంజితులు నగు దాసజనం
బులును దద్విభుంగొల్చుచుందురు. 43

సీ. చందమామను గూడ గ్రిందలన్ సలిపించు
రమణీయములగు వక్త్రములు బొలిచి
సౌవర్ణసంపుటస్పర్ధ సేయుచుఁ దళ
తళలాడు చెక్కుటద్దములు వెలసి
చాంపేయసుమచాకచక్యలుంటాకంబు
లైనట్టిగంధవహములు గలిగి
పీనోన్నతపయోధరానూనభరముచే
నాఁగ మందమగు యానములుదనరి

గీ. తత్తదవయవసౌందర్య ముత్తమముగ
నలరి యచ్చరగమిఁ బోలి లలిని; షోడ
శాబ్దమధ్యవయస్కులై హావభావ
ములను దాసీవితతి, నృపుఁ గొలుచుచుండు. 44

సీ. విసపు మేఁతరిశిరఃకుసుమంబు పసదూఱి
బిసకాండముల నట్టె కసరికొట్టి
హీరహారము తిరస్కారంబుగావించి
కుందచందనములన్ నిందఁజేసి
పుండరీకోద్దండ షండంబులనుగేరి
కర్పూరవారంబు గరిమదెగడి
గంగాతరంగకరింగణంబులఁగ్రుంకి
మంచుగుబ్బలిఁగౌఁగిలించి మించి

గీ. ప్రథితనిజకీర్తి ప్రోషితభర్తృక బలు
తెలిమిసిమిఁజెంది యొకటఁ గాల్నిలుపకెపుడు

దేశదేశంబునందునఁ దిరుగఁ; దనరె
నన్వయాబ్ధ్యుడుపతి దృఢధన్వనృపతి. 45

వ. ఇవ్విధంబున నవ్వసుధాధీశ్వరుం డసమానరథగజ తురగ పదాతివర్గంబులతో లోకంబునఁ దనకుం దనప్రజలకుం గాని విభవం బెందునుం గాననియట్లు పొలుపొందుచు. 46

క. వెలుపలిశత్రువులను లో
పలిశత్రువులన్ జయించి బహుళసుఖంబుల్
వెలయఁగ దృఢధన్వనృపుం
డిలఁ బరిపాలించుచుండె నింద్రనిభుండై, 47

గీ. అఖిలజనులును దద్రాజ్యమందు హరిని
గొలుచుచుందురు ప్రతిదినం బలఘుభక్తి
నక్కతంబున వారల కధికశుభము
లందుటయ దక్కఁ దదితర మమర దెందు. 48

మ. ఒకనాఁ డానృపుఁ డర్ధరాత్రమునఁ దా నుండంగ శయ్యాస్థలిం
బ్రకటంబైన విచారణం బొదవె భావంబం దహో నాకు నే
సుకృతాధిక్యముచేత నిట్టివిభవస్ఫూర్తిం గొనంగల్గె నే
నొకయజ్ఞంబుఁ దపంబునున్ సలుపకే యుంటిం గతంబేమొకో 49

వ. కావున నాభాగ్యకారణం బెవ్వని నడుగుదు నని చింతించుచున్న యాతని కారాత్రి గడచిన బ్రాహ్మముహూర్తంబున లేచి స్నానం బాచరించి యుదయించు భాస్కరు నుపాసించి భగవత్కలలఁ దృప్తిపఱిచి విప్రులకు దానంబులు సేసి నమస్కరించి తదాశీర్వాదంబులు వడసి

మ. తురగం బెక్కి మృగవ్యదోహలితఁ దోడ్తో సైనికుల్ రాఁగ నా
ధరణీపాలుఁడు కానకుం జని మృగేంద్రవ్యాఘ్రభల్లూకసూ
కరమాతంగకురంగముఖ్యమృగసంఘం బెల్లఁ జక్కాడున
త్తఱి, బాణంబును దాల్చి యొక్కమృగ మత్యంతత్వరం బాఱినన్ 51

ఉ. దుర్గమమైనయరణ్యమునఁ దోఁచిన నెత్తుటిబొట్లచొప్పునన్
మార్గణబాధ్యమానమృగమార్గవిమార్గణ మాచరించుచున్
నిర్గతుఁడై వనాంతరము నెట్టనఁ జేరి మృగంబుగాన కం
తర్గతమౌ తృషార్తిఁ బరితాపము నందుచు నట్టిపట్టునన్. 52

సీ. శీకరప్లుతమైన చిఱుతెమ్మెరలపిండు
తనువుసోఁకినమాత్రఁ దాప మార్ప
నూర్మిడోలికలపై నూఁగురాయంచలు
నయనాంబుజముల కానందమిడఁగ
మకరందములు గ్రోలి మత్తిల్లునెలదేంట్ల
ఝుంకృతుల్ శ్రవణతోషం బొసంగ
ఇందీవరమరందబిందుసంకలితతో
యము రసజ్ఞ కతిరుచ్యమనిచాట
గీ. వికచశతపత్రపరిమళవిస్తరమున
సంతసంబును జెంద నాసాపుటంబు;
సరసిఁ గనె రాజు తత్పరిసరమునందుఁ
బ్రిమదమంద నిజేంద్రియపంచకంబు. 53

క. ఆ సాగరతులితంబగు
కాసారంబునకు నేగి కడువడి జలమున్
దోసిటఁ గైకొని త్రావి పి
పాసం దొలఁగించుకొని నృపాలుం డంతన్. 54

వ. తత్తీరంబున 55

సీ. అభ్రంకషంబులై యలరారు కొమ్మల
నండజంబుల కులాయంబు లొప్ప
శుకపికశారికాదికశకుంతంబుల
కీచికూచీధ్వనుల్ వెలయుచుండ

కోటరంబులఁ బాదుకొనియున్న త్రాఁచుల
విసరంబు లెంతయుఁ బుసలుకొట్ట
నాతపంబునకోడి యురుదెంచి పసరముల్
నీడలన్ వసియించి నెమరువెట్టఁ
గీ. బెల్లుగా జాఱి యూడలు వెల్లివిరియ
నోలినవిగాని క్రోఁతు; లుయ్యాలలూఁగ
సరటచిక్రోండకాదిసంస్థాన మగుచు
వెలయు నొక గొప్ప న్యగ్రోధవృక్షముఁ గని. 56

వ. అశ్వంబు నవ్వటవిటపిజటకుం బంధించి యావృక్షచ్ఛాయంబున నొక్కస్నిగ్ధశిలావితర్దికం గూర్చుండి వృక్షంబు నలుగెలంకులం దిలకించి రాజేంద్రుండు. 57

చ. అతిథుల నాదరించెడి గృహస్థువిధంబునఁ గాననాంతర
స్థితమగు నిమ్మహావటము తేఱికనంగ ననేకజీవిసం
తతులకుఁ దావలంబయి నితాంతరవిచ్ఛవి తా భరించుచున్
వితతపరోపకారపదవిన్ వచియించుచునుండె నద్దిరే! 58

వ. అని తలంచుచున్నఁ దత్సమయంబున నయ్యెడకుఁ బరమశోభనంబగు నొక్కకీరం బరుదెంచె 59

మ॥ చిగురాకున్ మఱపించుచంచువు విపంచిన్ మించునాదంబు చె
ల్వగుపాదంబులు కప్పుఁగుత్తుకయు లీలాలోలనేత్రంబులున్
సొగసుం బచ్చనిఱెక్కదోయి మిగులన్ సొంపారుకుక్షిస్థలం
బు గణింపందగుయాన[illegible]గలిగి యింపుల్ గుల్కుచిల్కంగ నెన్ 60

ఉ. అక్కడి కేగుదెంచి యిటు లద్భుతమైనశుకంబు మఱ్ఱిపై
నెక్కి మనుష్యభాషల మహీశునిచిత్తవిమోహనంబుగా

నొక్కఁడుగావసించునృపు నోలిఁబ్రబోధమొనర్చి మాటికిన్
నెక్కొని యొక్కపద్యము ననింద్యగతిం బఠియించె నీకిరియన్ 61

—○[కథాసూత్రి పద్యము]○—

క. విరివిగఁ బరమసుఖంబులు
వఱలుచు నున్నవియటంచు వసుధాధీశా!
మఱియఁగ నేటికిఁ? దత్వం
బరయకయుండినను పార మందంగలవే ? 62

ఉ. మాటికి మాటికిం జిలుక మానవవాక్కుల నిట్టిపద్యము
ద్ఘాటన మాచరించిపలుకన్ నృపుఁ డాదటనాలకించుచున్
సాటి వచింపఁగాఁదగని సంతసముం గడు మోహముఁ మదిం
బాటిల మాటికీచిలుకపల్కుటకుం గతమేమియయ్యెడున్. 63

వ, అనివితర్కించి 64

గీ. నారికేళంబుభాతి నీకీరవాక్కు
పొసఁగెడి నగమ్యమగుచు దుర్బోధమగుచుఁ
గాని, సారంబుదీనిలోఁగలదు మిగుల
వ్యాససూనుండు కాఁడుగదా యితండు. 65

మ. మును సంసారములోనఁ జిక్కువడు నమ్మాంధాత్మునిన్ విష్ణురా
తుని శ్రీవిష్ణుకథాప్రబోధమున సంతుష్టాత్మునిం జేసి ము
క్తుని గావించినరీతి నాశుకమునీంద్రుండే యిటుల్ ప్రీతి, లో
నెనయంగా ననునుద్ధరించుటకునై యేతెంచెనో, కానిచో౯ 66

వ. దేవకీతనయుండో, కశ్యపనందనుండో యీరూపంబున దాసుండనగు నన్నుద్ధరింప దర్శనంబొసంగనోపు, 67

గీ. ఇటులఁ జింతించుచుండ నానృపతిముఖ్యుఁ,
డతనివెదకుచు సైనికు లట్టియెడకు

నేగుదెంచిరి, శుకము మహీశుఁగూర్చి
కడఁకనీరీతిబోధించి కన్మొఱంగె. 68

వ. అంత నృపుండు పరివారంబుతో నిజనగరంబునకుఁ జేరి శుకవాక్యంబుఁ దలంచి తదేకాయత్తచిత్తుండై మచ్ఛ్లోకంబు నెవ్వండు తీర్పంగలవాఁడని తలంచుచు 69

సీ. పసిఁడిపళ్ళెరములఁ భక్ష్యభోజ్యాదులు
ముందటం బెట్టినఁ ముట్టుకొనఁడు
కుసుమంబులం దెచ్చి పొసఁగఁ బాన్పునఁ జల్లి
తీర్చినఁ క్షణము నిద్రింపఁబోఁడు
ఎంతపిల్చినఁగాని సుంతైనఁజెవియొగ్గి
యక్కఱపల్కులఁ లెక్కఁగొనఁడు
ఎంతవాఁడైనను నెదుటికేతెంచిన
నుండు పొమ్మనియేనియుంబలుకఁడు

గీ. బహుళపరిమళమిళితసువస్తువులను
గైకొనఁడు రాజు; కీరవాక్యము తదీయ
చిత్తమున హత్తి జ్ఞానహృషీకపంచ
కంబు విషయంబులెఱుఁగనికారణమున. 70

వ. ఇట్లాతండు శాసింపక సంతసింపక కోపింపక హసింపక పుత్రులఁబరిరంభింపక భార్యనభినందింపక యానందసంప్లవంబున శ్రీమంతుఁడగు యోగిచందంబున ధ్యానంబునే యాశ్రయించియుండఁదత్సతీతిలకంబగు గుణసుందరి యేతెంచి యేకాంతంబునరాజునకిట్లనియె. 71

మ. విమలాత్మా! పురుషావతంస! యిటు లేవింబాయుచున్ దార్మనస్యము నొందంగతమేమి? యెందునను లేశంబేనియున్ నీకు లో

పము లే దాదట మాటలాడ నిను సంప్రార్థింతుఁ జింతందొలం
గుమ! లెమ్మా! సకలేష్టభోగములఁ గైకొమ్మా! నరేంద్రోత్తమా 72

మ. సతిచే నీగతి నూఱడింపఁబడియున్ క్ష్మానాథుఁ డొక్కింతయుం
బ్రతివాక్యం బిడకుండి సత్యమయి భద్రప్రాపకంబై మహా
ద్భుతసారాన్వితమై సుపర్వతతికిన్ దుర్జ్ఞేయమై యొప్పు న
చ్యుతగోత్రంసరుతంబు నే సతతమున్ భావించుచుండెన్ మదిన్ 73

వ. గుణసుందరియుఁ దనభర్త యివ్విధంబుననుంటకత్యంత దుఃఖితయై నిట్టూర్చుచు నుత్కటంబగు నిజప్రభుచింతాకారణంబు నెఱుంగకుండె నృపుండునునిట్లుచింతానిమగ్నుండై యుండఁగొన్నాళ్లు గడచెంగాని సందేహసాగరంబు గడువంబెట్టుహేతువు నెఱుంగకుండె నని చెప్పిన నారాయణర్షికి నారదుండిట్లనియె. 74

గీ. ఇట్లుచింతించుచున్న యానృపతివర్యు
నవలివృత్తాంతమేమయ్యె నదివచింపు
విష్ణుచరితంబు లేశంబు విన్ననదియుఁ
గలుషములనెల్ల హరియించుఁగాదెమౌని 75

వ. అనిన నారాయణర్షి యిట్లనియె. 76

సీ. పౌత్రాయణుండైన ప్రభువు జానశ్రుతి
శ్రద్ధతో దానధర్మములుసలిపి
శుద్ధుఁడై భల్లాక్షసూక్తి విరక్తుఁడై
రైక్వునెంచినప్రకారంబుదోఁపఁ
బూర్వజన్మంబునఁ బుణ్యకార్యము లనే
కము లొనర్చినయట్టి కారణమునఁ
జిత్తశుద్ధిఘటించి చిలుకపల్కినమాత్రఁ
దత్వంబుదెలియంగఁ దలఁచినృపతి

గీ. ఘోరసంసారగంభీర వారిధిఁబడి
యున్నవాఁడను దరిఁజేరు తెన్నుఁగనక;
నన్నుఁదరియింపఁజేసెడి నాథుఁడెవ్వఁ
డెవనిఁబ్రార్థింతు నెచ్చటికేను జనుదు. 77

—(దృఢధన్వునియొద్దకువాల్మీకిమహర్షి వచ్చుట)—

గీ. అనుచుఁ జింతాతురుండైన యట్టి నృపతి
పుంగవునియింటి కేతెంచెఁ బూజ్యతముఁడు
రామచరితంబు దివ్యంబు రచనఁజేసి
మిగుల విఖ్యాతుఁడైన వాల్మీకిమౌని. 78

ఉ. దూరమునన్ మునీంద్రుఁ గని తొందరమైనెదురేగి రాజు త
చ్చారుపదాంబుజంబులకుఁ జాఁగిలి మ్రొక్కి మహాదరంబునన్
భూరితరార్ఘ్యపూర్వముగఁ బూజయొనర్చి వరాసనంబునం
గూరిచిపాదతోయములు గొంచు శిరంబునయందుఁదాల్చుచున్ 79

వ. తదనంతరంబ కీరవచనంబులు స్మరియించి స్నిగ్ధవచనంబుల
నిట్లనియె. 80

మ. కృతకృత్యుండను భాగ్యవంతుఁడను నేనీనాఁడు ధన్యుండ మ
చ్ఛ్రుతిసాఫల్యము సేకుఱెన్ మఱియు సంశుద్ధంబు నాజన్మ, మీ
ప్సితసిద్ధుల్ ఘటియించె నియ్యెడల నిన్వీక్షించుటంజేసిమ
న్మతి నాభాగ్యము వర్ణనీయమనుచు న్భావింతు మౌనీశ్వరా. 81

క. అనిపల్కి యూరకుండిన
జనపతితో నధికవినయసంయుక్తునితో
మునిపతి సంప్రీతుండై
యనియెం దన్మనమునందు హర్షంబొదవన్, 82

చ. తగునిటు లెస్సనీకు దృఢధన్వమహీపతివర్య! చింతతోఁ
బొగిలెడిరీతి నీమొగముపోఁబడి చెప్పకచెప్పె,దానికిం
దగుకతమున్ వచింపుము నితాంతముగా; నటుగామి నంతగా
నగుకరణిన్ వచించెడిస్పృహం గొనితేని వచింపు మాక్రియన్ 83

వ. అనిన రాజిట్లనియె. 84

మ. భవదీయోద్యదనుగ్రహంబునఁ గడున్ వర్తించె నాకెప్పుడున్
దివిషన్నాథసుఖంబు,లైన నొకసందేహంబు నాచిత్తమం
దు విశేషంబుగ బాధఁగూర్చెడిని ప్రోద్యుర్వ్యాత సందేహముం
గవిచూడామణి! మానినాయక! తొలంగంబెట్టుమీ! వేగమే. 85

సీ. ఒకనాఁడు వేటాడ నుత్సాహినై నేను
విపినంబునకు నేగి వెట్టడస్సి
దగఁగొని కాసారముఁగని ప్రపీతోద
కుండనై శ్రమఁబాపి కొనఁగ నెంచి
తీరస్థవటవృక్ష భూరిశాఖలనీడ
యందునాసీనుఁడనై వసింప
నచ్చోటి కొకయద్భుతాకారమగు కీర
మరుదెంచి మానిపై నధివసించె

గీ. దానిసోయగమును మఱిదానినడలు
ఘనతరామోదమున నేను గాంచుచుండ
నంతలోనాకునభిముఖమై వసించి
పద్దెమొక్కండు పఠియించె నద్ది, యిట్లు 86

క. విరివిగఁ బరమసుఖంబులు
వఱలుచు నున్నవియటంచు వసుధాధీశా!
మురియఁగనేటికిఁ? దత్వం
బరయకయుండినను పాప మందంగలవే? 87

వ. అని యివ్విధంబున 88

చ. చిలుక వచించుపల్కులకుఁ జిందఱవందఱ నొందినాఁడన
ప్పలుకులలో గభీరమగుభావమదేదియొ నాకెఱుంగఁగా
వలనుపడంగలే దిదియె వాస్తవమైన మదీయసంశయా
విలత,మునీంద్ర! దీనిని నివృత్తియొనర్చి యనుగ్రహింపవే. 89

చ. మఱియుఁదురంగమంబులును మత్తకరుల్ రథపత్తిసంచయ
స్ఫురదురురాజ్యభోగములు శూరవరేణ్యులు నల్వురాత్మజుల్
పరమపతివ్రతామణియు భార్య; సుశీల తనూజ, యెప్పుడున్
గరమును నెట్టిపుణ్యమునఁ గల్గెను నాకు, నెఱుంగఁజెప్పవే 90

మ. అనిపల్కన్ నృపుఁడామునీశ్వరుఁడు ప్రాణాయామసంయుక్తుఁడై
మనమున్ నిల్పి కడుం గరామలకసామ్యంబొప్పఁగా భూతభ
వ్యనిరూఢుల్ దగువర్తమానమును దివ్యంబైనదృష్టిం గనుం
గొని సర్వంబును నిశ్చయించి పలికెన్ క్షోణీశుతోనిట్టులన్. 91

### — { దృఢధన్వుని పూర్వజన్మవృత్తాంతంబు వాల్మీకి సెప్పుట. } —

ఉ. తావకపూర్వజన్మచరితంబు సమగ్రముగా వచింతునో
భూవర! యాలకింపఁదగుఁ బూర్వమునందు సుదేవనామభూ
దేవుఁ డొకండు తా ద్రవిడదేశమునందునఁ దామ్రపర్ణికా
శైవలినీప్రతీరమున సాధుజనస్తుతసచ్చరిత్రుఁడై 92

చ. తనరుచు సత్యవాదియయి ధర్మపరుండయి వేదశాస్త్రముల్
ఘనముగ నేర్చి యాగము లఖండముగానొనరించి విష్ణుమూ
ర్తిని బరితోషితున్ సలిపి తీవ్రతరంబగు భక్తితోడుతన్;
దనకులభించు విత్తమునఁ దద్దయునుం బరితృప్తిఁగాంచెడిన్ 93

గీ. అనవరత మిట్లువసియించు నాద్విజునకు
గౌతమియనంగఁ బరఁగిన గౌతమసుత
భార్యయై శంకరున కలపార్వతివలె
వితతశుశ్రూష సల్పు సంతతము భక్తి. 94

వ. ఇట్లు ధర్మంబుదప్పక గృహమేధవిధియందున్న యాగృహమేధికిఁ జిరకాలంబు గడచెంగాని సంతానంబుమాత్రం బతండు వడయకుండుటం జేసి. 95

క. ఆసనమున నొకదినమున
నాసీనుండై ప్రియాంగనాసేవితుఁడై
భూసురుఁ డాత్మ విషణ్ణుం
డై సతికిట్లనియె గద్గదాక్షరములతోన్ 96

ఉ. చానరో! పుత్రసంతతి యొసంగుటకంటెను వేఱు సంసృతిం
గానఁగరావు సౌఖ్యము లిఁకం బరలోకమునన్ మహాతపో
దానసముద్భవోరుసుకృతంబు సుఖం బిడునంద్రు సత్సుతుం
డేని సమస్తసౌఖ్యముల నిచ్చట నచ్చటఁ గూర్పఁ జాలెడున్ 97

సీ. బ్రహ్మచర్యంబునం బరియించి విద్యల
మునుల యప్పును దీర్చుకొనినవాఁడ
సన్నుతంబుగఁ బెక్కుజన్నముల్ రచియించి
త్రిదశుల ఋణమెల్లఁ దీర్చినాఁడ
తనయుఁ డొక్కండు లేమిని బితౄణం బిఁక
నొండు దీర్పఁగలేకయున్నవాఁడ
నాకారణంబుచే నందక సత్పుత్రుఁ,
బ్రదుకుట మనకు నిష్ఫలము సుమ్ము

గీ. పుత్రసంతతి వేదార్థబోధితంబుఁ
జెల్వమీఱఁగ డగ్గఱఁజేరికౌఁగి
లించి ముద్దాడి పులకించి చుంచు దువ్వి
కౌతుకంబందుభాగ్యంబు గలుగదయ్యె. 98

ఉ. బాలునకున్ వివాహమును బంధుగులెల్లరు సంతసింప ను
ద్వేలముగా; నొనర్చి సరవిన్ నిజసంస్కృతిభారమంతయున్
బోలఁగఁదాల్చియాతఁడు సుపుత్రులఁ గాంచుచునుండఁ,జూచుచుం
గాలము హాయిగాఁ గడపఁగాఁబర మేష్ఠి లిఖింపఁడాయెఁగా. 99

క. వృథగాఁగడచెను కాలం
బధముఁడ నై యుండవలసె; నసువులు మేనన్
గ్రథియింపనొల్ల నింకన్
వ్యథబాయఁగ మృతినిజెందు టర్హమునాకున్. 100

మ. చతురుండయ్యును భర్త యిట్లు సుతవాంఛాపారవశ్యంబునన్
బ్రతుకే వ్యర్థమటంచు నెంచి తుదకుం బ్రాణమ్ములం బాయ స
మ్మతిగైకొన్న నిజాధినాథుఁ గని సమ్యగ్వాక్యచాతుర్య; సం
చితపాండిత్యవిశేష, గౌతమివచించెన్ ఖిన్నచిత్తమ్మునన్. 101

శా. ప్రాణేశా! యిటు నీవు ప్రాకృతజనప్రాయుండవై తుచ్ఛవా
క్శ్రేణిం బల్కఁగఁ జెల్లునే? ఘనమనీషిస్తోమదీవ్యచ్ఛిరో
మాణిక్యాయితపాదపద్ముఁడవు శ్రీమద్దైవభక్తుండ వీ
రాణంబాసినపద్ధతిన్ విడువు;మార్యా! మోహముంబాయుమా 102

గీ. సత్యధర్మపరుండవు స్తుత్యమతివి
జ్ఞానసంపన్నుఁడవుఁ గడుస్వర్గసుఖము
స్థిరముఁగాదని నీచేఁద్యజింపఁబడియెఁ
గానఁబుత్రునివలన సుఖంబుగలదె? 103

ఆ. వె. చిత్రకేతునృపతి పుత్రశోకంబునఁ
దప్తుఁడగుచు మున్ను తాపసులగు
నారదాంగిరసుల భూరితత్త్వప్రబో
ధనముచేఁ దరించె ననఁగ వినవె? 104

క. అంగపతి వేనుఁడనుపు
త్రుంగాంచి యతండు మిగుల దుష్టుఁడగుటఁ ద
త్సంగతి మాని నిశీథము
నం గడుకొని యేగెఁ గాననంబున కనఘా. 105

క. అటులే సంతానం బడి
పటుదుఃఖము నిడఁగఁజాలుఁ బ్రాణేశ్వర! నీ
క; టులైనను సత్పుత్ర
స్ఫుటలాలస యున్న విష్ణుపూజ సలుపుమీ. 106

ఉ. మున్నలకర్దముండు పరముం సకలార్థదు లోకనాయకుం
సన్నుతు శ్రీహరిం గొలిచి శాంతమతిం గపిలాఖ్యు యోగసం
పన్నుఁ గుమారుఁగాఁ బడయుభాగ్యముఁ జెందినయట్లు విష్ణువుం
బన్నుగ నీవునుం గొలిచి భావితకార్యము నిర్వహింపుమీ. 107

ఉ. ఆరహి ధర్మపత్ని పలుకాడినవాక్కులు విప్రశేఖరుం
డారసి నిశ్చయించి పరమాదరమొప్పఁగ భార్యతోడ సం
సారజసర్వకిల్బిషవిసర్పణదారము తామ్రపర్ణికా
తీరముఁజేరిస్నాతుఁడయి తీవ్రముగాఁ దపమాచరించుచుం. 108

ఉ అండజయాన తెచ్చియిడ నైమదినంబులకొక్కనాఁడు తా
నొండినయాకులం దినుచు నించుకనీరము గ్రోలుచుం ద్విజో
త్తండనుఁడైన యాద్విజుఁడు నాలుగువేలగువర్షముల్ సము
ద్దండవిధంబునం గడపఁ దల్లడమందెను మూఁడులోకముల్ 109

వ. ఇట్లు సుదేవుండు శ్రీహరింగూర్చి తపంబొనర్చుచుండ 110

—(విష్ణుమూర్తి సుదేవునకుఁ బ్రత్యక్షమగుట)—

శా. తత్తాదృక్షముదాత్తతత్తపము హత్తం జిత్తమందత్తఱిం
మెత్తంబాటి జనార్దనుం డపుడు ప్రోన్మీలదర్పియంబొప్పఁగా
నుత్తుంగాండజరాజపృష్ఠగతుఁడై యుర్వీసురాగ్రస్థలిన్
జొత్తెంచెం నిజభక్తవత్సలత యక్షుద్రింబుఁగాఁ దోఁపఁగం 111

సీ. అభినవజలధరశ్యామగాత్రమున భూ
షణరాజికాంతిచంచలలు మెఱయ
ఘనకటిదేశసంఘటితపీతాంబర
మర్మరధ్వనులు సమ్మదముఁగొలుప
రమణీయశంఖచక్రగదాంబుజంబులు
కరచతుష్టయమునం గడలుకొనఁగ
దరహాసచంద్రికాస్ఫురణనాశామోషి
దాస్యసౌగంధికాహ్లాద మొదవ
గీ. జీవ్వనర్ణ ప్రావాలు గరుఁడుని ఱెక్కదోయి
వెడలు గాడ్పులు రజమును వెడలఁజేయఁ
దమము హరియించి సత్వంబుఁ దార్చు విష్ణు
దేవుఁ డావిర్భవించె సుదేవు నెదుట. 112

క. ఆవిర్భవించు నచ్యుతు
శ్రీవనితాప్రాణనాథు శ్రితజనరక్షా
ప్రావీణ్యశోభితుం గని
కావించెన్ వందనంబు క్ష్మాసురుఁ డెలమిన్. 113

వ. అని మఱియు నారాయణర్షి నారదున కిట్లనియె. 114

క. కంజదళాక్షుని కలుషవి
భంజనశీలుని ద్విజుండు బహుభక్తి నిబ
ద్ధాంజలియై గద్గదికన్
మంజులవాక్యముల నిట్లు మఱిమఱిపొగడెన్. 115

పంచచామరము. నమస్కృతిన్ రచించెదన్ సనాతనాధునాతన
భ్రమప్రమాదవారణా! శుభప్రదా! బహుప్రదా
సమానహీన! సర్వలోకసాధ్వసాపనోదనా,
క్షమారమామనోహరా! విషణ్ణరక్షణా! హరీ! 116

క. పరమేశ్వర! శరణాగత
పరిపాల! ప్రపన్నలోక భయభంజన! నీ

చరణాంబుజములకు నమ
స్కరణంబు లొనర్చెదన్ జగజ్జనవంద్యా 117

సీ. నీభీతిచేఁగదా నిత్యంబు వాతంబు
వీచుచుం జగములం బ్రోచుచుండు
నీభీతిచేఁగదా నిరతంబు భాస్కరుం
డుదయించి లోకముల్ పొదలఁ జేయు
నీభీతిఁగాదె? యగ్నియు సదాభువనముల్
ప్రజ్వలించుచును గాపాడుచుండు
నీభయంబునఁగదా నియతి నింద్రుఁడు, మృత్యు
వాత్మీయకార్యంబు లాచరింత్రు

గీ. వారు స్వయముగ నీశ్వరత్వంబుఁ గనియు
రాజవరునకు భృత్యసమాజమట్లు
నీకు లోఁబడి రఖిలలోకైకనాథ
తాదృశుని నిన్ను నెన్నంగఁ దరమె? నాకు. 118

క. జయదా! జయస్వరూపా
జయకారణ! జయనశీల! జయవిజయవిభూ
జయభీమ! విజయ! జయదా
జయనాథ! జయేశవినుత! జగదవన! హరీ. 119

క. విశ్వకర! విశ్వకారణ
విశ్వావన! విశ్వనిలయ! విశ్వేశ! హరీ!
విశ్వహర! విశ్వపంజర!
విశ్వసృడాద్యమరవినుత! విమలచరిత్రా. 120

క. ఫలబీజము ఫలమూలము
ఫలనిచయాధారమగుచుఁ బరఁగెదుదేవా!
ఫలముల నొసంగుటన నీ
కలఘుగుణా! లఘువుగాక యలఘువె?తలఁపన్.121

క. తేజస్స్వరూపు సమధిక
తేజోదాయకు నశేషతేజోరాజి
భ్రాజిష్ణు విష్ణుఁ గృష్ణుఁ బ్ర
యోజితదయు నిన్ను నెంతు నుద్యద్భక్తిన్. 122

మణిగణనికరము. నిను నజహరముఖనిపుణవిబుధులున్
ఘననుతు లొనరుపఁగను దగ రనుచున్
వినియెద; జడునకు వికలమతికి నా
కనఁగ మనుజునకు నగునె? పొగడఁగన్. 123

ఉత్సాహ. దేవదేవదేవ! వాసుదేవ! సర్వదేవ! నీ
పావనప్రసిద్ధపాదపద్మశరణ మొందితిన్
గావ కింకఁ దప్పదయ్య! కరుణ దీనవత్సలా!
యీవ యిట్లు మిన్నకున్న నెవరు దిక్కు నాకికన్ 124

క. గురుతరదుఃఖిని దీనుని
ద్వరఁ గావ కుపేక్ష సేయఁ దగునే? నీకున్
వరలోకబంధుబిరుదము
హరి!నీ కేరీతి రిత్తయగునో తెలుపుమా. 125

వ. అంత వాల్మీకిమహర్షి దృఢధనువ్వనితో నిట్లనియె. 126

సీ. ఇట్లు నుతియించి ద్విజుఁడు భూయిష్ఠముగను
శ్రీహరిసమీపమందు వసించినంత
హరి తదీయస్తవంబెల్ల నాలకించి
జలదసంరావవాక్కులఁ బలికెనిట్లు. 127

మ. తపమున్ లెస్సగ నాచరించితివి వత్సా! సంతసంబందితిం
గృప నీపై జనియించె నాకు నిఁక నీయిష్టంబు శీఘ్రంబుగాఁ
జెపుమా! దానినొసంగువాఁడ నిటు లక్షీణప్రకారంబుగాఁ
దపముం జేసినవారి నెవ్వరిని సందర్శింపలే దెచ్చటన్. 128

వ. అనిన సుదేవుం డిట్లనియె. 129

గీ. దీనబాంధవ! కరుణానిధీ! ముకుంద!
వేణుగానప్రసిద్ధ! పురాణపురుష!
ప్రీతిగలదేని నాపయిఁజేతమలర
నాకు సత్పుత్రు నొసఁగుమీ లోకవంద్య! 130

శా. సంకల్పంబు ఘటించుటే సుఖము, తత్సంకల్పవిఘ్నంబె దుః
ఖాంకం, బింకవచింపనేటికి? రమేశా! పెక్కుపల్కుల్; నిరా
తంకం బొప్ప ఘటింపఁజేసి వెస మత్సంకల్పితార్థంబు, నా
వంకన్ నీకరుణావలోకనసుధన్ వర్షింపు మింపారఁగన్ 131

క. ఉదయింపమి సుతుఁడు దయా
ర్ద్రహృద! గదసహజాత! శూన్య మగుగార్హస్థ్యం
బది మది రుచింపదన న
య్యది విని హరి వలికె భూసురాగ్రణితోడన్ 132

చ. తనయుఁడు దక్క నీకువసుధామర! యెట్టియొసంగ రాని దై
నను సమకూర్తు వాంఛిత మనశ్వరమై తగులీల; నెంతయున్
గనుఁగొన నీదుఫాలఫలకంబున నున్న సమస్తవర్ణముల్;
పనుపడ సప్తజన్మముల బమ్మ లిఖింపఁడు పుత్రసౌఖ్యమున్ 123

వ, అనిపలికిన 134

చ. కొడుకు నొసంగునంచుఁ దనకుం బరమాత్ముఁడు; బిట్టుకోర్కి మై
నడరుచు బ్రాహ్మణుండు తుద కాతతవజ్రనిఘాతతుల్యమై
వెడలిన తద్వచస్సువిని వెంటనె గొడ్డటఁద్రుంచుమ్రానునాఁ
బుడమిని ద్రెళ్ళినన్ సుదతి పొంపిరివోయినదుఃఖ మేర్పడన్. 135

క. పతితున్ గతసుతసంస్పృహుఁ
బతిఁ గని కన్నీరు విడిచి భావమునం ద
త్సతి ధైర్యమూఁది పిదపం
బతితపతికి నిట్టులనియె వసుధాధీశా 136

ఉ. లెమ్ము మనోధవా! యిటు లలిందొలఁగం బనియేమి? నాదువా
క్యమ్ములు సంస్మరింపు మలయబ్జసముద్భవుఁ డెట్టుఫాలమ

ధ్యమ్మున వ్రాసె నట్లగు సుఖాసుఖముల్; నరుఁడెందు స్వీయక
ర్మమ్ము భుజించుచుండును, రమాధవుఁడందున కేమొనర్చెడిన్ 137

గీ. మఱియు దైవానుకూల్యంబు పొరయనట్టి
భాగ్యహీనుని యత్నంబు భ్రష్టమగును
చావసంసిద్ధమైనట్టి జనున కెన్ని
మందు లొసఁగిన వైయర్థ్య మందకున్నె? 139

చ. క్రతువులకంటె దానములకంటెఁ దపంబులకంటె సత్యసు
వ్రతములకంటె విష్ణుపదవారిజ సేవన ముత్తమంబనన్
శ్రుతిగల; దంతకంటె ములుసూపెడు దైవబలంబు, గాన నో
క్షితిసుర! నమ్మకమ్మునుద్యజించి సమస్తమునందు; లెమ్మఁకన్ 139

క. దైవము నవలంబింపం
గావలె హరివలననేమిగల దుపయోగం
బీ వికఁ జింతింపకుమీ
కావలసినయర్థ మెదియొ కాకవిడుచునే? 140

వ; అని పలికిన 141

క. గురుశోకసహితబాడబ
తరుణీమణివాక్యములను తార్క్ష్యుఁడు విని దు
ర్భరసంక్షోభసముద్భవ
పరివేపథుఁడగుచుఁ బలికెఁ బద్మాక్షునితోన్ 142

సీ. పావనపాదరాజీవసేవకదీన
సారంగనూతనవారివాహ!
సంతతధ్యానసంసక్తభక్తాభీల
తూలసంచయసముద్వేలపవన!
సారపూరితనామపారాయణాదర
జనతమస్సముదాయవనజమిత్ర!
ప్రవిమలసత్కథాశ్రవణప్రవణచిత్త
వృజినమహాటవీవీతిహోత్ర

గీ. శోకసాగరమగ్నయై వీఁకఁదొఱఁగు
బ్రాహ్మణిని, శోకనిర్గళద్బాష్పుఁడైన
బ్రాహ్మణు, నుపేక్షసేసి కృపాసముద్ర!
యిపుడు నీదయ యెందేగ? నెఱుఁగఁ జెపుమ 143

గీ. అకట! బ్రహ్మణ్యదేవుఁడవైన నీకు
ధర్మశీలతయిపు డెందుఁ దరలిచనియె
భక్తుల చతుర్విధంబగు ముక్తి నీకు
కరగతంబయి యుండదే? కమలనాభ. 144

క. ఇత్తెఱఁగున నున్నను న
త్యుత్తమమగుబత్తిఁజిత్తమొందమి నకటా
ముత్తికి నాసింపరు పురు
షోత్తమ! మునిసత్తమస్తుతోత్తమచరణా! 145

మ. హరి! నీముంగల నుండుఁ గింకరులుగా నయ్యష్టసిద్ధుల్ పరా
త్పర! యొందుర్ భవదీయపూజనమహత్వంబుం బ్రసిద్ధం,బిఁకన్
బరికింపన్ ద్విజవాంఛితార్థమును దీర్పన్ నీకు భారంబొకో
కరి నర్పించెడివాని కంకుశ మొసంగం గష్టమై తోఁచునే? 146

చ. స్థిరముగఁ బూరుషావళి కదృష్టగతంబె ఫలించునేని నీ
చరణసరోజసేవనము సల్పఁగ నింక నెవండు గోరెడిన్?
ధరణితలంబునందుఁ బ్రథితంబగు నియ్యది, నీదు భక్తియున్
హరువు దొఱంగి తా విలయ మందునుగాదె జగంబునన్ హరీ! 147

క. ఏయదియేనియు నీకున్
జేయఁగ జేయమికి వేఱుసేయుట కేనిన్
బాయని సామర్థ్యం బద
వీయం బై యుండునంచు విశ్రుతముగదా. 148

క. ఏతాదృశ సామర్థ్యం
బితటి గతియించె నంచు నెంతురు నాథా!

యీతనికిఁబుత్రిదానము
చేతోమోదంబెలర్పఁ జేయవయేనిన్. 149

స్రగ్విణి. కావునన్ మాధవా! కర్మవాదంబులన్
నీవు గావింప కీనెంజిలిం జెందుభూ
దేవుఁ డెంతేని మోదిల్లఁగాఁబుత్రకున్
దావకాంచద్దయన్ దప్పకర్పింపుమా. 150

ఉ. తాపము పాప మేదఁగ సుదాముఁడు నీపరిచర్యసేసి యు
ద్దీపితవైభవంబు భవదీయకృపం గొనలేదె? తొల్లి సాం
దీపనియున్ మృతాత్మజుని దెమ్మనఁగాలుని బ్రోలికేగి యా
పాపనిదెచ్చి యిచ్చి గురుభద్రముఁగూర్పవె? నేర్పుమీరఁగన్ 151

వ. కావున నీదంపతులును బుత్రలాలసులై నీశరణంబుఁజొచ్చి
రని గరుత్మంతుండు చెప్పెనని వెండియు నారాయణర్షి యిట్లనియె.

చ. గరుడుని మాటలన్ విని జగత్పతి శ్రీహరి యిట్లు వల్కె నా
దరమెసఁగన్ సుధామధురధారలతో నెనమైనవాక్కులన్,
వరసుతు నొక్కనిన్ విహగవల్లభ యీద్విజచిత్తసంస్థితుం
ద్వరితము నీవొసంగుము ముదంబునుజెందఁగ విప్రదంపతుల్. 153

మ. తనవాదంబున కానుకూల్యముగ నాదైత్యారి భాషించినన్
వినతానందనుఁ డెంతయే నడరి తద్విప్రాగ్రయాయిప్రమో
దనమై పర్వఁగ నొక్కపుత్రకుని సౌందర్యాదిసంయుక్తు నీ
కనురూపుండగువాని నిచ్చితిని నే నంచున్ వచించెన్ ద్విజున్ 154

వ. అంత శ్రీనారాయణర్షి యిట్లనియె 155

క. వినుమీ నారద! వాల్మీకి
ముని యాదృఢధన్వనామ భూమీశునకున్
వినిపించిన చరితంబును
వినిచెద నత్యద్భుతంబు వీనులలరఁగన్ 156

వ. అంత వాల్మీకి యిట్లనియె. 157

క. నాపలుకులు దృఢధన్వమ
హీపాలా! వినుము విష్కరేశ్వరుఁ డాల
క్ష్మీపత్యాదేశంబున
నీపగిదిం బలికె భూసురేంద్రునితోడన్. 158

చ. అరయఁగ సప్తజన్మములయందున, నీకుఁ దనూజసౌఖ్యమే
పొరయదటంచుఁదెల్పె హరి; భూసుర! నిక్కువ మద్దియైననుం;
గరుణను నాకు నాజ్ఞయిడఁగాఁ బరమేశ్వరుఁ, డొక్కపుత్రకున్
హరువుగలట్టివానిని మదంశసముద్భవు నిప్పుడిచ్చితిన్ 159

గీ. బాడబోత్తమ గౌతమితోడఁగూడి
సరగ సత్యంబులైన యాశాసనములు
పొందఁగల్గెద; వైనను జెందుమీఁకుఁ
దజ్జనితమైనదుఃఖంబు తప్పకుండ 160

మ. దొరలెం దావకమానసంబు ద్విజశార్దూలా! రమానాథుశ్రీ
చరణాంభోజములందు; ధన్యుఁడవుసూ చర్చింపఁగా నెందు, ము
మ్మరమౌశ్రీహరిభక్తి యయ్యది సకామంబేని నిష్కామమే
హరిచేతస్సరసీరుహంబునకు మిత్రాకారమైయొప్పెడిన్ 161

గీ. పురుషదేహంబు నీటిపై బుగ్గవోలె
క్షణమున నశించు, ధన్యుఁడౌ జనుఁడుదాని
నొంది మనమందు నెప్పుడానందమొదవ
శ్రీహరిపదాంబుజంబులఁ జింతసేయు 162

చ. సమధికదుస్తరం బయిన సంసృతిసాగర మీఁదుపొంటె ను
త్తమహరిపాదసేవనము దక్క మఱొక్కటి లేదుపాయ మా
కమలమనోజ్ఞనేత్రు దయ కల్మిని గాదె భవన్మనంబుతో
షముగనఁ బుత్రు నొక్కని నొసంగఁగఁజాలితి నీకు నేనిటన్ 163

ఉ. మానసమందు నెప్పుడు ప్రమాదములేక రమామనోహరుణ్
బూని సుఖం బెలర్ప ద్విజపుంగవ! నీవు చరింపుమయ్య యీ
మేను తిరంబటంచనక మేకొను సంసృతిభారమం దుదా
సీనత నుండి భోగములఁ జెందుము దానను సేమమయ్యెడుణ్. 164

వ. అంత వాల్మీకి యిట్లనియె. 165

గీ. అచ్యుతుండి ట్లనుత్తమమైన వరము
నొసఁగి ద్విజదంపతులు సూచుచుండ నపుడు
గరుడసంస్థితుఁడగుచు శీఘ్రంబుదనరఁ
దనదు ధామంబునకు నేగె ధారుణీంద్ర. 166

క. మనమున నెంచిన వరముం
గొనినసుదేవుండు భార్యఁగూడి చని గృహం
బునకుణ్, గార్హస్థ్యసుఖం
బునఁ బెనఁగొనియుండె నధికమోదం బడరణ్. 167

చ. కడచినఁ గొంతకాల మిటు,గౌతమి గర్భముదాల్చె నాసుదే
వుఁడు గడుసంతసంపడఁగఁ బూరితిసెందెఁ దదీయగర్భ; మ
ప్పుడు దశమంపుమాసమునఁ బుత్త్రిఁ డనుత్తముఁ డుద్భవించెబా
లుఁడు విని మేదినీసురపురోగములం బిలిపించి స్నాతుఁడై 168

గీ. జాతకర్మం బొనర్చి, ప్రశస్తముగను
దానములొసల్పి, పిదప నాదారకునకు
నామకరణం బొనర్చె నిష్ణాతుఁడగుచు
బంధుమిత్రద్విజోత్తమపంక్తితోఁ గూడి. 169

చ. పరమదయాన్వితుండగు సుపర్ణుఁడు పేర్మి ననుగ్రహించె ని
వ్వరతనయుణ్, శరత్కుముదబాంధవభాసురతేజుఁడై పరా
శరమునినాథపౌత్రకుని జాడ వెలింగెడి వీఁడు, వీనిక
త్తెఱఁగును బట్టిచూడ శుకదేవసమాఖ్యయె పొల్చునంచిడెణ్ 170

సీ. బాలుఁ డెంతయు శుక్లపక్షచంద్రునిభాతి
జనకమనోరథచయముతోడఁ

దల్లి కానందసంధాయకుండయి వృద్ధి
నందె శీఘ్రంబుగా, నపుడు తండ్రి
నందనునకు నుపనయనంబుఁ గావించి
సావిత్రినిడెఁ గడు సంతసమున
వైదికసంస్కార మూఁది మాణవకుండు
బ్రహ్మచర్యవ్రతవర్తి యగుచుఁ

గీ. దన్మహాతేజమున నన్యతరణియయ్యె
వేదశాస్త్రంబులెల్లను వినినమాత్ర
బుద్ధిసాగరుఁడగుట సద్బుద్ధితోడ
గురునకు ముదంబుగా నేర్చికొనియె భూప 171

వ. అంత నొక్కనాఁడు. 172

ఉ. పావనకోటిసూర్యసమభాసురతేజము సర్వదిక్కులన్
దేవలమౌని, యింటికరుదేర సుదేవుఁడు భక్తిమ్రొక్కి సం
భావనతోడ నర్ఘ్యమును బాద్యము నాసనముల్ ఘటింప నా
దైవతదర్శనుండు పరిమదంబును జెంది సుఖోపవిష్టుఁడై. 173

మ. చరణాబ్జంబుల మ్రోలఁ జాఁగిలి నమస్కారంబు గావించుభూ
సురపుత్రుంగని దేవలుండనియె నోక్షోణీసురాగ్రేసరా
హరి నీసల్పుతపంబు మెచ్చి యిడెఁ దార్క్ష్యారూఢుఁడై వచ్చి సుం
దరరూపుల్ బహుదుర్లభుల్ వరసుతుల్ ధన్యుండవీవెంతయున్ 174

క. ఇట్టికుమారకుఁ డేరికి
నెట్టియెడం బుట్టలే దహీనగుణాఢ్యుం;
డుట్టిపడుచుండె వినయం
బిట్టిట్టనరాని మోద మిడు వీనినుడుల్. 175

వ. అని బుద్ధిమంతుండును వేదాధ్యయనశీలుండును వాగ్మియు
నైన యక్కుమారుఁ జేరంజీరి కౌతుకకరంబగు నీకరంబుఁజూత మిటు
తెమ్మని గైకొని యాక్షించి సుదేవునితో దేవలుండిట్లనియె. 176

సీ. ఛత్రచామరసరోజాతయవాఖ్య రే
ఖలు పాణితలమునఁ బొలుచువాఁడు
ఆజానులంబంబులై హస్తిహస్తతు
ల్యంబైన హస్తయుగ్మంబు వాఁడు
ఆకర్ణచరమదేశాయతమధుపింజ
రములైన భవ్యనేత్రముల వాఁడు
వర్తులరమణీయమూర్తి వాఁ డురువళి
త్రయముచే నొప్పు మధ్యమ్ము వాఁడు
గీ. గూఢజత్రుండు తుంగవక్షుండు కంబు
కంఠుఁడు సమానకర్ణుండు ఘనవృషాంస
కుండు సుస్నిగ్ధకుంచితకుండలుండు
నఖిలలక్షణయుతుఁడు త్వదాత్మజుండు 177

వ. మఱియునితండు మహాభాగ్యనిధియయ్యెడునని హస్తంబె
ల్లెడఁజక్కంబరికించి. 178

ఉ. దోస మొకండు మాత్ర మతిదుస్త్యజమై గుణరాశినాశియై
గాసిఘటించు వీనికని కంపితమస్తకుఁడై సుదీర్ఘని
శ్వాసము వుచ్చిపల్కె మునివర్యుఁడు; ముందుగ నాయురున్నతిన్
వాసిగ గుర్తెఱింగి యటుపైఁ బలుకందగు, లక్షణంబులన్ 179

ఉ. ఆయువు లేనివానికి మహార్హగుణంబులచేత నేమియా
దాయమగున్? సుదేవ!విను ద్వాదశహాయనమందు వీఁడుపా
సీయమునన్ మృతుండగు, మనీషివి గావున నీవు దానికై
హేయపుదుఃఖమందక సహింపుము భావ్యము కాకమానునే?180

వ. మఱియు మరణోన్ముఖున కౌషధంబులువోలె నందులకుఁ
బ్రతివిధానంబు లేదు. 181

శా. కష్టంబుల్ సుఖముల్ ప్రతిక్షణమునం గర్మానుసారంబుగా
సృష్టింపంబడు; శోకగర్వము లెదం జేకూర్పఁగాఁ బోక సం

తుష్టస్వాంతమునం బరాత్పరు జగద్యోనిన్ రమేశున్ దయా
దృష్టిప్రాపకుఁ గొల్చి సంతతము; ముక్తింజెందు టర్హంబగున్ 182

గీ. పలికి దేవలుఁడీరీతి, బ్రహ్మలోక
మునకుఁ జనిన సుదేవుఁడు వనితతోడఁ
బిడు గడఁచినట్లు పుడమిపైఁ బడిచిరంబు
విలపనముసేసె దేవలుపలుకుఁ దలఁచి. 183

క. పిదపం గౌతమి ధైర్యము
మదిఁ గొంతధరించి యాకుమారకు బ్రేమం
బొదవ నిజాంకంబుననిడి
వదనము ముద్దాడి పలికె వల్లభుతోడన్ 184

క. కాఁదగు నర్థంబునకై
వేఁదుఱులై యిట్లుమనము వెఱచఱచినచో
నేదేని ఫలముగలుగునె?
నీవు మనంబునఁ దలంపు, నిఖిలార్థజ్ఞా 185

క. కానిది యెన్నండేనియుఁ
గానోపదు, కాఁగలట్టికార్యము తలఁపం
గా నెన్నటికేనియు నది
మానక కానోపు నెంతమానిసికేనిన్ 186

సీ. కలిరాజు పీడింప నలరాజు కీడొంది
యడవిలో నిడుమలం గుడువలేదె?
సీతావియోగంబుచేత శ్రీరాముఁడు
పెక్కుబన్నములందుఁ జిక్కుకొనఁడె?
దాయాదు లోడింప మాయాదురోదరం
బున ధర్మజుఁడు దుఃఖమును గొనండె?
బలిదానవేశ్వరుం డలదానవారిచే
తను బద్ధుఁడై రసాతలముఁ జొరఁడె?

గీ. శమ్ముగల యాదవులు వినాశమ్ముగనరె?
గోత్రరిపుచేతఁ జావఁడే? వృత్రదనుజుఁ
డాహిరణ్యాక్షుఁడీల్గఁడే? సాహసించి,
కార్తవీర్యుండు మడియఁడే? ధూర్తుఁడయ్యు 187

వ. మఱియుఁ జతుష్పాదుండును వింశతిభుజుండును దశవదనుండును మహాపరాక్రమశాలియు నగు రావణుండు శిరశ్ఛేదంబుఁ గాంచె రాజర్షియగు. పరీక్షిత్తు బ్రాహ్మణశాపంబున మృతుండయ్యె నీక్రమంబున భావ్యంబులైన యర్థంబు, లైతీరుంగాదె. 188

గీ. కావునను లెమ్ము శీఘ్రమెమ్మొ జీవితేశ
శౌరి శరణ్యు సనాతను నఖిలజీవ
కోటినిర్వాణపదదాయకుని భజింపు
మతఁడె మనదుఃఖమునుదీర్చునట్టిఘనుఁడు 189

కవి. అని వనితామణి యాడినవాక్యములాదటఁగైకొని యాద్విజుఁడా
త్మను ధృతిఁదాలిచి మానిజనస్తుతు మాధవుభూధవు మంజుదళ
ద్వనరుహనేత్రు శివంకరు మానస వారిజమం దిడి వాంఛమెయిన్
దనయుని వలనను దార్కొనఁబోవువ్యథన్ విడిచెన్వసుధారమణా

వ. అంత నారదుండు నారాయణర్షితో నిట్లనియె. 191

గీ. అవ్వలఁ బ్రబుద్ధుఁడైన ధరాధినాథు
చరిత మేరీతివర్తించె సొరిది నాకు
నద్ది మెఱిఁగింపుమయ్య! దయాసముద్ర!
శ్రోతృజనపాప ముడిపి సంశుద్ధిఁ గూర్చు 192

వ. అనిన నారాయణర్షి యిట్లనియె. 193

క. విని యారీతిగఁ దన ప్రా
క్తనచరితము మిగుల భీతికంపితుఁడగు రా
జును గని వాల్మీకిమహా
ముని మఱియు వచించెశ్రవణముల కభిరుచిగన్. 194

ఉ. తల్లడ మందుచున్న ద్విజ తల్లజుఁ డంగన పల్కినట్టి యా
చల్లని మాటలన్ విని ప్రశాంతహృదంతరుఁడై యనంతరం
బుల్లమునన్ రమాధవు ననుత్తము భక్తజనానురక్తు ను
త్ఫుల్లసరోజలోచను విభూషితవిగ్రహునిన్ ధరించుచున్ 195

శా. దీనాస్యుండయి దేవునిం దలఁచుచున్ దీర్ఘంబుగా నూర్చుచుం
గానీ! ధాత లిఖించువ్రాత యెపుడుం గాకుండునే? యంచు లో
లోనన్ నిశ్చయ మాచరించుకొని పూలుం బత్రి యిధ్మాదులుం
గానన్ దెచ్చుట కేగె, నివ్విధముగాఁ గాలంబు కొంతేగినన్. 196

క. కమలదళాక్షుని వరపద
కమలంబులఁ దలఁచికొనుచుఁ గానకు నొకనాఁ
డమలసుమఫలకుశంబులు
సమిధలు దేరఁగ సుదేవశర్మఁ డరిగినన్ 197

ఉ. ఆదినమందుఁ గుఱ్ఱఁడు శుకాఖ్యుఁడు నెయ్యురతోడఁ గూడి యా
మోదమెలర్ప డిగ్గియకుఁ బోయి జలంబుల డిగ్గి వారిపైఁ
బ్రోది సెలంగ నీరమును బుఱ్ఱటకొమ్ముల నెత్తి చిమ్ముచున్
మేదురఖేల గ్రీష్మమున మేకొని నవ్వుచు నివ్వటించుచున్. 198

సీ. ఆబాలకులు దనయందున సలిలంబుఁ
జిమ్మనగ్రోవులం జిమ్ముచుండ
నపుడు తా శుకదేవుఁ డుపమర్దితుండయి
యళుకున వడిఁ బలాయనము సేయఁ
దలఁచి యగాధపు సలిలంబునందున
విధిచోదనమున నూపిరిని బట్టి
సఖులనెల్లరను వంచనసేయఁగను మున్గి
సుడివడి కడు, బయల్పడఁగ లేక
గీ. బెడిదమగు డిగియ నుక్కిరిబిక్కిరవడి
పంచతనుజెందె; మగుడి వెల్వడని వాని

మడిసెనని యెంచి భీతులై మదిని; బాలు
రంద ఱింటికి; బఱచి హాహారవముల. 199

ఉ. ఆతతశోకపీడితహృదంతరులై సవయస్కబాలకుల్
గౌతమి కీయుదంతమును గ్రక్కునఁ జెల్పిన తీవ్రవజ్రసం
ఘాతనిఘోషభీషణముగా విని యాసతి హా యటంచు సం
పీతశుగార్త్రమై భువి లవిత్రనికృత్తలతాకృతింబడెన్. 200

వ. అంత నయ్యరణ్యంబున సుదేవుండు వలసిన సమిత్కుశపు
ష్పఫలంబులం గైకొని వచ్చుచు. 201

చ. అడవిని వీడి యింటిమొకమై చనుచుండఁ గుతూహలంబుచే
నెడమభుజంబు మాటి కదియేటికి నేఁ డదురంగఁ జొచ్చె నా
కడ లది యేమియయ్యెడినొ యంచు మనంబున సంశయించుచుం
జిడిముడిపాటుతోడ నిలుసేరి కనెం బడియున్న గౌతమిన్. 202

వ, కని యయ్యవసరంబున 203

చ. పుడమిని గౌఁగిలించుకొని పొల్పతి యేడ్వఁగ నేమిహేతువో
పడఁతి! వచింపు వేగ? మనబాలకుఁడేడి? యటంచు నాసుదే
వుఁడు తడఁబాటుమై నడుగ భూసురభామిని సూచి యింక నె
క్కడమనబాలుఁ, డమ్మునియఖండితవాక్కులు రిత్తవోవెనే?204

చ. అని యెలుఁగెత్తి యేడ్చుచు నిజాంగన; డిగ్గియలో సుతుండు డిం
దినవిధమున్ వచింపఁగ సుదేవుఁడు నిట్టకనిల్చినట్లె మే
దినిపయిఁ ద్రెళ్ళియెట్లొ సుదతీసహితంబుగ లేచి వాపికిం
జని, కని రిర్వు రయ్యెడల శంబరసంస్థితపుత్రదేహమున్. 205

వ. అంత సుదేవుండు దొట్రుపాటొదవ. 206

మ. అలలం దేలి చలించుచున్న మృతపుత్రాంగంబు నాడిగ్గిలో
పలికిం డిగ్గి తటంబు సేర్చి, ఘనశుక్పాథోధివీచీచయం
బులు తన్నుం గడు ముంప నంకతలముం బొందించి యాలింగనం
బొలయన్ మాటికిముద్దుగొంచు సుతుపైనుష్ణాశ్రువుల్ జార్చుచున్.

ఉ. అంకమునందునున్న సుతునాస్యముమాటికిఁజూచుచున్ నిరా
తంకముగాఁగనూర్చుచువిధాతలిఖించెనెయిట్లటంచుఁ గూ
లంకషదుఃఖమొప్పఁగవిలాపముభూసురుఁడాచరించెను
ట్టంకితగద్గదస్వరవిడంబితవిస్ఖలదక్షరంబులన్ 208

చ. పలుక వదేల? ముద్దొలుకు పల్కులు, చల్లని నీదుచూపులం
జిలుక వదేల? మాపయిని, జిన్నరిపొన్నరి యాటపాటలం
గులుక వదేల? నెచ్చెలులఁ గూడ వదేల? గురుండు వచ్చెనం
చులుక వదేల? పాఠముల నొప్పఁగఁ జెప్పవ దేల? బాలకా 209

సీ. కాశప్రసూననీకాశకేశులమైన
వృద్ధుల మము నాదరింపవేల?
అత్యంతవిశ్లథదంతదంతాస్యుల
నతిదుఃఖులను మమ్ము నరయవేల?
నయనంబు లిరులకు నయనంబులైనచీ
కుల మమ్ముఁ బేర్మిఁ గన్గొన వదేల?
శ్రవణముల్ గతరవప్రవణంబులైన యి
య్యనదల మమ్ముఁ జేకొన వదేల?

గీ. ప్రీతి దైవారఁజేతికి నూఁతకోల
వగుచు మముసాఁకి చివరకు నంత్యమఖము
నాచరించెద వనుకొంటి మదిసమస్త
మక్కటా! రిత్తవుచ్చి నీవరుగఁ దగునె? 210

మ. ఘనమైనట్టి తపంబు సేసి చిరమున్, గన్నట్టిసత్పుత్రకున్
నిను నేఁ జూచినయప్పుడెల్ల మది నెంతే సంతసం బంది యో
జనచే నెన్నియొ కట్టుచుండుదు నెదన్ సంకల్పసౌధంబులన్;
తనయా!యిత్తఱివాని నెల్ల మొదలంటంగూలఁగాఁద్రోచితే?211

ఉ. ఇంతగ నేడ్చుచున్న మము నియ్యెడఁ గన్నడసేసి యీక్రియం
గాంతువె? పెద్దనిద్ర కొడుకా! ముదమారఁగ లెమ్ము వేగమే

యెంతయు నిన్ను వీడి యిఁక నింటికిఁ బోవఁ దలంపుపుట్ట దొ
క్కింతయునుర్విసుఖంబుగలదే? నినుఁగోల్పడుమాకునయ్యెడన్ 212

ఉ. నాదుగృహంబు శూన్యవిపినం బటకీవు వసింప కున్కిమై
పోఁదలపన్; వనంబునకుఁ బోయితిఁబో ఫలమేమియయ్యెడున్
మోదము గల్గనేని ఫలమూలములందున నీకు, వేగమే
నాదు సమీపమం దిపుడు నందమెలర్పఁగ లేవకుందువే? 213

ఉ. పాఱుఁడు బ్రహ్మనాఁ బరఁగు బ్రహ్మమటందురు వేదవాక్యమున్
బాఱుని నొవ్వఁబల్కిన నపస్వరజుష్టము సేసినన్ శ్రుతిన్
వారక బ్రహ్మహత్యయని వాకొను శాస్త్రము, లీద్వయంబుఁజే
కూరుపలేదు స్వప్నమునఁ గూడ నిఁకన్ సుతుఁ డీల్గనేటికిన్ 214

సీ. నిందితకర్మంబు నేనొక్కటేనియు
నాచరించి యెఱుంగ నైతి; నేమి
పాపకర్మవిపాకభరమున నీరీతి
నానందనుఁడు నిధనంబుఁ గాంచె
నక్కటా! ధాత! నీవతిదీనుఁడను వృద్ధు
నైన నానేత్రంబు నపహరించి
యద్దానిచేత మహాఫలంబది యేమి
కనినాఁడవయ్యా! నిర్ధనులమైన
గీ. మాకు ధనరాశి, చేయూత, మహితహర్ష
సింధు, వీదృశు హరియింప సిగ్గొదవదె?
సదయుఁడ వటంద్రు నిన్ను నీసకలమందుఁ
గాన నిర్దయ మము నీవు గనుట తగునె? 215

క. యెచ్చట శోధన మొనరుతు
నచ్చెరు విడు ప్రకృతిసుందరాకారు సుతున్
గ్రచ్చుఱ నీవదనము సుత!
యెచ్చటఁ జూతును మనోహరేక్షణ యుతమున్ 216

మ. కలకంఠస్వర, మిందుసుందరముఖాకారంబు, శ్రీకారమం
జులకర్ణంబులు, నీలకుంతలము, లస్తోకాబ్జనేత్రంబులున్,
విలసన్నాసయు, దీర్ఘబాహులు, తనూవిస్ఫూర్తియుం, గుందకు
ట్మలదంతంబులు, గల్గు నిన్ విడిచి కట్టా! మేముజీవింతుమే? 217

సీ. సలిలంబు లేకున్న జలధరంబు లొసంగు
నిర్మలంబులగు పానీయములను
ధాన్యంబు కఱవైన ధరణి యర్పించుఁ దం
తన్యమానంబులౌ ధాన్యములను
రతనాలు లేనిచో క్షితిధరంబు లొసంగు
సంచితంబగు రత్నసంచయంబు
ముత్తెముల్ కఱవైన మున్నీరు తానిచ్చు
నాణిముత్యంబు లత్యంతముగను

గీ. కర్పురము లేకయుండిన గనులొసంగు
వసనములు సిక్కకుండిన నొసఁగుతరులు
చనినపుత్రకు నొసఁగు దేశంబు నెచటఁ
గనము కౌఁగిట గ్రుచ్చి శోకమును బాయ. 218

మ. ఘనదుఃఖంబున నీదుతల్లి యిచటం గన్నీరు మున్నీరుగాఁ
గను శోకించెడి నెంతయుం గురరినాఁ, గన్నెత్తి యొక్కింత గ
న్గొనఁగారాదె? యొకింత ముద్దొలుకు పల్కుం బల్కఁగారాదె? నం
దనుఁగన్నందులకిద్దియా ఫలము? వత్సా! మాకు లోకంబునన్ 219

క. తలిదండ్రు లానతీయక
వెలుపల నొక యడుగు నిడని విజ్ఞుఁడ, విటులన్
దొలఁగి చనుట పాడియె? నీ
కలఘుగుణా! యింత దీర్ఘమగు నధ్వంబున్. 220

క. కలవాక్యామృతసారము
దొలుకఁగఁ జెవులందుఁ బల్కుదువు తాదృశు; నిన్

దలఁచెడి నాచిత్తము వ్ర
క్కలు గాకున్నది యదెట్టి కాలాయసమో? 221

క. శ్రుతిపథనంబున నెంతయుఁ
జతురం బగు నీదువాక్యసారస్యంబున్
సుత! శుకదేవ! యిఁకెవ్వని
కతులముదం బొదవ వినిచెదయ్యా! తెలుపుమా? 222

ఆ. వె. సూర్యదేవ! విప్రసుతులు నీకతిహితు
లర్ఘ్య మిడుచునుందు రనుదినంబు
కావవైతి వేల? నీవైన బాలకు
లోకవంద్య! విప్రలోకదయిత! 223

చ. అరుగ సుతుండు కానలకు, నయ్యెడిసైపఁగలేక ప్రాణముల్
దొలఁగినయట్టి యాదశరథుండు కడుం గడు ధన్యుఁ, డిట్టి బం
ధురగుణశాలి పుత్రకుఁడు త్రుంగుట చూచియు నాదుప్రాణముల్
స్థిరముగ మేనిలోపల వసించె నిసీ! మఱి యెట్టిపాపినో 224

మ. వినతానందన! నందగోపకసుతా! విశ్వాదితేయస్తుతా!
ఘననీలాంగ! మతంగజావన! మహాకాలుష్యసంమోచనా!
మునిసంతోషణ! మంజుభాషణ! జగన్మాలా! కలాపోజ్జ్వలా!
నను రక్షింపుము పుత్రశోకశిఖిసంతప్తాంతరంగున్ గృపన్ 225

సీ. వసుదేవవరపుత్ర! వందారుజనమిత్ర!
పాకారినుతిపాత్ర! మాకళత్ర!
కలుషకృజ్జనదూర! ఘనదయాకూపార!
బృందావనవిహార! పృథులహార!
కృత్తదానవమస్త! దత్తసజ్జనశస్త!
జఠరనిష్ఠసమస్త! చక్రహస్త!
అఖిలసుపర్వాద్య! యధిగతాఖిలవిద్య!
విపులసద్గుణహృద్య! వేదవేద్య!

గీ. గోపికాలోల! గోపాల! గోపబాల!
గానలోల! సుసంగతకామపాల!
పుత్రశోకాగ్నికీలలఁ బొరి తపించు
నన్నుఁ గాపాడుమయ్య! యాపన్నశరణ! 226

మ. వినతానందనవాహ! మోహవిరహా! విస్తారపాపాపహా
ఘనకాళిందివిషాపవారక! రమాకాంతామనోహారకా!
ధనదాద్యంచితపాదపద్మయుగలా! దారిద్ర్యవృక్షానలా!
నను రక్షింపుము పుత్రశోకశిఖిసంతప్తాంతరంగుఁ గృపన్ 227

మ. సనకాదిప్రణుతా! చరాచరజగజ్జాలేశ్వరా! భాస్వరా!
ఘనసంసారసముద్రసేత! గగనాకారా! మురారీ! హరీ!
వినమద్బ్రహ్మముఖామరాళిముకుటత్విడ్భాసురాంఘ్రిద్వయా
ననురక్షింపుము పుత్రశోకశిఖిసంతప్తాంతరంగుం గృపన్ 228

శా. నాకన్నన్ శఠుఁ డీజగంబుపయి నున్నాఁడా? రమానాయకుం
డాకాలంబున నెంతసెప్పినను పుత్రాశావిశేషంబునన్
గైకోకుంటిని తద్వచస్సులు; నభాగ్యం బొప్పు వాఁడెందుఁ బెన్
వీఁకం గోర నదృష్టనష్టవిషయాప్తిన్ వర్తిలన్ నేర్చునే? 229

వ. అంత నారదుండు నారాయణర్షితో నిట్లనియె. 230

క. కల్మషహీనుఁ డహీనుడు
వాల్మీకి మహర్షియంత వసుధేశునకుం
దాల్మి వచించినవిషయ, మ
కల్మషహృదయా! వచింపఁగాఁ దగునాకున్ 231

వ. అనిన శ్రీనారాయణర్షి యిట్లనియె. 232

చ. తన తొలిబాముసుద్ది దృఢధన్వుఁ డెఱింగి విశేషవిస్మయం
బునుగని మౌనితోననియె, భూరినవం బగు నీసుధామయో
క్తిని విని నాదుచిత్తమునఁ దృప్తి జనింపకయుండె, నట్లుగా
వున సకలంబుఁ దచ్చరితఁ బొల్పుగఁ జెల్పుమనల్పధీనిధీ 233

వ. అనిన వాల్మీకిమహర్షి యిట్లనియె రాజర్షివరా! యట్లు

సుదేవుండు విలపించు సమయంబున 234

శా. పక్షంబుల్ గల పర్వతంబుల క్రియం బాఱాడుచున్ మింటఁ జి
త్తక్షోభంబుగ గర్జితంబు లిడుచున్ దర్పంబుఁ జూపించుచున్
గుక్షిస్థక్షణదీప్తిరాశి దశదిక్కూలంబులం బర్వఁబ్ర
త్యక్షంబయ్యె భయంకరంబగు నకాలాభ్రం బదభ్రంబుగన్ 235

ఉ. గాడుపు వాఁడితోఁ గొలసి గాఢబలంబునఁ బర్వతంబులం
గూడఁ జలింపఁజేసెడి నొకో! యన వీచుచుఁ గూడియాడు సై
దోఁడుగనుండ; నొక్కనెల తోయదముల్ గురిసెన్ గడుంగడుం;
బాడిదొఱంగి సంద్ర మిలపైఁ బడెనోయన నిండె నీరముల్ 236

క. పిఱుతివియ కిత్తెఱంగునఁ
గురిసెం బిడుగులను విడిచికొనుచు జలదముల్
ధర మిట్టుపల్ల మొకటిగ
వఱలెన్ వలిగొనుచు జంతువర్గము లురలెన్ 237

క. పగళుల పోకడ రాత్రులు
మొగిరాకడ వేఁడివెలుఁగు పొడసూపమిచే
నగశీతముగ వసియించెను
మొగిళులు తంపరగఁ జెదల ముసరినకతనన్ 238

వ. అయ్యవసరంబున 239

చ. ఘనతరపుత్రశోకమునఁ గ్రాఁగుచునున్న సుదేవుఁ డేదియున్
మనమున గుర్తెఱుంగడుఁ బ్రమాదమనండు తినండు క్రోలఁడే
మనఁడు చలింపఁడెప్డుఁ గొడుకా!తనయా! సుతుఁడా!యటంచువం
తను గొనుటొండుదక్క; వసుధాధిపతీ! సుతమోహమెట్టిదో?240

— { విష్ణుమూర్తి సుదేవునకు రెండవమారు ప్రత్యక్షమగుట. } —

చ. ఇటు విలపించు నాతనికి నేగెను మాస మొకండు బిట్టుపి
మ్మటఁ గ్రొ బురుషోత్తమాఖ్యవరమాసము కృష్ణహితావహంబు గా

వుటనది; భూసురోత్తముఁడు బుద్ధినెఱుంగక యాచరించినన్
బటురయమొప్ప శ్రీహరి కృపామతి వచ్చెఁ దదగ్రసీమకున్ 241

మ. అరుదేరన్ విలసన్నవీనజలదశ్యాముండు పీతాంబరా
భరణత్విట్చపలావిలాసుఁడు విశుంభన్మాలికాశాలి శ్రీ
హరి; జీమూతము గచ్చువిచ్చగుచు మాయంబయ్యె,నంతన్ ధరా
సురుఁ డాశ్రీపురుషోత్తముం గనియె నత్యుద్రప్రమోదంబునన్ 242

వ. అంత శీఘ్రంబున 243

ఉ. అంకమునుండి యామృతసుతాంగము డించి ధరాతలంబునన్
బంకజనేత్రయుం దను ప్రపత్తి జనార్దను పాదపద్మముల్
పొంకముమీఱఁ దాల్చి తలపూవులుగాఁగ నమస్కరించి య
ప్పంకరు హాత్యుచెంగటను బద్ధకరుండయి నిల్చిపెల్చనన్ 244

వ. శ్రీహరి నిట్లుసుదేవుండుప్రార్థించె 245

ల-గ్రా. తక్షకముఖాహిరిపుపక్షివిభువాహన! సు
శిక్షితజగత్త్రితయ! కుక్షిగతలోకా
భక్షితవిషప్రముఖభక్షితసుధప్రకర
రక్షణకలావిభవ! దక్ష! పరమేశా!
రాక్షసగణప్రహరణాక్షతసుదర్శనవి
మోక్షణచణా! సరసిజేక్షణ! మురారీ
యీక్షణమునందుఁ గృపనీక్షణముసేసిపరి
రక్షణమునల్పు శుభలక్షణసమేతా 246

సీ. కువలయరాజీవ కులములన్ నగియించు
సోయగంబగు కన్నుదోయివాఁడు
ప్రావృడభ్రచ్ఛాయఁ బరిభవింపఁగఁజాలు
సుందరంబగు దేహసుషమవాఁడ
కమనీయమణిగణ ఖచితదివ్యకిరీట
ఘటితభాసురమస్తకంబువాఁడ

పంటపైరులసామిపస దిసంతులుగొట్టు
డంబైన యాస్యబింబంబువాఁడ
గీ. గొల్లయిల్లాండ్రకడవలం దుల్లసిల్లు
చల్లలుం బాలుపెరుఁగును కొల్లగొట్టి
యుల్లమలరంగఁ ద్రావిన నల్లవాఁడ
యేలు సిరిఱేఁడ! నను, జగమేలు ప్రోడ! 247

మ-వృ బృందారకాకలిత మందారపుష్పమకరంద ప్రధౌతచరణా!
నంద ప్రమోదకరమందస్మితాస్య! జనసందోహరక్షణచణా!
వందారుమాదృశహృదిందీవరేందునిభ! ఛందః ప్రగీతమహిమా!
కందర్పవైరినుత! యాందోళితారిజన!కందేదఁగందునిడుమా 248

ఉ. ఇంబుగ రాత్రియంద్రు దినమిద్దియటందురు కాలమున్ జనుల్
పంభినసీదుకన్నుగవ పాపుస; మాదృశహృత్కువాల వ
క్త్రాంబుజముల్ భవప్నయనకాంతి హసింపఁగఁజేయుఁ బుష్పవం
తాంబక! శార్ఙ్గి! నిద్రగనుసత్తటిసీవు తమంబ యెప్పుడున్ 249

ఉ. చుక్కలు లెక్కవెట్టనగుఁ జోద్యములైన భవద్గుణంబులన్
లెక్కలు వెట్టఁజాలరు నిలింపులుసైత; మలంతివాఁడ నే
నెక్కడ? నీదుసద్గుణములెక్కడ? నిర్గుణాలవాల! యా
నక్కకు నాకలోక మొకనాఁటికినేనియుఁ జిక్కఁజాలునే? 250

వ. అని సుదేవుండు ప్రార్థించి శ్రీకృష్ణుండె నాకు శరణంబని చింతించుచున్నంత 251

క. పురుషోత్తమమాసంబును
పొరిపొరి సేవించుకతన భూసురుఁడు;మహో
దరమున శ్రీహరి యమృతము
గురిసెడు మధురోక్తులిట్లు గొనకొనిపలికెన్ 252

మ. బళిరా! ధన్యుఁడవోసుదేవముని! నీభాగ్యంబు నీముజ్జగం
బుల వర్ణింపఁగ నేరికిందరము? నీపుత్రుండు జీవించు న

త్యలఘుప్రాభవమంది ద్వాదశసహస్రాబ్దాయువుం గాంచుఁ జిం
తిలఁగాఁబోకుము పుత్రదత్తసుఖతృప్తిం గాంతు వత్యాంతముల్ 253

ఉ. నేను ప్రసన్నబుద్ధినయి నీకు నొసంగితి నిప్డు పుత్రకుల్
గాన భవత్తనూజసుఖగౌరవముంగని దేవయక్షులుల్
మానవు లిచ్చగింతురుసుమా! సతతంబును మత్ప్రసాద; మీా
హానియతిన్ వచింతు నితిహాసము దీనికివిన్ముభూసురా! 254

—(విష్ణువు సుదేవునకు ధనుర్మునికథ సెప్పుట)—

వ. అయ్యితిహాసంబు తొల్లి మార్కండేయుండు రఘునృపతికిం
జెప్పె నదియెట్లంటేని. 255

సీ. ధనువను నామంబు దాల్చిన శేముషీ
ఘనుఁ డొక్క-ముని మును గలఁ, డతండు
పుత్రశోకంబుచేఁ బొగులు లోకముఁజూచి
జాలిమైఁ దనకెప్డుఁ జావకుండు
సుతుఁడుద్భవింపఁగా మతిఁగోరి ధృతిమీాఱ
నతిదారుణతపంబు నాచరింప
వేయివత్సరములు వెడలినపిమ్మట
నమరు లాతనికిఁ బ్రత్యక్షమొసఁగి

గీ. కోరుము వరంబు నీమదిఁ గోరుదాని
నిచ్చెదము నీతపంబును మెచ్చినార
మనిన వారల మాటల నాలకించి
ఘనతరముదమ్ముఁ జెంది యమ్మునివరుండు 256

క. చావనిపుత్రుఁడు గుణనిధి
కావలయు నటంచుఁ బలుకఁగా మునివరుఁ, డా
దేవతలందఱు విని భూ!
దేవా! భూలోకమం దిది పొసఁగ దనినన్ 257

క. అటులేని నిమిత్తాయువు
ఘటితకృపాచిత్తులార! కలిగింపుఁడు నా

యటమటవాయఁగ నన; న
ష్టుమతులునిమిత్త మెదియొ పల్కుమయనిన్. 258

వ. అంతనద్ధనుర్మునీంద్రుండుతత్సమీపంబుననొక్కపర్వతంబు గాంచి. 259

ఆ. వె. ఎంతకాలముండు నీపెద్దపర్వత
మంతకాల మాయువమరుపుత్రు
నొసఁగుఁడనిన నట్లె యొసఁగితి మనిపల్కి
యింద్రుఁ గూడియేగిరెల్లసురలు. 260

సీ. అల్పకాలములోన నట్టిపుత్రకు ధను
ర్మునిగాంచె నెంతయు ముదముగదుర
శుక్లపక్షమునందుఁ జుక్కలదొరవోలె
నాబాలకుఁడు వృద్ధి నందుచుండె
పదునారువర్షముల్ ప్రాప్తింప వానికి
మునివర్యుఁడనియె నందనునిఁజూచి
మునిశేఖరుల కెన్నఁడును వత్స! యపచార
మును జేయఁబోకుమీ యని నయమునఁ

గీ. జెప్పిన తదీయవచనముల్ తప్పఁద్రోచి
యధికబలమత్తుఁడగుచు నయ్యడవి నడుమ
నుండు తపసుల యెడఁ గడు దుండగములు
సేయుచుఁ జరించు నానిమిత్తాయు వెపుడు 261

ఉ. పాలను గ్రోలు సింహికలఁబట్టి; రచించు నొకొక్కగుద్దులో
తాలను బిండిపిండిగ; నరణ్యమునం బెదపెద్ద మ్రాఁకులన్
హేలగఁ బట్టియూచి ఫలియించిన పండులనెల్ల నేలపై
రాలిచి మెక్కు; వాఁడు పెనురక్కసికైవడినిక్కి యుక్కునన్ 262

శా. ఆలీలం జనఁ గొన్నినాళ్ళ, మహిషాఖ్యాకుండు మౌనీంద్రుఁ డు
ద్వేలక్రోధనుఁ డొక్కనాఁడు విధిసంవిత్సంభృతప్రక్రియన్

శాలగ్రామశిలాకలాపకసమర్చాలోలుఁడై యుండఁగా
నీలోనన్ వడిగా ధనుర్మునిసుతుం డేతెంచి యచ్చోటికిన్. 263

క. శాలగ్రామశిలల్ గ
గ్గోలుగఁ గొని సలిలపూర్ణ కూపమునన్, దు
శ్శీలమున రువ్వి నవ్వుచుఁ
దాళంబులు దట్టికొనుచుఁ దకధికనాడెన్. 264

వ. అందుల కమ్మహిషమునీంద్రుండు. 265

ఆ. వె. అపరకాలరుద్రుఁ డన నతికుపితుఁడై
మండిపడుచు నోరిపండ గీడ
యిపుడె చావుమంచు శపియించె వడి;నిమి
త్తాయువోటఁ జావఁడాయెవాఁడు. 266

ఉ. పాయఁడు వీఁడు ప్రాణములు పాతకి; యిందుల కేమి కారణం
బో! యనియంతరంగమున నొక్కక్షణంబు దలంచుచున్ నిమి
త్తాయువు వీనిఁ జేసిరిగదా! సురలంచు నెఱింగి చింతతో
నాయతమైనయూర్పులిడ నందుజనించె లులాయబృందముల్ 267

ఉ. అమ్మొయిఁ బుట్టి దున్నలు రయంబునఁ గొండను ముట్టడించి పెన్
గొమ్ములఁగుమ్మి గిట్టలను గ్రూరతఁజిమ్మి క్షణమ్ములోపలన్
దుమ్మునఁజేర్ప నగ్గిరిని; దుర్మదుఁడైనధనుస్సుతుండు తా
డమ్మనిత్రెళ్ళె,భూమిపయిడక్కుదురే? మునులక్కఁబూనినన్ 268

చ. తనతనయుండు ప్రమందిన విధంబు నెఱింగి ధనుర్మునీశ్వరుం
డనుపమదుఃఖసాగరమునందు మునింగి మహావిలాపముం
బొనరిచి తానునుం దనదు పుత్రశరీరముతోడుతం జితా
గ్నినిబడి ప్రాణముల్ విడిచె నిర్భరశోకము నాఁగరామిచేన్?269

వ. కావున నోసుదేవా! యిట్లు బలాత్కారమునం బొందిన
సుతులు సుఖంబిడఁజాలరుగాదె 270

చ. కడుకొని నీకుఁ బుత్రునిడఁగా వినతాత్మజుఁ,డీవు పుత్రవం
తుఁడ వనుపేరుఁగాంచితివి ;తోషము నందితి నిప్పుడేను, నీ

వుడుగక యాచరించు పురుషోత్తమదుర్లభసేవచేత నీ
కొడుకునకుం జిరాయు వొనగూర్చితిమోదము నీకుఁదార్చితిన్ 271

మ. అనయంబున్ సుతుతోడ నియ్యతులగార్హస్థ్యంబునన్ మోదముం
గనుచున్ బిమ్మట బ్రహ్మలోకమును జక్కం జేరి తత్రిత్యసౌ
ఖ్యనికాయంబును గాంచి నిర్జరసహస్రాబ్దంబు; లాపైనిభూ
మినిజన్మింతువు చక్రవర్తివగుచున్ మేల్మిన్ ధరానిర్జరా! 272

సీ. అప్పుడు దృఢధన్వుఁ డనుపేరు ధరియించి
బహురథగజవాజిపదగులొప్ప
నాఖండలపదంబు హసియింపఁ జాలిన
యవ్యాహతైశ్వర్య మధిగమించి
పదివేలవర్షముల్ పాలింపఁగలిగెదు
నిస్సపత్నంబుగా నిఖిలభూమి
ఈగౌతమీసతి తా గుణసుందరి
యనుపేర నర్ధాంగహారిణియయి

గీ. నీకుఁ బట్టపుదేవివై నిరతభర్తృ
సేవలొనరించు; నయ్యెడ ధీవరులను
రాజనీతిప్రవీణుల నోజమెఱయ
సుతుల నల్వురఁగాంతువు సుతనొకతెను. 273

చ. విపులసుఖంబు లిట్లనుభవించి సురాసురదుర్లభంబులన్,
విపులఁ గృతార్థుఁ డేననుచు విస్మృత మోహముసెంది యమ్మహా
చపలసుఖావహారనిధిసంసృతిసాగరమందు మున్గినీ
వపగతవిష్ణుసేవనుఁడవై వసియింపఁగ నట్టిపట్టునన్ 274

శా. సంసారంబున నాదుతండిరి, రిరంసం బాయఁ డింకన్ బృహ
త్సంసారార్ణవతారకుం గొలువఁడా శౌరిన్ సదాయంచు, నీ
సంసత్పూజ్యుఁడు నీసుతుండు వటవృక్షుంబెక్కి కీరాకృతిన్
ధ్వంసంబాగతి నీకుమోహ; మొకపద్యంబున్ బఠించున్ వనిన్ 275

క. వైరాగ్యోత్పాదకమగు
కీరోక్తిని నీవువిని వికీర్ణమనమునన్
జేరి గృహంబును సంసృతి
పైరుచి విడనాడి చింతపడుచుందువెదన్ 276

ఉ. ఆకరణిన్ వసింప భవదంతికసీమకు నేగుదెంచి వా
ల్మీకిమహర్షి; బోధనమమేయముగానొనరించుఁ; దద్వచ
శ్శ్రీకలనన్ మనోవిశయగీతిని బాసి త్యజించిమేను, మో
దాకరమైన యచ్యుతపదంబును గాంతువు భార్యతోడుతన్ 277

వ. అంత వాల్మీకి దృఢధన్వునితో నిట్లనియె. 278

చ. పలుకుచునుండ నిట్లు హరి; పాలునిపుత్రుఁడు లేచి కన్నులన్
నులుముచుఁగూరుచుండెనఁ,దనుప్రభవుంగని విప్రదంపతుల్
బలితపు మోదమంది తమభాగ్యమునెన్నిరి సర్వదేవతల్
జలజల పుష్పవర్షమును జార్చిరి పేర్చినమోద మొప్పఁగన్. 279

వ. పిదప బాలకుండగు శుకదేవుండు శ్రీహరికిని, దలిదండ్రులకును, నమస్కరించిన,గరుత్మంతుండునుసుతసహితుండగుబ్రాహ్మణుం జూచి మిగుల సంతసించె. 280

క. చకితుఁడయి విప్రుఁడత్తఱి
ప్రకటితమగు భక్తిమ్రొక్కి పంకజనాభున్
ముకుళితకరుఁడై యిటులా
సకలేశ్వరు తోడఁబల్కె క్ష్మాపతితిలకా! 281

క. వెతదీర్ప శక్తిచాలని
యితరులకృప వారిమతికి నిడువెత; నీకనీ
మతిఁగరుణ పుట్టెనేనియు
వెతఁదీరిచి కుతుకమొసఁగు విశ్వనుత హరీ! 282

మ. అయుతంబుల్ నియుతంబు లుండినను దోషానీకముల్ వీఁక నీ
దయయొక్కండదిచక్కఁగాఁ దనరినన్ దగ్ధోషముల్ సర్వమున్
భయదారణ్యమునన్ మృగేంద్రుఁ డొకబొబ్బం బెట్టినన్ సత్వసం
చయముల్ పాఱుతెఱంగునం దొలఁగవే? చంచద్గతిన్ శ్రీపతీ283

వ. అని మఱియు హర్షగద్గదస్వరంబున హరితో నిట్లనియె. 284

సీ. నలినాక్ష! మున్ను నేనాలుగు వేలయేం
డులుతపంబొనరింపఁ బెలుచఁ బ్రీతి
నరుదెంచి నీవు నా పరిసరంబున నిల్చి
వత్స! తావకభాలపట్టికపయి
వర్తించువర్ణముల్ వరుసగాఁ జూచితిఁ
బుత్రభాగ్యంబెందు బొసఁగదనుచు
బహుకర్కశంబుగాఁ బల్కినాఁడవుగదా
తద్వాక్యమును నేఁడుతలఁగఁద్రోచి

గీ. ఘనకృపామతిఁ జనుదెంచి చనినసుతుని
గడఁకఁ బ్రతికించుటకు నేమికారణంబు?
తెలియ వివరింపు నామది బలితమైన
సందియంబుతొలంగ; నానందసాంద్ర! 285

వ. అంత శౌనకాదులు సూతునితో నిట్లనిరి. 286

ఉ. శ్రీదయితామనోహరుని చిత్రచరిత్రమునందుఁ దక్కినన్
లేదమృతంబు తద్విషధి, లేదబలాజనతాధరంబులన్
లేదు తమోముఖంబునను, లేదు ఖగాధిపతిచ్ఛదంబులన్
లేదు సుధాంశుదీధితి బళీ! కలదందురటన్ భ్రమంబుధుల్ 287

వ. అనిన మఱలసూతుండిట్లనియె. 488

చ. అనఘచరిత్రులార! యిటు లవ్వనసీమఁ బురాణమౌనివ
ర్యుని గని నారదుండనియె నొయ్యన; నోమహనీయ! [illegible]త్మజుం
గని హరియేమి యుత్తరముగా వచియించెఁ బ్రసన్నచిత్తుఁడై;
వినఁగవినంగమోద మభివృద్ధినిజెందెడిఁదెల్ప వేదయన్ 289

వ. అనివేఁడిన నారదునకు నారాయణర్షి యిట్లనియె. 290

క. ఆరీతి సంశయంబును
దీరుప వినయంబునన్ సుదేవుండడుగన్
సారసనాభుండు కృపా
వారిధి యిట్లనియె భక్తవాత్సల్యమునన్ 291

గీ. అవనిసురవర్య! నీవిప్పు డాచరించి
సట్టి కృత్యంబు నొరుఁడు సేయంగలేఁడు
దేనిచే నేను గంటినో తృప్తిమిగుల,
నీవెఱుంగవు దానిని నిశ్చయముగ 292

సీ. నాకుఁ బ్రియంబగు శ్రీకరపురుషోత్త
మాఖ్యమాసంబు దానరిగెనిపుడు
శోకమగ్నుండవై నీకాంతతోఁ గూడి
చక్కఁగాఁ దత్సేవ సల్పినాఁడ
వందొక్క యుపవాస మాచరించినవాఁడు
సకలపాపములు భస్మంబుసల్పి
సురయానమెక్కి భాసురమైన వైకుంఠ
పురమున కేగు నిర్జరులు వొగడ

గీ. మాసమంతయుఁబస్తులు సేసితిరి, జ
లధరములు వచ్చి కురియఁ గాలత్రయమున
నంబుదస్నాన మదియబ్బె ననుదినంబు
ననఘ! చేతనలేకున్న యట్టిమీకు 293

చ. గురుతరశోకవారినిధిఁ గ్రుంకుచు శ్రీపురుషోత్తమాఖ్యమా
సరమణసేవనంబు ద్విజసత్తమ! నీవొనరించినాఁడ, వి
ల్లెఱుఁగక యాచరించినను నెవ్వఁడు నీసుకృతాతిరేకముం
బరిమితిసేసి చెప్పఁగలవాఁడు గలండు? జగత్త్రయంబునన్. 294

సీ. సురలముందట మున్ను పరమేష్ఠివేదోక్త
సాధనంబులనెల్ల సంతరించి
యొకచక్కనిల్పి వేఱొకచక్క పురుషోత్త
మాఖ్యమాసమ్మునమర్చి ధటను
దూఁచిన లఘువుఁ గాదోఁచె సాధనము, లి
మ్మాసంబు గురువుగా వాసిఁబడసె
గావున భూమిలోఁగలసర్వమానవుల్
స్థిరమతి దీనిబూజించుచుంద్రు ౘ

గీ. అఖిలజగములఁ బురుషోత్తమాఖ్యమాస
మలరె; నైననుభూలోకమందు దానిఁ
బూజసేసిన మిక్కిలి పుణ్యమంది
పొందరానిసుఖంబులఁ జెందఁగలరు. 295

వ. కావున వత్సా! నీవిప్పుడు సర్వవిధంబులన్ ధన్యుండవు. ఇమ్మాసంబున నన్నపానాదులం ద్యజించి పరమదారుణంబగు తపం బాచరించితివిగాదె. 296

ఉ. మానవుఁ డిట్టిపుణ్యతమ మాసమునందున స్నానదానముల్
మానిన జన్మజన్మమున మానక బిట్టుదరిద్రుఁడయ్యెడున్
గాన సమస్తయత్నములఁ గైకొనఁగాఁదగుదీని; నాక్రియం
బూని యొనర్చువాఁడధికపూజ్యుఁడు ధన్యుఁడదృష్టశాలియున్ 297

వ. అంత నారాయణర్షి యిట్లనియె. 298

క. హరి జగదీశ్వరుఁ డీక్రియ
ధరణీసురవరునితోడఁ దగఁబల్కి వెసన్
గరుడారూఢుండై నిజ
పురమగువైకుంఠమునకుఁ బోయెమునీంద్రా. 299

క. పురుషోత్తమసేవనమున
మరణించినసుతుఁడు శుకసమాఖ్యుఁడు బ్రతుకన్
బొరిపొరి సుదేవుఁడుం ద
త్తరుణీమణి గౌతమియును దాల్చిరి ముదమున్. 300

క. ఎఱుఁగకయుండిన మనచేఁ
బురుషోత్తమసేవనంబు పొనరింపఁబడెన్
త్వరితముగ సఫలమయ్యెన్
మరణించిన మనసుతుండు మగుడి లభించెన్. 301

వ. అని తలంచి యాపురుషోత్తమవ్రతవిధానంబు సక్రమంబుగ శ్రీహరివలనం గ్రౌదెలిసి 302

మ. బళిరా! యీదృశమాసరాజ మెచటం బ్రాప్తింపఁగాబోవదం
చలఘుప్రీతియు విస్మయంబు మదిలో నావిర్భవింపంగ నా
నెల యేతెంచినయప్పుడెల్ల మిగులన్ నెక్కొల్పితత్సేవ; లు
గ్మలితోఁగూడి ద్విజుండు సర్వసుఖముల్ గాంచెన్ సుతోపేతుఁడై

మ. శుకదేవుం డనయంబు మాతృపితలన్ శుద్ధాంతరంగంబునన్
సకలానందములొప్పఁ గొల్చుచును విష్వక్సేను నర్చించుచుం
బ్రకటంబౌపురుషోత్తమాఖ్యమగు సన్మాసంబు సేవించుచున్
సుకృతంబున్ గణియించుచుండెమిగులన్ క్షోణీజనుల్మెచ్చఁగన్ 304

సీ. కర్మమార్గస్పృహం గడకొత్తి భక్తిమా
ర్గైకస్పృహం జిత్తమందుఁదాల్చి
సర్వదుఃఖంబులన్ సమయించు పురుషోత్త
మాఖ్యవిష్ణుప్రియమాసమందు
జపహోమముఖ్యవిస్తరపద్ధతులచేత
హరిని బూజించి యత్యంతభక్తి
వేయివత్సరములు విపులభోగంబుల
ననుభవించుచుఁదా నహర్దివంబు

గీ. యాజకులకును యోగుల కందరాని
దెట్టిశోకంబులుండని యట్టిదైన
పరమలోకంబునకు నిజపత్నిఁగూడి
యరిగెను సుదేవుఁడధికపుణ్యంబుకతన. 305

ఉ. ఉన్నతసౌఖ్యమిచ్చు పురుషోత్తమమాసముఁ గొల్చియుండుటం
బన్నుగ విష్ణులోకమున వర్తిలు సౌఖ్యములంది భార్యతో
గ్రన్నన వచ్చు భూమి కల త్న్మవిబుధుండు నృపాలవర్యుఁడై,
యెన్నికఁగాంచ, నానృపతి యీవెసుమీ! దృఢధన్వభూపతీ 306

క. పతిదేవత యాగౌతమి
కుతుకంబిడు నీదుభార్య గుణసుందరియైఁ

క్షితిజన్మించెను వసుధా
పతి! నీవడుగుటను తెలియఁబల్కితఖిలమున్ 307

శా. నీకుం బూర్వపుజన్మమందుసుతుఁడై నీరేజపత్రాక్షుచే
సాకల్యంబుగ నాయువీఁబడిన యాసచ్ఛీలుఁడంతంబునన్
వైకుంఠంబున కేగి తొంటిపిత్రవై వర్తించుటన్ నీవు,కీ
రాకారంబున వచ్చి పల్కెను వటప్రాంతంబునం బద్యముల్ 308

వ. కావున నోరాజేంద్రా! నీకుఁబూర్వజన్మపుత్రుండగు శుక
దేవుండు పండ్రెండువేలయేడులు జీవించి జ్ఞానవంతుండై వైకుంఠంబు
నకుంజని పిదపనీకోఁజకు శుకాకారంబువడసి యరణ్యసరోవరతీరంబున
వటవృక్షంబధిరోహించి యచ్చటికి వచ్చియున్న నిన్నుంగాంచి తన
మనంబున 309

మ. పురుధర్మంబుల నాకితండు పితయై బోధించి సన్మార్గత
త్పరుఁగాఁజేసి తరించు తెన్నిడిన నాప్రత్యక్షదైవంబు దు
స్తరసంసారార్ణవమందుఁ గ్రుంకి విషయాశానక్రసంగ్రస్తుఁడై
తెరువుంగానక యున్నవాఁడనుచు నెంతేఁ జింతవాటించుచున్ 310

ఉ. ఈతనికిం బ్రబోధ రచియింపకయుంటినయేని సుతుండనై
యాతతమైనబంధము నిరంతరమున్ నను బాధపెట్టెడిన్
బూతశ్రుతుల్ వచించెఁ బితృపున్నరకంబుఁ దొలంచువాఁడె వి
ఖ్యాతసుతుండటంచు; నది యన్యవిధంబుగ నాకునయ్యెడున్. 311

గీ. కనుక వెనుకటిపుట్టుక జనకుఁడైన
యితని కుపకృతి సేయుట యొంతయుఁదగు
ననుచుఁ జిలుకగ నేతెంచి యాశుకాఖ్యుఁ
డవనినాథ! వచించెఁ బద్యమ్ములనట్లు 312

వ. అని వాల్మీకిచెప్పిన దృఢధన్వుం డిట్లనియె 313

క. పరికింపఁ దొంటిపుట్టుక
గురుఁడనునే నతని, కిపుడు గురుఁడైయతఁడే
వరబోధసేసె సంసృతి
తరలఁగ నాకున్, శుకుఁడు కృతజ్ఞతవెలయన్. 314

వ. అంత వాల్మీకి యిట్లనియె. 315

క. ఎదియెది నన్నడిగితి వీ
వదియది తెల్పితిని నీకు నంతయు, సరయూ
నదికిం బాపవినాశిని!
కిఁ దగఁ నేనింకఁ జనుదు క్షితిపతితిలకా! 316

క. కుండలమణిరుచిమండల
మండితగండాస్యచంద్రమండల! శుండా
దండభుజ! చండశాసన!
దండితరిపువర్గ! పండితప్రణుత! హరీ! 317

కందగర్భ చంపకమాల.

చ. బలవిలసచ్ఛరీర! నతభర్గ! లలామకవీర! సర్వగా!
కలుషహరా! సురారిగణకాల! విశాలదయాలవాల! ని
ర్మల! నలినేక్షణా! మధురమంజులభాషణ!శోషితార్తశు
గ్జలధిజలా! హృదబ్జకృతసన్నిధితోషితవేంకటాచలా! 318

గర్భ కందము.

క. విలసచ్ఛరీర! నతభర్గ!లలామకవీర! సర్వగా! కలుషహరా!
నలినేక్షణా! మధురమంజులభాషణ! శోషితార్తశుగ్జలధిజలా! 319

మాలిని. వ్యపగతజననాంతా! హ్లాదితాభీరకాంతా!
రిపుజనఘనవాత్యా! ఋగ్యజుస్సామనుత్యా!
తపనహిమగునేత్రా! తాపసాత్మీయమిత్రా!
క్షుపితకుజనశస్త్రా! శంఖచక్రాదిహస్తా! 320

గద్య.

ఇది. శ్రీమద్విబుధవిధేయ వేంకటాచలశాస్త్రి నామధేయ
ప్రణీతంబైన బృహన్నారదీయ పురాణాంతర్గత
పురుషోత్తమ మాహాత్మ్యంబునఁ
దృ తీ యా శ్వా స ము

శ్రీకృష్ణార్పణమస్తు.

శ్రీరస్తు

శ్రీపురుషోత్తమాయపరబ్రహ్మణేనమః

# పురుషోత్తమమాహాత్మ్యము.

## చతుర్థాశ్వాసము.

శ్రీ గోలోకవిహారక!
భోగిప్రభుశయన! నిఖిలభూతావన! స
ద్యోగా! పోషితకౌశిక
యోగా! పురుషోత్తమా! ధృతామలదామా! 1

వ. దేవా! సూతుండు శౌనకాదిమహర్షులతో నిట్లనియెం బిదప శ్రీనారాయణమునీంద్రుండు నారదునకిట్లనియె. 2

ఉ. పూర్వచరిత్ర మట్లు మునిపుంగవుఁ డాదృఢధన్వుతో శ్రవః
పర్వముగా వచించి యటుపైఁ బయనించుచునున్న యాతనిన్
సర్వజనస్తుతుండు నృపసత్తముఁ డూఱడ వేఁడి తా; నెదం
బర్వినభక్తిఁ దత్పదనమస్కృతి సల్పి వచించె నెంతయున్. 3

వ. మఱియు ననంతరంబున సూతుం డిట్లనియె. 4

గీ. నారదుం డిట్లు నారాయణర్షిముఖము । నుండిదృఢధన్వచరితంబు నువినితృప్తి । లేనివాఁడై సనాతనమౌనిఁగాంచి । భక్తివినయంబులోల యంగఁ బల్కెనిట్లు. 5

క. అట్టియెడ రాజచంద్రుఁడు । పుట్టంబుట్టినమునీంద్రు మొకముంగని తా
నెట్టనముగఁ బ్రశ్నించిన । యట్టిది చెప్పుముమునీంద్ర! యదివినవలతున్

వ. అనిన శ్రీనారాయణుం డిట్లనియె నారదా! యట్లు దృఢ

ధన్వుండు మహాప్రాజ్ఞుండగు వాల్మీకిమునిసత్తము ననునయించి యడి
గిన ప్రశ్నంబును జెప్పెద వినుమని యిట్లనియె. 7

క. తులసీశ్రీఫలదళముల । వలె గంగాజలముపగిది వైదికవాక్యం।బుల.
చెలువుననీపలుకులు।కలుషహరంబులుమునీంద్ర!ఘనపుణ్యదముల్

ఉ. ఓఋషిసార్వభౌమ! పురుషోత్తమమాసము మోక్షకాములౌ
వారెటు లాచరింపఁదగు వాస్తవమెట్టిది? యేసుపర్వునిన్
ధారణచే యజింపఁదగు? దానమదెద్ది? విధానమెట్లు? పెన్
గూరిమి నంతయుం దెలుపఁగోరెద, సర్వజగద్ధితంబుగన్ 9

వ. మహాత్మా! భవాదృశులుసర్వలోకహితంబుకొఱకుఁ జరిం
చుచుందురు గదా! 10

క. వరమగు నీనెలసాక్షా ।త్పురుషోత్తముఁడనియుదీని బూజించినచో
గురుతరపుణ్యంబనిముని । వర! నీవదనమునవినఁగఁబడియెంగాదే 11

చ, ప్రథమజనిన్ సుదేవుఁడను పాఱుఁడనై గతజీవపుత్రకుం
డధిగతజీవుఁడయ్యెనని యాపురుషోత్తమమాసమున్, మనో
వ్యథ లేక నెన్నఁడున్ గలుగనట్లు మహత్తర భక్తితోడుతన్
విధివిహితప్రకారమున వేడ్క సమర్చితముం బొనర్చితిన్ 12

చ, గురుతరపుత్రశోకమును గూరి విచేతనతన్ వసించుచున్
దొఱఁగితి నన్నసీరములు దోఁగితి నభ్రజలంబులందు న
ల్లిఱుఁగక యాచరించితిని యీపురుషోత్తమసేవఁ; గావునన్
దెరలినపుత్రకుం డరుగుదెంచె శుకాఖ్యుఁడు ప్రాణధారియై 13

చ. హరిపరిబోధితోరువిధి నర్మిలి యీపురుషోత్తమాఖ్యమున్
విరివిగఁ గొల్చి నేననుభవించితి భద్రము మున్ను, మానిరా
డ్వర! యిదిలాఁతిపుట్టువగుటన్ మఱపుం దగిలెన్ సమస్తమున్
గరమును తద్విధానమును గాఢకృపన్ మఱలన్ వచింపవే? 14

వ. అట్లని రాజేంద్రా! తద్విధానంబు వచింతు వినుము 15

— { వాల్మీకిమహర్షి దృఢధన్వునకుఁబురుషోత్తమవ్రతి చేయఁదగునాహ్నికవిధానంబు చెప్పుట } —

సీ. పురుషోత్తమవ్రతంబును చేయఁబూనిన మనుజుఁడెంతేని శ్రద్ధను
వహించి। బ్రాహ్మముహూర్తంబు పరఁగ, మేల్కనిపరబ్రహ్మము
దలఁచివాఃపాత్ర, చేత। నంది నైరృతదిక్కునందుగ్రామమునకునవ్వల;
దివససంధ్యలనుకర్ణ। మున బ్రహ్మసూత్రకమును దాల్చియుదగభి
ముఖుఁడై తృణంబులఁబుడమిగప్పి
గీ. యంశుకావృతమస్తకుఁడై నియమిత। వదనుఁడై యుచ్ఛ్వసింపకవద
లకయుమి, । సలుపనగుమూత్రశమలముల్, క్షుపలయందు।దక్షిణ
ముఖంబుగాఁ జేయఁదగునుభూప! 16

వ. అంత గృహీతమేహనుండైలేచి గృహీతశుచిమృత్తికుండై
లింగంబున నొక్కపరియుఁ బాయువున నైదుమాఱులునువామకరంబున
మూఁడుపర్యాయంబులును నుభయహస్తంబులఁ బదిసారులును పాదం
బులఁ బదునేడుతడవలును గార్హస్థ్యశౌచంబు చెప్పఁబడినది గాన నట్ల
తంద్రితుండై గంధలేపక్షయకరంబుగా శౌచంబుఁగావించి పాదంబు
లును హస్తంబులును మృజ్జలంబులచేఁ గడిగికొనవలయు, తీర్థమందు
శౌచం బాచరింపక పాత్రోద్ధృతజలంబుచే నాచరింపవలయు, జలం
బనుద్ధృతంబయ్యెనేని రెండు పిడిమూఁరలదూరంబు వదలి యాచరింప
వలయు: పిదప నపరిశుద్ధంబుగను నన్యథాహితంబుగను జేయంబడిన
యాతీర్థంబును శుద్ధంబు గావింపవలయు, పురుషోత్తమవ్రతియైనవాఁ
డిట్లు శౌచంబు గావించి యనంతరంబు పదునాఱు గండూషంబులఁ
గాని పండ్రెండుగాని చేయవలయు; గృహస్థుఁడు మూత్రోత్సర్గంబు
గావించిన నెనిమిది యావృత్తులుగాని నాలుగావృత్తులుగాని గండూ
షింపవలయును. ఇవ్విధంబునఁ గావించి నేత్రంబులఁ గడిగికొనిదంత
కాష్ఠంబుగ్రహించి 17

క. ఆయువు బలమునుయశం బన। పాయపువర్చస్సుప్రజయుఁ బశువసు
నిచయం। బేమొడ బ్రహ్మప్రజ్ఞలు। ధీయుక్తియు నిమ్ము వనస్పతీ
మాకుదయన్. 18

వ. అని యీమంత్రంబు నుచ్చరించి దంతధావనం బాచరింప
వలయు మఱియు నాదంతకాష్ఠం బిట్టిదిగా నుండవలెను 19

ఆ. ఉత్తరేణిపుడుకయో, రేఁగుపుల్లయో । ద్వాదశాంగులంబు వ్రణ
రహితము । సంగతము, కనిష్ఠకాంగులిస్థూలంబు । అర్థపర్వకూర్చ
కాంకితంబు. 20

వ. ఇట్టికాష్ఠంబున దంతధావనం బాచరించి పండ్రెండు గం
డూషంబులచే శుచియగునది ఇయ్యది భానువాసరంబున నిషిద్ధంబు
పిదపనాచమించి మిక్కిలిపరిశుద్ధుండై ప్రాతస్స్నానం బాచరింపవలయు
స్నానానంతరము తీర్థదేవతలకుఁదర్పణంబు గావింపవలయు 21

గీ, ఉదధిగతరంగిణీస్నాన ముత్తమంబు । మధ్యమముపువాపికూపపద్మా
కరముల । మందిరస్నాన మద్ది సామాన్యమనుచుఁ। బలుకఁగాఁబడి
యెను గృహస్థులకు భూప! 22

వ. అనంతరంబు తెల్లనిపరిశుద్ధవస్త్రంబులు ధరియింపవలయు
ప్రాజ్ఞుండైన బ్రాహ్మణుం డుత్తరీయమ్ము నెప్పుడును ధరింపవలయు,
శుచిగలప్రదేశంబునఁ దూరుపుముఖముగనో యుత్తరముఖముగనో
బద్ధశిఖుండును జానుద్వయాంతరస్థితభుజద్వయుండును సపవిత్రహస్తుం
డునునై యాచమనక్రియనాచరింపవలయు,ను, ఆపవిత్రంబుచ్ఛిష్టంబు
గాదు. భుజించినపిదప నుచ్ఛిష్టంబైన దానిని వర్జింపవలయుఁ దదనం
తరం బాచమించి గోపీచందనమృత్స్నచేఁదిలకంబు ధరింపవలయు 23

సీ. దండరీతిగ ఋజుత్వంబుసౌమ్యతయొప్పఁ బూనఁగాఁదగునూర్ధ్వపుం
డ్రకంబు । ఊర్ధ్వపుండ్రంబేని యుండ్రిపుండ్రంబేని నడుమఛిద్రంబు
గన్పడఁగవలయు । ఊర్ధ్వపుండ్రంబునం దొప్పాగున్వయముగ నిం
దిరతోడగోవిందుఁడెపుడు । శ్రీత్రిపుండ్రంబునం జెన్నారునుమతోడ
శంకరుండెపుడు సాక్షాత్కరించి

గీ సుషిరవిరహితపుండ్రంబు శుభకపదస । మంబు, శ్వేతంబుజ్ఞానక
రంబు, రక్త । మైనవశ్యకరంబు, పీతాభమైన । యఖిలవృద్ధిదమిత
రంబు త్యాజ్యమధిప! 24

సీ. గోపిచందనమునఁ గోమరొప్పశంఖ చక్రాదికంబులు ప్రధార్యమ్ము
లగును । ఆరీతిధరియింపఁపభలపాపక్షయకరము,పూజాంగమైవఱలు

నందు । శంఖచక్రాదిక చారుచిహ్నంబులు కనుపించు నెవనివిగ్రహమునందు । నతనిమర్త్యుఁడటంచు ననరాదునిత్యంబు భగవత్తనువుగఁదల్పంగవలయు

గీ. అట్టిఁడొనరించిన యఘంబులరుగు; మెయిని ।యునయమునుదాల్ప శంఖచక్రాదికములనంచితంబులనారాయణాయుధములఁ । గొట్టిఁడెంతటిపాపులఁ గూడయముఁడు. 25

సీ॥ అంతఁ బ్రాణాయామమది యాచరించి సంధ్యావందనంబు సేయంగవలయు । పూర్వసంధ్యను ఋక్షములు గల్గినప్పుడే చెప్పినవిధి నుపాసింపవలయు । ఆదిత్య దర్శనంబయ్యెడిదనుక గాయత్రినభ్యాసము సేయఁగవలయు । అమలసావిత్రి మంత్రావలిచే నుపస్థానంబుసల్పి యంజలిఘటించి

గీ॥ ఆత్మపాదంబులకు భూమియందు నల్లె । సంజ తటిసేయఁదగు నమస్కార మిటుల । నితరచిత్తంబులేక తత్కృతమతియయి । సలుపఁదగు, నింక నూనంబుఁ దొలఁగుఁపొందెు। 26

వ॥ "యస్యస్మృత్యాచనామోక్త్యా" యను మంత్రంబుచే న్యూనంబైనదానిం బూరింపవలయు. 27

క. విధిచోదితముగ నెవ్వఁడు ప్రథితంబగుసందె వార్చు శ్రద్ధాయుతుఁడై । యధిగతముకాని దొకటియు । నధిపా! లోకత్రయమున నాతనికున్నె ? 28

క. ఇటుదివసాదిమకృత్యము । పటుతరముగఁ జెప్పఁబడియెఁ బ్రతిదినమటులే । విటతాటము లేకొనరిచి! స్ఫుటగతినిటుపైని విష్ణుపూజ సలుపనొ. 29

వ. అలుకంబడిన పరిశుద్ధప్రదేశంబున నియతుండును వాగ్యతుండునుశుచియునై వస్త్రువగఁగాని చదరంబుగఁగాని గోమయంబున మండలంబుసలిపి వ్రతసిద్ధికై తండులంబులచే యష్టదలంబుసేసి యందు సువర్ణమయంబుగాని రజతమయంబుగాని తామ్రమయంబుగానిమృణ్మయంబుగాని,సుదృఢంబునునూతనంబునువ్రణరహితంబును శుద్ధంబునగు కలశంబును స్థాపించి యందు శుద్ధ తీర్థంబునుండికొని

రాఁబడిన శివంబగు నుదకంబును పూరించి 30

చ. కలశముఖంబునందుహరి కంఠమునన్ హరుఁడుండు; మూలమం
దలరునజుండు, మధ్యమునయందున మాతృగణాళి, కుక్షిన
జ్జలధులు నేడు దీవులగు క్ష్మాస్థలి; సాంగములైన వేదముల్
వాలిచెడిఁజూవె తత్కలశపూరిత తోయములాశ్రయించుచున్.

వ॥ ఇట్లు కలశంబును స్థాపించి అందు గంగను గోదావరిని కావేరిని సరస్వతిని దురితక్షయకారణంబున మచ్ఛాంతికొఱకు సరు డెంచెదరుగాకయని తీర్థంబులఁ జేకూర్పవలయు, పిదప సమంత్రకంబు లగునుపచారంబుల గంధాక్షతలచేతను నైవేద్యములచేతనుతత్కాల సంభవంబులగు పుష్పంబులచేతను కలశమును పూజించి దానిపైఁ బీతాంబరావృతంబగు తామ్రపాత్రంబు నుంచవలయు నద్దానిపై రాధాసహితుండగు శ్రీహరిని హేమవికారు నుంచవలయు 32

ఆ. వె. పైఁడితోడ రాధఁగూడిన పురుషోత్త । ముని రచించి యతని
పూజసేయుఁ। దగునుభక్తితోడఁ దద్వ్రతము సేయుఁ। దలఁచు
వారు విధిని తలఁగకుండ 33

క. పురుషోత్తమ మాసంబది । పురుషోత్తమ దేవతాకము గనుక
శ్రీమ । త్పురుషోత్తమ సేవనమే । పురుషోత్తము మాసమందుఁ
బొనరుపఁగఁదగున్ । 34

క. భవసాగరముఁదాఁటిం । చి దుమిడుములఁ గుడుచువారిఁదేర్చుధ్రువ
ముగా । నెవఁ; డితని నెఱుఁగొలువరు? భవతారకు మరణధర్మవ
న్మర్త్యజనుల్. 35

—(మర్త్యునకు ధర్మాచరణమే ముఖ్యమనుట)—

మ. మఱలం గ్రామము, లర్థముల్ మగుడి, ప్రేమస్థానశోకంబు క్ర
మ్మఱ, గేహంబులుసాగెకున్, రుచిరభామారత్నముల్ పల్మఱున్,
మఱియున్ వచ్చు శుభాశుభంబులగు కర్మంబుల్, నృదేహంబు క్ర
మ్మఱ రాఁజాలమగానఁ బ్రోవఁదగుధర్మ ప్రాప్తికై దేహమున్.

గీ. ధర్మసంస్కృతిచేత జ్ఞానముత్పన్నమగును । జ్ఞానమొదవిన మోక్షంబు
సంభవించుఁ । గాన మానవజన్మంబుగల్గినపుడ । ధర్మమొనరింప

వలయు మేధావిజనుఁడు. 37

క. తనువను తరువునకు సనా। తనధర్మమె మహితఫలము ధర్మము లేకు।న్కని దద్దేహము నిష్ఫల। మునితాంతము; వంధ్యవృక్షము గతినరేంద్రా! 38

క, తలిదండ్రులు సోదరులున్। గళత్రపుత్రులు ధనాదికము సాయంబున్। సలుపరు ధర్మంబది కే। వలము చలింపక సహాయపడు సతతంబున్ 39

సీ॥ బెదరుదోఁపఁగనెద, ముసలితనముబెబ్బులి మూర్కొఁగబళింపఁ బొంచియుండు। పరిపంథులట్లు దుర్భరముతో రోగముల్ గట్టిగా మెయిచిక్కఁబట్టికొట్టు। తూఁటిడ్డకుండలో తోయంబుతెఱఁగున దినదినంబాయువు తెరలుచుండు। కుసుమంబు కైవడి మిసమిస లాడుచు యౌవనంబంతలో నంగవించు

గీ॥ సంపదలనఁ దరంగ చంచలలు మఱియు। విషయములు స్వప్న పరిదృష్టవిషయ సమితి।చలము విత్తంబు చిత్తంబు, సంసృతిఁగల సకలసుఖములు నధికచంచలములధిప' 40

వ॥ కావున నిర్లిప్తింగి విరక్తుండై ధర్మాభ్యాసపరుండు కావలయు 41

గీ॥ పాముకుత్తుక నగపాలు పడియుఁగప్ప। యూహగావించు నీఁగపై కుతికి మ్రింగ;। కాలగిళితుఁడు జీవుఁడా లీలదోఁప। వితతపర పీడనార్థనాదృతివహించు॥ 42

గీ. మృత్యుగిళితాయువులగు వారికిసుఖంబు। లెటుల నానందమును, ఘటియింపఁగలుగు?। చెనకి యాఘాతమునకు నీడ్చికొనిపోవఁ। బడెడి వధ్యునిసుఖములభాతిగాక. 43

సీ. ధర్మంబుసేయఁ జిత్తముగల్గినప్పుడు విత్తంబుచేతిలోవెలయఁబోదు విత్తంబుచేతిలోవెలసినఁజిత్తంబు ధర్మాభిముఖముగాఁదనరఁబోదు చిత్తవిత్తంబులు చేకూరెనేనియు సత్పాత్రమదితటస్థంబుగాదు ఇమ్ముగాఁడు సమకూడెనేని తప్పకధర్మ మాచరించినయట్టిఁ డతి నిపుణుఁడు

గీ. విత్తవిస్తారసాధ్యముల్ వేనవేలు । ధర్మములుపోల్చ,నల్పపుధనము
చేత । నధికధర్మంబుపురుషోత్తమాఖ్యమాస । మందుసాధింపనను
కూలమగు నృపాల! 44

క. స్నానము దానము కథలన్ ।మానాథున్ జిష్ణు విష్ణుస్మరియించుట
యున్ । బూనఁగ నేతన్మాత్రి మ। నూనభయంబడఁచి ధర్మమో
మున్ జనులన్. 45

క. గంగయెతీర్థము, ధన్వి య । నంగుఁడె, విద్యయెధనంబనన్, సుగు
ణములే । మంగళరూపం, బిఁకమే । ల్మింగనుపురుషోత్తమాఖ్యమే
మాసములన్. 46

ఉ. జన్మములాదిగానెసఁగు సత్క్రియలందిది ధిక్కృతంబుగా
మున్నువసించెఁ, బిమ్మటఁబ్రమోదముతోఁ బురుషోత్తముండు దీ
నిన్నిజనామధారిగను నెట్టనఁజేయుఁ దదాఖ్యచేత భూ
మిన్నిఖిలాగ్రగణ్యమయి మేలిమిఁగైకొనియెన్ నృపాగ్రణీ. 47

గీ. అఖిలజంతుపదంబులు హస్తిపదము । నందు లీనంబులగులీల
నఖిలధర్మ । ములునుకాలంబులఖిలముల్ ముడుఁగుఁజూవె।మహిత
పురుషోత్తమాభిఖ్యమాసమందు. 48

సీ. ఎన్నినిమ్నగలైననేమియించుకయైన నమరతరంగిణీసమములగునె?
ఎన్నివృక్షములైననేమిలేశంబేని కల్పవృక్షయశంబుఁగాంచఁగలవె?
ఎన్నిరత్నములైననేమియొక్కింతయుఁ జింతామణీసమశ్రీనిగనునె?
ఎన్నిధేనువులైన నేమిలవంబేని కామధేనుసమాన గరిమఁగనునె?

గీ. రాజుతోభృత్యతతి, వేదరాశితోడ । శాస్త్రజాలంబు సమమానె?
సకలపుణ్య । కాలములు సర్వమాసముల్ పోలఁగలవె? । మహిత
పురుషోత్తమాభిఖ్య మాసమణిని. 49

క. పురుషోత్తమమాసమునకుఁ। బురుషోత్తముఁడధిపుఁడగుచుఁ బాలు
పారుటచే । స్థిరభక్తిశ్రద్ధలతోఁ । బురుషోత్తమునాదిదేవుఁ బూజిం
పఁదగున్. 50

గీ. వేదశాస్త్రప్రవీణునివిష్ణుభక్తు । సత్యసంధునిసంశుద్ధ క్ష్మాసురవరు
నమలునాచార్యు రావించియతనిచేతఁ । గోమరుగాఁబూజసేయించి

కొనఁగవలయు. 51

శా. కామక్రోధముఖోగ్రనక్రయుతమై గంభీరమై తీవ్రమై
భీమంబైన భవాబ్ధిదాట భరతోర్వీభాగమం దాత్మలో
నేమర్త్యుండుదలంచునో! యతఁడు భూయిష్ఠాదరంబొప్పఁగా
శ్రీమంతుం బురుషోత్తముణ్ హరినిపూజింపందగుణ్ భూవరా! 52

— { వాల్మీకిమహర్షి దృఢధన్వునకుఁబురుషోత్తమ పూజనవిధిచెప్పుట } —

క. అనలోత్తారణమొనరిచి । పనుపడఁబ్రాణప్రతిష్ఠ ప్రతిమకుసేయం
గనగుందద్విధముగఁజే । యనియెడనదిధాతుమాత్రమైవర్తించుణ్.

వ. మఱియుఁ బ్రతిమాకపోలద్వయంబును దక్షిణకరంబున స్పృశియించి యావిష్ణుదేవునిప్రాణప్రతిష్ఠచేయవలయు. ప్రతిమలయం దుఁబ్రాణప్రతిష్ఠ సేయకుండిన యథాపూర్వంబుగ స్వర్ణాదిధాతుత్వం బుదక్క దేవతాత్వంబుగలుగదు, ఇతర దేవప్రతిమలయందుఁ దత్తద్దే వత్వసిద్ధికొఱకుఁ బ్రాణప్రతిష్ఠ నాచరింపవలయు, పురుషోత్తమబీజంబు చేతను"తద్విష్ణోః" అనుమంత్రముచేతను హృదయభాగంబున నంగుష్ఠం బిడి మాటికిని మంత్రవిదుం డీమంత్రముచేత హృదయంబునందును బ్రతిష్ఠగావింపవలయు "శ్లో॥ అస్యైప్రాణాఃప్రతిష్ఠంతు।అస్యైప్రాణాః క్షరంతు చ । అస్యైదేవత్వసంఖ్యాయై।స్వాహా" అని యజుస్సును బలు కుచు వైదికంబులగు మూలమంత్రంబులచేతను అంగమంత్రముల చేతను సర్వప్రతిమలయందు నిట్లు ప్రాణప్రతిష్ఠగావింపవలయు, అట్లు కాదేని ప్రయత్నంబునఁ జతుర్థ్యంతంబులును స్వాహాంతంబులునగు నామమంత్రంబులచేత నయ్యాయిదేవతలను స్మరియించుచు నాచరింప వలయు, ఇట్లుప్రాణప్రతిష్ఠచేసి శ్రీపురుషోత్తముని ధ్యానింపవలయు54

క రాధాయుతుశాంతునిలీ । లాధృతలోకుణ్ ద్రిభంగలలితుణ్ లీలా
బ్జాధికరుచిఁబురుషోత్తము । శ్రీధరు ధ్యానింపవలయుశ్రీవత్సాంకుణ్

గీ. దేశకాలంబులను ప్రకీర్తించిశుచియు । నియతుఁడునువాగ్యతుండు

నై నిఖిలదపురు । షోత్తముయజింపఁదగు షోడశోపచార । ములను పృథుభక్తితోఁ గ్రమంబుగ ఘటించి 56

గీ. దేవదేవేశ! శ్రీకృష్ణ! దివ్యరూప! । కామితార్థద! పురుషోత్తమా! ముకుంద! । రాధికోపేత! శ్రీహరీ! రాసనిపుణ । రమ్ము నాపూజ నిచటఁ గైకొమ్ము వేగ. 57

వ. "శ్రీరాధికాసహితపురుషోత్తమాయనమః ఆవాహనం సమర్పయామి" అని యావాహన మర్పింపవలయును 58

క. నానారత్నాన్వితజాం । బూనదసింహాసనంబు పురుషోత్తమ! దే వేశేశ! సర్వసంస్థిత । దీనావన! రాధికాసతీప్రియ! కొనుమా. 59

వ. "శ్రీరాధికాసహితపురుషోత్తమాయనమః ఆసనంసమర్ప యామి" అని యాసనము సమర్పింపవలయు. 60

గీ. ప్రథితగంగాదిసర్వతీర్థములనుండి । ప్రార్థనలతోడఁ దెచ్చినవాఁడఁ దో యు; । మిద్దియధికసుఖస్పర్శ మిక్కుతమున । బాద్యమునకై గ్రహింపుమీ పంకజాక్ష. 61

వ. శ్రీరా-నమః-పా-స. అని పాద్యమును సమర్పింపవలయు.

గీ! గోపికానందమును గూర్చుకొఱకునంద । గోపకునియింట నున్కి గైకొనినకృష్ణ । యర్ఘ్యమునుగొమ్ము నేనిడినట్టిదాని । రాధికాయుక్త శ్రీకృష్ణ సాధువినుత. 63

వ. శ్రీరా-నమః-అ-స. అనియర్ఘ్యమును సమర్పింపవలయు 64

క. గంగాజలమునుదెచ్చితి । గాంగేయవికారమైన కలశాంతరమం । దుం గలదిదెయాచమనం । బుంగావింపుముపురాణ పురుషోత్తముఁడా.

వ. శ్రీరా-నమః-ఆ-స అని యాచమనంబుసమర్పింపవలయు

క. గొనకొనిపంచామృతములఁ । గొనివచ్చి తివీనిచేతఁ గొమరారంగ న్ నినుబూజించెడినాకా । ర్యనిచయముఫలించుఁగాక రాధారమణా 67

వ. శ్రీరా-నమః-స్నా-స. అని స్నానము నాచరింపింపవలయు.

క. గోక్షీరదధిఘృతంబులు । మాక్షికశర్కరలుగలవుమహనీయగుణా కుక్షిస్థలోకమాధవ । దాక్షిణ్యముతోడఁగొనఁగఁదగుసీయ్యోడల న్

వ. శ్రీరా-నమః-పం-స. అని పంచామృతస్నానంబు సేయింప
వలయు. 70

క. యోగేశ్వరదేవునకుఁ । శ్రీగోవర్ధనసమాఖ్యశిఖరిధరునకుఁ ।
యాగాగమాధిపతికిఁ । గోగోపాలప్రపాలకునకిదె సనతుల్ 71

క. గంగాజలసమశీతల । తంగాంచనదీజలంబుదార్కొల్పితినీ । కుంగా
వింపఁగస్నానము । మంగళగుణనందరాట్కుమారక కొనుమిా 72

వ. శ్రీరా-నమః-శు-స.అనిశుద్ధోదకస్నానంబాచరింపింపవలయు

గీ. సర్వకామార్థసిద్ధియౌసంగుపొంకు । చారుపీతాంబరయుగంబుసంత
రించి । భక్తితోనీకు నేసమర్పణముసేయు । చున్నవాఁడగ్రహింపు
మచ్యుత! సురేడ్య! 74

వ. శ్రీరా-నమః-వ-స. అనివస్త్రంబుసమర్పించి యాచమనం
బొసంగవలయును. 75

క. తరియింపఁగఁజేయుము మ । స్తరసంసారార్ణవంబుదామోదర,నఁ;
విరచింతువందనము,నుత్తరీయమునుజందియంబుధరియింపఁగదే76

వ. శ్రీరా-నమః-ఉ-స, అనియుపవీతంబునర్పించి యాచమనం
బొసంగవలయు. 77

క. సుమనోహరమైగంధా । ఢ్యమైనశ్రీఖండచందనాలేపనముఁ ।ప్రమ
దంబుమిారఁగొనఁగా । నమరగణశ్రేష్ఠనిన్నుఁ బ్రార్థింతుఁగడుఁ 78

వ. శ్రీరా-నమః-చం-స. అని చందనముసమర్పింపవలయు.79

గీ. సురసమూహాగ్రగణ్య సుశోభితములు । కుంకుమాక్తాక్షతలుసమ
కూర్చియిచట । తావకపదార్చనంబు నత్యంతభక్తి । నొనరుపఁ
దలంచినాఁడఁ గైకొనుముదేవ 80

వ. శ్రీరా-నమః-అ-స. అని యక్షతలు సమర్పింపవలయు.81

గీ. మాలతీప్రముఖసుగంధిమాల్యములను । ప్రభువరానీమపూజకేర్ప
ఱచితెచ్చి । నాఁడగావున నాదృతితోడమ్ముమల । పుష్పములఁగై
కొనందగు బుధనుతపద! 82

వ॥ శ్రీరా-నమః-పు-స. అని పుష్పముల నర్పించి పిదప నంగ
పూజగావింపవలయు. 83

సీ॥ నందాత్మజుఁడు యశోదేవీముఖప్రియ తనయుండు కేశిసూద నుఁడు భూధ । రుఁ డనంతుఁడును విష్ణురూపి ప్రద్యుమ్నుండు నని రుద్ధశ్రీకంఠ కాఖిలాస్త్ర । ధారివాచస్పతిభూరినామకుఁడు కేశ వుఁడు సర్వాత్ముఁడన్ వివిధనామ । ములఁ బాదగుల్ఫజానులు జఘనకటి గుహ్యములు నాభీహృదయములు గళము

గీ. బాహుముఖనేత్ర శిరములు భక్తి వెలయ । విశ్వరూపుని సర్వాంగ వితతిఁబుష్ప । ములను గైకొని క్రమవృత్తి దొలఁగకుండ।నర్చ నము సేయఁదగుఁ జతుర్థ్యంతములను. 84

గీ. హరికిఁగావించి యిట్లు ప్రత్యంగపూజ । మఱియు ననంగేశవాది నామంబులనఁగఁ । దనరు నిరువదినాల్గు మంత్రములఁ బుష్ప।తతుల నర్చింపఁదగుఁ జతుర్థ్యంతములను. 85

క. అనుపమ గంధసమేతము । వనస్పతి రసంబు దేవవర్గాఘ్రేయం । బును దివ్యమైన ధూపం । బును గడునుత్తమముగొనుము పురు షోత్తముఁడా. 86

వ॥ శ్రీరా-నమః-ధూ-స. అని ధూపంబొసంగవలయు. 87

గీ. దేవతలకందఱకును జ్యోతివగు దీవు । తేజములకెల్ల నుత్తమ తేజ మీవు। ఆత్మవిజ్యోతి వీవు మహాత్మపరమ । ధామదీపంబు గ్రహి యింపఁదగు మురారి! 88

వ॥ శ్రీరా-నమః-దీ-స. అని దీపంబు సమర్పింపవలయు 89

క. నైవేద్యము గ్రహియింపుము । దేవా నీయందుభక్తి స్థిరపఱుపు మునా భావంబుదున; నీప్సిత । మా వరమిదు, మవలనొసఁగు మపవర్గంబున్. 90

వ॥ శ్రీరా-నమః-నై-స. అని నైవేద్యము సమర్పించి మధ్య మధ్యపానీయంబునిడి యుత్తరాపోశనంబు నొసంగవలయును. 91

గీ॥ జాహ్నవీతోయమును దెచ్చి స్వర్ణకలశ । సంస్థితముజేసినాఁడ నాచమనకృత్య మాచరింపుము లోకత్రయామయహర । శ్రీహృ షీకేశ! జగదీశ! చిద్విలాస! 92

వ॥ శ్రీరా-నమః-ఆ-స. అని యాచమనం బర్పింపవలయు 93

క. ఫలమును నీకర్పితముగ । నిలిపితి నిదె కొనుము దేవ! నిఖిలాధారా!
వెలయింపుము దయతోఁద । త్ఫలమున సుఫలాప్తి నాకుఁ బ్రతి
జన్మమునన్. 94

వ. శ్రీరా-నమః-శ్రీ-స. అని శ్రీఫలము సమర్పింపవలయు. 95

గీ. గంధకర్పూరకస్తూరికాదియుక్త । మౌకరోద్వర్తనకమును నతిసు
వాసి । తంబు నర్పించుచున్నాఁడ నంబుజాక్ష! మునిజనస్తుత! దీనిఁ
గైకొనుము దయను. 96

శ్రీరా-నమః-క-స, అని కరోద్వర్తనమొసంగవలయు. 97

క. పూగీఫలసంయుతమును । రాగిత;రుచిరంబుగప్పురమువిడియమిటన్
శ్రీగోవింద! సమర్పణ । మేఁగావించితిని భక్తి నిదె కైకొనుమా. 98

వ. శ్రీరా-నమః-తాం-స.అని తాంబూలంబు నర్పింపవలయు.

గీ. భాసురహిరణ్యగర్భ గర్భస్థమగుచు । నవ్విభావసుబీజమై యల
రుచున్న । యుదిరిని ననంతపుణ్యఫలదమునిదిగో । యొసఁగితిని
నీకు; శాంతి నాకొసఁగుకృష్ణ! 100

వ. శ్రీరా-నమః-ద-స. అని దక్షిణ నర్పింపవలయు 101

క. శారదనీలోత్పలశో । భారుచిరునకున్ త్రిభంగభవ్యాకృతికిన్
నీరాజనమర్పించెద। శ్రీరాధాసహితునకు విచిత్రగుణునకున్. 102

వ. శ్రీరా-నమః-నీ-స. అని నీరాజన మర్పింపవలయు. 103

క. రక్షింపుము జగదీశ్వర । రక్షింపుము భక్తలోకరక్షణదీక్షా!
రక్షించు త్రిలోకేశ ప్ర । దక్షిణ మర్పింతుఁ గొనుము దానవవైరీ

వ. శ్రీరా-నమః-ప్ర-స. అని ప్రదక్షిణము లాచరింపవలయు.

క. యజ్ఞోద్భవ యజ్ఞేశ్వర! । యజ్ఞపతీ యజ్ఞరూప యజ్ఞకృదవనా
ప్రాజ్ఞనుతదేవ హరి నా। యజ్ఞానము వాప నీకు నర్పింతు నతుల్.106

వ. శ్రీరా-నమః-మం-స.అని మంత్రపుష్పంబునొసంగవలయు

క. విష్ణుఁడ విశ్వేశ్వరుఁడా । విశ్వోద్భవ! విశ్వజనక! విశ్వజనీనా!
శాశ్వత!నతులిడుమునునీ! కైశ్వర్యంబొసఁగి ప్రోవుమయ్యముకుందా

వ. శ్రీరా-నమః-న-స. అని నమస్కారంబొసంగవలయు. 109

ఆ. వె. మంత్రహీనమనెడి మంత్రంబుచేఁ బురు। షోత్తముని క్షమింప బత్తి వేఁడి । ప్రతిదినంబునందు స్వాహాంతనామమం । త్రములఁ దిలలు వేల్చఁదగును భూప. 110

గీ. సర్వకామ్యార్థఫలసిద్ధి సంభవింప। నేతితోఁ బురుషోత్తమప్రీతి కొఱ కు। ఖండదీపంబు నానెలఁ గడవఱకును। స్థాపనము సేయఁగాఁ దగు శ్రద్ధ వెలయ. 111

వ. పిదప "యస్యస్మృత్యాచ" యనెడు మంత్రంబుచేఁ బురుషోత్తముని నమస్కరించి యూనమగునది సంపూర్ణంబుగావించి సుఖంబు నందవలయు. 112

సీ. ధరణీశయిట్లు శ్రీపురుషోత్తముసరాఘు నభినవజలధరశ్యామవర్ణు, నరుదేరఁబురుషోత్తమాభిఖ్యమాసంబు పుడమిమానవుఁడుగాఁబుట్టి భక్తి । హరిసేవనాసక్తుఁడైన విప్రునిగురువును జేసికొనిప్రతిదినము నందుఁ । బూజించు నాతండు భూరిధనాఢ్యుఁడై సంతానవంతుఁడై సకలవిధను.

గీ॥ లైన యైహికసుఖములనంది, పిదప । సకలపాపంబులను భస్మ సాత్కరించి । మఱల జన్మంబునందక మహితమైన । మోక్ష సామ్రాజ్యమును జెందు భూపసింహ. 113

వ. అంత శ్రీనారాయణర్షి నారదునకుం జెప్పినట్లు శ్రీసూతుండు శౌనకాదులకిట్లనియె మునీంద్రులారా అట్లువిని దృఢధన్వుండు శ్రీ వాల్మీకితో నిట్లనియె. 114

గీ॥ మానినాయక పురుషోత్తమవ్రతనియ । మంబులను దెల్పుమీ విస్తరంబుగాను । ఏది భోక్తవ్య? మెది భుజియింపరాదు? । విడువ నగునెద్ది? యెయ్యది విడువరాదు ? 115

వ. అంత శ్రీనారాయణర్షి నారదమునితో నిట్లనియె. నట్లా రాజేంద్రుండు భగవంతుండగు వాల్మీకిమహర్షింగనుంగొని లోకనిశ్రే యసంబుగానడిగిన నాతనిని బహుమానించుచు మునీంద్రుండిట్లనియె.

— { వాల్మీకిమహర్షి దృఢధన్వునకుఁ బురుషోత్తమ వ్రతనియమంబులఁ దెల్పుట. } —

క. పురుషోత్తమమాసంబునఁ । బరికీర్తితమైన నియమపద్ధతులను నీ
కెఱిఁగించెద నిపుడు సవి।స్తరముగ నృపవినుము భక్తితాత్పర్యమునన్
సీ. పురుషోత్తమంబున భుజియింపఁదగు హవిష్యాన్నంబు ప్రయతుఁడై
యనుదినంబు। సితసర్వశాలిధాన్యతతిగోధూమముల్ యవతిలముద్గ
ధాన్యవ్రజంబు । కంగు[1] కలాయ[2]కోత్కరము నీవారము కాల[3]శా
కం బార్ద్ర[4]కంబు దోస।మూల కందక హిల[5]మోచికా రంభలుసైం
ధవలవణ మాజ్యంబు దధియు
గీ. క్షీరములును ననుద్ధృతసారకములు । చూతధాత్రీపనసలు హరీ[6]తకి
యును।పిప్పలీజీరకంబులు విశ్వ[7]భేష । జంబు తింతిడి క్రముక మైక్షవ
గుడంబు. 118

వ. తైలంబుచేఁ బచింపనిపదార్థంబును హవిష్యంబుగా మును
లు వల్కుదురు హవిష్యభోజనము మానవుల కుపవాససమంబుగావున
నీపదార్థంబులు ఘృతపక్వంబులుసేసి పురుషోత్తమమాసంబునం
భుజింపవలయు మఱియు మాంసభోక్తలగు క్షత్త్రియశూద్రులీ వ్రతం
బాచరించినఁ బలలంబులును వర్జింపవలయు. 119

గీ. క్షౌద్ర[8]మఖిలామిషములు మాంసంబుబదరి । రాజమాషాదికంబును
రాజి[9]కయును । మఱియుఁదిలపుంజతైలంబుమాదకంబు । ద్విదళపు
రుషోత్తమవ్రతివిడువవలయు. 120

ఆ.వె శల్యదూషితాన్నశబ్దదుష్టాన్నక్రి।యావిదూషితాన్న భావదూషి
తాన్నములు, పరాన్న మాదరింపఁగరాదు । తొలఁగవలయునితర
ద్రోహబుద్ధి. 121

క. వఱలకయుండినఁదీర్థ, మి।తరదేశముసనుట పారదార్యము సురభూ
సురవేదగోవ్రతిస్త్రీ । గురురాజమహాత్మనిందకూడదువ్రతికిన్.122

సీ. పార్థివోత్తమవిన్ము ప్రాణ్యంగచూర్ణముల్ ఫలములయందు జంబీర
ఫలము । ధాన్యంబుల మసూ[10]రధాన్యంబుపర్యుషితాన్నంబుభూమి
జమైనయుప్పు । గోమహిష్యజలపయోమండకాదుల కన్న వేఱైన

1. కొఱ్ఱలు, 2. గుండ్రనిసెనగలు, 3. కఱివేప, 4. అల్లము, 5. చిలుకహారా
6. కరకకాయ, 7. సొంటి. 8. తేనె, 9. నల్లావాలు, 10. చిఱుసెనగలు.

దుగ్ధాదికంబు । బ్రాహ్మణక్రీతసర్వరసంబులును తామ్రపాత్రస్థమైన
గవ్యప్రతతియు

గీ. చర్మనిర్మితభస్త్రికాసంస్థజలము । తననిమిత్తంబుగావండికొనిన
యన్న । మామిషములనిబుధులుపల్కుచుందు। గానవ్రతశీలురీ
యవిమానవలయు. 123

గీ. బ్రహ్మచర్యంబు, పుడమిపైపవ్వళింత । నాలుగవజామువచ్చిన వేల
యందు। ఛదనసంచయమందుభోజనముసేత। తగునుపురుషోత్తమ
వ్రతతత్పరునకు. 124

మ. అలఘుశ్రీపురుషోత్తమవ్రతసపర్యానిష్ఠమర్త్యుల్ రజ
స్వలతో మ్లేచ్ఛులతో నిషాదపతితవ్రాత్యాళితో బ్రాహ్మణా
వలిశత్రు శ్రుతిబాహ్యమానవులతో భాషింపగారాదు వా
రలు వీక్షించిన యన్నముంగుడువగారాదయ్య!భూవల్లభా. 125

గీ. సూతకాన్నంబుఁ గాకులచేతఁదాఁకఁ । బడినయన్నము నిరుమారు
లుడికినట్టి। యన్నమునుపరిదగ్ధాన్నమారగింపఁ। జనదు పురుషోత్త
మాఖ్యమాసంబునందు. 126

గీ. ముస్తలు పలాండులశునముల్ పుట్టగొడుగు। మూలకము[1] నాలికం[2]
బును మునగకూర । వ్రతులయినయట్టివారు సర్వవ్రతముల। నెల్లది
నముల నివి భుజియింపరాదు. 127

వ. మఱియువిష్ణుప్రీతికొఱకుఁ బురుషోత్తమమాసంబున స్వశ
క్తికొలంది కృచ్ఛ్రాదికంబును జేయవలయు, కూశ్మాండంబును, బృహతి
యు(వాఁకుడు) తరుశియు (సురగ) మూలకంబును, శ్రీఫలంబును,
కళింగఫలంబును (కొడిసె) ధాత్రీఫలంబును, నారికేళంబును, అలా
బువును, పటోలంబును, బదరీఫలంబును, చర్మవృంతంబును (వంగ)
అజికంబును (తీఁగ)వల్లీశాకంబును (పుల్లబచ్చలి)జలజంబును(తామర)
వీనిని క్రమంబుగఁ బ్రతిపదాదులయందుఁ బురుషోత్తమవ్రతి వర్జింప
వలయు, అట్లే ధాత్రీఫలంబును రవివాసరంబున సర్వదాగృహస్థుండు
భుజింపఁజనదు. 128

1. ముల్లంగి, 2. ఉల్లికాఁడ.

క. పురుషోత్తమతుష్టికినెవి । పరివర్జితములగు; వాని భార్గవ! వసుధా
మరునకు నొసంగి యటుపై । మఱలన్ భుజియింపఁదగుఁ జుమా
సతతంబున్. 129

గీ. మఱియు నీలీలఁ గార్తిక మాఖమాస । ములనుసైతము నియమ
ముల్ సలుపవలయు । నియమములులేక యుండిన నృపతిసింహ!
వ్రతి తదీయఫలంబును బడయలేఁడు. 130

గీ. శక్తిగల్గినచో నుపోషణము సేత । యొనరుచుట యుత్తమము
పురుషోత్తమంబు; । అట్లు కాదే నయాచితమైన దుగ్ధ। పానమైనను
ఘృతపానమైనఁజెల్లు. 131

క. ఫలమూలు మొదలగునవి తిన । వలయున్ వ్రతి; శక్తి కొలఁది; వ్రత
భంగంబున్ । గొలుపనివిధమున సేయున్ । వలయు విమర్శించి
చక్కఁ బ్రాజ్ఞజనంబుల్. 132

వ। పుణ్యదివసంబునఁ బ్రాతఃకాలంబునలేచి పౌర్వాహ్ణిక
క్రియలను గావించి భక్తిచే శ్రీకృష్ణుని హృదయంబున స్మరించుచు
నియమంబు గ్రహింపవలయు, ఉపవాసంబునకుగాని నక్తంబున నేక
భుక్తంబునకుగాని యేదేని యొక్కనిశ్చయంబుగావించికొని యీ
వ్రతంబాచరింపవలయు. 133

క. శ్రీమద్భాగవతంబును । శ్రీమత్పురుషోత్తమమునఁ జెవులారంగా
నేమానవుండువినునో। యామానవుపుణ్యమెన్న నజునకుఁదరమే?

క. తులసీదళలక్షను ని । స్తులశాలగ్రామపూజ శుద్ధ హృదయులై
సలిపిన నిమ్మాసంబునఁ।బొలుపారు ననంతపుణ్యము నృపవరేణ్యా

ఉ. తీవ్రతరాఘపాశములఁ ద్రెంపఁగఁ జాలినయీనెలన్ యథో
క్తవ్రతులైన మానవులఁగాంచి కృతాంతుని దూత లమ్మృగేం
ద్రవ్రజముం గనుంగొనిన దంతిసమూహములట్లు భీతులై
సువ్రత! పారుచుందురు త్రిశుద్ధిగ నమ్ము మిది తన్మహత్వమున్. 136

సీ. ఈమాసపున్ వ్రతమెంతయుశ్రేష్ఠంబుక్రతుశతంబునకంటెఁగాశ్యపీన్ద్రి
క్రతువులచేతస్వర్గము పురుషోత్తమంబుననుగోలోకంబుపొందఁగలరు

ధరగల సర్వతీర్థంబులు క్షేత్రములు సర్వదేవతలును సంతతంబు
పురుషోత్తమవ్రతంబును సేయువారలదేహంబునందువర్తించుచుండ్రు

గీ. త్రివిధపాపసమూహదారిద్ర్యములును। సకలదుస్స్వప్నదోషముల్,
సకలరోగ। తతులు మానసపీడలు, తద్వ్రతంబు । సలుపువారికి
తప్పక విలయమందు. 137

క. పురుషోత్తమ సంసేవా। నిరతుండగు విష్ణుభక్తునిన్ విఘ్నంబుల్
బారయనిగతి రక్షింతురు। పురుషోత్తమతుష్టికొఱకుఁబురుహూ
తాదుల్. 138

క. ఏతల నీపురుషోత్తమ। పూతవ్రతి యుండు, నచట భూతప్రేత
వ్రాతంబులును పిశాచ। వ్రాతాదులుబెదరి సత్వరంబుగఁబఱచున్

క. శ్రీపురుషోత్తమసువ్రత। మీపగిది విధిప్రకార మెవఁడుసలుపు,భూ
పా! పలుకశక్యమాత। ద్వ్యాపృతఫలము న్ సహస్రవదనున కేనిన్

క. పురుషోత్తముఁడెవ్వండీ। పురుషోత్తమవ్రతముబ్రీతిబూను,నతండా
పురుషోత్తమప్రియతముఁడై।పురుషోత్తముఁగూడినిరతముంగ్రీడించున్

క. గణనాతీతగుణా! పణి। ఫణమణిచరణా! సమస్తభక్తేప్సిత పూ
రణ! రణదురుభూషణ! మా। ర్గణగణసంధానదుష్టఖండననిపుణా!

మాలిని. వమనగిళనకార్యావర్తితైణత్వ్రిపంచా
విమల! సకలదా! సర్వేంద్రియాతీతరూపా!
సమధికవృతమాయాచాతురీకాతరాస్మ
ద్భ్రమహరణపటిష్ఠా! పావనాత్మ ప్రతిష్ఠా. 143

గద్య.

ఇది. శ్రీమద్విబుధవిధేయ వేంకటాచలశాస్త్రి నామధేయ
ప్రణీతంబైన బృహన్నారదీయ పురాణాంతర్గత
పురుషోత్తమ మాహాత్మ్యంబునఁ
జతుర్థాశ్వాసము
శ్రీకృష్ణార్పణమస్తు.

శ్రీరస్తు

శ్రీపురుషోత్తమాయపరబ్రహ్మణేనమః

# పురుషోత్తమమాహాత్మ్యము.

## పంచమాశ్వాసము:

శ్రీధర! మహితశ్రుతి వి
ద్యాధర! విద్యాధరస్తుతాంచితచరితా!
సాధుజనవంద్య! తోషిత
రాధా! పురుషోత్తమా! కరస్థితకామా! 1

వ. దేవా! సూతుండు శౌనకాదిమహామునుల కిట్లనియెననంతరంబు శ్రీనారాయణమహామునీంద్రుండు నారదున కిట్లనియె. మునీంద్రా! మఱియు దృఢధన్వుండు వాల్మీకింగని పల్కె నది యెట్లనిన 2

క. ఈపురుషోత్తము నెలలో । దీపప్రదానమున నరుగుదెంచుఫలంబుల్
నాపైనిం దయతోడం గ్ర । పాపారీణా! మునీంద్ర పలుకంగదవే. 3

గీ. ఈకరణి విన్నవింప వాల్మీకిమౌని ! శ్రోతుకాము వినీతు విశుద్ధ
చరితు । ధారుణీశునిగని ప్రమోదమునఁబల్కె । నెలనగవు వదన
మందునఁ దొలకరింప. 4

-(దృఢధన్వునకు వాల్మీకి చిత్రబాహుచరిత్రంబు సెప్పుట!)-

క. వినురాజర్షభ! పాప । ప్రణాశినిగఁ దనరు కథను బలికెద దానిన్
వినినంబంచేంద్రియసం । జనితములగునఘము లెల్లసమసిచనుదృటిన్

క. సౌభాగ్యాఖ్యం దాల్చిన । బాభాసితపురిని చిత్రబాహుండనఁగా
భూమిభర్తగలఁడు సుయశ । శ్శోభితదిగ్వలయుఁడధికశూరుండధిపా

ఉ. ఆతఁడు సత్యసంధుఁడు దయాకరుఁ డంచితవేదశాస్త్ర వి
ఖ్యాతసమస్తధర్మవిషయజ్ఞుఁడు విజ్ఞుఁడు రాజనీతిని

స్నాతుఁడు భవ్యరూపుఁడు ప్రశాంతుఁడు విష్ణుపదాబ్జ సంచర
చ్చేతనుఁడున్ ద్విజప్రియుఁడు శీలుఁడు పుణ్యకథానురక్తుఁడున్. 7

క. మఱియున్ స్వదారనిరతుం। డురుపశుధనధాన్యపుత్రయుక్తుండురథ
ద్విరదతురంగమపత్తి। స్ఫురణుండై వెల్గునపరపురుహూతుఁడనన్

ఉ. శిష్టజనప్రకీర్తితయు శ్రీహరిభక్తిసమేతయుం జతు
ష్షష్టికలాసమన్వితయు సాధ్వియుఁ జంద్రకలాఖ్యయౌ స్వకీ
యేష్టకుటుంబినింగలిసి యేర్తెఱ రాజ్యసుఖంబుఁగాంచె సం
తుష్టిగ రాజవర్చసముతో సుతులుం దన కింపునింపఁగన్ 9

గీ. ఆనృపతిశేఖరుఁడు తన మానసమున। శ్రీకరుని గృష్ణదేవు వినా
కరించి। యితరదైవంబు మఱియొకఁ డెసఁగెననుచు। ధరణి
నాయక! యెఱుఁగనే యెఱుఁగఁడయ్య! 10

ఉ. ఒక్కదినంబునందు మహిమోన్నతుఁడైన యగస్త్యమౌని నల్
దిక్కులబ్రహ్మవర్చసము ద్రెక్కొన నింటికి నేగుదెంచినన్
మ్రొక్కి పదద్వయంబు విధిపూర్వముగా నలచిత్రబాహుకుం
డక్కఱఁబూజసేసిముని కాసనమున్ ఘటియించి తద్దయున్.

క. వినయావనతుండైయ। మ్మునిమ్రోలవసించి కేలుమొగిచిప్రమోదం
బనయఁగఁజిత్తంబందున। మునితోనిట్లనుచుఁబలికెభూపలలామా.

ఉ. నేఁడు మదీయజన్మమును నేఁడు మదీయగృహంబు విత్తమున్
నేఁడు మదీయరాజ్యమును నేఁడు మదీయసమస్తసంపదల్
పోఁడిమిమీఱఁగా సఫలముల్; హరిపాదసరోజభక్తితోఁ
గూడిన యట్టి మీరలిటకుంజను దేరుట; మౌనిసత్తమా, 13

ఉ. మూపులఁదావకీనములఁ జొప్పరుపన్ దయతోడ నాపయిన్
రూపఱెఁ బాపజాలము; నిరూఢరథద్విరదాశ్వపత్తిసం
దీపితమైనరాజ్యమునిదే భవదర్పితమున్ బొనర్చితిన్
శ్రీపతిపాదసేవనము చేసెడివారి కదేయమెందు నే? 14

వ॥ మహానుభావా భవాదృశులగు విష్ణుభక్తుల కల్పంబిడి
నను నయ్యది మేరు కల్పంబు, మఱియు 15

ఉ॥ శ్రోత్రియవిష్ణుభక్తులకు శుద్ధచరిత్రులకుం గపర్దికా
మాత్రమువ్యంజనంబయిన మంజులదీదివియైన సుంతయున్
బాత్రులటంచు నేదినము భక్తినిబెట్టరొ యాదినంబ యీ
ధాత్రిజనాళికిన్ విఫలతాఘటకంబనుచుంద్రు వైదికుల్.

గీ॥ విష్ణుభక్తిసమేతులౌ విప్రులెల్ల। పూజనీయులు గావున భూరిభక్తి
వాఙ్మనఃకాయజములగు వ్యాపృతులను। వారి, సంభావితులఁ
జేయ వలయునెపుడు. 17

వ మఱియు గర్గుండును గౌతముండును సుమంతుండును
నాకిట్లువచించిరి.

గీ. ఎంతదనుకను రవి యుదయింపకుండు। నంతదనుకనె రిక్కలు
కాంతిఁబొరయు;। ఎంతదనుకను హరిభక్తుఁడేగుదేరఁ। డంతదను
కనె యితరబ్రాహ్మణుల ఘనత 19

వ. అంతనగస్త్యమహర్షి యిట్లనియె. 20

చ. స్థిరపయిఁ జిత్రబాహునృపతీ కడుధన్యుఁడవీవు, నీప్రజల్
కరమును ధన్యులౌహరి నఖండితభక్తిని గొల్చునట్టి నీ
వఱగొఱలేక యేలుట; నయంబున నేపరిపాలకుండు శ్రీ
హరిపదభక్తుఁడై నెగడఁ డచ్చటనుండఁగరాదు భూవరా! 21

క. అనఘా! శూన్యంబగునే! వనమధ్యమునందునైన వసియింపఁదగున్
ఘనులగు హరిపదభక్తులుఁ। దనరని రాష్ట్రమున నుండఁదగదొక
క్షణమున్. 22

సీ. కనులులేకుండిన కాయంబుకైవడి పతిహీనయైనట్టి సతితెఱఁగున
విద్యలేకుండిన విప్రునివడుపున దర్భలేనట్టి సంధ్యావిధమున
స్నాన వివర్జితంబైన వ్రతమురీతి సత్యంబులేని వచస్సుపగిది
త్యాగ విహీనమౌ ద్రవిణంబుపోలిక చంద్రుఁడులేనట్టిక్షణదభాతి

గీ. తిలవిహీనంపు తర్పణంబులవిధమున। నీరములులేకయున్న కాసా
రమట్లు। జవనమైయుండనట్టి యశ్వంబుగతిని। రాష్ట్రమొప్పదు
వైష్ణవరహితమైన. 23

వ. మఱియు వృత్త్యర్థంబగు దేవసేవ చందంబునను; సకేశ యగు గతభర్తృకమాడ్కిని, బ్రాహ్మణీగామియగు శూద్రునిమాదిరి గను, నవైష్ణవంబగు రాష్ట్రంబుండు. 24

గీ. ఎతఁడు శ్రీకృష్ణపదములఁ నేభజించు। నతనిని వచించు రాజని యార్య గణము। అతనిరాజ్యంబు వర్థిల్లు ననుదినంబు। నతనిప్రజలెల్ల సుఖములననుభవింత్రు. 25

మ. నిను వీక్షించుటచేత నా నయనముల్ నీతోడ భాషించుటన్ జననాథాగ్రణి! నాదు వాణియును ధన్యంబుల్ మదీయాజ్ఞ గై కొని యీరాజ్యము నీవయేలఁదగు నీకున్ బట్టమున్ గట్టితిన్ జనుదున్ నేనిఁక నీ కనంతసుఖముల్ సంప్రాప్తమౌఁగావుతన్.

వ. అంత శ్రీనారాయణర్షి నారదునకిట్లనియె. 27

గీ. అని యిటులఁబల్కి గంతుకామునకు నయ్యగస్త్యమునిపుంగ వునకు నఖండభక్తి। వఱల చంద్రకళాభిఖ్య పరమసాధ్వి। మహి షియొనరించె నపుడు నమస్కృతులను. 28

వ. నమస్కరించిన రాజపత్నిని యవైధవ్యంబు నీకెప్పుడున య్యెడు భక్తిచేఁ బతిని సేవింపుము గోపీజనవల్లభుండగు శ్రీకృష్ణునియం దు నిరంతరంబు దృఢభక్తురాలవుగమ్మని యాశీర్వదించిన; నయ్యగ స్త్యమునిని బద్ధాంజలిపుటుండును వినయానతకంధరుండునై చిత్రబా హుండు మఱల నిట్లు ప్రశ్నించె. 29

చ. పొరిపొరి నాకుసంపదలు పొంపిరివోవఁగ నేల? రాజ్య మి త్తెఱఁగున నిస్సపత్నముగఁ దేజరిలం గతమేమి? భార్యయుం బరమపతివ్రతామణి కుమారకులుం గుణశాలు లెందునుం గొఱఁతవసింప దిట్లు సమకూరుట కేసుకృతంబుఁజేసితిన్? 30

గీ. నీదు శరణంబుఁజొచ్చితి నాదరించి। కరతలామలకంబుగాఁగాంచి దీనిఁ। దెలుపవేఁడెదనో మునితిలకయిపుడు। పలుకరానిదిగలదె? భవాదృశులకు. 31

వ. అట్లా రాజేంద్రుం డడిగిన నగస్త్యమునీంద్రుండు సమాహి తమనస్కుండై నృపసత్తమునితో నిట్లనియె. 32

క. ఏదర్శించితి సర్వము। నీదగు ప్రాక్తనచరిత్ర నీకువచింతున్
బ్రోది,నితిహాసయుతముగ। నాదరమునవినుముదానినంతయున్నృపతీ.

— { అగస్త్యుండు చిత్రబాహునకు గాతని పూర్వజన్మవృత్తాంతంబు దెలుపుట. } —

సీ. కడురమ్యమగు చమత్కారపట్టణమునందున మణిగ్రీవాఖ్యతోడ
మును। శూద్రుండవైనీవు శుభలక్షణములేక పరదారపరుడవు
నిరతజీవ। హింసాపరుండవు హేయచరిత్రుండవును దుర్వ్యసనీతుండ
వును కృతఘ్నుఁ। డవు నాస్తికుండవు ప్రవిమలశిష్టజనాచార
రహితుఁడవైతి, వీమె.

గీ. నీతలోదరిపూర్వజన్ సుసాధ్వి। వాఙ్మనసములకర్మసంవర్గము
లను। భర్తృసేవాపరాయణ పరమధర్మ। నిష్ఠ నీపయి దుర్మతి
నెఱపదెపుడు. 34

ఉ. జ్ఞాతులు సర్వబాంధవులు సైపఁగఁజాలక నీదు చర్యలన్
పాతకియంచు వీడ్కొనిరి పార్థివుఁడుంగడు క్రుద్ధచిత్తుఁడై
బ్రాఁతిగనున్న నీధనముఁ బైకొనిగైకొనియెన్ విశిష్టమున్
జ్ఞాతులు సంగ్రహించిరి నిశాంతము బాపి రశాంతచిత్తులై.

చ. ధనమిటులంతయుం జనినఁ దద్దయునీకు ధనాశవుట్టె ని
ర్ధనుఁడవటంచు నీదు వనితామణి సుందరి పేర్మిఁబాయకుం
డెను గడుసాధ్వియౌటను; కడింది తిరస్కృతి నిట్టు లందఱుం
బొనరుప నిర్జనాటవికిఁ బోయితి వత్తఱి జీవనార్థివై. 36

ఉ. సంభృతచాపబాణుఁడ వసాధుచరిత్రుఁడ వుగ్రదుష్క్రియా
రంభుఁడవై యరణ్యమృగరాజి వధించి నిరంతరంబు కు
క్షింభరివై చరించుచు నిషిద్ధవిధంబున; భార్యతోడను
జృంభిత ఘోరపాతకముఁ జేయుచు కాలముఁ బుచ్చుచుండఁగన్.

మ ఖగముల్ సర్పము లన్యవన్యమృగముల్ గారించునుగ్రాటవిన్
మృగమాంసార్థిత నొక్కనాఁ డలమణిగ్రీవుండు కాండంబులన్
నెగడంజేసి శరాసనాంతరమునన్, నిర్మానుషారణ్య మ
ధ్యగుఁడై క్రూరతజంతుసంతతుల నత్యంతంబుఁ దూఁటాడుచున్.

వ॥ తన ప్రాక్తన పుణ్యవిశేషంబున నొక్క సద్బుద్ధిపుట్టె
నది యెద్దియనిన. 39

ఉ. అందొక యగ్రదేవుఁడనునట్టి మునీంద్రుఁడు దారిదప్పి మ
ధ్యందిన భాస్కరప్రభలు దార్కొనఁ బెల్లుచరించి నీరు వ
ట్టొందివిమూర్ఛితుండగుచునుర్వరపైఁబడియుండ;శూద్రుఁడా
చందమెఱింగి జాలిపడి సత్వరమేగి తదగ్రసీమకున్ 40

చ. గుటగుట గొంతులో నుసురు కొండొకకొట్టుకయాఁడు బాడబుం
డటుకున లేవదీసి తన తావునకుంగొనిపోయి దంపతుల్
పటుతరసేవలన్ సలుప బ్రాహ్మణుఁడొక్క ముహూర్తమేగు పి
మ్మటను సచేతనుండయి సుమాళము విస్మయమాత్మ దోఁపఁగన్.

క. అచ్చటనుండిన నేనెటు। వచ్చితినిట కిద్ది యన్యవనముగనుండెన్
మెచ్చుగనను సేవించెడి। యిచ్చ పలాక్షియునునీతఁడెవ్వారలొకో

వ. శ్రీ నారాయణుండిట్లనియె. నట్లా బ్రాహ్మణుండు తన
మనంబున వితర్కించుచున్నంత మణిగ్రీవుండతనితో నిట్లనియె. 43

చ. మునివర యీసమీపమున ఫుల్లసరోజసువాసితంబు ని
స్స్వనదళిహంస శోభితము స్వాదుసుశీతలవారిసంయుతం
బనుపమమౌ సరస్సుగల దందునఁ గ్రుంకులువెట్టి పూర్వపున్
దినవిధిదీర్చి పండ్లుదిని నీరముఁగ్రోలి వసింపుమూఱటన్. 44

వ॥ అని మఱియు మణిగ్రీవుండు. 45

ఉ. కాననహింస్రజంతుముఖగహ్వరగామివి గాకయుండగా
నేనల కాననమునుండి నిను నిచ్చటకున్ గొనివచ్చితిన్ మహా
మానవరేణ్య! లెమ్మికఁ బ్రమాదములేదన నుగ్రదేవుఁడ,
వ్వానివచస్సులన్ విని పిపాసనుదెల్పుచులేచి యంతటన్ 46

ఉ. చేవయొకించుకంతయు వసింపమి దేహమునందు నమ్మణి
గ్రీవుభుజంబు నూతఁగొని గెంటుచునేగి సరస్తటంబునన్
శ్రీవిలసద్వట ద్రుమమునీడ నొకించుకవిశ్రమించి యా
పై విధులెల్లఁ దీర్చుటకుఁ బాఱుఁడుస్నాన మొనర్చెఁ గ్రమ్మఱన్.

సీ. ప్రథితంబుగా నిత్య విధియంతయుం దీర్చి వాసుదేవునిపూజనఱలసల్పి
దేవతలను బితృదేవతలను తర్పితులఁ జేసి శీతలజలముఁ గ్రోలి
తటవటవిటపిచెంగట నటమటవాయఁ జేరి తచ్ఛాయ నాసీనుఁడైన,
ప్రియురాలితో మణిగ్రీవుండు తత్పదమ్ములకు నమస్కారమును రచించి

గీ. మమ్ముఁ దరియింపఁజేసెడి మానసమున। నరుగుదెంచితి విపుడు నా
యాశ్రమమున । కరిగె నీదర్శనమున నాదురితమెల్ల, యనఘ
కొనుము మదాతిథ్యమును మునీంద్ర! 48

వ. అనిన యతనికిం బల్కక మణిగ్రీవుండు ప్రియురాలింగనుంగొని

ఉ. పమ్మిన ప్రీతి స్వాదుపరిపక్వ రసాలఫలమ్ము లిద్ధమూ
లమ్ములు మౌనికోసము విళంబనమించుకయున్ రచింపకే
తెమ్మని భార్యకాజ్ఞయిడఁ దెప్పున నాయమ యేగి వానినిన్
సమ్ముద మొప్పఁ దెచ్చి యిడె సంయమినాయకు ముందటన్ దగన్

వ. అంత మణిగ్రీవుండు మఱల మునిసత్తమునకిట్లనియె. 51

క. ఫలములు మూలంబులు నగ్గలముగ దేఁబడియె మౌనిగణసంస్తుత నీ
వలసినయవి గైకొని మమ్ములను గృతార్థులను జేయుము మునివరేణ్యా

వ. అనిన నుగ్రదేవుండిట్లనియె. 53

ఉ. ఎవ్వఁడ వీవు? నీదయిన వృత్తమదెద్ది? యరణ్యసీమలో
నివ్వనితాసహాయుఁడుగ నీగతినుండఁగ నేమి హేతువో?
నెవ్వడిఁ దెల్పఁగావలయు నిక్కమెఱుంగక బ్రాహ్మణోత్తముం
డెవ్వనివద్ద నెద్దిభుజియింపఁగరాదని యండ్రు కోవిదుల్. 54

—(మణిగ్రీవుం డుగ్రదేవునకు నిజవృత్తాంతము సెప్పుట)—

ఉ. ఓవిబుధాగ్రగణ్య విను మొయ్యన, నేనొక శూద్రుఁడన్ మణి
గ్రీవ సమాఖ్యుఁడన్ ననునకించను జేసిరి యెల్ల బాంధవుల్
భూవిభుఁడున్ సమస్తధనముం గొనెఁ గ్రూరత నక్కతంబునన్
దావమునందు నిట్లు నిజదారసహాయుఁడనై చరించెదన్. 55

గీ. పాదసంభవుఁడీరీతిఁ బలుకదెలిసి । యమ్మునీంద్రుండుకడుఁ బ్రసన్నా
త్మకుఁడయి । ఫలములును మూలములు మెక్కి జలముగ్రోలి।తరుల
నీడను చిఱుత తెమ్మెరలువొలయు. 56

శా. ఆసీనుండయినన్ సతీసహితుఁడై యంఘ్రిప్రజాతుండు ప్రో
ల్లాసంబొప్పఁ దదంఘ్రు లంకగతము ల్గావించి పెన్బత్తి నెం
తే సంవాహనమాచరించుచుమ; మీ రెందుండి యొందేగుచుం
ద్రాసావాసము నియ్యరణ్యము మునీంద్రా! సేనారోయనన్.57

వ. అనిన నుగ్రదేవుండిట్లనియె. 58

ఉ. ఆగమపారగుండనగునట్టిఁడ నేనొకపాఱుఁడన్ మహా
భాగ! ప్రయాగముంజనెడుభావమునన్ బయనించితిన్ దిశా
భాగముదప్పి యియ్యడవిపాలయి దూపిలి ప్రాణము ల్పరి
త్యాగముసేయునుండ నిటదానముసేసితి వీవుప్రాణముల్ 59

ఉ. కావున నేనునీకు నొసఁగందగనట్టిది యుండునే? మణి
గ్రీవసమాఖ్య! యీయడవికిన్ భవదీయసతీయుతంబుగా
నేవగ నీవువచ్చితివొ యింతయు దాఁపక నాకుఁదెల్పుమీ
తావకదుఃఖమంతయును దప్పక తీరిచిపుత్తు వేల్మిడిన్. 60

వ. అంత నగస్త్య మహర్షి యిట్లనియె. 61

మ. లలితాలాపము లిట్టు లాద్విజుఁడు వల్కన్ శూద్రుఁడాలించి యి
మ్మల నమ్మానికి నూరటంగొలిపి యాపూర్వోదితోదన్, నిజా
విలదార్గత్యసముద్రముం గడువఁగాఁ బెట్టన్ స్వపాపక్రియా
ఫలవృత్తాంతము పూసగ్రుచ్చినగతిన్ బల్కెనమ్మానితోన్.62

వ. మణిగ్రీవుండిట్లనియె. 63

ఉ. ధీరులు శూరులుం గలిగి దృక్కులకున్ రమణీయమౌ చమ
త్కారపురంబునందు నిజదారసమేతుఁడనై వసించెదన్
భూరిధనాఢ్యుఁడన్ సుజనపూజకుఁడన్ బ్రపవితుఁడన్ మహో
దారుఁడ, దైవయోగమునఁ దద్దయు దుర్మతి నాకుఁ బుట్టినన్.

ఉ. డబ్బధికంబుగా బలియుటం ధనగర్వముపుట్టి బిట్టుగం
గొబ్బరికాయకున్ వలెనె కొండొక కన్నులు నెత్తికెక్కి త

బ్బిబ్బులు మాటలాడితి బిభీషకలన్ వెలయించితిఁ సదా
లిబ్బియె శాశ్వతంబని మలీమసవృత్తి కుపక్రమించితిన్. 65

మ. నిజధర్మంబుల నుజ్జగించితి మహానీచుండనై యన్యవా
రిజనేత్రాభిరతిన్ వసించితిని మైరేయాదులన్ ద్రావితిన్
బ్రజలెల్లన్ బరిభీతులై వడఁకఁ జౌర్యద్యూత హింసాదులన్
విజయిత్వంబును గంటి నిట్లధికపాపిష్ఠుండనై యుండగన్ 66

ఉ. బాలిశుఁ డుగ్రపాపుఁడు కృపారహితుండని నన్ను నెల్లచు
ట్టాలు పరిత్యజించిరి తుటారములాడి బృహద్బలాఖ్య భూ
పాలుఁడు నా ధనంబుగొనె బంధుగులొందిరి శిష్టవిత్త మీ
లీలఁ దిరస్కృతుండనయి లేమిడిచేత వనంబు జేరితిన్. 67

ఉ. ఈవనమందు జంతువుల హింసయొనర్చుచు భార్యతోడుతన్
జీవిక నిర్వహించుచు వసించుచునుంటి వినింద్యవృత్తితో
వావిరి పూర్వపుణ్యమున వచ్చితి వీవు మునీంద్రసత్తమా
తావకసత్కృపంగొలిపి తద్దయునుమ్ము ననుగ్రహింపవే 68

శా. ధీరాగ్రేసర మానిసత్తమ భవద్దివ్యాంఘ్రియుగ్మంబు నే
దారోపేతుఁడనై హృదంతరమునన్ దధ్యంబుగా నమ్మితిన్
దారిద్ర్యమ్ము హరించి సంపదల నత్యంతంబుఁ జేకూర్ప నీ
కారుణ్యంబున నెద్దియైన నొకమార్గంబున్ గటాక్షింపవే 69

వ. అనిన నుగ్రదేవుండిట్లనియె 70

క. నీవు కృతార్థుఁడవు మణి। గ్రీవాయాతిథ్యమిపుడు ప్రీతిని నాకున్
గావించితివా హేతువు। చేవడిఁ గల్యాణమీవు సెందెదు సతితోన్.

మాలిని. వలవదు వ్రతచర్యల్ వల్వ దాతీర్థయాత్రల్
వలదు ధనపుటీగుల్ వల్వ దాభీలరీతుల్
తొలఁగిచనఁగ నీకీదుష్టదారిద్ర్య బాధల్
సులువయినవిధంబున్ శూద్రవర్యా వచింతున్ 72

సీ. ఇటువైధృతీయమైయేతెంచుమాసంబుపురుషోత్తమాఖ్యమైపొల్చు,
దీపదానంబు సేయుఁడీ దంపతుల్ మీరలు పురుషోత్తమప్రీతికొరకు
నందుఁ। దత్కారణమున నీదారిద్ర్యభారమ్ము లయముసందును

సమూలంబుగాను । తిలతైలమున సేయవలయును వైభవంబలరిన
ఘృతముతో సలుపవలయు
గీ. అడవినడుమను వసియించునట్టి నీకు । రెండునయ్యువిలభియింప
కుండెనేని । గారకాయలనూనియ చేరచింప । నగును తన్మాస
మంతయు నరుగుదనుక 73
ఉ. ఆనెల నీసరోవరమునందున నిత్యము భార్యతోడుతన్
స్నానమొనర్చుచున్ నియతి సల్పుము నీవిట్లు;లాతిధేయముల్
మానుగనాకొనర్చుటను మంచిమనస్సును దాల్చి తెల్పితిన్
దీనినె నీకుఁ బెద్దయుపదేశముగా నిగమార్థసారముల్ 74
క. అటుగాక దీపదానం । బెటునేసిన సిరిఘటించు నెల్లజనులకున్
పటువిధినా నెలయం దుత్కటభక్తి నిసలుపఁజెప్పగలమెసుకృతముల్
సీ। వేదోక్తకర్మముల్ వివిధదానంబులు సకలతీర్థంబులుశాస్త్రగణము
జ్ఞానంబు యోగంబు సాంఖ్యంబు తంత్రముల్ కృచ్ఛ్రచాంద్రా
యణాగ్నియవ్రతములు । వేదపాఠంబు మహోదయాదులు గయా
శ్రాద్ధంబు, లుపరాగశతశతంబు । గోమతీతటసేవ కురుముఖ
క్షేత్రముల్ దండకప్రముఖకాంతారములును
గీ. మఱియునున్ వ్యతీపాతముల్ హరిక్రీతి । యమర పురుషోత్త
మాఖ్యమాసమున నుంచు। దీపషోడశభాగంబు దాపునైనఁ । జేర
లేవని తెలియుమీ చిత్తమందు 76
చ. గొనకొని నీకుఁ దెల్పితిని గుహ్యతమంబిది యెట్టివారికిన్
బనుపడఁ జెప్పఁగూడనిది వత్స భవత్కృతమైనసేవచే
దనిసి యిటుల్ వచించితిని దద్దయు నీక్రియనాచరింపుమీ
ధనమును ధాన్యమున్ బహువితానము పుత్రులు కీర్తిగల్గెడిన్
సీ. వంధ్యాత్వమును మాను వంధ్యాసమూహంబు వైధవ్యమును
బాయు వారిజాక్షి । రాజ్యవిభ్రష్టుండు రాజ్యంబునొందును చింతి
తార్థంబును పొందునరుఁడు।చిరజీవిగుణోవిభుఁ జేకొనుకన్యకవిద్యార్థి
పొందు సద్విద్యలెల్ల । కాంతార్థిగాంచును కాంత ఘుశీలనుసిద్ధి
కాముండు సుసిద్ధినందు.

గీ॥ కోశకాముకుఁడగు వాఁడుకోశ మొందు। మోక్ష మర్థించు
మర్త్యుండు మోక్షముఁగను। నుడిగి విధిశాస్త్రములు పురుషోత్తమ
మున। దీపమిడుమాత్ర నఖిలసిద్ధియుఘటించు 78

వ॥ వత్సా విధివంతంబుగ బ్రయత్నంబుతో దీపంబు నీపురుషోత్తమమాసంబుననుంచినవారి ఫలంబింక నేమని వర్ణింపఁగల్గుదు; కావున నమ్మాసంబున పురుషోత్తమ ప్రీతిగా దీపంబుబెట్టవలయు తావకంబగు తీవ్రదారిద్ర్యనాశకంబుగ నిది నీకుపదేశించితి నీకుస్వస్తి యగుంగాక నీసేవచే మిక్కిలి సంతోషించితినని యుగ్రదేవుండు మణిగ్రీవునితోఁ జెప్పెనని మఱియు నగస్త్యుండా రాజేంద్రునితో నిట్లనియె.

క. అనిపలికి యుగ్రదేవుఁడు। మునుకొని శ్రీహరినిద్విభుజమురళీహస్తున్
ధనదాదివందితుని మన। మునధ్యానించుచు బ్రయాగమునకున్
జనియెన్ 80

గీ. తమకునాశ్రమమునుండి తరలిద్విజుని। తోడ నాదంపతు లను
గతులయి మాస। మాత్ర; మెంతయు హర్షితమానసులయి
మఱలివచ్చిరి తన్మాని కెరగిభక్తి 81

క. అరుదెంచితమకుటెంకికిఁ। బురుషోత్తమమాసమందుఁ బూనినభక్తిన్
జరిపిరి మాసయుగముభూ। సురపాదనిలీనమానసులువారునృపా.

క. అరుగన్ మాసయుగముశ్రీ। పురుషోత్తమమేగుదేర ఫుల్లమనోవా
రిరుహులయిదీపమునువారిరుపురుహరిహితముకొఱకునిడిరతిభక్తిన్

గీ. స్థిరములగు వైభవములు ప్రాప్తించుకొఱకు। నింగుదీతైలమును
దెచ్చియిడిరి దీప। మిటుల నాదంపతులు రచియించుచుండ।మహి
తపురుషోత్త మాభిఖ్యమాసమరిగె. 84

గీ. ఉగ్రదేవమునీంద్రు ననుగ్రహమున। వాఙ్మనఃకాయ జనిత పాపం
బులుడిగి। కాలవశమునుజెంది సంక్రందనీయ। పురవరంబునకేగి
రయ్యిరువురధిప. 85

సీ. అచటన్భోగంబుల నన్నియునంది యాస్థిరపైనిభారతాజిరమునందు
ఉగ్రదేవునిమహానుగ్రహంబునఁజేసియుత్తమంబగుజన్మమెత్తిపీర

బాహుపుత్రుఁడుచిత్రబాహు వైపుట్టెతీవివసుమ్మామ్రఘోరజీవహింస
కెరలిచేసిన మణిగ్రీవుండ వీచంద్రకలనీదుసతి వాని కాంతమైన.

గీ. సుందరీనామ్ని;సాధ్వియైక్షుద్రుఁడైన। పతిని దైవంబుగా నెంచిపాయ
కుంట । నీకు నర్ధాంగియై యిప్డునిఖిలసుఖము । లనుభవించుచు
నున్నది మనుజనాథ. 86

క. పాతివ్రత్యపు ధర్మము । చేతను వసియించినం; గు శేశయనేత్రల్
చేతో నాధరచిత వి । ఖ్యాతసుకృతమందు నర్ధమందుదురనఘా.87

క. పురుషోత్తమమాసంబున । స్థిరముగ దీపంబు నింగుదీ తైలమునన్
విరచించినసుకృతంబున।బాలయంగలిగితివి రాజ్యము;నకంటకమున్

క. విలసిల్లఁగ ఘృతముననో । తిల తైలముననో యఖండదీపంబిడ నీ
నెలయందున;దత్పుణ్యము ।పలుకంగలఁడేసహస్ర వదనుండైనన్

క. పురుషోత్తమదీపంబున ।వఱలినఫలమిద్ది నిక్కువము నీకు నృపా
పరమోపవాసముల నా । చరింపఁదత్ఫలమునింకశక్యమెపొగడన్

వ. అంత వాల్మీకిమహర్షి యిట్లనియె. 91

గీ. కలశజమునీంద్రుఁడిట్లు సాకల్యముగను । చిత్రబాహునిపూర్వచారి
త్రమపుడు । దెలిపియుడుగరలనుబొంది దీవనలిడి శౌరికీర్తించుచు
ను యదేచ్ఛముగఁజనియె. 92

వ. అనిచెప్పిన శ్రీవాల్మీకిమహర్షిం జూచి దృఢధన్వుండిట్లనియె॥

క॥ పురుషోత్తమమాసనము।ద్ధురవ్రతిజనంబునకుఁ బ్రతోషముగమునీ
శ్వరయుద్యాపనవిధిగురుకరుణామతినిపుడు దెల్పగద వెక్రమముగన్

వ॥ అనిన వాల్మీకిమహర్షి యిట్లనియె॥ 95

—(వాల్మీకి దృఢధన్వునకు వ్రతోద్యాపనవిధి దెల్పుట)—

గీ॥ పూజ్యపురుషోత్తమవ్రతపూర్తి కొరకు । తద్వ్రతోద్యాపనస్థవిధా
నమెల్ల । వివరణమొనర్తు రాజేంద్ర యవధరింపు । సమధికశ్రద్ధ
నారీతిసలుపఁజెల్లు॥ 96

వ॥ శ్రీపురుషోత్తమమాసంబునఁగృష్ణపక్షంబునజతుర్దశియం
దేని నవమియందేని యష్టమియందేని యథాలబ్ధోపహారంబుచే
నుదీరితక్రమంబున నుద్యాపనంబుసేయవలయు, అట్టిపుణ్యదినంబున

ప్రాతఃకాలంబున లేచి పౌర్వాహ్ణికక్రియలాచరించి స్వస్థచిత్తుండై సదాచారులును విష్ణుభక్తిపరాయణులును సపత్నీకులునగు ముప్పం ద్రుబ్రాహ్మణులను నిమంత్రింపవలయు శక్తి చాలనివారు పదుగుర నుగాని ఏగురనుగాని విత్తానుసారంబుగ నిమంత్రింపవలయు, పిదప మధ్యాహ్న సమయంబునఁ దూమెఁడేని తదర్ధంబేని తదర్ధంబేనియుఁ దమతమశక్త్యనుసారంబునఁ బంచధాన్యంబులనునిచి ఉత్తమంబగు సర్వతోభద్రంబు నాచరింపవలయు నమ్మండలంబునశుద్ధంబులును అవ్రణంబులునునగు నాలుగుకలశంబులు హైమంబులేని రాజతం బులేని తామ్రవికారంబులేని మృణ్మయంబులేని శ్రీఫలాన్వితంబులు గను సద్వస్త్రవేష్టితంబులుగను నాగవల్లీదళసంయుతంబులుగను సల్పిచతుర్వ్యూహప్రీతికై నల్దెసలస్థాపింపవలయు॥ 97

క॥ చెలువముగ వాసుదేవుని। హలధరుఁ బ్రద్యుమ్న దేవుననిరుద్ధునిద
త్కలశచతుష్టయమందున। నిలుపందగునయ్య! ధారణీపతితిలకా

గీ॥ ప్రకృత పురుషోత్తమవ్రతారంభమందు । రాధికాదేవదేవవిరాజి
తముగ । స్థాపితంబైనఘనకలశంబుదెచ్చి ।మండలంబందునటన
డుమ నిడవలయు. 99

వ॥ వేదవేదాంగపారగుండగు విష్ణుభక్తాగ్రేసరు నాచార్యుఁ గాఁజేసికొని జపార్థియై నలుగురవిప్రవరులను వరింపవలయు హస్తము ద్రాదిసంయుతంబులైన రెండురెండు వస్త్రంబులు వారలకొసంగ వలయు వస్త్రభూషణాదులచే నాచార్యులనలంకరించి పిమ్మట దేహశుధ్యర్థంబు ప్రాయశ్చిత్తంబాచరించికొనవలయు అటుపైఁ బూర్వంబునఁజెప్పిన తెఱంగునసతీసహితుండై పూజగావింపవలయుఁ బిదప వరించిన నల్వురు బ్రాహ్మణులచేఁజతుర్విధంబగు చతుర్వ్యూ హజపంబుఁజేయింపవలయు నల్దెసల నుద్ధృతంబులగు దీపంబులుం చవలయుఁబిదప నారికేళాదులచే నర్ఘ్యదానంబు క్రమంబుగఁజేయ వలయు॥ 100

సీ॥ జానుద్వయమున సంసక్తభూతలుఁడయి యాత్మీయపాణిపుటాం
తరవాసనఁబంచరత్నంబుల నంచితంబుగఁగూర్చి లభియించినట్టి

ఫలములతోడ । శ్రద్ధయు భక్తియు స్వాంతంబునందాల్చి నిజ పత్నితోఁబ్రీతినివ్వటిల్ల । శ్రీహరిపై మదిచెదరకుండఁగనిల్పి దేవ దేవా! వసుదేవతనయ!

గీ॥ ప్రాణికోట్యంతరస్థలోకైకనాథ। రాధికోపేతవరదపురాణపురుష యజహరేంద్రాదివంద్య తుభ్యంనమోయ । టంచుఁ బురుషోత్తమునకు నర్ఘ్యమిడవలయు॥ 101

క॥ మురళీధరునిన్ ద్విభుజుని పురుషోత్తము నూత్న వారిముక్నముఁబీతాంబరధరు రాధాసహితున్ గరివరదునమస్కరింతుఁగలుషంబెడలన్

గీ॥ ఇత్తెరంగున రాధతో బొత్తుసేయు హరికిమ్రొక్కులనిడి చతుర్థ్యంతములగు ॥ నామమంత్రంబులందిలహోమకృతిని । విధివిధానంబుగా నెరవేర్పవలయు॥ 103

వ॥ అంత దదంతంబునఁ దన్మంత్రంబులచే తర్పణమార్జనంబులాచరింపవలయు॥ 104

క॥ కందర్పకోటిసుందర । యిందీవరసదృశదేహ యిందునిభాస్యా బృందారకార్చితపదయనిందితగుణయిడితికొనుమునీరాజనమున్.

వ॥ అని సరాధుండగు భగవంతునకు నీరాజనం బర్పింపవలయు మఱియును॥ 106

సీ॥ రమణీయమణిరత్న రాజితసింహాసనాంతరాళంబునందలరువాని
మురళీనినాదసంమోహితవ్రజవధూబృందావనమునన ర్తించువాని
గణనీయకౌస్తుభమణిరుచిప్రద్యోతితోరస్థలంబుచే నొప్పువాని
రాజితబహురత్నరచితకిరీటకుండలహారదీప్తులఁ బొలుచువాని

గీ॥ హేమపీతాంబరము ధరియించువాని । అఖిల ప్రాణ్యంతరజ్యోతి యైనవాని । రాధికోపేతుఁడై యలరారువాని । నిందుమనమున నిట్లు ధ్యానింపవలయు॥ 107

వ॥ తదనంతరంబున॥ 108

గీ॥ మూర్తులనుగొన్న తావకకీర్తులనఁగ । ధవళధవళంబులగు సుమ తతులనివిగో। యంజలిని నినిచి నీకు నేనప్పనంబు। సేయుచున్నాడ హరి కటాక్షించి కొనుము॥ 109

వ॥ అని హరికిఁ బుష్పాంజలి సమర్పించి॥ 110

క॥ నవజలదశ్యామా! పీ । తవసన! శ్రీవత్సవిలసితమహోరస్కా!
భవరహిత రాధతోడఁ హవణిల్లెడు దేవ! నాజోహారుల్ గొనుమా

వ॥ అని గృహిణీసహితుండై సాష్టాంగనమస్కారంబు సేయ
వలయుఁ బిదపసహిరణ్యకంబుగా బ్రాహ్మణునకుఁ బూర్ణపాత్రంబు
నొసంగవలయు॥ 112

ఉ॥ ఆర్యజనాగ్రపూజ్యుని నిజాంగనతో వసియించువాని నా
చార్యుని దివ్యవస్త్రములఁ జారుతరాభరణంబులన్ మహో
దార్యము లర్ప భూరితరదక్షిణలన్ బరమార్థదృష్టిమై
భార్యయుఁ దాను తద్వ్రతిప్రపత్తి సమర్చితుఁ జేయఁగాఁదగున్॥

వ॥ అటుపిమ్మట ఋత్విజులను జక్కఁగా దక్షిణలొసంగవయు

సీ॥ సాధుశీలయు సవత్సయు పయస్వినియును గళవిలోలద్ఘంటికా
భరణయు। హేమశృంగియుఁ దామ్రపృష్ఠియు రౌప్యఖురప్రభూషిత
యు వస్త్రసహితయును । నగునొక్క ధేనువు నవనినిర్జరునకు సంవ
త్సరగ్రాససంయుతముగ । దోహనార్థంబుగాఁ దోరంపుపాత్ర
తో దానంబు సేయఁగాఁదగును భక్తి

గీ॥ అవలఘృతపాత్రదానంబు నాచరింప । వలయుఁ దిలపాత్రమీయఁ
గావలయు నట్లె । మఱియు నిడ నా నుమామహేశ్వరముదంప
తులకుఁ బరిధానకంబు నో యలఘుచరిత॥ 115

వ॥ పిదప అష్టవిధంబగు త్రయోదశపద దానంబులును ఉపా
నద్యుగలంబును దానంబు సేయవలయు॥ 116

క. తిలలోహజాతరూపంబులు కార్పాసంబులవణమున్ ధారిణి గోవులు
సప్తధాన్యములు బహు । కలుషహరము లగుడు నష్టకంబిడవలయున్

వ. వ్రీహియవగోధూమముద్గ మాషప్రియంగు చణకంబులు
సప్తధాన్యంబులు 118

క. శ్రీమద్భాగవతంబును । భూమిపతీవిప్ర వైష్ణవునకిడవలయున్
శ్రీమద్భాగవతంబన । నేమెయిఁ బ్రత్యక్షవిష్ణువేసుమి జగతిన్. 119

చ. అనఘునకుఁ బుధాగ్రణికి నచ్యుతభక్తున కివ్విధంబుగా
గొనకొనియిచ్చువాఁడు కులకోటిఁదరింపఁగఁజేసి యప్సరో
జనపరిసేవ్యమానుఁడయి చారువిమానమునెక్కి వేగ నే
గును ఘనయోగిదుర్లభము గోసమభిఖ్యములోక రాజముఁ 120

గీ. చలముచిత్తంబు విత్తంబు చాచలంబు। చలముజీవిత మిట్లని చాలి
సిమిగుల। శక్తి కొలఁదిని చతురుఁడై జాగులేక।ఉక్తవిధదానములఁ
జేయనొప్పునధిప 121

మ. ధనదానంబులు ధాన్యదానము లిలాదానంబులుఁ గన్యకా
జనదానంబులు వాజపేయముఖయజ్ఞంబుల్ తులాదానముల్
ఘనదానాష్టకముల్ మఱెన్నియయినంగానీ! జగన్మండలిఁ
జననాథా! యెటువోలు భాగవతదానంబందుఁ గోట్యంశముఁ 122

గీ. కావునను విష్ణుభక్తుఁడౌ బ్రాహ్మణునకుఁ। గనకసింహాసనాసీనుగా
నొనర్చి। చేలభూషణములను గైసేసి భక్తిఁ। బెనఁగి భాగవతంబు
నర్పింపవలయు 123

గీ, బ్రాహ్మణులకీయఁగాఁదగుఁబరగఁగాంస్య। సంపుటంబులు ముప్పది
సంతరించి। వానిలోపల నొక్కొకదానియందు। ముప్పదిగ ము
ప్పదిగనుంచి యప్పములను; 124

గీ. ఎన్ని ఛిద్రంబులుండునో యిచ్చినట్టి। యయ్యపూపంబులందున;
నన్నివేల। యేండ్లు వైకుంఠమున వసియించిమర్త్యుఁ। డనుపమ
సుఖంబు లనుభవించును నృపాల 125

వ। పిదప నవ్వారెయ్యది సెందినపాలి రాకుందు;రట్టిదియు జ్యోతిర్ధామంబును సనాతనంబును నిర్గుణంబును యోగి దుర్లభంబున గు గోలోకంబునకుఁ జనుదురు మఱియు సార్ధప్రస్థద్వయంబు కాంస్య సంపుటంబుచెప్పఁబడియెఁ గావున నిర్ధనుండు వ్రతపూర్తికై శక్తినతిక్ర మింపక చేయవలయు అట్లును కాదేని సఫలంబును సపక్వంబునునగు నపూపసామగ్రినటనునిచి పురుషోత్తమప్రీతికొరకు నిమంత్రితులగు సశ్రీకవిప్రుల కొసంగవలయు. మఱియు పురుషోత్తమసాన్నిధ్యంబున సంకల్పంబుసేసి యవ్వాలనిట్లు ప్రార్థింపవలయు 126

ఉ. చేసిన నామదోసములు చిందరవందరచేసి వేగమే
గాసి తొలంగఁ జేసి భవికప్రకరంబుఘటింపఁజేసి నీ
దాసులలోన నన్ను నొక దాసునిగాఁ దలపోసి ప్రోవఁగా
దోసిలియొగ్గినాఁడనిదె త్రోయక కావఁగదే జనార్దనా! 127

గీ. విష్టపాధార హార్జితవిష్టపగణ । విష్టపాధీశ శ్రీకృష్ణ విబుధవంద్య
యైహికాముష్మికార్థంబు లఖిలములును । నవఘళింపఁగఁ జేయు
మహాత్మ నాకు 128

వ. ఇవ్విధంబున గోవిందుని ప్రార్థించి మనంబున సప్పురుషోత్తముని సంస్మరించుచు సదాచారులును సపత్నీకులునగు బ్రాహ్మణులను భక్తితో విధివంతముగఁ బూజించి ఘృతపాయసంబులిడి వారిని భుజింపఁజేయవలయు. 129

గీ. ఎఱిఁగి ద్విజరూపమునుహరియే యుమటంచు। శ్రీస్వరూపంబుఁదలఁచి
రాధికయటంచు । భోజనార్థంబుసంకల్పమునురచింప। వలయుఁబు
రుషోత్తమవ్రతి తలఁగకవిధి; 130

సీ. రంభలుద్రాక్షలామ్రములులోనగు ప్రపక్వములైననానాఫలముల
తోడ । ఆజ్యపాచితపుఁబక్వాన్నజాలముతోఁ బ్రశస్తమాషకష్ట[1]
సమితితోడ । శర్కరాఘృతవిశేషంబులతోడ ఫాణిత[2]ఖండమండక[3]
వితతితోడ । ఉర్వారుముఖ్యశాకోత్కరంబులతోడ నార్ద్రికజంభ
చయంబుతోడ

గీ. వాసితంబగు గోరసప్రతతితోడ। వలయుగతిపరివేషణములనొనర్చి
పొలుపుమీరఁజతుర్విధ భోజనముల । షడ్రసంబులతోడ నొసంగ
వలయు. 131

ఉ. మీమనిమిత్తమై యిటుల, మేకొనికూర్చితి మిక్కుటంబుగా
స్వాదువులైన వస్తువులఁ జక్కఁభుజింపుఁడు పాచితంబులన్
నానుభవంబుసార్థక మనంబడియొంగద నేఁడటంచు సం
మోదముతోడభోజనము భూసురపాళికిఁ బెట్టఁగాఁదగున్ 132

1. వడియము, 2. కండచక్కెర, 3. మండిగలు.

గీ. పోసఁగ నేలాలవంగ కర్పూరములును । నాగవల్లీదళంబులు పూగ
ములును । బరగ కస్తూరి సుధయును; హరికిఁబ్రీతి। వెలయఁ దాం
బూలమర్పింప వలయుననఘ. 133

క, ఇవ్విధముగఁదాంబూలము । నెవ్వం డర్పించుద్విజుల కిద్ధగుణులకుఁ
నివ్వటిలు నతని కిలసుఖ। మవ్వలమోక్షంబుగలుగుననఘ చరిత్రా!

గీ. అలరఁగాఁ జేసియిటు సభార్యులనుద్విజుల । మోదకంబులఁదత్కర
ములనిడఁదగు । లలనలను విధితోడనలంకరించి। వారికర్పింపఁగాఁ
దగు వైణవ్రులను. 135

వ. పిదప నాబ్రాహ్మణుల నాసీమాంతంబుగననుసరించి చని
సాగననుపందగు నవ్వల"మంత్రహీనంక్రియాహీన"మనుమంత్రంబునఁ
బురుషోత్తమునికుమాపణంబువేడి "యస్యస్మృత్యాచనామోక్త్యా"
యనుమంత్రంబుచే జనార్దనునినమస్కరించియూనంబైనదానినిపూర్ణం
బుగావించి సుఖంబుగాఁ జరింపవలయు 135

గీ. భూతజాలంబునకుఁ గుత్సఁబూనకవిభ । జూచి యన్నం; బసత్యభా
షితములుడిగి । స్వజనములఁగూడి మిక్కిలిసంతసమున । భోజనం
బును వ్రతిసేయఁబోలుభూప. 137

క. అమవసవచ్చిన జాగర । ణముతో నారాత్రి కమలనయనునిరాధా
సముపేతుని స్వర్ణమయుఁ । బ్రమదంబునఁ బూజసేయవలయు
నరేంద్రా! 138

క. తరుణీసహితుండై వ్రతి । పురుషోత్తమునిఁ సరాధుఁబూజాంతమునం
దెరఁగిముదంబుమనంబున । నొరపుగ; నొనరింపవలయు నుద్వాస
నముఁ. 139

గీ. అవలనాచార్యునకు నుపహారమొసఁగి । యన్నదానంబుసేయఁగా
నగును; మఱియు । నేయుపాయంబుచేనైన నీవ్రతంబు।సలుపఁదగు
దానములనిచ్చి శక్తి కొలఁది. 140

గీ. భూరిభక్తినిరు లేనినారు లేని । యీవ్రతంబునునొనరించి రేనిజన్మ ।
జన్మములకునుదారిద్ర్యజనితదుఃఖ। ములనుమఱియన్యదుఃఖముల్
పొందరనఘ. 141

క. లోకంబున నీవ్రతమును । సాకల్యంబుగను జేయు జనులైహిక సౌ
ఖ్యాకలితులగుచుఁబిదపన్ । వైకుంఠంబేగఁగలరు వైమానికులై.

వ॥ అంత శ్రీ నారాయణర్షి నారదునకిట్లనియె 143

శా. శ్రీకృష్ణప్రియమైనమాసమున నీరీతిం జనుండెవ్వఁడేన్
వీఁకంబ్రోక్త విధిప్రకారముగ సేవింపంగ శ్రీకృష్ణున
స్తోకాఘంబులఁబాసి, సౌఖ్యమిలయందుంగాంచి యాపైని గో
లోకంబుంజని వాఁ డదభ్రసుఖలోలుండై వసించున్ జుమీ 144

—(వా, దృ. గృహీతనియమ మోక్షణంబుచెప్పుట)—

వ. అంత నారాయణర్షి నారదునితో నిట్లనియె. నట్లు వాల్మీ
కి మహర్షి దృఢధన్వునితో నుద్యాపనానంతరంబు వ్రతనియమమో
క్షణంబుసెప్పెదవినుమని యిట్లనియె 145

గీ. పాపజాలంబులవి పటాపంచలగుచు । వెడల శ్రీగరుడధ్వజ ప్రీతి
కొరకు । పొలుపుగవచింతువినుఁ విధిపూర్వకముగ । నవనిప!
గృహీతనియమ సంత్యాగములను 146

సీ. నక్తభోజనమునోనర్చినవాఁడు సద్విప్రులకన్నంబుఁ బెట్టవలయు
భక్తినయాచితవ్రతియైన యాతండుసువర్ణదానంబునుసలుపవలయు
అన్నంబునమపసఁదిన్న యాతఁడుసదక్షిణగోప్రదానంబుసేయవలయు
స్నానంబుధాత్రితోసల్పినట్టిఁడుదధియేనిక్షీరంబేని యిడగవలయు.

గీ. ఫలములర్పింపఁదగు ఫలభక్షకుండు । తైలదేశంబునన్ నేయి తగు
నొసంగ । ఆజ్యదేశంబునన్ క్షీరమగునొసంగ । ధాన్యరతుఁడిడఁదగు
శాలితండులములు 147

వ. మరియు నాధాన్యరతుండు గోధూమములైననొసంగఁదగు.

చ. అవనిపయిన్ శయించి నిశలందు; వ్రతంబొనరించియుండినన్
ధవళపరిచ్ఛదాన్వితము తల్పముతూల వినిర్మితంబు భూ
ధవ!యొసగంగఁజెల్లు, నది దాతకుదానముగొన్న వానికిన్
దవులఁగఁజేయు సౌఖ్యము నితాంతముశ్రీహరితుష్టిగాంచెడిన్ 149

చ. సనియతిఁబత్రభోజనము సల్పినచో ఘృతశర్కరాక్తభో
జనమిడనొప్పు; మౌనమునుసల్పినఘంటఁదిలల్ హిరణ్యమున్

జొనిపి యిడఁదగుఁ మఱియు శుద్ధఘృతంబున భోజనంబులఁ
గొనకొని విప్రదంపతులకుఁ బ్రియమొప్పఁగ బెట్టఁగాఁదగుఁ.
సీ. నఖకేశములుదాల్చినంబురుషోత్తమవ్రతిదర్పణంబీయవలయుభూప!
పాదుకాసంచారపద్ధతిఁ విడిచినయతఁడుపానహములీయంగవలయు
లవణపరిత్యాగి యవనినిర్జరులకు వివిధరసంబు లర్పింపవలయు
దీపదానంబుభక్తి నిసేయునాతండుపాత్రయుక్తంబు దీపమిడవలయు
గీ. సఘృతదీపంబు తామ్రమంబు స్వర్ణవర్తి । సంయుతముపలమాత్రంబె
సంగ్రవతము । పూర్తియగు పొంటెనధిమాసముననొసఁగు । పురు
షుఁడనయంబు వైకుంఠమునవసించు 151
వ. మఱియు నేకాంతరోపవాసంబుచేసవస్త్రంబులును కాంచ
నోపేతంబులునగు నెనిమిది కుంభంబులను స్వర్ణమయంబులనేని
మృణ్మయంబులనేని యొసంగవలయును; మాసాంతంబున ఛత్రంబుల
తోడను ఉపానహంబులతోడనుముప్పది మోదకంబులనొసంగవలయు
మరియు ధౌరేయంబగు ననడ్వాహంబు నీయవలయు 152
క. ఎఱిఁగించినయవియన్నియు । జరిగించుటయేరికేనసాధ్యం; బైనన్
బరిపూర్ణవ్రతసిద్ధిని । ధరణీసురవాక్యమొసఁగు ధరణీనాథా. 153
క. పురుషోత్తమమాసంబును నరుఁడేకాన్నమునఁగడపినఁజతుర్భుజుఁడై
పరమగతిఁజెందినిరతము । పరిపూర్ణసుఖంబుతోడ వఱలునరేంద్రా
వ.ఏకాన్నంబుకంటెఁబవిత్రంబగునది యొండునను మరియొండు లేదు
ఏకవారాశనంబున మునులుసిద్ధులై శ్రేష్ఠంబగునిర్వాణంబునొందిరి.
క. పురుషోత్తమమాసంబున । నరుఁడుభుజియించెనేని నక్తమునందుఁ
నరపతియైనిఖిలేచ్ఛల ।నిరతంబుననుభవించునిక్కమిదినృపా 156
గీ. అమరులుభుజించుచుండ్రు పూర్వాహ్నమందు । మునివరేణ్యులు
మధ్యాహ్నమునఁగుడుతురు। తినుదు రపరాహ్ణకాలమందున పిత
రులు । తమనిమిత్తంబు మఱిఁజతుర్థకమునందు. 157
గీ. సకలవేలలుగడచి యేసజ్జనుండు । భోజనముసేయు;నాతండు భూ
విభుఁడగు । బ్రహ్మహత్యాదిపాపముల్ భస్మసాత్కృ । తంబులగు
నట్లుసేసిన తప్పకుండ. 158

ఆ. నక్తభోజియైన నరుఁడునరాధిప । సర్వపుణ్యములను సల్పుజనుల
మించియుండునశ్వమేధఫలంబును । దినదినంబునతఁడుకొనెడిఁగాదె
క. హరిహితమగుపురుషోత్తమ । వరమాసంబందుమాష వర్జితభుక్తిన్
నరుఁడొనరించిన;పాపములు రయంబునఁబొనివిష్ణులోకముఁజేరున్
క. పాలుఁడుతిలయంత్రవాహ్య । పారంబొనరించెనేని పాపాత్ముండై
రౌరవమందునతిలసం ।ఖ్యారీతిన్నిలిచికుడిచియతిదుఃఖముల౯ 161
వ. పిదపఁగుష్ఠరోగపీడితుండై చండాలయోనింబుట్టు. 162
గీ. శుక్లకృష్ణంబునందునశుద్ధచిత్త । మంది యేకాదశీవ్రతమాచరించు
పురుషుఁడు చతుర్భుజుండయి పొసఁగగరుఁడు । నెక్కి సురసేవ్య
మానుఁడైయేగువేగ. 163
వ. దేవదేవునిప్రీతికొరకు దశమియందునను ద్వాదశియందు
నను నేకభక్తంబునుగావించిననరుండు స్వర్గంబును జెందును. 164
సీ। ఎల్లవేళలయందు నెసఁగినభక్తితో దర్భకూర్చంబునుఁదాల్పవలయు
మూత్రంబును పురీషమును శ్లేష్మమును రక్తమునుదర్భలనుజిమ్మఁ
బోల;దట్లు । సల్పినవిష్ఠలోజన్మించుకృమియయి;బహుపవిత్రములు
దర్భ, లవిలేని క్రియలువ్యర్థంబులున్నపవరదర్భమూలంబున బ్రహ్మ,
మధ్యంబునందుఁ
గీ. జక్రి, యగ్రంబునందునశంకరుండు । వరలుచుందురుగాన దర్భమయ
కూర్చ । మునను మార్జనమునుజేసి కొనఁగవలయు । దర్భలను
శూద్రుఁడెత్తంగఁదగదెపుడును। 165
వ। మఱియు శూద్రుండు కపిలాదుగ్ధంబుగ్రోలంజనదు మధ్య
పత్రంబున భుజింపంబోలదు. ప్రణవమంత్రంబుచ్చరింపంజెల్లదు. పురో
డాశంబుభక్షింపనొప్పదు ఆసనంబునఁ గూర్చుండరాదు ఉపవీతంబు
దాల్పంగూడదు వైదికక్రియల నాచరించుటతగదు, విధిరహితంబుగా
నాచరించెనేని పితరులతోఁగూడి పదునలువురింద్రులవరకు ఘోరంబగు
నరకంబునంబడి మునింగియుండు తరువాతఁ గుక్కుటంబుగనో సూక
రంబుగనో జన్మించుఁగావున శూద్రుండెల్లప్పుడును బ్రణవంబువర్జింప
వలయు మరియు విప్రులకు నమస్కారంబుచేత శూద్రుండు నశించు.

గీ. ఇద్దియొనరించి యోధారుణీశతిలక । వ్రతముఁబరిపూర్ణమును జేయ
వయ్యునయ్య।దక్షిణనొసంగకుండినఁ దగినరీతి। నరకమున కేకు తప్పక
నరచయంబు 167

వ ఇంక వ్రతవైకల్యంబాచరించిన సంధుండును గుష్ఠియు
నైపుట్టు 168

పృథ్వీ. ధరామరవచస్సులన్ వినుజనుల్ సదాకొంద్రు ని
ర్జరప్రభుసమానులై దివిని సౌఖ్యజాలంబులన్
నరాధిపతదుక్తులన్ శుభముగోరు నారీనరుల్
నిరాకృతియొనర్పఁగాఁదగదొకింత, నేర్పుండినన్. 169

ఉ ధర్మరహస్యముత్తమము తాపహరంబు ఫలప్రదంబు దు
ష్కర్మవినాశకంబు వృషసంఘటకంబు హరిప్రియంబు నే
నర్మిలి నీకుఁదెల్పితిధరాధిప దీనిఁబఠించినన్ సదా
శర్మదమై మనంబునకు సంతసమున్ ఘటియింపగల్గెడిన్ 170

క. దీనినివినినన్ జదివిన। మానవుఁడనయంబుభక్తి మదిగదురఁగ; నా
ధీనిధియోగీశుఁడుఁహరి । పూనికవసియించులోకమునకరుగు నృపా

వ. అంత శ్రీనారాయణర్షి యిట్లనియె. 172

క. అనియిట్లుపల్కి విరమిం ।చినను నినాయకునిరాజు చిక్కణమగు భ
క్తినిమ్రొక్కి భార్యయును దా । నునుహర్షముతోడ బూజను
సలిపిరనఘా 173

శా. వారల్సల్పినయట్టి పూజలకునైవాల్మీకిమోదిల్లి యా
శీరుక్తుల్ వలుకాడి శీఘ్రముగనేఁ జేరందగుం బాప దు
ష్పూరంబున్ హరియింపజాలు సరయూస్రోతస్వినిన్ నీదు వా
చారంభంబునయ్యె నియ్యెడనె సాయంకాలము ర్వీశ్వరా. 174

——(శ్రీ వాల్మీకి ప్రస్థానము)——

వ. ఇట్లుపల్కి మునిసత్తముండగు వాల్మీకి వేగంబె చనియె
నంత దృఢధన్వుం డాసీమాంతంబమున్నని ననుసరించిచని గృహంబునకు
మరలివచ్చి తనప్రియురాలగు గుణసుందరితో నిట్లనియె. 175

సీ. రాగరోషాదిశాత్రవషట్కయుతమయి గంధర్వనగరంబుగావసించు
సారవిహీన సంసారంబునందేమి సుఖముండు? నరులకుసుందరాంగి
వాతపిత్తకఫోల్బణపూయశోణితమూత్రపురీషాది పూరితమయి
కృమిభస్మయుతమగునీశరీరంబుచేనేమి ప్రయోజనంబెసంగంగలదు.
గీ. అస్థిరంబగునిట్టి దేహంబుచేత। స్థిరముసాధించుటకు నాదేశమునకుం
జనెదఁ బురుషోత్తమునిహరి వనజనేత్రు। సంస్మరించుచు మిగుల
నా స్వాంతమందు. 176
ఆ. వె. జిహ్వాగ్రంబులుఅక జీర్ణంపుఁగంబుసంబు। విడిచినట్లనేక పృథివి
పతులు। భుక్తభోగమైన భూరాజ్యరమనెల్ల। తంద్రలేకవిడిచి
తరలిచనరె? 177
మ. అనియిట్లాడిన, రాజుపల్కులకు నయ్యబ్జాక్షి ప్రాణేశ్వరుక్
వినయంబొప్పఁగమ్రొక్కి యిట్లనియె, సుర్వినాథ? నీతోవనం
బునకేనుంజనుదెంతు సాధ్వులగు పూవుంబోండ్లకుంభర్తృసే
వనమే దైవతపూజనంబనుచు తేనంబల్కవే? శాస్త్రముల్. 178
క. పతివెడలిన పిమ్మటనే। సతిసుతసదనంబునందు జనికి నధీన
స్థితిఁబొరసి బ్రదికెడినిద। త్సతిపరగేహమున సరమచందముగాదే.
క. మితముగనేయొసఁగునుపిత। మితముగభ్రాతయునొసంగుమితముగ
సుతుఁడుక్। మితమదిలేకుండఁగనిజ। పతియిడుఁ దాదృశునిపతిని
బాతురె? సాధ్వుల్. 180
వ. అంత నారాయణస్త్రి యిట్లనియె. 181

—(దృఢధన్వుండు సభార్యుఁడై గోలోకమేగుట)—

గీ. ప్రియవచించినవాక్యమూరీకరించి। రాజ్యమునకెల్లఁ బుత్రునిరాజుఁ
జేసి। తనమనస్థాంగితోదృఢధన్వనృపతి। మునిశరణ్యామరణ్యంబు
చనియెనంత. 182

సీ. పారీంద్రనఖసంవిదారితకరికుంభగళితరక్తాక్తముక్తాఫలంబు
బర్హికేకాభీతఫణివేగనిస్సరజ్జాహ్నవీధారాప్రసారకంబు
గుంజదిందిందిరమంజులలవలీనికుంజఖేలదమర్త్యరంజితంబు
అభ్రంలిహాదభ్రశుభ్రాంశురవియానభంగకృద్భాసురశృంగకంబు
గీ. సర్వమంగళవితరణచతుర శర్వ
ప్రమదకృత్సర్వ మంగళార్పణచణంబు
సర్వసర్వంసహాధరచక్రవర్తి
సాధుసంతోషకరహిమభూధరంబు 183

వ. ఇవ్విధంబున నాదంపతులు హిమాచలసమీపంబున గంగానదికిం జేరి పురుషోత్తమమాసంబు ప్రాప్తింపఁ ద్రికాలస్నానంబు లాచరించి ఱ అయ్యెడ విధిప్రకారంబునఁ బురుషోత్తమునారాధించి పురుషోత్తముని సంస్మరించుచు సపత్నీకుండై యారాజు తపం బాచరించె. 184

శా. పాదాంగుష్ఠము చేత నిల్చి దివిఁ బాహుద్వయం బెత్తి విన్
వీదిం దృష్టి నిగుడ్చి యాతఁ గోన కవ్విశ్వేశు శ్రీకృష్ణు నా
హ్లాదం బొప్పమదిం జపించుచు నిరాహారంబుమై నున్నయు
ర్వీదారుం బరిచర్యతోడ ననువర్తించెన్ దదర్ధాంగియున్ 185
ఉ. ఓలి నిటుల్ రచింపఁ బురుషోత్తమమాసము పూర్ణమయ్యె స
చ్ఛీలుఁడు పుణ్యశీలుఁడు సుశీలుఁడుఁ దెచ్చిరి హేమకింకిణీ
జాలసమన్వితం బయిన చారువిమానము, దానిఁ గాంచి భూ
పాలుఁడు విస్మయంబుఁ గని వారలకున్ నతులాచరించినన్ 186
శా. ఆలీలన్ వసియించు భూపతిని భార్యాయుక్తునిన్ వార లు
ద్వేలప్రీతి విమానసంగతుని గావింపంగ దివ్యాంగరు
గ్జాలుండై పురుషోత్తమోత్తమతపశ్చర్యన్ నృపశ్రేష్ఠుఁడా
గోలోకంబున కేగి మోదిలె సదాగోవిందసంసేవియై. 187

క. పురుషోత్తమవమాసంబున । గురుతపమొనరించుభర్తఁ గొలిచినిరతముఁ । బరమపతివ్రతగుణసుం । దరిచేరెఁ విభునితోడఁదల్లోకంబుఁ

క. దరహాసరుచిరవదనా । పరిహాసిజనప్రహరణ! భాసురగోపీ విరహాటనకారణ!బహు। వరహాటకభూషణా!భవభ్రమహరణా 189

ఉపేంద్రవజ్ర. తృణీకృతబ్రహ్మసురేంద్రరక్షో
గణప్రహారక్షమకార్యదీక్షా
గుణాగుణజ్ఞాన్యనుకూలరక్షా
మణీప్రవాళస్తుత! మానిపక్షా 190

క. పురుషోత్తమసువ్రతత
త్పరపరిరక్షణ! సమస్తపాపారణ్యో
ద్ధురదహన! దురామయసం
హరణా కరుణాలవాల యాశ్రితపాలా. 191

గద్య.

ఇది శ్రీమద్విబుధవిధేయ వేంకటాచలశాస్త్రి నామధేయ
ప్రణీతంబైన బృహన్నారదీయ పురాణాంతర్గత
పురుషోత్తమ మాహాత్మ్యంబునఁ
బంచమాశ్వాసము
శ్రీకృష్ణార్పణమస్తు.

శ్రీరస్తు.

శ్రీపురుషోత్తమాయపరబ్రహ్మణేనమః

# పురుషోత్తమమాహాత్మ్యము.

## షష్ఠాశ్వాసము.

శ్రీపాదజనితగంగా
వ్యాపృతిపరిపావితాఖిలాశాంతరదు
ష్పాపిజనమోక్షసుఖసం
ప్రాపక! పురుషోత్తమా! విపత్పరిక్షీమా. 1

వ. దేవా! సూతుండు శౌనకాదులకిట్లనియెఁ దదనంతరంబా
నారాయణమునీంద్రుండు నారదుంగనుంగొని 2

ఉ. నారద! యేమివర్ణనమొనర్తును? శ్రీపురుషోత్తమప్రథం
బూరితిగావచించుటకుఁబోలునె? నాకొకనాల్కవానికిన్
వారక వేయిపుట్టుల తపంబొనరించినవారలేని ది
వ్యోరుసుఖప్రదంబుఁ బురుషోత్తమమాసఫలంబుఁగాంతురే. 3

మ. ఉపవాసంబులు దానముల్ మఱియుస్నానోద్యోగముల్ పూజలుఁ గ
జపముల్ శ్రీపురుషోత్తమాఖ్యవరమాసంబందు నేమాత్రమేన్
వ్యపదేశంబున నాచరించినను పాపవ్రాతముల్ కోటిజ
న్మపరీతంబులుఁగూడఁబాసిచనుసుమ్మా మౌనిచూడామణీ 4

సీ. పురుషోత్తమాభిఖ్యవరమాసమందునఁ ద్రిదివసంబులుబుద్ధిదెలియ
కుండఁ। గడుమస్తమైన శాఖామృగంబొక్కండు కుండంబులోపలఁ
గ్రుంకుకతన।ప్రాక్తనపాపకర్మంబులంబెడబాసిదివ్యదేహంబునందేజ

రిలుచు । వరవిమానము నెక్కి జరయుమృత్యువు లేని గోలోకమున
కేగెఁ గుతుకమొప్ప

గీ. వ్యాజమున స్నానమొనరించు నంతమాత్ర । దుష్టశాఖామృగంబు సం
తుష్టిగదుర । హరిపదంబునకుం జేరె నక్కతమున । సర్వమాసంబు
లందు శ్రేష్ఠంబు చూవె. 5

శా. శ్రీరాముఖ్యులు దీనిసేవనముఁ జేయం బూనకున్నార లె
వ్వారల్ స్నానము దానముల్ జపము దీపంబాపవస్త్రాదులిం
పారన్ శ్రీపురుషోత్తమంబునను దీవ్యద్భక్తిఁ గావింతురో
వారల్ ధన్యులు వారిజన్మములు సాఫల్యంబులన్ గాంచెడిన్ 6

వ. అనిన నారదుం డిట్లనియె. 7

చ. అనఘ! మనుష్యజన్మ మఖిలార్థసుసాధనమంచు వేదమం
దునవచియింపఁగాఁబడియె దోసములం బెడబాసి వ్యాజ సే
వన మొనరించు మాత్రమున వానర మొక్కఁడు మోక్షమెట్లు సెం
దెను వివరించి తత్కథను దెల్పుము నాకు జగద్ధితంబుగన్. 8

గీ. మర్కటము పురుషోత్తమమాసమందు । స్నానములు మూఁడు
దివసముల్ సల్పెనెచట? । నెవ్వఁడీక్రోఁతి యెటఁబుట్టెనేమిమెస
వె? వ్యాజమునదాని కెట్టి పుణ్యంబుగలిగె? 9

క. అదియెల్ల విస్తరంబుగ । విదితంబును జేయుమయ్య విబుధవతంసా
మదిఁ దృప్తి పుట్టకున్నది। త్వదుదితమహనీయసత్కథాశ్రవణమునన్
అనిన శ్రీనారాయణర్షి యిట్లనియె. 11

——(నారాయణముని నారదునకుఁ గదర్యోపాఖ్యానంబు చెప్పుట)——

మ. పొలుచుం బూర్వము చిత్రశర్ముఁ డను విప్రుం డెంతయున్ లోభి కే
రలదేశంబున; నాతఁ డర్థము నహోరాత్రంబు జంటీఁగ నాఁ
బెలుచం గూర్పఁగ దక్షుఁ డక్కతమునం బేర్కొందురవ్వానిఁ బొ
రులు పూర్వాఖ్యఁ బరిత్యజించియు కదర్యుం డంచు నెల్లప్పుడున్ 12

ఉ. కూడఁగఁ బెట్టె నాపిసినిగొట్టు ధనంబును బిట్టు పొట్టకుం
గూడుతినండు యోగ్యమగు గుడ్డయుఁ గట్టడు జన్నమేదియుం

బోఁడిమిఁజేయకుండుటది పోవఁగ నార్జికమైనఁబెట్టఁడే
జాడయశోర్థియైయెదియు సల్పఁడహోయతఁడెంత లోభియో 13

గీ. ఆలుబిడ్డలు మున్నగు నట్టిపోష్య । జనులకైననునొక తృణమును నొసఁగక । యక్రమంబుగ నార్జించినట్టి ధనము । భూతలంబున నంతయుఁ బాఁతివైచె. 14

వ. మఱియు నితండు మాఘమాసంబునఁ దిలదానంబును కార్తికంబున దీపదానంబును బ్రాహ్మణుల కన్నదానంబును, వైశాఖంబున ధాన్యదానంబును వ్యతీపాతంబున గాంచనంబును వైధృతియందు రాజతంబును రవిసంక్రమణంబున సర్వదానంబులును నెన్నండును జేయఁడు చంద్రసూర్యోపరాగంబుల నొక్కపరియైన జపంబును హోమంబు నాచరింపఁడు. 15

చ. అనయము దీనవాక్యముల నాడుచు నశ్రుపరిప్లుతాస్యుఁడై
మునుకొని వర్షవాతముల భూరిశరాతపమందుఁ గ్లేశముం
గని కృశనీలదేహుఁడయి గాఢధనాశను మూఢబుద్ధియై
యనవరతంబు భూతలమునందుఁ జరించెడి మానిసత్తమా. 16

వ. మఱియు. 17

మ. గతిలేదే నతిదీనుడంగరుణతోఁ గాసేనివీసంబయేఁ
వితగావింపక నాదుప్రార్థనము, నర్పింపుండటంచెప్పడీ
గతి గోదోహనమాత్రమైన నొకటంగాలూఁదకే లోకధి
క్కృతిపాత్రుండయి సంచరించుచుఁ బ్రవర్తించుఁ సముద్విగ్నుఁడై

మ. వనపాలుండొకసంగడీఁడతనికిఁ వర్తించె నవ్వానితో
ననునీపట్టణవాసులందఱును నిందంజేయుచున్నారుగా
వున నేనచ్చటనుండనొల్లనని దాపుంజొచ్చి దుఃఖించుచుఁ
దనవృత్తాంతమునంతయుం దెలుప నాతండంతరంగంబునఁ 19

శా. ఆరీతిఁ వచియింపఁగాఁబడు కదర్యాలాపమాలించియా
ర్వేరంబించుకయుందలంపక కృపావిస్ఫూర్తియై మాలికా
కారుండొయికదర్య! యోడకుము వీఁకంనాదు పూఁదోటకే
తేరంగాఁదగు నాహితుండవయి చింతింపంగ నీకేటికిఁ. 20

వ. అనిపలికి తనవాటికయందు నివసింపుమనిన. 21

క. ఆకింపచానుఁడాతని । వాకులకున్ సంతసించి వాటమెయనుచున్
బ్రాకట నాగరసంఘుని। రాకృతుఁడై వాటిఁగాపురముఁగావించెన్

ఉ. ఎప్పుడుఁదత్సమీపముననే వసియించుచు నాతఁడాదటన్
జెప్పినయట్టికార్యములు సేయుచునుండఁ గదర్యుపైఁగడున్
ముప్పిరిగొన్ననమ్మకముఁ జూపె వనాధిపుఁ,డంతనాతనిన్
మెప్పునఁదద్వనాధిపుఁగ మేకొనిసల్ప స్వకల్పుఁడైతగన్. 23

గీ. పిదప సర్వాత్మభావంబుగదుర నతని । స్వీయజనునునిగ మదిలోన
విశ్వసించి । వాటికాచింత విడనాడి తోటమాలి । రాజమందిర
సేవా నిరతివసించె. 24

క. వనపతిరాజ ద్వారం । బున నిరతము కార్యభారమున వసియించెన్
దనకుఁబరాధీనతగ । ల్గినకతనవనంబునకు మగిడిరాకుండెన్ 25

చ. సమయమిదేయటంచు వనజాతఫలంబుల నిచ్చవచ్చిన
ట్లమితముగా భుజించుచు మహాధనలుబ్ధతఁ దక్కువానిన
ర్థమునకువిక్రయించుచుఁ గదర్యుఁడు తద్ధనమెల్లతానె భ
ద్రముగనుడాఁచికొంచుఁ బ్రమదంబుననుండె వనంబునందునన్ ·

మ. ఒకనాఁడావనపాలుఁడవ్వనికి నుద్యోగంబునందుండి వ
చ్చికదర్యుంగని యొక్కపండయిన నీచెట్లంగనన్ రాదు నేఁ
డకటాకారణమేమి మిత్రమయటం చాతండుప్రశ్నింప నా
కిఁకబొంకేశరణంబటంచుమది నాహీనుండు యోజించుచున్. 27

మ. అనయంబుందిరుగాడియాడి పురిలో యాచించియాచించి జీ
వనముంజేయుచు భైక్షవృత్తి,వనసేవన్ నిత్యమున్ సల్పుచుం
టిని నేనట్లొనరించుచుండినను వాటింబండులేకుండఁ బ
క్షినికాయంబరుదెంచి పండులను భక్షించున్ జుమీనెచ్చెలీ. 28

గీ. అటులఁ దినుచుండఁగని కోపమంది నేను । వాఁడితూపులఁదున్మి
త్రూఁటాడినాఁడఁ। గొన్ని పక్షుల;నివిగొ కన్గొనుమువాని । యొటుక
లునుమాంసఖండముల్ దొరఁగెధరణి. 29

క. అని చూపించిననాతఁడు। కనిమనమునవిస్మిరాచ కార్యముసలుపం
జనియోఁదనతోఁవనికిఁయఁ।జనియెఁగదర్యునకుఁగొన్ని సంవత్సరముల్
గీ. వృజినచర్యలనెనుబదియేడుసమలు వితతముగనుజరాజర్జరితతనుఁ
డయి । బ్రదికిమూాఘకదర్యుండుమ్రంది తుదకు । నగ్నిసంస్కారమే
లేక యటులనుండె. 31
క. అకృతప్రాయశ్చిత్తక। వికృతకలుషములవి యనుభవింపక చను నే?
ప్రకటతరభోగవాంఛా। సుకృతంబయినట్టిమహితసుకృతముకరణిన్
వ. అనివేదవిదులగు మహర్షులునచించిరిగాపున. 33
శా. దేహంబుద్యజియించినంత సమవర్తిప్రేషితుల్ దూతలా
ద్రోహిన్ భీకరముద్గరంబులను నేత్రుల్ గ్రక్కఁగామొత్తుచున్
స్నేహంబింతయులేక యంతకపురింజేర్పంగ నెన్ బాధలన్
హాహాకారముతోడుతంబెలుచ నిట్లాలాపముల్ సల్పెఁదాన్. 34
ఉ. పుణ్యనిధానమౌ భరతభూమిని బ్రాహ్మణజన్మమెత్తి యే
పుణ్యమునాచరింపక కుబుద్ధి మహాఘములే యొనర్చితిన్
గుణ్యజనుల్ దిసంతులనుగొట్టినఁ దొంటివిధంబుమానకే
పాణ్యభిఘాతినై తుదకుఁ, బాతకినై చెడిపోయితింగటా. 35
మ. నరజన్మంబునుదేవ దుర్లభమునందంగల్గి యొక్కింతయున్
వరకృత్యంబొనరింపనైతి ధనలోభంబూని; వ్యర్థంబుగా
నరిగెన్ జన్మము దుర్మతిం జడుఁడ నాయజ్ఞానమిట్లింపుఁడీ
చిరకాలార్జితవిత్తముం బరులకే చేకూరఁగాఁజేసితిన్ 36
సీ. దానంబునొకకాసునైన సల్పఁగలేదు హోమంబుసేయలే దొక్క
నాఁడు । ప్రాలేయగిరికందరంబునహరిహర ప్రీతిగాఁదపమాచరింప
లేదు । మకరసంయుతమైన మాఘమాసమునందు జాహ్నవీస్నా
నంబుసలుపలేదు । పురుషోత్తమాభిఖ్యవరమాసమం దుపవాసతి
యంబైనఁజేసియెఱుఁగ
గీ. తారకలతోడనొప్పుప్రాతస్సమయము । నందుఁగార్తికమునసుస్నా
నంబుఁజేయ । నకట పురుషార్థద నరదేహంబునైనఁ । వాసిబో
పించుకొనకిట్లుమోసపోతి. 37

గీ. స్వాపతేయంబునెంతయు సంతరించి । పాఁతివైచితిభూమిలో వ్యర్థ
ముగను । సందునొకలేశమేనియు ననుభవింప । నైతిసరఘలుపెర
తేనియలనుబోలె. 38

సీ. ఒక్కనాఁడైననుడొక్కనిండఁగనాదు కొంపలోనన్నంబుఁ గుడిచి
యెఱుఁగ। నోటుబాసినముంత తోడఁబానీయంబుఁ ద్రావితిమంచి
పాత్రంబునెఱుఁగ । చింపిపాఁతలుదక్క చెలువంపువస్త్రంబుఁదగఁ
బర్వమందైనఁదాల్చియెఱుఁగ। భూమిపై నుపధానముగహస్తదం
డంబు, పవ్వళించితిఁగానిపాన్పునెఱుఁగ

గీ. జ్ఞాతులునుబంధువులుస్వీయజనులుఁమఱియు। నాలుఁబిడ్డలుతలిదండ్రు
లవనిసురులు । మధురమగునన్నమునొక్కమాఱుఁగాని। తనుపఁ
బడ్డైరెరి వెంటవచ్చెనె? ధనంబు. 39

క. జీవించినంతకాలము । జీవంబునుగ్లేశమొందఁ జేసితినిపుడే
భావింపనిల్లుగాలఁగ । బావిన్ద్రవ్వంగఁబూను బాలిశుఁడఁగదా 40

వ. మానుషజన్మంబెత్తి యప్పుడేమిశుభంబాచరింపకయిప్పుడు
కాలపాశబద్ధుండనై పరాధీనుండనగు నేనేమిచేయఁజాలుదునని వగచు
చున్నకదర్యునియమభటులు కీనాశసన్నిధికిఁగొంపోయినిలువంబెట్టిరఁ
జిత్రగుప్తుండాతని శుభాశుభంబులువీక్షించి స్వామియగు ధర్మ
రాజుతోనిట్లనియె. 41

సీ. అధిపయీతఁడు కదర్యాఖ్యద్విజాధముండెట్టిపుణ్యమురచియింపఁ,
డితని । వాటికాపతినమ్మి తోటకాపరిసేయ ఫలములన్నియును
దొంగిలిగ్రసించె । మిగిలినఫలములమ్మి ధనప్రలుబ్ధుఁడై తద్ధనం
బునుభూగతంబుసేసె ।ఫలచౌర్యజనితపాపంబువిశ్వాసఘాతజమైన
పాపంబుద్వయమువీని

గీ. యందునత్యుగ్రమైయుండె నన్యపాప । గణములింకను పెక్కులు
గలవు వానిఁ । దవిలివ్రాసితి నొక్కపొత్తంబునిండె। ననినఁనంతకుఁ
డెంతయు గినుకతోడ 42

చ. చిటచిటవిస్ఫులింగములు జిమ్మఁ గనుంగవ; క్రోధమూర్తియై
పటపటపండ్లుగీఁటుచుఁ బ్రభాకరనందనుఁ, డిద్దురాత్మకుం
డిటుపయి వేయిసార్లుజనియించి వనంబునఁగోఁతిగాఁగఁ,బి
మ్మట నుపకర్తకుంబెలుచ మంతువుఁగూర్చిన దోసమొందెడున్

వ. అనిపల్కినఁ జిత్రగుప్తుం డంతకభటులకిట్లనియె. 44

శా. నిండారందనకోర్కి; యీకృపణుఁడెం తేఁబూర్వలోభాభిభూ
తుండై పిమ్మటఁబెక్కువత్సరము లత్యుత్సాహియైతోటలో
పండుల్ దొంగిలెఁగానఁ బ్రేతమగుచుంబాధల్ గడుం జెంద ను
ద్దండారణ్యమునన్ వసించి కపిగాత్రంబూనుఁగాకవ్వలన్ 45

క. అంతట నేనెంతయునో । యంతకభటులార నరకయాతననిడుడున్
జింతింపధర్మరాజగృ । హాంతరముననిద్ధిశ్రేయమగుక్రమమునుఁడీ

మ. అని యీరీతిగఁజిత్రగుప్తుఁడు యమాభ్యర్ణంబునం దద్భటా
ళినివీక్షించివచింప వారలపుడా లింపాకునింబట్టి కొ
ట్టి నితాంతంబును నిర్జలాశ్మల కువాటిం బెద్దకాలంబు ద
ప్పినిక్షుద్వ్యాకులతన్ వసించుకరణిం బ్రేతత్వ మొందించిరన్.

మ. తొలుతన్ ఘోరవనాంతరాళమున నా దుశ్చర్యుఁడెంతేనిక్షు
త్కులనుండై తగఁబ్రేతయోనిగత దుఃఖంబాదియాపిమ్మటన్
ఫలచౌర్యంబునఁ జేసి పొందెఁగపి జన్మంబున్ మునీంద్రా! యఘం
బులనెవ్వండుత్యజించుఁడా ననుభవంబుం జెంద కెప్పట్టునన్. 48

సీ. కాలాంజరాభిఖ్యశైలభాగంబునజంబుఖండకమనోజ్ఞంబునందు
చారుశీతలజలచ్ఛాయంబునందున ఫలపుష్పపల్లవలలితమందు
సాధుసేవ్యముపాపసంహారకము పుణ్యాకరముమహాసరోవరసమంబు
సురరాజనిర్మితవరకుండ మమరులకును దుర్లభంబయితనరుచుండు

గీ. అద్ది మృగతీర్థమనఁగఁ బ్రఖ్యాతివడసె । దానియందున నెవఁడు
శ్రాద్ధంబుసేయు । వానిపితరులు సద్గతివడయుదురు; రటఁ । బ్రనమ
కపిజన్మమందె నాబాడబుండు. 49

క. ఆకుండంబున దైత్యభ । యాకంపితులగుసురలు మృగాకృతితో ని
ర్భీకులయిక్రుంకుచుండుట । రీకతమునదానినందు మృగతీర్థముగన్

క. తా నరజన్మం బెత్తియుఁ । దానరసజ్ఞాన నారదా నతవరదా
కాన రహిఁ బాసిపాఱుఁడు । వానరజన్మంబు నెత్తెఁ ఫలచౌర్యమునన్
వ. అనిన నారదుం డిట్లనియె. 52

శా. ముల్లోకంబులవారి పాపముల నున్మూలించు రమ్యోజ్జ్వల
త్కల్లోలంబుల నొప్పు పుణ్యమృగతీర్థంబందు నేరీతిగా
మల్లె పుట్టె? దురాత్ముఁ డీతఁడు మహాత్మా! నాకు నీసంశయ
మ్ముల్లంబందుఁ దొలంగఁ బెట్టఁ గదె శిష్యన్ నన్ గటాక్షించుచున్.
వ. అంత సూతుం డిట్లనియె. 54

క. ఆదివిజమౌనిచేతను । చోదితుఁడై మౌని, ధరణిసురవరులారా!
ప్రాదుర్భూతదయుండయి । భేదిల్లఁగ సంశయంబు, వివరించె నిటుల్.

మ. ఒకయూర వ్యఁ డుచిత్రకుండలసమాఖ్యుం డాఢ్యుఁ డొప్పారు తా
రకనామంబున సాధ్వి తత్సుదతియై రాజిల్లు నవ్వారలీ
ప్రకటంబౌ పురుషోత్తమవ్రతము నారంభించి మాసాంతమం
దొకనాఁ డావ్రతపూర్తి సల్పుటకుఁ దారుద్యాపనాసక్తులై. 56

గీ. వేదవేదాంగపారగవిప్రజనుల సతులతోఁ గూడు వారల సద్గుణులను
ఆవ్రతోద్యాపనవిధానమాచరింప । బలితముగు బత్తియుఁ గురొత్తఁ
బిలువనంప. 57

మ. ధనలోభంబున నీకదర్యుఁడుచ నెందద్గేహ ముద్యాపనం
బును పూర్ణంబొనరించి వైశ్యవరుఁ డప్పుణ్యాత్ముల్ విప్రులన్
ఘనదానంబుల భూరిదక్షిణల సన్మానించినన్ స్వీయగే
హానికాయంబున కేగి రెల్లరును వారత్యంతసంతుష్టులై. 58

క. అతిలుబ్ధుండు కదర్యుఁడు । వితతంబుగ నొసఁగినట్టి విత్తాంకులకున్
మతిఁ దృప్తి లేక వైశ్యుని ప్రతిఁ గనియీరీతిమిగులవగచుచుఁ బలికెన్

సీ. చిత్రకుండల! వైశ్యశేఖర! గుణనిధీ! హరిపాదపంకజనిరతచిత్త!
పురుషోత్తమవ్రతంబును లెస్సగా నీవు విధివత్తముగను గావించితిప్పుడు
ఈవిధంబుగ నెవ్వఁ డెచ్చుట నీపృథివిస్థలంబందుఁ గావింపలేరు
ఈపుకృతార్థుండ వీవు ధన్యాత్ముఁడ వెన్నివిధంబుల నెంచిచూడ

గీ. మహితభక్తిని పురుషోత్తమవ్రతంబు। నాచరించిన నినుఁగన్నయట్టి
నీకు । తల్లిదండ్రులు జగతినత్యంతధన్యు । లిట్టి నీపుణ్యమునువచి
యింపఁదరమె? 60

గీ. ధన్యములయందు నత్యంతధన్యమరయ । నర్యకులవర్య పురుషోత్త
మాఖ్యమాస । మద్ది సేవించుమహనీయు లధికములగు । నైహికా
ముష్మికసుఖంబులందఁగలరు. 61

ఉ. స్వాంతమునందు నెంతయు విశాంపతి! నీయొనరించుపూజకున్
సంతసమందినాఁడ నిదె సన్నుతకర్మము నాచరించితిన్
వింతదలిర్ప మొండుగను విప్రులకెల్ల ధనాపలిచ్చి యా
వంతయు నాకొసంగవుగదా! మఱి నామరదృష్టమెట్టిదో 62

క. అని గద్గదస్వరంబునఁ । గనుఁగవనశ్రుపులుచిందఁగఁగదర్యుఁడురో
దనమాచరింపనిజమే యనుకొనియాతనికివైశ్యుఁడర్థంబొసఁగెన్ 63

వ. ఆధనంబునుఁగొని యాతండుసంతసంబున పూర్వధనంబట్లు
భూమిగతంబుసేసె. 64

ఉ. అచ్చటఁబొరుషోత్తమమహార్చనముంగని తన్నుతిక్రియన్
హెచ్చుగవిత్తలోభమున నీమరితాత్ముఁడు పూర్వమం దటుల్
పొచ్చెముగానొనర్చినను బుణ్యదమౌ మృగతీర్థసన్నిధిం
జొచ్చెనువానరాకృతి, విశుద్ధపుగార్యము రిత్తవోవునే? 65

వ. మునీంద్రా! సపత్నీకుండగు శ్రీపురుషోత్తమదేవుని దర్శ
నంబును స్తవనంబునుధనలోభంబుననాచరించినను దుష్టశాఖామృగం
బునకుసత్తీర్థసేవనంబుసంభవించె నద్దేవునిదర్శనస్తవనంబులు శ్రద్ధతో
నాచరించినవానిపుణ్యంబునింక నేమనిచెప్ప ందగుననిననారదుడిట్లనియె
క. శీతలజలసంయుతము న । పేతాతపమధికసుఫల వృక్షాన్వితమై। ప్రీతి
ఘటియించునడవిని। క్రోఁతివసించుటకుఁగతముఁగూర్మిఁదెలుపుమీ

వ. అనిన నారదా! దీనికొక్క కారణంబుఁగలఁ దయ్యదివిను
వారలపాపంబుహరించుఁగాన నద్దినీకుం దెల్పెదవినుమని నారాయణుం
డిట్లనియె. 68

శా. శ్రీరాముం డఖిలార్థదుండు జలధిన్ సేతున్ నిబంధించి దో
స్సారంబొప్పఁగ రావణప్రభృతిరక్షశ్శ్రేణిఁ దున్మాడి లం
కారాజ్యంబునకున్ విభీషణు విభుంగావించి వైశ్వానరో
దారజ్వాలల శుద్ధయైతనరు సీతంగూడి చెల్వారఁగన్. 69

చ. హరుఁడజుఁడింద్రుఁడాదిగలయట్టి సురర్షులు దుష్టరాక్షసే
శ్వరునివధించినందులకు సంతసముంగని రామచంద్ర! భా
స్కరకులవంశదీపక! విశాంపతినాయక! నీకునిష్టమా
వరమునుగోరుకొమ్మనిన భక్తవశంవదుఁడాతఁడిట్లనున్ 70

మ. సురలారా వినుఁడయ్యనాపలుకులన్ శుద్ధాంతరంగంబునన్
వరమున్ నాకునొసంగఁగాఁదలఁతురేన్ వాత్సల్యమున్ బూని వా
నరులన్ శూరులరాక్షసాహతుల గణ్యంబౌసుధావృష్టి చె
చ్చెర వర్షించుచు వారినెల్ల మఱలన్ జీవింపఁగాఁజేయుఁడీ 71

క. ఇదియేనాప్రార్థనమని। విదితముసేయుంగనమృత వృష్టిఁగపులపై
గదియించివారినెల్లర। బ్రదికించిరి భవసరోజభవశక్రాదుల్ 72

ఉ. నిద్దురవోయిలేచుగతి నీల్గినవానరులెల్లఁ దద్దయున్
సద్దొనరించుచున్ గిచకిచల్ పచరించుచు రామభద్రునిం
గ్రద్దనజుట్టుముట్టిన ధరాసుతతోడ విమానమెక్కి తా
సుద్దియొకండు తత్కపులఁజూచి ప్రియంబునఁబల్కె నత్తఱిన్.73

శా. ఓసుగ్రీవుఁడ జాంబవంతుఁడ నలా యోవాయుజా యంగదా
నా సంకల్పముఁ దీర్చియుంటిరిగదన్నా వానరశ్రేణితోఁ
వాసిన్ గానక వారికాజ్ఞయిడుఁడీ వర్తింపఁగా స్వేచ్ఛమై
శ్రీసంధిల్లఁగ వారికెల్లెడలవర్తించున్ ఫలాదుల్ వనిన్. 74

సీ. నాకు సాహాయ్యంబొనర్చిన దీర్ఘజీవులు కపులెటనెటవెలయు
చుండుత। అటనటఁబుష్పఫలాన్వితంబుగఁ వృక్షజాలంబు లెప్పు
డెసంగుఁగాక। స్వాదుశీతలజలసంయుతంబుగఁ సరోవరములుఁ న
దులును వఱలుఁగాక ! ఒకఁడైన బెదరింపకుండుఁగాపుత మదా
జ్ఞనుఁ సర్వవానరుల్ చనుఁడు మనుఁడు

గీ. అనుచుఁ శ్రీరాముఁడాజ్ఞయిచ్చిన కతమునఁ । దప్పఁ్రభావంబుచేత
నేస్థలమునందుఁ । గొమ్మలొంకిమెకంబులు గూడుచుండు । నచట
ఫలజలసౌఖ్యంబులవఘళించు. 75

క. మృష్టజలనదులు కొలఁకులు । తుష్టినిగలిగించు మంచితోఁటలు
కమనీ । యేష్ట ఫలపుష్పపల్లవ । పుష్టమహావృక్షములును బొలు
పారు నటన్. 76

క. అటులైనన్ సుఖదుఃఖము । లటమరఁగనఁబోవు ప్రాక్తనాదృష్టజ
ముల్ । స్ఫుటగతి నెటనెటజంతువు । లటనముగావించు కర్మ
మటన్నటకరుగున్. 77

వ. అనుభవింపక కర్మంబు క్షీణింపదని వేదానుశాసనంబని
మఱియు శ్రీనారాయణుండిట్లనియె. 78

గీ. అంత నవ్వానరంబు కొండంతమేను । గదుర నభివృద్ధిజెంది
యాఁకలియు దప్పి ! సంతతంబును బీడింప సంచరించు । నవ్వ
నంబున నిట్టటు నటమటవఃశి. 79

ఉ. పిత్తసముద్భవంబయిన పీడతదాస్యమునందు పుట్టుతో
హొత్తుటఁజేసి సంతతము నాస్యగతవ్రణజాలమెంతయున్
నెత్తుటిధారలంగురియు; నిస్సహమైన తదాస్యబాధమై
బొత్తిగనేమియుం గుడువఁబోదు జలంబునుగ్రోలదెన్నఁడున్. 80

క. తెఱచున్ వదనముఁ గిచకిచ । నఱచున్ వెఱచఱచుఁదఱచు నతి
భాధకు మై ।మఱచున్స్పృహగని మఱి వా । చఱచున్వాలంబు
నేలఁజఱచున్ బఱచున్. 81

మ. తినకున్నన్ నిజచంచలత్వమున నర్థిన్గోసి పండ్లెల్ల వా
సనఁజూచున్ వదనాంతికంబున నిడున్ క్షామమండలిం బారవై
చు నిటుల్ వానరమొక్కఁడానిలువ కక్షుద్రంబుగాఁజెట్లయం
దున నిట్టట్టుభ్రమించుచున్ మరణ మొందున్ మేలుగానెంచుచున్

ఉ. ఊఁచవడెన్ శరీరము సముద్ధతిఁ జూపెడి క్షుత్పృడార్తిమై,
నేఁచు వ్రణంబునన్ రదనబృందము జారిపడెం, గరంబులున్

సాఁచుటకేని లేశమగు శక్తియొసంగదు, తోఁకభారమై
తోఁచెను మర్కటంబునకుఁ దొల్లియొనర్చిన పాపరాశిచేఁ 83

క. అటిమటి యీరీతిగ వా । చటుచుచు నుపవాసములను జరిపె
డికపికిఁ । బలు తెంచె దైవికంబుగఁ । బురుషోత్తమమాసమపుడు
పురుపుణ్యదమై. 84

క. శీతంబున వాతంబున నాతపమున బీడ్యమానమగుచుఁ బెలుచఁ
మూతిఁ మూట్టక యెదియే నా తెరగుననుండెఁ గ్రోఁతియమ్మాస
మునఁ. 85

సీ. ఒక్కనాఁడనఘ!యా వెక్కిరించుమెకంబు బహుళపక్షమునందు వ
నమునడుమ । దూపటిల్లి కరంబు తుందుడుకునఁబోయి కుండంబు
చెంగటఁ గూరుచుండి। జలపానమును జేయఁజాలక యాఁకటఁజాం
చల్యమూని యచ్చటవసించు । వృక్షమెక్కి మఱొక్కవృక్షంబు
మీదికి దుముకంగఁబోయి కుండమునఁబడియె

గీ. బహుదినంబులనుండి తద్వానరంబు । తిండిలేకుండుటను గ్రుస్సి
కుండతీర్థ । మునను దశమిమొదలుగను దినచతుష్ట । యంబుగ
డునఁగ దొరలుచు నధివసించె. 86

క. పంచమదివసంబది ప్రా । ప్తించినమధ్యందినమునదినమణివెలుగఁ
బంచతఁజెందెఁ బ్లవంగమనుచితమగుకుండతీర్థమందు జలమునఁ

వ. అంత నవ్వలీముఖంబు వినిర్ధూతమలాశయంబై యా
దేహంబువదలి తక్షణంబ భవ్యాభరణభూషితంబగు దివ్యదేహంబు
దాల్చె. 88

సీ. ఇందీవరశ్యామమిద్ధప్రకాశంబు కందర్పశతకోటిసుందరంబు
లలితకిరీటకుండలభాసమానంబు కేయూరహారముద్రాయుతంబు
కటినటత్పటుపీతపటకాన్తిఘటితంబుమణిమయకటిసూత్రమణ్డితంబు
నీలకుంచితచికురాలిభవ్యముఖంబునటదమరాంగనార్భటిసహితము

గీ. గీతకుశలోరుగంధర్వకిన్నరగము దివ్యదేహంబుఁగాంచి యాత్మీయము
మఁగపి। యధికపాపునకిట్టిదేహంబునాకుఁ।గలిగెనెట్లనియాశ్చర్య
కలితమయ్యె. 89

వ. విమానారోహణార్హంబును సుఖకరంబునైన యీశరీరం
బు పుణ్యాతమునకుంగదా యోగ్యంబు 90

మ. ఒకదివ్యాంగన పట్టె ఛత్త్రమును వేఱొక్కర్తు పావాలువే
రొకనారీద్వయి చామరద్వయము నింకొక్కర్తు భృంగారకం
బొకకాంతాతిలకంబు వీటికయు వేరొ క్త్రాలవట్టంబు దా
ల్చికరాబ్జంబున వీచుచుం దగవసించెం దత్సమీపంబునన్ 91

వ. ఇవ్విధంబున నప్సరఃస్త్రీలుగీతవాద్యాదితత్పరలై నాట్యా
దులచే ననేకవిధంబులఁదన్నుఁగొల్వఁ నవ్వైభవంబుఁగాంచి, చిత్రార్పి
తుండువోలెఁగొంతదడవుండి. 92

క. ఇదియేమి యెట్టిపుణ్యం । బొదవె నపుణ్యునకు నాకు నురుదుర్మ
తికిన్ । ముదమున హరిపదమునుగను । సదమలపుణ్యంబు నా
కెసంగదుగాదే. 93

మ. అని తర్కించుచు మర్కటాకృతిఁ బరిత్యాగంబుగావించి ని
ల్చిన యాతండు విమానరాజమెదుటన్ జెన్నార సాశ్చర్యుఁడై
కనుచుండన్ వినయానతిన్ హరిభటుల్ గావించి పాణిద్వయం
బును జోడించి మనోహరోక్తినివహంబుంబల్కిరీరీతిగన్ 94

గీ. ప్రాకటవిమానమెక్కి గోలోకమునకు । వేగ దయచేయుమయ్య
యో విభువతంస । తనరఁబురుషోత్తమునిసన్నిధినివసించు । గొప్ప
పుణ్యమునుంచేసికొంటివీవు. 95

వ. అనిన నా దివ్యరూపుండిట్లనియె. 96

మ. ధరణీరేణుగణంబులెన్నిగలవో తారాచయంబెంతయో
మఱియున్ వర్షజధారలెన్నిగలవో మత్పాపకర్మంబులా
కరణిన్ లెక్కకునెక్కవై కలవు భోగ్యంబుల్ చిరం, బిట్టి నా
కురులోకంబెటుగల్గెనో? యఘచయంబుత్సన్నమెట్లయ్యెనో? 97

వ. మఱియు నీ దివ్యదేహంబును దివ్యభోగంబులు నవితర్కి
తంబులెట్లుసంప్రాప్తించె దీనికిం గారణమేదే నత్యుగ్రంబుండవలయుఁ
దెలియవలతుంజెప్పరేయని హరిభటులనడిగిన వారలిట్లనిరి. 98

శా. ఓహో శ్రీపురుషోత్తమప్రథితమాసోదగ్రపుణ్యంబు దు
ర్మోహాంధ్యద్ధతశత్రువారకము సంపూర్ణాఘహారంబు
న్మాహాత్మ్యంబు నెఱుంగఁజాలవో కో? యామాసంబునన్ నీవుసం
దేహంబేది తపంబుఁజేసితివి సత్తీర్థంబునం బెల్లుగన్. 99

వ. అదియెట్లనిన నో మహారాజవరా! 100

సీ. వానరదేహంబుబూనియుండుటఁజేసియావొనర్చినతపంబెఱుంగనైతి
వాస్యరోగముచేతనాహారసువ్రతంబదినీకుసంప్రాప్తమయ్యెఁబెలుచ
శాఖామృగీయుచాంచల్యంబునంబహుఫలములుద్రెంచిభూభాగమందు
బడనైచితివివానిబహుజనంబులుమెక్కితనివినందిరిమహావనమునందు

గీ. మానసికదుఃఖమున లేశమాత్రమైన । నుదకపానంబుసేయక యుం
టివీవు । మహితపురుషోత్తమాభిఖ్య మాసమందుఁ । దెలియకుండి
యుఁ దపమిట్లుసలిపి తథిప. 101

సీ. ఫలపాతమునఁజేసిపరులకునుపకారముడుగకరచియింపఁబడినదయ్యె
శీతవాతాతపాక్షీణబాధలు చరియించుచు వనిసహింపఁ బడియె
మహనీయమృగతీర్థమధ్యంబునందైను ప్రొద్దులుతప్పకమునుఁగఁబడియె
గావునస్నానజఘనతరపుణ్యంబు పురుషోత్తమాంతరంబునఘటించె

గీ. ఇటులనామయపీడచేనీవుతెలియ । కాచరించితి పురుషోత్తమాఖ్య
మాస । మందు నుత్తమతపమును వ్యాజమునను । సలిపినను నీకు
నెంతయు ఫలదమయ్యె. 102

వ. శ్రీపురుషోత్తమమాసమందలి యుత్తమంబగు మాహా
త్మ్యంబునెఱింగి శ్రద్ధతో విధిప్రకారంబు కర్మంబాచరించినవాని
భాగ్యంబింక నేమనివర్ణింతుము? మఱియు నోమహానుభావా! నీవొన
రించినయంత,స్వార్థంబయినను నాచరింప నెవ్వండు సమర్థుండు? 103

చ. ఒనరిచిరేనొకండు పురుషోత్తమమాసమునం దుపాస; మ
ప్పునిమెయి సర్వపాపములుఁ బాయును తత్సదృశంబు వేరొకం
డును హరితుష్టిఁగూర్పదు; కడుంగడుధన్యులు తద్వ్రతంబు నే
మనుజులొనర్చుచుందురు ప్రమాదములేక సముక్తపద్ధతిన్. 104

చ. మఱిమఱిభూతలంబుపయి మానవకోటికిఁ బుణ్యభారతా
జిరమునఁబుట్టు దుర్లభము; చేకురినప్పుడయందు జన్మ మీ
యురుకలుషాపహంబుఁ బురుషోత్తమమాసముసేవసల్పు వా
రతిముఁటిపుణ్యవంతులుసుమా! మఱివారి భవం బెధన్యముల్. 105

గీ. మాననీయము పురుషోత్తమంబెవరికి । స్నానదానజపాదులు సలు
పుచుండ । నరుగు నవ్వారుసుభగు లత్యంతపుణ్యు; । లందుదురు
వారు గోలోకమందు ముదము. 106

క. పితృకార్యంబులుదానము । లతులతపస్నానములునునాదిగలవి స
న్నుతపురుషోత్తమమందుఁ । గృతమైనంగోటిగుణములిదినిజమనఘా

గీ. అరుగుదేరఁగఁబురుషోత్తమాఖ్యఁమందు।స్నానదానవివర్జితజనుఁడు
ఖలుఁడు । శఠుఁడుధర్మధ్వజుండు విస్తారపాపి । ధిక్కృతికిఁబాత్రుఁ
డెందు నాస్తికుఁడువాఁడె. 108

వ. మఱియు నారాయణుండిట్లనియె. 109

గీ. పుణ్యశీలసుశీలురు పౌసఁగఁదనయ । దృష్టమును సన్నుతింప నా
దివ్యరూపుఁ । డెంతయేనియుఁ జకితుఁడై హృష్టుఁడగుచుఁ । బులక
జాలాంకితాంగుఁడై పొలిచి పిదప. 110

మ. సతులన్ సల్పియుఁదీర్ఘదేవతలకు న్గాలాంజరాభిఖ్యప
ర్వతముల్ మొక్కియుఁ గాననాథపతులం బ్రార్థించి గుల్మోత్కర
వ్రతతిశ్రేణికిజోతలన్ సలిపి భవ్యంబావిమానంబున
న్ధాతమీరంగఁ బ్రదక్షిణించియతఁడం దారూఢుఁడై ప్రీతితోన్ 111

సీ. మణిగణరచితకంకణఝణత్కారం బెసంగఁజామరములచ్చరలువిసర
మోదిల్లియమరులామోదంబుసంధిల్ల నల్లనల్లనవిరుల్ సల్లుచుండ
గంధర్వకిన్నరుల్ ధుంధుంకిటాత్కారబంధురవాద్యశబ్దంబుగొలుప
దరహాసమునపురందరపురస్సరులుసాదరభావులైబరాబరులుసూప

గీ. గోపగోపీగవాదిసంప్రాపకంబు । రాసమండలయుతముజరామరణవి
వర్జితముపునరావృత్తివారకంబు। యోగిదుర్లభగోలోకమేగెనతఁడు

చ. కృపణుఁడుచిత్రశర్ముఁడతికిల్బిషకర్ముఁడు దంభవృత్తిచే
నుపమవచింపరాని పురుషోత్తమసేవన మాచరించిన్

గపిణనవుద్యజించి హరిఁ గంజమనోహరనేత్రుఁగూడి తా
నపరిమిత ప్రమోద మనయంబును జెందె మునీంద్రసత్తమా 113

క. అమితాశ్చర్యదమిదియని । యమరులుతమలోనమిగుల యచ్చెరు
పడుచున్ । దమతమనెలవులకేగిరి । సమధికపురుషోత్తమ ప్రశంస
సలుపుచున్. 114

వ. అనిన నారాయణునకు నారదుండిట్లనియె. 115

క. దివసాదిమభాగంబునఁ । దవిలినయాహ్నికమునీవుతగదెల్పితి త
ద్దివసాపరభాగీయం । బవుదానినిదెల్పుమిప్పుడఖిలాభిజ్ఞా 116

గీ. కడఁకగృహమేధులకునుపకారమొదవఁ। బలుకఁగదవయ్యయోవద
ద్వరమహాత్మ । తిరుగుచుంద్రుగదాభవాదృశులనయము ।లోకము
ల కుపకారంబువీఁకఁజేయ. 117

వ. అనిన శ్రీనారాయణర్షి యిట్లనియె. 118

–(శ్రీనారాయణర్షి నారదునకు దివసాపరభాగీయవిధిని దెల్పుట)–

క. ప్రాతఃకాలికకర్మము । లాతతవిధిఁబూర్తిసేసి యవియగుపిదపన్
బ్రీతినిమాధ్యాహ్నికసం । ధ్యాతిలతర్పణములనఘతగజేయనగున్

క. సురలుమనుష్యులుపశువి । ష్కిరము లురగములు పిశాచసిద్ధులు
యతుహో । సురులుంబ్రేతములన్నా । తురులగు నందఱకునొసగుదు
నశనమిచటన్ 120

వ. అని పిదపఁ బంచమహాయజ్ఞంబులాచరింపవలయు నవ్వల
భూతబలినాచరింపవలయు, నిట్లువచించి కాకంబునకును శునకంబున
కును బలినొసంగి మఱియువేరుగా భూతంబులకుబలినొసంగి యా
చమించి 121

క. గోదోహకాలమతిథిన్ । మోదంబున ద్వారదేశమునవేచియు భా
గ్యోదయముచేతవచ్చిన । చోదైవమటంచు నతనిశుద్ధమనమునన్

క. పలుకులచేసత్కారము । తొలుతంబొనరించి భక్తితోడసపర్యన్
సలిపిరుచిరాన్నపాన ।మ్ములనుయథాశక్తినొసఁగబోలుమునీంద్రా.

గీ. ఆత్మ గేహాంతరాకల్పితాన్నమందుఁ । గొంత వ్యంజనములతోడఁ గూర్చి సవిధి । భిక్షువగు బ్రహ్మచారికిఁ బ్రీతియొదవ । నప్పనము సేయఁగాదగు నార్యవినుత. 124

గీ. యతియును బ్రహ్మచారి పక్వాన్న విభులు । అన్నమును వారికిడక యే తిన్న వాఁడు। సముచితంబుగఁ జాంద్రాయణను చరింపఁ। వలయు నటు గామిపాపంబు తొలఁగకుండు. 125

చ. సలిలము పూజ్యుఁడైన యతిచంద్రుకరంబుననుంచి భైక్షను వ్వలఁగడుభక్తితోడనిడి వారి ననంతరమిచ్చిరేని త త్సలిలము సాగరోపమము తద్ఘన భైక్షము మేరుతుల్యమై పొలిచి సమస్తపాపములఁ బోకడపెట్టెడి మానిసత్తమా. 126

గీ. సమధికంబగు శ్రద్ధతో సత్కరించి। భిక్షువునకన్న మొసఁగినఁ బ్రీతితోడ । గోప్రదానసమంబగు గొప్ప పుణ్య । మనివచించెను భగవంతుఁడగు యముండు. 127

గీ. సుప్రశస్తము విపులమౌ శుద్ధపాత్ర । మందుమానంబుతోడ గర్హణము లేక। ప్రాఙ్ముఖంబుగఁ గూర్చుండి స్వస్థచిత్త । మునను గృహమేధి భోజనం బొనరుపఁదగు 128

వ. స్వాసనంబును నిజభాజనంబును నేకవస్త్రుండై భజియింపం జెల్లదు స్వయముగ నాసనంబునధిరోహించి స్వస్థచిత్తుండై భుజియింపవలయు. 129

క. ఆయతమై విలసిల్లు స్వ । కీయంబగు కాంస్యపాత్రఁగేవల మొకఁడే పాయక కుడుచు నెవండత । డాయుఃప్రజ్ఞాయశోబ లాదులనందున్

వ. "సత్యంత్వర్తేన" యను మంత్రంబుచే హస్తమున జలంబు గ్రహించి పరిషేచనమాచరించి సఘృతంబును వ్యంజనాన్వితంబునగు నన్నంబుఁ భుజింపవలయు భోజనంబునుండి యించుకయన్నాగ్రంబు గ్రహించి "భూపతయేనమః" యనియు, "భువనపతయేనమః" యనియు, "భూతానాం పతయేనమః" అనియు, నుచ్చరించుచుబలియొసంగి పిదప ధర్మునికొఱకును చిత్రగుప్తునికొఱకును బలినొసంగవలయు పిదప (కుత్సితపాపోపహతా తు) లె యెటనెట వర్తింతు రట్టిభూతములు

తృప్తిఁజెంద యథాసుఖంబుగ నక్షయ్యంబగునిది యగుఁగాకయని యుచ్చరింపవలయు. సకలభూతంబులకుబలి నొసంగవలయు. తదనంతరంబు ప్రాణంబుకొఱకు నపానంబుకొఱకు వ్యానంబుకొఱకు నుదానంబుకొఱకు సమానంబుకొఱకుఁ బూర్వంబున బ్రణవంబుచ్చరించుచు స్వాహాంతంబుగ ఘృతప్లుతంబగు నన్నంబు నైదుపర్యాయంబులు దంతదంశితంబు గాని తెరంగునజిహ్వచేఁగ్రసియింపవలయు, పిదప దద్గతమనస్కుండై తొలుత మధురంబునునడుమ లవణామ్లంబులును దరువాతఁ గటుతిక్తంబులును భుజియింపవలయు. 131

క. తొలుతం బురుషుండు ద్రవం। బులగుపదార్థములు, కఠినములునడుమ, ద్రవం। బులుమరలఁ దుదనుదినినఁ। బలమారోగ్యంబు విడువఁ బడవుమునీంద్రా. 132

క. ఎనిమిది గ్రాసంబులుయతి। వనవాసిపదాఱుతినగవలయు; గృహస్థుల్ గొనదగుముప్పదిరెండిటి। నన ఘూవర్ణులుభుజింపనగు నమితముగన్

గీ. చెల్లదుతినంగ శాస్త్రదూషితము లైన; । భక్ష్యభోజ్యాదులను ద్విజప్రతతి యెపుడు। నొప్పనుభుజింప శుష్కపర్యుషితమైన। యట్టియాహారమని చెప్పి రార్యజనులు. 134

గీ. సంయమీశ్వర! ఘృతపాయసను లుదక్తు। సర్వవస్తువులను సశేషముగఁదినగ। నగునుదచ్ఛేషమును భోజనాంతమందు। నుంచి యగ్రాంగుళుల విధియుక్తమునను 135

వ. అనంతరంబు జలపూర్ణాంజలియై యందునర్ధంబు గ్రోలి యగ్రాంగులిస్థిత శేషంబగు నంజలిజలంబు భూమియందొసంగి శేషంబునయ్యెడన (రౌరవేపూయనిలయే పద్మార్బుదనివాసినా మర్థినాముదకందత్తమక్షయ్యముపతిష్ఠతు) అనుమంత్రంబుఁ బఠించుచు బుధుండు నిషేచనము సేయవలయు నట్లుకాదేని విప్రుండుపాపంబు నందిప్రాయశ్చిత్తంబున శుద్ధుండగు అమ్మంత్రంబుచే నిషేచనమాచరించినపిదప దంతవిశోధనంబాచరించి యించుక యార్ద్రపాణిచేఁ బాత్రోత్సారణంబొనర్చి యాచమించి పిదపలేచి బహిఃస్థితుండై సమాహితత్వంబున మృత్తికచేతను శుద్ధజలంబుచేతను ముఖహస్తంబులం గడిగి

కొని షోడశగండూషంబులాచరించి శుద్ధుండై సుఖంబుగఁ గూర్చుండి

గీ. మునివరునగస్త్యుఁ గుంభకర్ణుని శని బడ । బానలము భీమసేను నీ
వైమగురను । బ్రార్థనమొనర్తు నాహారపరిణతికయి । యనుచుఁ
గరమునసిమిరికోనగు, నుదరము. 137

క. ఆతాపినిజంపివెసన్ । వాతాపినిగూల్చినట్టి పావనుఁడబ్ధిం
బ్రీతింగ్రోలినఘనవి। ఖ్యాతుఁడగస్త్యుఁడుప్రసన్నుఁడయ్యెడునాకున్

వ. అనితలంచి. 139

గీ. పిదపశ్రీకృష్ణదేవుని పదములుమది । యందుస్మరియించి యాచాం
తినాచరించి । సలిపి తాంబూలచర్వణంబెలమిమీరఁ।గృష్ణమయ
బ్రహ్మమును విచారింపవలయు. 140

వ. పిదప సచ్ఛాస్త్రాది వినోదముచే సన్మార్గాద్యవిరోధంబుగ సద్బుద్ధితో నధ్యాత్మవిద్యాశ్రవణంబు నాచరింపవలయు వృత్తిహీనుండైనను తప్పక యేకముహూర్తంబైన స్వస్థమానసుండై యట్లు చేయవలయు. 141

మ. వినిధర్మంబుల గుర్తెఱుంగు వినియేపీడున్ సమస్తాఘముల్
విని మోహంబును బాయజాలు వినియేవిజ్ఞానమున్ గాంచెడిన్
వినుటన్ నీచజనుండు సైతమువెసన్ శ్రేష్ఠుండగున్ శాస్త్రమున్
వినకున్నందగశ్రేష్ఠుఁడైన జనుఁడున్ నీచత్వముంజెందెడిన్. 142

వ అనంతరంబు. 143

క. ఇలువెడలి వెలుపలికిన। వ్వలనరిగి యొనర్పవలయువ్యవహారంబున్
తలఁచుచు శ్రీకృష్ణుని హృ।జ్జలజంబున సర్వకార్య సంసిద్ధికరున్.

చ. ఇనుఁడపరాద్రికూటమున కేగినయంతఁ దరంగిణీతటం
బునకయినన్ స్వకీయగృహభూమికినైనను జేరి పాదసే
చనమొనరించి శుద్ధుఁడయి శాంతహృదంతరమెప్ప సాయసం
ధ్యను నెఱవేర్పఁగావలయుఁ దప్పకభూసురవర్యుఁడాదటన్. 145

మ. అమరవ్రాతసమర్చితాంఘ్రియుగ! సాయంసంధ్యనేబ్రాహ్మణా
ధముఁడెం తేనిఁబ్రమాదిమొసలుపఁడో తద్దినంబుగాగోవధా

ఘమునీలోకమునందుఁగాంచి యతఁడాకాయంబునుంబాసి య
య్యమలోకంబునఁజెందు రౌరవసమాఖ్యంబగు దుర్యాతనన్

గీ. సంకటంబుననో కాక, సరణియందొ । కాలలోపంబొకప్పుడుకలిగె
నేని । ఆనిశీథముసాయసంధ్యనుద్విజుండు ।సేయఁగాదగుఁద్యజియిం
పఁజెల్లదెందు. 147

క. కనిశోద్ధమిగులనేద్విజ । జనవర్యుండొగిత్రికాలసంధ్యోపాస్తిం।బొన
రుచునాతనితేజము ।దనరుఘృతమ్మునసుపర్బుధజ్వాలగతిన్. 148

వ. సాదిత్యాయ్యినర్ధాస్తమితభాస్కరయునగునట్లు సాయంసంధ్య
నాచరింపవలయు ప్రాణాయామంబాచరించియద్దేవతాంచితమంత్రంబు
చేత సంప్రోక్షించి సాయంకాలమున "నగ్నిశ్చమా" యనుమంత్రంబు
చేతఁబ్రాతఃకాలమున "సూర్యశ్చమామన్యుశ్చ" యను మంత్రంబు
చేత నుదకంబుఁబుచ్చుకొనవలయుపిదపఁబ్రత్యఙ్ముఖోపవిష్టుండునువా
గ్యతుండును సుసమాహితుండునునై జపమాలధరించి నక్షత్రోదయ
పర్యంతము, లెస్సగావ్యాహృతియుతంబుగాగాయత్రీజపంబాచరింపవల
యువారు ణులచేనాయాదిత్యుని యుపస్థానమొనర్చిప్రదక్షిణించుచుది
క్కులకునమస్కరించిదిక్పతులనువేరువేరుగనమస్కరించియివ్విధంబుగ
బశ్చిమసంధ్యనుపాసించియగ్నియందుహోమంబుఁగావించిభృత్యపరివృ
తుండైయనతితృప్తిగ భుజింపవలయుభుజింపనియాతండునుసాయంకాల
ప్రాతఃకాలములయందు వైశ్వదేవబలికర్మముల నాచరింపవలయుఅట్లు
సేయఁడేని కిల్బిషియగు సాయంబుభుజించినపిదప గృహస్థుండు కృత
పాదాదిశౌచుండై యుపధానసమన్వితంబైమృదులంబగు శయ్యనొంద
వలయు.

గీ. తనగృహంబునదూరుపు; దక్షిణాశ । శ్వశురమందిరమునఁ బ్రవాస
మునబశ్చిం। మాశ తలయంపిగను తెండనగు,బరుండ। దగ దుదఙ్మ
స్తకముగనే స్థానమందు. 150

క. తలఁచిమనంబునసుఖశా ।యులబుధుల; జపించి రాత్రిసూక్తంబు;
నమ । స్సులనొనరిచివిష్ణువునకు;। నెలకొనఁగసమాధి, నిశనునిద్రిం
పఁదగున్. 151

క. కలశజమునిమాఘవుఁడున్ । బలవన్ముచికుందరాజవరుఁడు కపిలుఁడున్
కలుషహరుండాస్తీకుం । డెలమినిసుఖశాయులగుదురీమైనుపురున్

గీ. పూర్ణకుంభంబుమాంగల్యమునుశిరఃప్ర । దేశమందుననుంచివైదిక
ములైన । గరుడమంత్రంబులనురక్షగాంచిపిదప। స్థిరతరంబగుమదిని
నిద్రింపవలయు. 153

క. వ్రతమూనిపర్వదినవ । ర్జితముగగృహమేధిజనుఁడుత్రిదశమునీంద్రా
ఋతుకాలాభిగమనమున్ । జతురతనొనరింపవలయుస్వకళత్రరతిన్

వ. ప్రదోషపశ్చిమంబు లీరెండును వేదాభ్యాసంబునంగడు
పవలయుఁ బిదపయామద్వయంబు శయనించినవాఁడు బ్రహ్మత్వంబు
నొంద సమర్థుండగు, నారదమునీంద్రా! గృహస్థాశ్రమలక్షణంబగు
నీకృత్యజాతంబంతయు నశేషంబుగాఁ బ్రతిదినంబున గృహస్థుండులెస్స
గాఁ జేయవలయు. 155

గీ. సత్యవచనంబహింసయు సర్వభూత । దయయుశమము యథాశక్తి
దానములును । దేవగురుతీర్థసేవనాదికము గృహికి । ధర్మమని
చెప్పఁబడియె శాస్త్రంబునందు. 156

క. పరదారపరాఙ్ముఖతయు । తరుణీపరిరక్షణం బదత్తాదానో
పరమణము, మధుపమాంసము । పరివర్జించుటయు,గృహికి వర
ధర్మమగున్. 157

వ. ఈమైనవిధంబులైన ధర్మంబు బహుశాఖంబై సుఖోద
యంబుగావించు దేహపరములగు దేహులచే దేహసంభవంబాచరింప
వలయు. 158

చ. అనుపమసర్వవేదములయం దుదితంబగు సచ్చరిత్రమున్
ఘనగృహమేధిధర్మమనఁ గ్రాలినదాని జగద్ధితంబుగా
వినిచితి నీకునారద! సవిస్తృతిచే, వచియించినట్లుగా
నొనరిచినట్టివారలకు నుత్తమచిత్త విశుద్ధియేర్పడున్ 159

వ. నారదుండిట్లనియె. 160

క. స్తుతియించితితొలుతపతి । వ్రతయగునారినితదీయవరలక్షణముల్.
వితతముగ నాకునిపు డం । చితచరితతపోనిధీ వచింపుముకరుణన్.

వ. సూతుండిట్లనియె. 163

క. నారదమునిచోదితుఁడై । నారాయణమహామునివరుఁడు నారీహితమా
తీరునఁ బలికె నశేషము । దారకృపంగని పతివ్రతాచరితంబుల్.

వ. అనిన నారాయణమహర్షి నారదుంగని యుత్తమంబగు
సతులవ్రతంబుఁ జెప్పెదవినుమని యిట్లనియె. 164

—(నారాయణర్షి నారదునకుఁ బతివ్రతాధర్మంబులు చెప్పుట.)—

మ. తననాథుండు కురూపియైనను గువృత్తవ్యాపకుండైనఁ గ్రో
ధనుఁడైనన్ బహుళనిర్ధనుండయిన మద్యవ్యగ్రచేతస్కుఁడై
ననువృద్ధుండయినం గదర్యుఁడయినన్ జాతుర్యశూన్యాత్ముఁడై
ననుగాణుండయినన్ మహాకితవుఁడైనన్ బూజ్యుఁడౌ, సాధ్వికిన్

క. లలనాలంపటుఁడైనన్ । వెలుచన్ బహురోగజాల పీడితుఁడైనన్
జలచిత్తుఁడైననువిడలు। గొలువందగుదైవతముగఁగొనకొనిభర్తన్

గీ. అంధుఁడైననుబధిరుఁడునైన మూకుఁ । డైనగాతరుఁడైననీచాత్ము
డైన హేయుఁడనిఎంచ కెపుడు వాక్కాయకర్మ। ములను మగ
నిని సేవింపవలయుఁబాలఁతి. 167

వ. మఱియు భర్తకువిషమంబాకప్పుడునువనితయొనర్పఁజనదు.

క. బాలయు యువతియు వృద్ధయు । లోలాక్షియొనర్పరాదు లోలుప
మతితో।శాలన్ స్వతంత్రతను నె। క్కాలంబునఁగూడనొక్కకార్యం
బయినన్. 169

శా. కామక్రోధములందృజించి దురహంకారంబువర్జించి యు
త్ప్రేమన్ భర్తృమనోభిరంజనముఁ గావింపందగున్ సాధ్వికిన్
గామాసక్తిబరుండుసూచి ప్రియవాక్యంబుల్ ప్రసంగించినన్
రామారత్నముమానసంబున వికారంబందరాదింతయున్ 170

చ. జలరుహలోచనన్ జనులసందడి నన్యుఁడుసంస్పృశించినన్
గలుషతనందఁబోకతమకంబునఁజిత్తమునందు; నేసతీ
తిలకమెసంగు; నాసుదతి స్త్రీలతనూరుహసంఖ్యయెంతగా
నల రేడిసన్ని వేలసమలందునఁజెందును నాకసౌఖ్యమున్ 171

క. ధనకనకంబులనిచ్చెద। ననితద్దయు నాశయిడిన నన్యపురుషుని కే
మనమునవాక్కునకర్మం। బుననొల్లనితరుణిలోకభూషణయనఘా
మ. మదమాతంగమనోజ్ఞయాన! వినుమీ మద్వాక్యముల్ బాహుద
ర్పదశక్ నిర్జరులం జయించితిని నారాజ్యంబుగీజ్యంబు నీ
పదరాజీవములందునుంతు ననుచుం బ్రార్థించినన్ దైత్యుఁ; డే
సుదతీరత్నము ధిక్కరించు; నదియే సుమ్మీ మహాసాధ్వినాన్.
ఉ. చోరుని తీరుదోఁపఁ గొనుచుంజని నిష్కుటమందునుంచి నా
కోరికిఁదీర్పకున్న నినుఁగూరలువండుదు నారలొల్లునం
చాఱడిబల్కినం దలక కన్యజనుం ద్యజియించి భర్తపైఁ
గూరిమినొందు సుందరి నకుంఠితసాధ్విగ నెంచగాఁ దగున్. 174
మ. ననుఁ బ్రేమింపవయేని పల్వురుగనన్ నానాప్రకారంబులన్
నినుఁగారించెద వల్వలొల్చెదనుగానీ. పీడఁగాఁబోవనం
చని బన్నంబుల నెన్ని వెట్టినను జిత్తాబ్జంబునన్యాప్తితం
బునుగానీక పతివ్రతామణి విభుంబూజించు నాసక్తితో. 175
క. చనవునఁబరపురుషుఁడుచూ చినఁజూఁడకనవ్వినన్ హసింపకభాషిం
చిన భాషింపక వాంఛిం। చినఁగోరనిసాధ్వి సాధుశీల జగమునన్
గీ. రూపయౌవనసంపన్న రుచిరనృత్తగీతవాద్యప్రవీణయానాతిసాధ్వి
స్వామిరూపనరుంజూచినపుడుచిత్తమందువికృతినిలేశంబునందబోదు
మ. తరుణుండైన సురూపుఁడైన బహువిద్యావంతుఁడైనన్ ధనా
కరుఁడైనన్ వరకామినీజనమనఃకంజాతపుంజప్రభా
కరుఁడైనన్ బరపూరుషున్ బ్రియమునంగామింప కేనాతిదా
వఱలుం దత్సతినే మహాసతిగ సంవర్ణింపఁగానొప్పెడిన్. 178
క. మానవుడైనను దేవుం। డైనను గంధర్వుఁడైన నతివల కన్యుం
డైన పురుషుండుప్రియుఁడుగ। నేనాఁడును జెల్లదయ్యయిద్ధచరిత్రా
సీ. ప్రాణవల్లభునకుబత్ని యేసమయంబునందు నప్రియముసేయఁగరాదు
పరదేశమునకాతడరుగంగఁదనుమండనంబీగిమలినాంబరంబుదాల్చి
భుజియింపనాతండుభోజనంబొనరించి దుఃఖింపనాతండుదుఃఖమంది
ముదితుడైనయతండుముదితగావర్తించిసుప్తుడైననతండుసుప్తిగాంచి

గీ. మొదలనాతనికంటెను నిదురలేచి। పంచతను జెందనాతండువహ్నిఁ
జొచ్చి ' చిత్తమందుననితరు వాంఛింపకుండు । నతివఁదెలియంగ
దగుఁబతివ్రతయనంగ. 180

వ. మఱియు సత్తమామలయందును బత్తిగలదై భర్తను మిగుల భక్తిసేవించుచు ధర్మకార్యములయందును సర్థకార్యంబులయందును గృహోపస్కరసంస్కారమందును బ్రతిదినంబు నాసక్తయై యుండవలయు, 181

క. వనముననుండియొక్షేత్రం । బుననుండియొ యన్యగ్రామముననుండి
యొ వ । చ్చిన విభుఁడు; లేచియాసన । మునజలమున నతనిమదికి
ముదమిడవలయున్. 182

చ. కలకలలాడుమోమున సుఖంబుగఁ గాలమునందు భోజనా
దులనిడి భుక్తవద్విభునితో నహితంబులనాడజెల్ల ది
మ్ముల శయనాసనంబులను భోజనదానములందు సత్కృతిం
బలుకులయందు, నెప్పరిగ భార్యవసింపఁదగున్ గృహంబునన్.

ఉ. భర్త గృహవ్యయంబుసలుపందనకిచ్చినఁ విత్తమందు సం
పూర్తిగ వేశ్మకృత్యములు వుచ్చి మిగుల్పఁగఁజెల్లు, ద్యాగని
ర్వర్తనమాచరింపగఁ గరంబునబెట్టినయర్థమందు లో
భార్తిమిగుల్పరాదు లవమైనను మానిని మానిసత్తమా. 184

వ. మఱియు విభునియానతింగొనక స్వబంధువులకేని ధనం బొసంగంజనదు. 185

క. ఇతరాలాపంబులు, సం । హతతోషంబితరజనుల వ్యాపారకథా
పరితతులు నతిహాసంబులు। నతిరోషమువిడువజెల్లునంగనలెల్లన్

క. ఎయ్యది భర్త భుజింపఁ।డెయ్యది నాథుండుగ్రోలఁడెయ్యదిపూయం
డెయ్యదియాఘ్రాణింపఁ। డెయ్యదిసర్వంబువిడువఁగుపడతులకున్

క. తైలాభ్యంగము స్నానము । హోళిఁదనూద్వర్తక్రియయు నుద..ను
ముదం । తాళిపరిశోధనంబును। స్త్రీలొనరింపంగదగుఁ బతిముదం
బందన్. 188

గీ. మానినులకార్తవమ్ము ప్రతిమాసమందుఁ । ద్రేతమొదలుగనది తట
స్థించెఁగానఁ । దత్సమయమందు సతిదినత్రయమువిడిచి । వేశ్మకృ
త్యంబునందుఁ బవిత్రయగును. 189

గీ. ప్రథమదినమునఁ జాండాలవనితయగును । బ్రహ్మఘాతిని రెండవ
వాసరమున । రజకిమూఁడవనాఁడు పురాళగమున । నాలవదినంబు
నను శుద్ధురాలు మాని. 190

ఉ. స్నానము శౌచగానహాసనంబులు రోదనయానకర్మముల్
మానసవాచికంబులును మైథునముల్ హరిలేపదేవతా
నూనసమర్చనంబులును ద్యూతదివాస్వపనంబు లార్య వ
ర్గానతిదంతధావనములార్తవదూషిత పీడఁగాఁదగున్. 191

వ. మఱియు నభ్యంజనాదికృత్యంబులు సేయఁదగదు. 192

సీ. జలజనేత్రను రజస్వలనుముట్టఁగరాదన్నాతితోమాటలాడఁజనదు
మూఁడురాత్రులువక్త్రమును జూపరాదాపె వినిపింపఁగారాదు
తనపలుకులు। ఇట్లుదినత్రయంబేగించి ముట్టుత నాలవదినము స్నా
నంబుసేసి । యితరపూరుషవక్త్రమీక్షింపకెలమి భాస్కరుఁజూచి
బ్రహ్మకూర్చంబుఁ గ్రోలి.

గీ. ఆత్మశుద్ధికిఁబంచగవ్యంబుక్షీర । మైననుం బుచ్చికొనఁదగునయ్యు
యువుడు । చెప్పినవిధంబొకింతయుఁ దప్పకుండ । నాచరింపఁగవల
యు నబ్జాయతాక్షి. 193

వ. గర్భిణిగనుండెనేని నారీతిలకంబప్పుడు 194

ఉ. బాలసమై నిరంతరమలంకృతులన్ విరచించికొంచుఁ జా
లాలుపసన్నవక్త్రమున నాత్మవిభుప్రియకార్యరక్తయై
పాలితనైజధర్మమున వాస్తుసమర్చనముం బొనర్చుచుం
గాలముపోఁబుగాఁగడపఁగావలయున్ నిజరక్షమేర్పడన్ 195

వ. మఱియు గుర్విణి 196

చ. కులటలులోనుగాఁగలుగు కుత్సితలంగవి మాటలాడఁగా
వలవదు, శూర్పవాతపరివర్జనముఁ బొనరింపఁగావలెన్

దలరి మృతార్భకాదులను తాఁకఁగరా దితరాన్నభుక్తియున్
సలుపఁగరాదు రౌద్రకథనంబునువింటయుఁ గూడదింతయున్ 197

మ. వనటంగుందగరాదు గుర్విణులు భీభత్సంబులీక్షింపఁగా
జన దుత్కృష్టమజీర్ణదాయకము విస్తారంబునాహారముం
దినరాదిట్లువసించినన్ సతి, సుతున్ దేదీప్యమానున్ శుభుం
గను లేదేనియు గర్భపాతముదవున్ గాదేని స్తంభించెడిన్ 198

వ. ఇత్యాది గర్భిణీధర్మంబులు. 199

గీ. స్వీయసద్గుణములకన్న భిన్నమైన । గుణములుగలట్టిసవతిపైఁ గొణఁగ
జనదు । ఈర్ష్యపుట్టిన మచ్చరంబెంతయున్న । సవతులకునప్రియము
పరస్పరముతగదు. 200

చ. పరగుణనామకీర్తనము భామయొనర్పక భర్తకెప్పుడున్
బరిసరమందునుండఁదగు, వర్తిలనొప్పదు దూరమందునన్
ధరణి నిషణ్ణఁగాఁదగు నతండువచించినమేనిముంగలన్,
హరిదవలోకనంబు నితరాస్య విలోకనమొప్పదెప్పుడున్ 201

సీ. ప్రాణనాథునివక్త్రపంకజంబునువిలాసినియైలతాంగివీక్షింపవలయు
శ్రవణింపఁగాఁదగు సాదరంబునను దత్కథ్యమానములైన కథల
నెపుడు । అతండుభాషించునప్పుడుమధ్యతాభాషింపరాదన్యభాష
ణములు । పిలిచినంతనెజాగుసలుపకాసక్తయై తరలఁగాఁదగు రతి
స్థానమునకు

గీ. అతఁడుగానమునొనరింపఁగుతుకమూని । వినఁదగునతనిచెంతసోద్వే
గముగను । వ్యగ్రచిత్తతవర్తించుట నుచితంబు । కలహమెన్నండు
నతనితోసలుపరాదు. 202

సీ. కోపంబుచే భర్త కొట్టినం దిట్టినన్ బెదరించినంగాని బిసరుహాక్షి
కంఠమందతని నగ్గలికంబు చెన్నారధరియింపగాఁదగు వెరపుదక్కి
ఎలుగెత్తి కన్నీళులొలుకరోదన మొనర్పఁగఁజెల్లదాక్రోశపడగరాదు
తనయిల్లువిడిచి పలాయనమొనర్పగరాదు పొరుగువారలకెల్లమొ
ఱకపడఁగ;

గీ. ఉత్సవాదులయందు బంధూత్కారము గృ । హంబులకుఁబిల్వ నా
ధుని యనుమతిఁగొని । యరిగి యధ్యక్షరక్షితయై; చిరము వ ।
సింపకచ్చట యింటికిఁ జేరవలయు. 203

చ. మగడు ప్రయాణమౌనెడ నమంగళముల్ వచియించుచున్ జనం
దగదని యానవెట్టుచు నితాంతము రోదనమాచరించుచున్
బాగులఁగఁరాదు నాతికి; విభుండరుగం బరదేశ; మెంతయున్
సొగసులుమాని జీవితము చొప్పడుమాత్రవసింపనొప్పెడిన్. 204

గీ. అత్తమామల చెంగట నత్తమిల్లు । దగదుప్రతిదినమధిపువార్తలనర
యఁగ । వలయు దూతలనంపగా వలయు నతని । కుశలవార్తలు
దనకుఁ జేకూరుకొరకు. 205

క. పరదేశంబున నాధున । కరిగినకార్యంబు ఫలదమై శీఘ్రముగా
మఱలియరుదేరనతడటే। ముత్రిప్రోషితకాంత దైవమును వేడదగున్

వ. ఇంటికివచ్చిననతని మనంబెరింగి భక్తి సేవింపదగు. 207

సీ. అంగసంక్షాళనం బాచరింపమియును మలినవస్త్రంబున మెలఁగుట
యును । తిలకాంజనంబులఁ దీర్చకుండుటయును వరగంధమాల్య
వివర్జనమును । నఖరోమసంస్కారణము లేకయుండుట దశనమార్జన
మును దప్పియుంట । అట్టహాసక్రియ లన్యనర్మాలాపమన్యచేష్టా
చింతలవిగలుగుట

గీ. యిచ్ఛవచ్చినగతిచరియించుటయును। దవిలిపరపూరుషాంగమర్దన
ము సేఁత । సిబ్బితింబాసిటీకునై నిబ్బరించి । యేకవస్త్రంబుతోఁజరి
యించుటయును. 208

వ. కథితంబులగు నిత్యాదిదోషంబులు యోషితలకుదుఃఖ
దాయకంబులుగాన త్యాజ్యంబులు 209

చ. సతినిజవేశ్మకృత్యములు సల్పి, హరిద్రశరీరమందు సం
గతముగఁజేసి, నీరమున క్షాళనముంబొనరించి, మండనా
న్వితవరగాత్రియై, కనుల విందొనరించుచు భర్త పిల్చినన్
జతురతనంతికంబు విలసన్ముఖపంకజయైచనన్ దగున్ 210

వ. మనోవాగ్దేహసంయుతంబగు నిట్టివృత్తంబుచేనారీరత్నంబు లుండవలయు. 211

చ. పిలిచినచో ధవుం డవలఁ బెట్టిసమస్తగృహస్థకృత్యముల్
తలఁగకయుండభక్తియు ముదంబునవేగమ యేగి, యేటికిన్
బిలిచితిరీ రనుగ్రహము పెంపున నానతియిండు వేగమే
సలిపెదమీదుపంపునని సాధ్వివసింపఁగఁజెల్లుముందటన్ 212

వ. మఱియు ద్వారంబునఁ జిరకాలంబునిల్వంజనదు ద్వారంబు నుపసేవింపఁజనదు నిజనాథుండు తనకుఁబ్రియంబున నెద్దియేనిడిన నది యన్యులకొసంగఁజనదు. 213

క. మిష్టాన్నఫలాదిధవో। చ్ఛిష్టంబుమహాప్రసాదచిత్తమ్మునసం। తుష్టిఁ
బతివ్రతయగుసతి। మృష్టంబనితినఁగఁదగుసుమీమునితిలకా 214

మ. పతికూర్చుండినయప్పుడున్ సుఖముగాఁబన్నుండియున్నప్పుడున్
మతినేదేనియు నూహసేయునపుడున్ మాటాడుచున్నప్పుడున్
దృతకార్యాతురుఁడైవసించినపుడున్ దీప్తించిలేలెమ్మటం
చతివల్ పల్కఁగరా దొనర్పఁదగుఁదత్స్వాంతానుకూలంబుగన్.

క. ఏకాకినియై యెన్నం। డేకడకుంబోక చెల్లదింటికి, మఱియున్
గోకధరింపకదిసమొల। నేకాలము జలకమాడుటెది తగదనఘా.

క. మగనింద్వేషించెడి సతి। కి గుణంబులవెన్నియున్నఁగీర్తింపంగాఁ
దగదుపతివ్రతయనఁగా; । జగతిన్ దుర్యశమునట్టి జలజాక్షికగున్.

గీ. ముసలమందు నులూఖలమునశిలపయి। యంత్రశిలయందు శాణం
బునందుశూర్ప। చాలనులయందు దేహళీస్థానమందు। శోధనుల
యందు సతులుగూర్చుండరాదు. 218

మ. తరుణీరత్నము పాపనాశముగఁ దీర్థస్నానముంగోర ను
ద్ధురభక్తింబతిపాదముల్ గడిగి తత్తోయంబుశీర్షంబునం
బరిమార్జించికొనందగున్ మఱియు దద్వాఃపానముంజెల్లు శం
కరుకన్నన్ హరికన్నసాధ్వికిమనఃకాంతుండుపూజ్యుండగున్. 219

క. వ్రతములు నుపవాసంబులు। పతియనుమతిలేక సలుపఁబడ్డాత్మకులు,త
త్పతికాయుష్యముదొరఁగును । మృతమైనరకంబునం బ్రభవించు రెం బె
లుచన్. 220

మ. పనుపుం జేయక భర్త పైఁగినుక చేఁ బ్రత్యుత్తరం బీయకుం
డిన యాకామిని గ్రామమందు శునియై నీ చస్థితిం బుట్టి యా
ర్గినదై వెండియు నిర్జనాటవి సృగాలీజన్మముం జెందుఁ గా
వున నారీమణి భర్త పైఁ గినుక నెప్డుం బూనరాదింతయున్. 221

క. పరమంబగు నియమంబది । తరుణులకు నొకం డుదాహృతము పతి
పదముల్ । నిరతంబుగఁ బూజించియుఁ । దరువాత భుజింపవలయు దామరసాక్షుల్. 222

గీ. ఎవతె భర్తకు నిడక యే యిష్టమిష్ట । వస్తువుల మెక్కుచుండు కేవల
ముతాన । క్రూరమైనయులూకియై కొండగుహల । వృక్షకోటర
ములను వర్తించు నాపె. 223

గీ. భర్తను పరిత్యజించి కేవలము నెవతె । కేరడంబుగఁ దారహాఃశ్చా
రిణియగు । నాచెడిపె గ్రామసూకరంబైన, లేక । పుట్టుఁ గను,
వల్గువిశ్వవిడ్భుజయగుచును. 224

గీ. పతిని నెవ్వతె హుంకృతుల్ వరపి పలుకు । నట్టిభామినిమూకగా నవ
తరించు, । నెవతె సవతుల నెప్పుడు నీసడించు । నాపె దుర్భగయ
య్యెడి నన్యజనిని. 225

గీ. కాంతు నన్యుని నిజకాంతు కన్నులంగి । కాంచు నేనాతి వలవంతఁ
బొంచిపొంచి । గతవదనగానొ యది యొంటికంటిదిగనొ । రూప
హీనగనో పుట్టు నాపయిజని. 226

సీ. ప్రాణేశ్వరుఁడు వెలుపలినుండి చనుదేరఁగని సత్వరంబుగా జని జల
ములు । నాసనంబు నొసంగి యాప్యాయనముఁ గూర్చి యేలాదికలిత
తాంబూలమొసఁగి । యాలవట్టంబు కెంగేలఁ గైకొని రణత్కరకంక
ణంబులు మెఱయ విసరి । యంకపీఠిని పాదపంకజంబులు లేదీయును
లూని సంవాహనము రచించి

గీ. ప్రియతరంబైన వాక్యసంచయముచేత । సేవనితసేయు భర్తృసంసేవనంబు । నలసతీమణియే యపాంసులలయందుఁ। బుణ్యసంపదచే నగ్రగణ్యయగును. 227

క. విభుఁడేదైవముతీర్థము। విభుఁడేగురువరుఁడుహితుఁడువిభుఁడేవ్రతముఁన్ విభుఁడే ధర్మముగావున । విభుసేవయెతగునుసతికి; వీడిసకలమున్.

క. జీవవిహీనశరీరము । కైవడిపతిహీనయైన కామినిస్నానం । బేవగఁ జేసిన; నశుచిత । దావిడదుసుమీ యనారతంబునుమానీ. 229

క. క్షితిసర్వమంగళములు। గతధవయగునాతిమిగులగ నమంగళయౌ గతధవనీక్షించినవాఁ । క్షితసిద్ధియొకప్పుడేని చేకురదనఘా 230

గీ. మాతృదేవోభవయను నామ్నాయవిధిని । తల్లిదీవన యొక్కండు దక్కప్రాజ్ఞుఁ । డితరగతభర్తృకాశీస్సులేనివిడువ । నొప్పునెప్పుడు నాశీవిషోపమముగ 231

ఉ. జీవసమేతుఁడైన; గతచేతనుఁడైన; మదీయభర్తకున్
సేవలుసాహచర్యమునఁ జేసెదభక్తినటంచుఁగన్యచేఁ
బావకసన్నిధిన్ద్విజులు వల్కఁగఁజేతురు పెండ్లియం దటుల్
గావునభర్తతోడఁజనఁగాఁదగు దేహముతోడనీడగన్ 232

వ. ఇవ్విధంబున భక్తిచే సతులు పతికనుకూలంబుగ నెప్పుడుండవలయు. 233

క. వ్యాలమునుబిలమునుండియువ్యాలగ్రాహుండుతిగుచువడువడరంగా కాలునినుండియుబతి.సతి । వాలాయంబుగనులాగిస్వర్గముజేర్చున్

క. సతినింగనిదూరంబున।కృతాంతభటులదరితమదుహృదయంబులయం దతిదుష్కృతయుతుఁడైనన్।బతితపతిన్విడిచితొలగిపారుదురనఘా

గీ. తనరెదనదేహముననెన్ని తనురుహమ్ము। లన్నికోట్యయుతంబులై నట్టిసమలు । భర్తతోఁగూడఁగాంచును స్వర్గసుఖము । మహితయగుసాధ్వి కడు రమమాణయగుచు. 236

క. గతశీలయగుచుబుంశ్చలి । వితతములగుపాపములకువెనుదీయమిచే బితృకులముంబతికులమున్ । బతితంబులఁ జేసియిహము పర మఱి పోగులున్. 237

గీ. తనదునాథునితోఁగూడ దైవికముఁగ। ననుగమనమును జేయకుండిన
వలంతి। శీలసంరక్షణంబును జేసికొనఁగ। వలయునటుగామితన
కధఃపతనమగును. 238

వ. మఱియు నాపై వైగుణ్యంబునఁ బితయుఁబతియుస్వర్గంబునుండి
పతితులగుదురు. 238

గీ. భర్తగతియింపఁగబరికాబంధమొప్ప। దగదు, తాల్చిన భర్తృబం
ధమ్ముగల్గుఁ। గానమస్తకవపనంబు కార్యమెపుడు। విగతభర్తృక
యైనట్టి వెలదికనఘ. 240

వ. ఎల్లప్పుడు నేకాహారంబుననుండవలయు నిరుపూరులుభుజిం
పఁజనదు. గతప్రియ పర్యంకశాయినియైనఁ బతిని పతితుంజేయుఁగావు
నఁబతిసౌఖ్యఘటనేచ్ఛచే భూమిపైఁబరుండవలయు. 241

గీ. పతివిహీనకునిజతనూద్వర్తనంబు। పోసఁగఁదాంబూలభక్షణంబు
నుసుగంధి। వస్తుసంభోగములుసలుపంగఁదగదు। శ్వేతవస్త్రంబు
ధరియింపఁజెల్లుమాని. 242

గీ. భక్తితోడుతఁదత్పతిప్రతిదినంబు। కుశతిలోదకములజతఁగూర్చిపతికి
నామగోత్రాదులను తర్పణంబుసేత। విహిత మాతనిపితృపితా
మహులతోడ. 243

వ. ఇవ్విధంబులగు నియమంబులవర్తించిన భర్తృహీనయుఁ
బతివ్రతయగు. 244

మ. హితసంధాయకపుణ్యలోకమిడగా నేతాదృశంబైన దై
వతమే లోకమునందు నంగనలకుఁ వర్తింపగాఁబోవదా
పతిమోదిల్లిన సర్వకామములు సంప్రాప్తించు నెల్లప్పు డూ
ర్జితకోపంబతఁడొందినన్ గరిత దాఁజేరున్ యమాగారమున్.245

చ. పతిసదనుగ్రహంబున నపత్యవరాసనశయ్యలున్ సమం
చితపటమాల్యభూషణవిశేషము లద్భుతభోజనంబులున్
వితతసుగంధివస్తువులు విస్తరభోగములంది, నాకసం
స్థితిగని కీర్తిగాంచు నిదిసిద్ధము సాధ్వికి మానిసత్తమా. 246

వ. అంత సూతుండిట్లనియె. 247

క. ఈరీతి నారదుఁడు వి। స్తారంబుగవిని పతివ్రతాధర్మము శ్రీ
నారాయణునొకప్రశ్నము।గోరె,వచింపగను వేడ్కగొనిమునులారా

గీ. సర్వదానాధికము కాంస్యసంపుటమని । యానతిచ్చితి తొలుత
యో మానిచంద్ర । దానికింగారణంబు వ్యక్తముగనాకుఁ। గరుణ
వెలయఁగ వచియింపఁగదె మహాత్మ. 249

వ. అనిన నారాయణర్షి యిట్లనియె. 250

—{ శ్రీనారాయణర్షి నారదునకు సంపుటదానఫలంబును జెప్పుట. }—

మ మును శైలాత్మజ పౌరుషోత్తమవ్రతంబుఁ జేసి తత్పూర్తికే
ఘనదానం బని లోకభద్రముగఁ బల్కన్ శంకరున్ వేఁడినన్
విని శ్రీమత్పురుషోత్తమున్ మనములో వీక్షించి వీక్షించి యి
ట్లనె నద్దేవుఁడు సర్వలోకహితవాక్యం బద్రిసంజాతతోన్. 251

వ. ఆ శ్రీమహాదేవుండు పల్కినదెట్లనిన. 252

గీ. పుణ్యపురుషోత్తమవ్రత పూర్ణవిధిని । సలుపగను శాస్త్రమందు
నెచ్చటనుగూడ । సాధ్యపడకుండు దానం బెసంగఁబోదు । రాజ
దురుగాత్రి పర్వతరాజపుత్రి. 253

శా. ఏయేదానము లుత్తమంబులని యెంతే నీడ్యమానంబులో
యాయాదానము లిట్టిమాసమున గౌణార్థంబు నేచెందుఁగా
దా! యేతద్వ్రతపూర్తినీకునిడునద్దానంబుతో సాటియై
గేయంబైన సుదానమొండుగలదే కీర్తింపఁగా నెంచినన్. 254

క. పురుషోత్తమమాసంబున। బరిపూర్ణమువ్రతముగాగ బ్రహ్మాండంబున్
వరసంపుట రూపమ్మును । వరవర్ణినిద్విజునకీయవలయుదగుగతిన్.

మ. అదియర్పింపఁగ నేరకిం దరముగాదట్లాట నద్దానికిం
బకులైయుండఁగఁ గాంస్యసంపుటము సంపాదించి యద్దానము
ప్పదిగానుండు నపూపముల్ నినిచి సప్తప్రస్ఫురత్పూత్రముల్
పదిలంబొప్పఁగఁజుట్టి పూజలిడి సుస్వాంతంబు సంధిల్లఁగన్. 256

క. సద్వంశ్యుఁ డురుకుటుంబియు । విద్వద్వరుడైనయట్టివిప్రవరునకున్
మద్వార్థిపొరలగా నే। తద్విధినాసంపుటంబు దానమిడఁదగున్.

వ. ఇట్లు వైభవంబుండిన ముప్పది సంపుటంబులు వ్రతసం
పూర్తికై యొసంగవలయు. 258

చ. పలుకఁగనిట్లు ధూర్జటి శుభంబని పార్వతిసంతసించి ని
స్తులశశిభాసురప్రభలశోభిలుముప్పదికాంస్యసంపుటం
బులుసమకూర్చి లోకహితమున్ మదిఁగోరి ధరామరావళిన్
బిలిచిసమర్పణంబుసలిపెన్ వ్రతపూర్తిఘటింపఁబ్రీతితోన్ 259

వ. అంత సూతుండిట్లనియె. 260

క. మునులారయిటులనారద । మునినారాయణునివాక్యము లమృత
సమముల్ । వినితృప్తుండై మఱి యి । ట్లనియెన్ మాటికినినతుల
నతనికినిడుచున్ 261

వ. మహాత్మా! సర్వసాధనములకంటె నీపురుషోత్తమమాసంబు
శ్రేష్ఠంబని నీచెప్పిన యుత్తమంబగుతన్మాహాత్మ్యంబువిని నిశ్చయించి
కొంటి నియ్యది భక్తిచేవినినను నరులకుమహాపాపంబులు క్షీణించు
శ్రద్ధతో విధిప్రకారంబుగ నాచరించిన వారిపుణ్యంబు నేమనిపర్ణిం
పందగు. 262

క. ఇటుపై నెదియునునాశ్రుతి,పుటములకుఁ బ్రమోదలేశమును గూరు
ప దు। త్కటమధురామృతసాయికి ।నెటులితరాంబుపులుముదము
నిచ్చెడిఁజెపుమా. 263

వ. అంతసూతుండిట్లనియె. 264

క. అనియిట్లుపల్కినారద । మునివిరతుండయ్యెభక్తిపూర్వముగసనా
తనమునివరునకుబదరీ । వనవాసునకఘహరునకువందనమిడుచున్.

— { సూతుండు శౌనకాదులకు పురుషోత్తమమాహాత్మ్యశ్రవణఫలంబును జెప్పుట. } —

సీ. పుణ్యనదీనదభూరిశైలోద్వేల భారతావనియందుఁ బ్రభవమంది
సతతంబుసంసారసక్తులై యుత్తమ మైనశ్రీపురుషోత్తమాఖ్యమాస
మననెట్టిదోచవిన్ వినక సేవింపక తనువుఁదాల్చెడి నరాధము లన
యములు। ప్రతిజన్మమందు దుర్భగులైతపించుచు మతిలేమినిల గతా
గతినిగాంచి

గీ. పుత్రమిత్రకళత్ర సమూహమరణ। జనితదుఃఖంబులుఁ వ్యాధిజనిత
దుఃఖ ।ములునుధనధాన్యగృహపశుముఖ్యహాని । జనితదుఃఖంబు
లనయముఁ గనుచునుండ్రు. 266

సీ. భూసుర! ప్రకరమీ మాసమందెన్నఁడుఁ జరుపంగరాదసచ్ఛా
స్త్రములను ।పరశయ్యయందుస్వాపముసేయఁగాఁజెల్లదనృతభాషి
తములనాడఁజనదు।పరభోజనంబులు పరకార్యచయములు పరపరీ
వాదముల్ దొరఁగవలయు । విత్తశాఠ్యములేక విప్రసంఘమునకు
దానంబుసేయఁగాఁదగుధనంబు

గీ. స్వాపతేయముఁగలవాఁడుశాఠ్యమూన। రౌరవాఖ్యంబునరకంబుఁ
జేరును; వ్రతి । ద్విజునకన్నంబునిడి ప్రతిదినము; తినఁగ । వలయు
దినమునష్టమభాగమందు 267

క. పురుషోత్తమునెవ్వారలు । స్థిరభక్తినివిధిచెలంగ దినదినమందుఁ
పరిపూజింతురొవారలు। ధరణీతలంబందునధికధన్యులుతలఁపఁ

వ. మఱియు నింద్రద్యుమ్నుండును శతద్యుమ్నుండును యావ
నాశ్వుండునుభగీరథుండును పురుషోత్తమారాధనంబుసల్పిభగవదంతి
కంబునకుఁజేరిరి, కావున సర్వప్రయత్నంబులఁ బురుషోత్తమసేవ
నంబర్హ్యంబు తత్సేవనంబు సర్వసాధనంబులకంటె శ్రేష్ఠంబు సర్వార్థ
సంధాయకంబు 269

క. గోపాలుగోపరూపుని । గోపీజనహితునిహరిని గోకులనిలయుఁ
శ్రీపతిగోవర్ధనధరుఁ। పాపనివారకునిగొల్చెదంగోవిందుఁ 270

గీ. మున్నుకాండిన్యమునిచేత ప్రోక్తమైన। మంత్రముసుదీని భక్తి
బల్మారుమదిని । జపముసేయుచు నిన్నెల నపనయించు । వాఁడు
పురుషోత్తమునిఁజెంది కీడుఁబాయు. 271

గీ. నవఘనశ్యాము ద్విభుజునినళినసేత్రు । వంశికాహస్తురమ్య పీతాం
శుకధరు । రాధికోపేతుసంతత సాధుసేవ్యు । బత్తిధ్యానింపనగుఁ
బురుషోత్తము హరి. 272

క. రాజీవరమ్యనయనుని। బూజించుచు నెమ్మనమునఁ బురుషోత్తముసం
యోజించుచు నిమ్మాసము। నోజన్ గడపినన భీష్ట మొందు నరుఁ డెటన్

గీ. గుహ్యములలోన నెంతయు గుహ్య మిద్ది। ఏనికింగూడ జెప్పగ రానిదిద్ది,
నేను సైతము దీనిని నెవని యెదుట। నెఱుఁగ జెప్పఁగ లేదు మౌనీంద్రులార

చ. సతతము నీపురాణము ప్రశాంతమతిన్ శ్రవణీయ మిాప్సిత
ప్రతతిసమర్పకంబు పరిపావన మిందొకపద్యమేని సం
భృతమతి విన్న మానవుఁడు భీకరపాపసముత్కరంబులన్
హత మొనరించి మాధవపదాంబురుహంబన యంబుఁ జెందెడిన్.

క. గంగాదిపుణ్యతీర్థము। లం గలయ మునుంగ నేఫలం బాఫలమే
తుంగతరభక్తి దీని వి। నంగా నే తెంచు మౌనినాయకులారా. 276

క. ఈపుడమిన్ వలగొనగా। నేపుణ్యం బరుగుదెంచు నిష్టఫలదమై
యాపుణ్యము గైకొందురు। శ్రీపురుషోత్తమగమహిమఁ జెవినిడువారల్

ఉ. పాఱుఁడు బ్రహ్మవర్చసము పార్థివుఁ డిద్ధధరాధిపత్యమున్
బేరి ధనాధిపత్యమును విష్ణుపదోద్భవుఁ డుత్తమత్వమున్
క్రూరకిరాతముఖ్యులఘుకుంచనముంగని ముక్తులౌదు రీ
సారమహత్వమున్ వినిన సంతతమున్ బురుషోత్తమాయమున్ 278

మ. అనువొప్పన్ బురుషోత్తమప్రథితమాహాత్మ్యంబు వ్రాయించి వి
ప్రునకున్ వస్త్రవిభూషణంబుల విధిం బూజించి యర్పించు పా
వనుఁ డాత్మీయకులత్రయంబు తరియింపం జేసి యాగోపికా
జనసంవేష్టితవిష్ణుధామము గనున్ సన్నుత్యగోలోకమున్. 279

క. పురుషోత్తమమాహాత్మ్యము హరుసంబున వ్రాసి తన గృహంబున నిడు నే
పురుషుండు, తద్గృహంబున। దిరముగ విలసిల్లు నఖిలతీర్థచయంబుల్.

మ. ఘనపాపౌఘహరాచ్యుతాంఘ్రికమలాగ్రస్వాంతులౌ మౌనులీ
యనఘశ్రీపురుషోత్తమప్రథిత మాహాత్మ్యంబు సాంతంబుగా
విని యాశ్చర్యమహాసముద్రవిలసద్వీచీతతిం దేలుచున్
వినయంబొప్పఁగ సూతపుత్రముఖమున్ వీక్షించి హర్షంబునన్.

వ. అంత శౌనకాది మహర్షులిట్లనిరి. 282

గీ. ప్రథితగుణజాత యోమహాభాగసూత
యీవుధన్యుఁడ వెంతయుఁ బావనుఁడవు
త్వన్ముఖామృత సారంబు ద్రావుకతన
నేముకృతకృత్యతనుగంటి మిజ్జగమున 283

క. పౌరాణికచూడామణి! । భూరిచిరాయుష్యమీవుపొందుముసూతా
ధారుణి పావనమైతగు । కీరితినీకుండుఁగాక కెరలుచునెపుడున్.

ఉ. దాసజనావనవ్రతవిధానచణాచ్యుతసత్కథామృతా
భ్యాసులునైమిషేయులు త్వదంచితవాక్పరితుష్టి నీకు బ్ర
హ్మాసనమిచ్చి రావారిమహాయశముఁ డెడిదాక, యందు సం
వాసముచేసి విష్ణుకథఁ బల్కుచునుండుము మౌనిసత్సభన్. 285

మ. చెలికారంబునసూతుఁడిక్రియ ద్విజాశీర్వాదముంజెంది వా
రలకున్ భక్తిఁ బ్రదక్షిణించి నతిచర్యల్ సల్పి గంగానదీ
సలిలంబందునదోఁగి స్వీయవిధులన్ సాగింపగానెంచి మౌ
నులయాజ్ఞంగొని సత్వరంబుగఁజనెన్ గోవిందుఁగీర్తించుచున్.

చ. కరముచిరంతనంబు జితకల్మషవారము వాంఛితార్థ వి
స్తరపరికల్పనత్రిదశశాఖివరేణ్యము శ్రోతృ మానసా
త్యురుపరితోషదంబుఁ బురుషోత్తమమాస మహత్త్వమున్ బర
స్పరమును నైమిశాఖ్యవనవాసులుపల్కి రుదాత్తచిత్తులై. 287

చ. కలియుగవర్షముల్ జలధికాలమరుత్పథబాణసంఖ్యచే
నలరఁగ శ్రీముఖాబ్దమున నాశ్వినశుక్లహరిప్రవాసరం
బొలప్పుఁగనాంధ్రమందుఁ బురుషోత్తమమాసమహత్తు వేంకటా
చలకవి పూర్తిచేసియిడెఁజక్రిపదాంబురుహద్వయంబునన్. 288

మ. తనయద్వంద్వము పుత్రికాద్వయము సంతానంబునాకిప్పుడుం
డెను సంసారభరంబుదుర్భరము తండ్రీ! నీకుసంప్రీతిగా
నొనరింపందలఁకొన్నగ్రంథమిది యెట్లోపూర్తిఁగావించితిన్
ననుఁబ్రోవంగదవయ్యశ్రీహరి! ససంతానున్సదారుంగృపన్ 289

గీ. సంతతంబును శ్రీజార్జిచక్రవర్తి
శ్రీమదుస్మానలీఖాఁదుషామహీపుఁడు
హరికృపాదృష్టి శుభములనంది, ప్రజల
విదితధర్మపథమున నేలుదురుగాత. 290

క. పాతివ్రత్యధనాన్విత। శీతకరాస్యావనా! విచిత్రచరిత్రా!
భూతదయాకర! ధర్మ। ప్రీతాత్మకరక్షణా! విరించనజనకా! 291

మాలిని. నిరుపమశుభరూపా! నిత్యకల్యాణదీపా!
పరిహృతపరితాపా! భవ్యవిజ్ఞానరూపా!
విరచితబహులీలా! వేణుగానప్రలోలా!
చరణపతితపాలా! శాశ్వతానందమూలా! 292

గద్యము.

ఇది. శ్రీమద్విబుధవిధేయ వేంకటాచలశాస్త్రి నామధేయ
ప్రణీతంబైన బృహన్నారదీయ పురాణాంతర్గత
పురుషోత్తమ మాహాత్మ్యంబున
సర్వము షష్ఠాశ్వాసము
శ్రీకృష్ణార్పణమస్తు.

సికింద్రాబాదు: చందా నారాయణశ్రేష్ఠిగారి
'శ్రీబాలాత్రిపురసుందరీ' ముద్రాలయమున ముద్రితము.

# శుద్ధపత్రిక.

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 2 | 11 | వెలయించిస | వెలయించిన |
| 7 | 5 | సుఱుకు | నుఱుకు |
| ,, | 6 | నుర | సుర |
| 10 | 20 | జక్కటి | చక్కటి |
| 15 | 8 | మహీంతు | మహింతు |
| 19 | 17 | మ. | శా. |
| 28 | 3 | నిలచి | నిలిచి |
| ,, | 7 | సేసివ | సేసిన |
| 34 | 6 | తేజస్వరూపం | తేజస్స్వరూపం |
| ,, | 8 | న్యాధులు | వ్యాధులు |
| 46 | 19 | (వసంతగ్రీష్మవర్షర్తువుల | ( చైత్రాద్యాశ్వయుజాంతంబు |
| 56 | 5 | శౌనగా | శౌనకా (లగుమాసంబులలో |
| ,, | 22 | గాని | దాని |
| 64 | 24 | విడచి | విడిచి |
| 80 | 19 | నిట్లనిరి | (బాండవులిట్లనిరి. |
| 119 | 17 | ఆంత | అంత |
| ,, | 21 | మడిపి | ముడిపి |
| 121 | 17 | వోవెనే | వోవునే |
| 123 | 10 | గూరుప | కూరుప |
| 125 | 17 | జ్వాలా | జ్వలా |
| 126 | 15 | తద్వస్సుల | తద్వచస్సుల |
| 146 | 22 | మఖ్య | ముఖ్య |
| 152 | 27 | చిద్విరాస | చిద్విలాస |
| 159 | 18 | ఆడు | ఆతడు |
| 169 | 25 | దధిప | రధిప |

| | | | |
|---|---|---|---|
| 180 | 17 | చినమని | చినముని |
| ,, | 23 | మర్వీ | ముర్వీ |
| 182 | 9 | ఇవ్విధంబు | కనియివ్విధంబు |
| ,, | 18 | చ్ఛీలు | చ్ఛీలురు |
| 197 | 2 | హాతరంబు | హారంబుత |
| 211 | 8 | సేనింప | సేవింప |
| 216 | 14 | పర్ణిం | వర్ణిం |

ఉపోద్ఘాతము-పుట-2-పంక్తి-25-తప్పు-ద్రై-ఒప్పు-ద్రై

నస-వప-థధ-రఱ-ఁ ఈ మొదలగు మఱికొన్ని ప్రమాదములు లేక పోలేదు వానిని పాఠకులు యథాయోగ్యమగు సవరణతో బఠింపఁ బ్రార్థితులు.

ఇట్లు

గ్రంథకర్త.

UNIVERSITY OF HYDERABAD
S. N. Reddy
LIBRARY

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

Cl. No. 294.5925 V55P Acc. No. 28977

DATE DUE

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

T Acc. No. 28977

Call No. 294.5925, V55P

Author [illegible]

Title [illegible]

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

Help to keep the book fresh and clean